# మొదటి సినిమా

## - కిరణ్ ప్రభ

Part - 2



శ్రీ కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 39

# ఇందులో...


| | |
|---|---|
| బీరం మస్తాన్ రావు | 3 |
| పి.చంద్రశేఖర రెడ్డి | 14 |
| శివనాగేశ్వర రావు | 19 |
| సత్యానంద్ | 26 |
| ఈశ్వర రెడ్డి | 30 |
| విజయ బాపినీడు | 37 |
| బి.రమణ | 41 |
| పర్వతనేని సాంబశివరావు | 48 |
| చంద్ర సిద్ధార్థ | 52 |
| భువనచంద్ర | 58 |
| ఇంద్రగంటి మోహనకృష్ణ | 64 |
| దశరధ్ | 71 |
| మదన్ | 76 |
| కోటి | 83 |

# మొదటి సినిమా

## మెరుపులాంటి ఒక చిత్ర ప్రముఖుని మొదటి సినిమా జ్ఞాపకాలు

### శ్రీ బీరం మస్తాన్ రావు

బుర్రిపాలెంబుల్లోడు, గయ్యాళిగంగమ్మ, ప్రేమసింహాసనం, విప్లవశంఖం, తల్లి గోదావరి, సువర్ణసుందరి ..

*ఆయన తీసినవి ఆరు సినిమాలే ఐనా, అందులో రెండు అగ్రశేణి కథా నాయకులతో తీసినవే..! మొట్టమొదటి సినిమానే 'బుర్రి పాలెం బుల్లోడు' నటశేఖర కృష్ణ, అందాల తార శ్రీదేవిల కాంబినేషన్‌లో 100 రోజుల చిత్రంగా రూపొందించారు. అప్పుడప్పుడే హీరోయిన్‌గా పైకి వస్తున్న శ్రీదేవికి కమ్మర్షియల్ హీరోయిన్‌గా బ్రేక్ నిచ్చింది కూడా ఇదే చిత్రం. ఈయన దర్శకత్వం వహించిన మూడో చిత్రమే ఎన్టీఆర్ హీరోగా 'ప్రేమ సింహాసనం'. ఇదీ 100 రోజుల చిత్రమే. ఇందులో రతి అగ్నిహోత్రిని మొట్టమొదటి సారిగా తెలుగు చిత్రరంగానికి హీరోయిన్‌గా పరిచయం చేశారు.. ఆయన దర్శకత్వం వహించిన చివరిచిత్రం, సొంత నిర్మాణతలో రూపొందిన 'సువర్ణసుందరి'. ఈ చిత్రం 8 నంది అవార్డుల్ని గెలుచుకుంది. ఆసక్తికరమైన మలుపులతో సాగిన కెరీర్‌లో శ్రీ బీరం మస్తాన్ రావు గారి మొదటి సినిమా జ్ఞాపకాలు, తదుపరి సినిమాల గురించిన సంక్షిప్త వివరాలూ ఈ నెల కౌముది పాఠకులకోసం..*




నేను పుట్టింది 1944 అక్టోబర్ 30, కార్తీక సోమవారం పౌర్ణమి తెల్లవారు ఝూమున. నాన్నగారి పేరు బీరం నాగయ్య, అమ్మ పేరు వెంకాయమ్మ. నా తరువాత ఒక చెల్లి. ఐతే చెల్లి పుట్టిన సంవత్సరానికే, నా ఏడో సంవత్సరంలో అమ్మ చనిపోయింది. మళ్ళా తరువాత నాన్న ద్వితీయ వివాహం చేసుకున్నా గానీ అది ఎక్కువకాలం కొనసాగక మా జీవితం కాస్త అస్తవ్యస్తమైంది ఆ సమయంలో. నాన్నా, పెదనాన్నా బేల్దారీ మేస్త్రీలుగా పనిచేసే వాళ్ళు. దేవాలయాల నిర్మాణం, వాటిమీద విగ్రహాల రూపకల్పన లాంటి పనులు చేస్తుండేవాళ్ళు. నాన్న ఐతే వీటితో బాటుగా, వడ్రంగం పని చేస్తూ, పెద్ద పెద్ద

భవంతుల నిర్మాణంలో ఉపయోగించే తలుపులమీద లతలూ, పూలతో చక్కటి డిజైన్లు చెక్కుతుండేవాడు. ఆ పనులుచేసేప్పుడు వాళ్ళు వేసుకునే డ్రాయింగులు గమనించడం చాలా ఆసక్తిగా వుండి, నాక్కూడా బొమ్మలు వేయడంలో కాస్త పట్టుదొరికింది చిన్నతనంలోనే.

మేము గుంటూరులో నివసించిన ప్రాంతం సంగడిగుంట. ఆ రోజుల్లో కమ్యూనిస్టులకి అది పెట్టని కోట. దాన్నే ఎర్రకోట అనే వాళ్ళుకూడా. ఎక్కువగా కూలీలూ, శ్రామిక వర్గానికి చెందిన వాళ్ళు ఉండేవాళ్ళు ఆ ప్రాంతంలో. నేను హైస్కూల్లో చదువుకునే రోజుల్లోనే పరిసరాల ప్రభావమేమో గానీ కమ్యూనిస్టు ఉద్యమాల వైపు బాగా ఆకర్షించబడ్డాను. వాటిల్లో భాగంగానే యువజన సంఘాల కార్యక్రమాల్లోనూ, ప్రజానాట్యమండలి కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనడం మొదలుపెట్టాను...వీటి మధ్య 1960-61 లో ఎలానో ఎస్సెల్సీ పూర్తయిందనిపించాను. తరువాత పై పెద్దగా పై చదువులకి వెళ్ళాలని లేక పోయినా స్టూడెంట్ ఫెడరేషన్‌ని లీడ్ చేయడానికని విద్యార్థిగా ఉండాలి కాబట్టి ఎ.సి.కాలేజీలో పి.యు.సి చదవడానికి జాయినయ్యాను..

అదే సమయంలో గుంటూరు లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ విదేశీ పుస్తకాల అనువాదాలు చదివాను. సోవియట్‌లాండ్ పత్రిక తరుఫున స్థానికంగా జరిగే కార్యక్రమాల్లో కూడా చాలా యాక్టివ్‌గా పాల్గొంటూ ఉండేవాడిని. కరుణశ్రీ జంధ్యాలపాపయ్య శాస్త్రి గారు, జమ్మలమడక మాధవరాయ శర్మ గారు ప్రభృతులు నాకు ఎ.సి.కాలేజీలో గురువులు. ఐతే నేను కాలేజీకి వెళ్ళేదే తక్కువరోజులు. మా టీచర్లంతా "వీడు తెలివిగల వెధవ. కాని చదివి చావడు. నాయకత్వం పిచ్చి ఎక్కువ వీడిలో..' అని అంటుండేవాళ్ళు. ఎలానూ నాకు శ్రద్ధలేదుకాబట్టి చదువు అలానే ఆగిపోయింది.

అదే రోజుల్లో కమ్యూనిస్టుపార్టీ రెండుగా చీలిపోయింది. ఉడుకు నెత్తురు ఉప్పొంగే రోజుల్లో లెఫ్ట్ వైపు అతి త్వరగా ఆకర్షించబడి వెళ్ళిపోయాను. గుంటూరు మెడికల్ కాలేజీలోని స్టూడెంట్స్ ని చైతన్యవంతంచేసి , శ్రీకాకుళం నక్సల్ బరీ పోరాటంలోకి పంపే బాధ్యత నా మీద పెట్టారు. ముందుగా నేను శ్రీకాకుళం వెళ్ళి నక్సల్ బరీ ఉద్యమ పరిస్థితుల్ని అధ్యయనం చేసి వచ్చాను.

నేను తిరిగివచ్చాక నా మాతృసంస్థ ఐన రైట్ కమ్యూనిస్టులు నన్ను తమవైపుకి లాగేసుకున్నారు. ఐతే ఉద్యమాలతో విసుగెత్తిన నేను పార్టీ నాయకులకి చెప్పాను " నన్ను ఏదైనా సాహిత్యపరమైన కార్యక్రమాల వైపు పనిచెయ్యనివ్వండి..' అని. అప్పుడే విజయవాడలో విశాలాంధ్ర పత్రిక కార్యాలయం నుంచీ 'ప్రగతి' అనే వారపత్రిక మొదలుపెట్టారు. దానిలో సబ్-ఎడిటర్ గా పనిచెయ్యమని పంపించారు. ఇదంతా 1967-68 ప్రాంతాల్లో జరిగింది. అలా నా మకాం విజయవాడకి మారింది.

'ప్రగతి' వారపత్రికకి మొదట్లో కడియాల రాజగోపాల రావుగారు ఎడిటర్‌గా వుండేవారు. తరువాత బొల్లిముంత శివరామకృష్ణగారు ఆ స్థానంలోకి వచ్చారు. నేను విజయవాడ వెళ్ళాక నాటక సమాజం కార్యక్రమాలు కూడా బాగా వూపందుకున్నాయి. బొల్లిముంతగారు అప్పటికే సినిమా రచయితగా ఉన్నారు. అదే రోజుల్లో 'మనుషులు మారాలి' సినిమాకి పనిచేస్తూ ఎక్కువరోజులు మద్రాసులోనే ఉండేవారు. పత్రిక పని అంతా ఒక్కచేతిమీదుగా నేనే చూస్తుండేవాడిని. రాత్రి పూట నాటక రిహార్సల్స్ వగైరా మామూలే.

ఆ రోజుల్లో చాలామంది చూసి వదిలేసిన ఆదివిష్ణు నాటిక రాతి మనిషి ని ప్రదర్శించడానికని ట్రూప్‌ని తయారు చేశాను. ఆ సందర్భంలో పరిచయమైన వాళ్ళే జంధ్యాల, సుబ్బరాయ శర్మ, సుత్తి వీరభద్రరావు, మురళీ మోహన్ వగైరా మిత్రులు. జంధ్యాల మా నాటికల్లో వెయ్యలేదు కానీ మిగతా వాళ్ళంతా నేను ప్రదర్శించిన నాటికల్లో వేసిన వాళ్ళే.పరిషత్ నాటకపోటీలకి వెళ్ళడం కూడా ముమ్మరంగా సాగుతుండేది. ఎక్కడికి వెళ్ళినా బెస్ట్ ప్రొడక్షన్, బెస్ట్ యాక్టర్, బెస్ట్ డైరెక్షన్ బహుమతులు ఎక్కువగా మా ట్రూప్ కే వస్తుండేవి. ధవళ సత్యం నేనూ కూడా చాలా చోట్ల పోటీ పడుతుండే వాళ్ళం.

ఆ సమయంలో పరిచయమైన ఆదివిష్ణు నా జీవితంలోని మరో ముఖ్యమైన మలుపుకి కారణమౌతాడని ఎప్పుడూ ఊహించలేదు. ఆయనతో పరిచయం కూడా చాలా విచిత్రంగా జరిగింది.

ఆయన నాటిక రాతి మనిషిని ప్రదర్శిస్తున్నా ఉత్తరాల ద్వారా అనుమతి పత్రం తెచ్చుకోవడమే తప్ప ఆయనని ప్రత్యక్షంగా ఎప్పుడూ చూడలేదు. ఒకసారి ఏదో ప్రదర్శనకి అనుమతికోసం అని ఉత్తరం రాస్తే చాలా రోజులు సమాధానం రాలేదు. నాకు చాలా కోపం వచ్చి చెడామడా చీవాట్లేస్తూ ఆయనకి ఉత్తరం రాశాను. ఆ తరువాత కొన్ని రోజులకి విజయవాడలోనే మిత్రుడు పూసలని కలవడానికి వెళ్ళాను. పక్కనే మరో పెద్దమనిషి ఉన్నాడు. నేను వెళ్ళగానే పక్కనున్నాయన 'సరే పూసల..నేను వెళ్ళొస్తాను. మీ మిత్రుడెవరో వచ్చారు కదా.. నేను కూడా బీరం గాడిని కలవాలి. అసలే తిడుతూ ఉత్తరం రాశాడు..చాలా షార్ట్ టెంపర్ లా వున్నాడు.." అని శెలవు తీసుకోబోతుంటే పూసల "అరే.. నువ్వు వెదుకుతున్న బీరం ఇతనే" అని మా ఇద్దర్నీ ఒకరినొకరికి పరిచయం చేశాడు. అదే ఆదివిష్ణుని నేను ప్రత్యక్షంగా చూడడం..


'గయ్యాళి గంగమ్మ 'షూటింగ్‌లో

రోజులు ఇలా పత్రికతోనూ, నాటకాలతోను బిజీగా గడుస్తుండగా ఒక పెద్ద జర్క్ వచ్చింది. రోజులు ఎప్పుడూ ఒక్కలా ఉండవు, మనుషులూ ఎప్పుడూ ఒక్కలా ప్రవర్తించరు.. ఎవరో వెళ్ళి విశాలాంధ్ర జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు (తరువాత ఈయన విజయవాడ మేయర్ గా కూడా పనిచేశారు) గారికి నా మీద ఫిర్యాదు చేశారు. నా నాటకాలూ, రిహార్సల్స్ గురించి ప్రశ్నించారు. నేను ఏ పనిచేసినా పత్రిక వ్యవహారాలకేమాత్రం ఆటంకం లేకుండా చేస్తున్నానని నచ్చజెప్పినా ఆయన నమ్మకపోయే సరికి పౌరుషం కొద్దీ నేనే రాజీనామా చేశాను..

రావడమైతే వచ్చేశాను కానీ ఇల్లు జరగాలి కదా ..అసలే లో క్లాస్ ఫేమిలీ. పొట్టకూటికోసమని వేరే వాళ్ళ పేరుతో డిటెక్టివ్ నవలలు వ్రాయడం మొదలుపెట్టాను. అలా రోజులు భారంగా గడుస్తున్నప్పుడే ఆదివిష్ణు 'బాలమిత్రులకథ' అనే కొత్త సినిమాకి మొదటిసారిగా కథ, మాటలు వ్రాయడానికిఒప్పుకున్నారు. నిర్మాతా, తనూ హోటల్లో ఉన్నప్పుడు నాకు కబురు చేశారు.. ఆదివిష్ణు చేతి వ్రాత వాళ్ళకి అర్థం కాకపోవడంతో, ఆయన చేతి వ్రాత బాగా తెల్సిన నన్ను ఫెయిర్ కాపీ చేయడానికని పిలిపించారు. సరే మంచి పనే కదా అని ఒప్పుకున్నాను. అలా వాళ్ళకోసం రోజూ హోటల్ కి వెళ్ళేవాడిని. 'బాలమిత్రుల కథ' చిన్న పిల్లల సినిమా. అందులో నటించడానికి నటనా సామర్థ్యమున్న చిన్నపిల్లలకోసం చూస్తున్నారు. నాకు నాటకరంగంతో బాగా సంబంధముందని తెల్సిన నిర్మాత గారు బాల నటుల విషయంలో నా సహాయం కోరారు. రెండురోజుల్లో నా పాత పరిచయాలనుపయోగించి మెరికల్లాంటి బాల నటీనటుల్ని వాళ్ళకి చూపించాను. వాళ్ళకి నన్నే ట్రైనింగ్ ఇవ్వమని అడిగారు. నిర్మాతా. ఆదివిష్ణూ ఒక రూమ్ లో ఉంటే నేను పక్క రూమ్ లో పిల్లలకి శిక్షణ నివ్వడం, సీన్ పూర్తవగానే వాళ్ళ వద్దకి తీసుకెళ్ళి ప్రదర్శించి చూపించడం..ఇలా జరిగేది. పిల్లలు కూడా సంభాషణలు చెప్పడం కానీ, ముఖంలో ఫీలింగ్స్ చూపించడం కానీ కరెక్ట్‌గా చేసేవాళ్ళు. అది చూసిన నిర్మాత గారికి నా మీద బాగా గురి కుదిరింది. తమతో బాటు మద్రాసు వచ్చేసి సినిమాకి అసిస్టెంట్ గా పనిచేయమని అడిగారు. నేను సంతోషంగా ఒప్పుకున్నాను.

అలా మొదలైంది నా మద్రాసు యాత్ర.

అప్పటికే హీరో కృష్ణ గారి మొట్టమొదటి సొంత సినిమా ‘అగ్నిపరీక్ష‘ కి దర్శకత్వం వహించి, దాన్ని విజయవంతమైన చిత్రంగా తీర్చిదిద్దిన వరప్రసాదరావు గారే ‘బాలమిత్రుల కథ‘ కి కూడా దర్శకుడు. సినీ దర్శకత్వ రంగంలో మొదటి పాఠాలు వరప్రసాదు గారి వద్దనే నేర్చుకున్నాను. పిల్లలకి డైలాగ్ చెప్పడంలోనూ యాక్షన్ నేర్పడంలోనూ అప్పటికే పని చేసి ఉండడం వల్ల మిగతా వాళ్ళకి కూడా అవి నేర్పుతుండేవాడిని. దానితో బాటు సి.నారాయణరెడ్డి, దాశరధి మొదలైన వాళ్ళకు సీనులు వివరించి పాటలు వ్రాయించడం కూడా నా బాధ్యతల్లో ఒకటి. అప్పటికే నాటక రంగంలో ఇలాంటి పనులన్నీ ఎన్నో సార్లు చేసి ఉండడం వల్ల సంపాదించిన అనుభవమూ, కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల వచ్చిన బోల్డ్‌నెస్..నేను చిత్రసీమలో తొందరగానే స్థిరపడడానికి దోహదం చేశాయి. యూనిట్ సభ్యులతో అతి తొందరగా కలిసిపోయాను. మొదటి సినిమాలోనే కృష్ణంరాజు గారు, జగ్గయ్యగారు....లాంటి దిగ్గజాలతో పనిచేసే సదవకాశం లభించింది.

అంతా సవ్యంగానే జరుతోందనుకుంటున్నప్పుడే సడన్ బ్రేక్ పడింది. ఆ సినిమా మధ్యలో ఆగి పోయింది.

నిర్మాత గారు పిలిచి "బాబూ.. సినిమా మధ్యలో ఆగిపోయింది. మరి నీఇష్టం..గుంటూరు వెళతావో, బెజవాడే వెళతావో నిర్ణయించుకో .." అన్నారు.

ఏమి చెయ్యాలో ఎక్కువసేపు ఆలోచించకుండానే మద్రాసులోనే ఉండి పోవాలన్న నిర్ణయానికి వచ్చాను.

ఈ నిర్ణయం వెనుకనున్న పిట్టకథ ఏమిటంటే.. బాలమిత్రుల కథకి పనిచేసేప్పుడే అందులో ఒక వేషం వేస్తున్న నవీనలక్ష్మి తో పరిచయమైంది. అప్పటికే తను గరికపాటి రాజారావు గారి లాంటి హేమాహేమీలతో నాటకాలు వేసి గొప్పపేరు పొందిన నటీమణి. మా పరిచయం తొందరలోనే ప్రేమగా మారింది. పెళ్ళికీ దారితీసింది.

‘సువర్ణసుందరి‘ వర్కింగ్ స్టిల్



ఈ నేపథ్యంలో మద్రాసు వదిలి వెళ్ళాల్సిన అవసరం ఏమాత్రం లేదు. తనూ నాటకాలు వేస్తుండేది. బాలమిత్రులకథ షూటింగ్ సమయంలోనే ప్రసిద్ధ నటులు జగ్గయ్య గారితో పరిచయం జరిగింది. అదే సమయంలో ఆయన తన సొంత సినిమా ‘శభాష్ పాపన్న‘ మొదలు పెట్టారు. దానికి అసిస్టెంట్‌గా పనిచేయడానికని వెళ్ళాను. దాని దర్శకుడు, కెమేరామేన్ ఎస్.ఎస్.లాల్ గారు. అందులో జగ్గయ్యగారిది ద్విపాత్రాభినయం.

11నెలల పాటు రాత్రీ పగలూ పనిచేశాం. ఈ అనుభవంలో చాలా టెక్నిక్‌లు నేర్చుకోగలిగాను. ఈ సినిమాకి అసోసియేట్‌గా పనిచేసే వెంకటేశ్వర రావు అనే ఆయన మధ్యలో ఒక రోజు సెట్ మీద నుంచీ పడిపోవడంతో కాలు ఫ్రాక్చర్ ఐ షూటింగ్ కి రాలేక పోయారు. ఇంక నేనే అసోసియేట్ ఐ మరిన్ని బాధ్యతలు నిర్వహించాల్సి వచ్చింది. ఇదీ నా మంచికే అనిపించింది. ఈ సినిమా పూర్తవుతుండగానే మళ్ళీ ‘బాల మిత్రుల కథ‘ మొదలౌతోందని పిలిచారు. వెళ్ళి అది పూర్తయేవరకూ వాళ్ళ వద్దా పనిచేసి వచ్చాను. మొత్తానికి ఈ విధంగా మొదట్లోనే ఒక సినిమాకి అసిస్టెంట్ గానూ, మరోదానికి అసోసియేట్ గానూ పనిచేసే అవకాశం లభించి, నాకు చిత్రపరిశ్రమలో మంచి పునాదులు వేసింది.

తరువాత కన్నె వయసు సినిమాల కి కూడా పనిచేశాను. అప్పుడు కె.బాపయ్య గారితో పరిచయం జరిగింది. ఆయన మొదటి సినిమా ద్రోహి అంతగా విజయవంతం కాకపోయినా, తరువాత దర్శకత్వం వహించిన మేమూ మనుషులమే చిత్రంతో విజయవంతమైన దర్శకుడిగా నిలదొక్కుకోవడమే కాక, పలు హిందీ చిత్రాలను కూడా రూపొందించారాయన. ఆయన వద్దనే దాదాపు 7 సంవత్సరాలు అసిస్టెంట్‌గా, అసోసియేట్‌గా, కో-డైరెక్టర్ గా ఎన్టీఆర్ ఎదురులేని మనిషి, ఇంద్ర ధనుస్సు, చరిత్రహీనులు వగైరా.. సినిమాలకి పనిచేశాను. మధ్యలో కొన్ని నెలలు కె.రాఘవేంద్రరావు గారి మొదటి సినిమా 'బాబు' కి కూడా సహాయకుడిగా పనిచేశాను. బాపయ్య గారి వద్ద కో-డైరెక్టర్ గా నేను పనిచేసిన చివరి సినిమా తిరుపతి ఇంటర్నేషనల్స్ వారి 'సాహసవంతుడు'. మొదటిసారి నేపాల్‌లో షూటింగ్ జరుపుకున్న తెలుగు సినిమా అదే మహానటుడు ఎన్టీఆర్ కథానాయకుడు.

ఆ సినిమా షూటింగ్ చివరలో ఉండగానే నిర్మాత కె.విద్యాసాగర్ గారు నాకు సొంతంగా దర్శకత్వం వహించే అవకాశం ఇస్తానని అన్నారు, హీరో ఎవరైతే బావుంటుందనీ అడిగారు. లోగడ వున్న పరిచయం వల్ల కృష్ణ గారిని హీరోగా సజెస్ట్ చేశాను. నన్నే వెళ్ళి డేట్స్ కూడా మాట్లాడి రమ్మన్నారు. అడగ్గానే కృష్ణగారు కూడా నా మీద అభిమానంతో ఐదారు నెలల తరువాత డేట్స్ ఇచ్చారు. ఐతే అప్పటికి ఎన్టీఆర్, కృష్ణల సినిమాల మధ్య బాగా పోటీ ఉండడం వల్ల అప్పటికింకా సాహసవంతుడు షూటింగ్ లో ఉండడం వల్ల కృష్ణ గారితో తరువాతి సినిమా తీస్తున్నామన్న సంగతి బయటికెక్కడా చెప్పలేదు.

ఇంతలో 'సాహసవంతుడు' రిలీజవ్వడమూ, నిర్మాతకి ఆర్థికంగా దెబ్బ తగలడమూ జరిగింది. ఆయన ఏమాత్రం పెట్టుబడి పెట్టే స్థితిలో లేరు. ఇంకో వైపు చూస్తే కృష్ణ గారి డేట్స్ దగ్గరికి వచ్చేస్తున్నాయి. ఏం చెయ్యాలో తెలీలేదు. అప్పటికే చాలా మంది నాకు 'నెక్స్ట్ పిక్చర్ నీ డైరెక్షన్ లోనే.. ' అని వాగ్దానాలు చేసినా, వాటిని నిజం చేసింది కేవలం విద్యాసాగర్ గారు మాత్రమే.


'తల్లి గోదావరి' పాటల రచయిత ఆత్రేయగారితో..

అప్పుడే తమిళంలో ముత్తురామన్ గారి దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా విడుదలైన 'ప్రియ' సినిమా చూశాను. దాన్ని చాలా భాగం సింగపూర్‌లో షూట్ చేశారు. దాన్ని తెలుగులోకి డబ్ చేస్తే బాగా ఆడుతుందని నమ్మకం కలిగింది. వెంటనే విద్యాసాగర్ గారి వద్దకెళ్ళి ' మీరు అర్జెంట్ గా ప్రియ సినిమా రైట్స్ కొనెయ్యండి. మనకి మంచి లాభాలు వస్తాయి..' అని చెప్పాను. ఐతే కనీసం వాళ్ళతో బేరమాడి ఎడ్వాన్స్ ఇవ్వడానికైనా డబ్బులు కావాలి కదా. నేనే ఒక ఫైనాన్సియర్ దగ్గరకెళ్ళి పదివేల రూపాయలు అప్పుతెచ్చి విద్యాసాగర్ గారి కిచ్చి 'ప్రియ' సినిమా కొనమని చెప్పి పంపించాను. వెళ్ళినాయన ఒట్టి చేతులతోనే వచ్చేశారు. ఎందుకంటే తెలుగు రైట్స్ రెండున్నర లక్షలు చెప్పారట. రజనీకాంత్ సినిమాకి ఆ రేటు చాలా ఎక్కువ అని వచ్చేశారు. ఐనా నేను పట్టుబట్టి పంపించాను. 'ఎంతైనా సరే కొనండి తప్పని సరిగా ఇది మనకి లాభాలు తెచ్చిపెడుతుంది.' అని. ఎలాగైతే రెండు లక్షలకి బేరమాడి 'ప్రియ' సినిమా తెలుగు డబ్బింగ్ కి ఎడ్వాన్స్ ఇచ్చి వచ్చారు. మళ్ళీ అదే ఫైనాన్సియర్ దగ్గరకే వెళ్ళి మరో యాభై వేలు అప్పుతీసుకుని డబ్బింగ్ కార్యక్రమాలు మొదలు పెట్టాం.

అటువైపు కృష్ణ గారి డేట్స్ దగ్గరకొచ్చేస్తున్నాయి...ఈ ప్రయత్నమైనా నిర్మాత గారికి ఆర్థిక వెసులుబాటు కలిగిస్తుందేమో చూడాలి.

'ప్రియ' డబ్బింగ్ సినిమా మొదటి కాపీ వచ్చేసింది. లాబ్ నుంచీ రావడంతోనే విద్యాసాగర్ గారు.." మాస్తాన్‌రావ్ గారూ..కృష్ణ గారికి ఒక యాభై వేలు ఎడ్వాన్స్ ఇచ్చెయ్యండి. హీరోయిన్‌ని బుక్ చేసెయ్యండి..ఇంక కార్యక్రమాలు త్వరత్వరగా పూర్తి కావాలి.' అంటు

నన్ను హడవిడి పెట్టడం మొదలు పెట్టారు. విషయమేమిటంటే 'ప్రియ' సినిమా మంచిరేట్లకి అమ్ముడుపోయి 5 లక్షలు లాభంవచ్చింది. అమ్మయ్య అనుకుని ఇంక కొత్త సినిమా కార్యక్రమాలు చురుకుగా మొదలు పెట్టాను.

***

హీరోయిన్ గా అప్పుడు కాస్త టాప్‌లో వున్న గ్లామర్ గర్ల్ జయప్రద అనుకున్నాం. వెంటనే తన వద్దకెళ్ళి 5 వేలు ఎడ్వాన్స్ కూడా ఇచ్చి వచ్చాం. కృష్ణ, జయప్రద మంచి కాంబినేషన్ ఆ రోజుల్లో.

సినిమా కథ విషయాని కొచ్చేసరికి హీరో కృష్ణ గారే ఒక సలహా చెప్పారు "నీకిదే మొదటి సినిమా కాబట్టి, సేఫ్ గా వుండాలంటే ఏదైనా రీమేక్ తీసుకుంటే బావుంటుంది. నాకు తెల్సి ఒక మంచి హిందీ సినిమా వుంది. అమితాబ్ బచ్చన్ డ్యూయల్ రోల్..కస్మేవాదే సినిమా రైట్స్ సుందర్ లాల్ నహతా గారి వద్ద వున్నాయి. వాళ్ళు తియ్యడం లేదని తెలిసింది. నేను చెప్పానని చెప్పి వెళ్ళి అడగండి" అని అన్నారు.


'ప్రేమసింహాసనం' ప్రారంభోత్సవం

ఈ ఐడియా బానే వుందని చెప్పి నహతా గారి ఆఫీసుకి వెళ్ళాము. వాళ్ళ అబ్బాయి శ్రీకాంత్ గారు మాట్లాడారు. కృష్ణ గారు ఇచ్చిన సలహా గురించి చెప్పాను. "ఓకే..దాని దేముంది.. అలానే ఇస్తాము.." అన్నారు. తరువాత రేటు గురించి మాట్లాడాము. అరవై వేలకి ఖరారు చేసుకున్నాం. అప్పుడే ఎడ్వాన్సు ఇవ్వబోయాను. ఐతే - ఆయనే " ఇప్పుడే అవసరంలేదు..మీ ఏర్పాట్లలో ఉండండి. రికార్డింగ్ ముందురోజు సగం ఇవ్వండి, సినిమా షూటింగ్ మొదలు పెట్టబోయే ముందు మిగతా సగం ఇవ్వండి.." అన్నారు. మేము సరే అన్నాము. స్క్రిప్టు ఇస్తామంటే నేనే అవసరంలేదన్నాను. నేను సినిమా చూసేశాను, పైగా దాన్ని మన నేటివిటీకి అనుగుణంగా మార్చుకోవాలి కాబట్టి ఒరిజినల్ స్క్రిప్టు ఉన్నా ఒరిగేదేమీలేదని నా అభిప్రాయం.

ఆనందంగా వచ్చేశాం.. ఇంక స్క్రిప్టు వర్క్ మీద పూర్తిగా కూర్చున్నాం. సీన్లూ, డైలాగ్సూ అన్నీ ఐపోయాయి. వేటూరి గారితో పాటలు కూడా వ్రాయించాను. శ్రీకాంత్ గారు అన్నమాట ప్రకారమే రికార్డింగ్ రేపు అనగా వాళ్ళింటికి వెళ్ళాం. ముందు అనుకున్నట్లే 30,000 ఆయన చేతికి ఇవ్వబోతే "సారీ.. నాన్నగారు మనసు మార్చుకున్నారు. రైట్స్ మీకు ఇవ్వము. మేమే తీద్దామనుకుంటున్నాం.." అన్నారాయన. నాకు మతిపోయింది...9 సంవత్సరాల నిరీక్షణ..అన్నీ కుదిరాయి. పైగా అయన అన్న మాట మీదనే ఇన్ని ఏర్పాట్లూ చేసుకున్నాం. చివరికి ఇలా అడ్డం తిరుగుతున్నారేమిట్రా..ఏం చెయ్యాలీ అని మథన పడ్డం ప్రారంభించాం.

ఆయన్ని నాకు చేతనైనంతలో బ్రతిమాలాను. నా పరిస్థితి అర్థం చేసుకోమని వివరంగా చెప్పాను. ఐనా ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోడానికి ఒప్పుకోలేదు. వాళ్ళ కుటుంబానికి సన్నిహితుడూ, నాకూ మిత్రుడైన డాన్స్‌మాస్టారు శీనుని తీసుకెళ్ళాను. ఆయన కూడా పరిపరి విధాలా నచ్చజెప్పారు. ఐనా ఆయన రైట్స్ ఇవ్వడానికి ఒప్పుకోలేదు. చివరికి శీను మాస్టారు ఆయన కాళ్ళు పట్టుకునే స్థితికి కూడా వెళ్ళబోయారు.. ఇంక పరిస్థితుల్లో ఆయన్ని వారించాను. "శీను మాస్టారూ.. వెళ్దాం పదండి.. మాట తప్పిన వాళ్ళతో ఇంతకంటే ఎక్కువ బతిమాలడం అనవసరం. వారం రోజుల్లో షూటింగ్ వుంది. ఖచ్చితంగా మొదలుపెట్టి తీరుతాను. దీనికంటే బ్రహ్మాండమైన కథ తయారు చేసుకుని సూపర్ హిట్ చేసి తీరుతాను..మీరూ తియ్యండి ఇదే కథని. అది ఫ్లాప్ కాకపోతే నన్ను అడగండి.." అన్నాను ఆవేశంగా.

"సెంటిమెంటల్ గా అంటున్నారా..?" అడిగారాయన..

" నేను కమ్యూనిస్టుని సార్..నాకు సెంటిమెంట్ల మీద నమ్మకం లేదు. ఆ మాట ఎందుకన్నానంటే ఆ కథని యథాతథంగా తీస్తే మన నేటివిటీకి సరిపోదు. మీరు తీస్తే అలా తీస్తారు..అందుకే అది హిట్ కాదని ఇప్పుడే చెబుతున్నా.." అని వచ్చేశాం.

రావడమైతే వచ్చాం కానీ వారం రోజుల్లో కథ వెదకాలి, కథ హీరోగారికీ, హీరోయిన్‌గారికీ నచ్చాలి.. ఈ అవకాశం వదులుకుంటే కృష్ణగారి డేట్స్ మళ్ళీ ఎప్పటికో గానీ దొరకవు.. పరిస్థితి సంక్లిష్టంగా తయారై కూర్చుంది. ఒక్కరోజులో సీన్ అంతా మారిపోయింది.

ఈ విషయం తెలుసుకున్న కృష్ణగారే మరునాడు నన్ను పిలిచి ఇలా అయిందట గదా అని అడిగారు. ఆయనకెలా తెలిసిందా అని ఆశ్చర్యపోతుంటే నహతా గారే వచ్చి చెప్పారనీ, తామే సినిమా తీస్తామనీ, నాకిచ్చిన డేట్స్ వాళ్ళకివ్వమని అడిగారనీ చెప్పారు. కానీ ఇచ్చిన మాట తప్పడం ఇష్టం లేక అలా వీలుకాదని చెప్పాననీ కృష్ణ గారు చెప్పారు. పైగా వాళ్ళకి "మీరు మస్తాన్ రావుని డైరెక్టర్ గా పెట్టుకుంటే ఆలోచిస్తాను.." అన్నారట. దానికి వాళ్ళు ఒప్పుకోలేదు..

సరే నేను చెప్పాను " కృష్ణ గారు..అనుకున్న ప్రకారం వారం రోజుల్లో షూటింగ్ మొదలు పెడదాం. మీకు 2,3 రోజుల్లో కథ చెబుతాను. మీకు నచ్చితేనే చేద్దాం.." అని చెప్పి వచ్చేసి కథల వేటలో పడ్డాం. జంధ్యాలా నేను కలిసి బెంగుళూరు వెళ్ళాం. ఏమైనా కన్నడ సినిమాలు ఉంటాయేమో రైట్స్ తెచ్చుకుందామని. ఏమీ దొరకలేదు. తిరుగు ప్రయాణంలో వస్తూ వస్తూ ఒక హోటల్లో టిఫిన్ చెయ్యడానికి ఆగినప్పుడూ సడన్ గా ఒక చిన్న ఫ్లాష్ మెరిసింది. జంధ్యాలకి స్టోరీ థ్రెడ్ చెప్పాను. " భలే వాళ్ళే సార్ మీరు...ఇంత మంచి కథ మీ వద్దనే పెట్టుకుని ఊరంతా తిరుగుతున్నారెందుకూ.. పదండి దీన్నే డెవలప్ చేద్దాం.. " అని మద్రాసు రాగానే సత్యానంద్ తో కూర్చుని దానికి తుది మెరుగులు దిద్దారు. సత్యానంద్ చెప్పిన కొన్ని మలుపులు నేననుకున్న దానికి ఫోర్స్ నిచ్చాయి. ఈ కథ ఖచ్చితంగా కృష్ణగారికి నచ్చుతుందని అనిపించి ఆయనకి ఫోన్ చేసి మరునాడు కథ చెప్పడానికి వస్తున్నామని తెలియచేశాను.



షూటింగ్‌కి 3 రోజులు టైముందంతే.. సరే హీరోయిన్‌కి షూటింగ్ కన్‌ఫర్మ్ చేద్దామని జయప్రద ఇంటికి వెళ్ళాం. " మీరు తీస్తోంది కస్మేవాదే కథ కాదట గదా.. అలా ఐతే నేను యాక్ట్ చెయ్యను " అందావిడ. ఒక వైపునుంచీ ముడి విప్పుకుంటూ వస్తుంటే ఇంకో వైపు నుంచీ కొత్త ముడులు పడుతున్నాయి. ఇంతవరకూ జరిగిందంతా వివరించి దయచేసి అలాంటి నిర్ణయం తీసుకోవద్దనీ, చివరి నిమిషంలో వేరే వాళ్ళని తీసుకోవడం కష్టమనీ నచ్చ జెప్పచూశాం.. "నాన్నగారిని అడిగి చెబుతాను. ఆయన ఇప్పుడు ఊళ్ళో లేదు. మూడు రోజులాగి రండి.." అందావిడ. ఆవిడ ఇచ్చిన గడువు సరిగ్గా షూటింగ్‌కి ముందు రోజు. అప్పటివరకూ ఆగి అప్పుడు ఆవిడ ఒప్పుకోకపోతే.. అది మరింత డామేజ్ అవుతుంది. ఐనా అక్కడేమీ అనకుండ సరేనని చెప్పి వచ్చేశాం.

అప్పుడే తమిళంలో 'పదునారు వైదునిలే' విడుదలై ప్రేక్షకుల్ని ఒక ఊపు ఊపేస్తోంది. ఏ మాత్రం ఆలోచించకుండా శ్రీదేవి వద్దకి వెళ్ళాం. ఆవిడ హఠాత్తుగా ఎక్కడనుంచీ తెస్తారు డేట్స్? ఐనా మా ప్రయత్నం చెయ్యాలి కదా. ఆవిడ అదే అన్నారు. " ఒక్క పని చేయండి..రేపో ఎల్లుండో వచ్చి కథ చెబుతాం..కథ నచ్చితే డేట్స్ ఎలాగొలా సర్దుకుందాం..'అని చెప్పి వచ్చాం. మరునాడే కృష్ణగారికి కథ వినిపించాం. ఆయనకి విపరీతంగా నచ్చేసింది. కథ వింటున్నంతసేపూ పగలబడినవ్వుతూనే ఉన్నారు. " మొత్తానికి అఖండులయ్యా..మూడు రోజుల్లోనే అద్భుతమైన కథ ని తయారు చేశారు. ఐతే ఒక చిన్న ఇబ్బంది వచ్చింది.." అన్నారు.

మళ్ళీ మా గుండెల్లో బాంబు..

"మీరు నాలుగు రోజుల్లో కొత్త కథ ఏం చేస్తారులే అనుకుని మీ కిచ్చిన డేట్స్‌ని వేరే వాళ్ళకి ఇచ్చేశాను..వాళ్ళంతా ఫినిషింగ్ స్టేజ్ లో ఉన్నారు.." అని చావు కబురు చల్లగా చెప్పారు.

"సార్..ఈ స్టేజ్‌లో మీరే ఏదైనా చెయ్యాలి. షూటింగ్ మాత్రం ఆపలేం. దయచేసి  నిర్మాతలని అడిగి ఎన్ని రోజులు వెనక్కి ఇవ్వగలిగితే అన్నే తీసుకోండి. మేము ఎలాగోలా తంటాలు పడతాము.." అని ఆయనకి చెప్పి శ్రీదేవి వద్దకి వెళ్ళాం. కథ విన్నాక ఆవిడ కూడా "తప్పక చెయ్యాలని ఉంది కానీ చెప్పాను కదా డేట్స్‌దే ప్రోబ్లెం అనీ.. కావాలంటే ఇదుగో డైరీ చూసుకోండి .." అని మా ముందు పడేశారు. అక్కడక్కడ వెదగ్గా వెదగ్గా 8 రోజులు దొరికాయి. ఇంతలో కృష్ణగారి వద్దనుంచీ కబురొచ్చింది ఒక 20 రోజులు సర్దగలనని. ఇక్కడ కొంచెం లక్ కలిసొచ్చి శ్రీదేవి 8 రోజుల్లో , కృష్ణ గారి 20 రోజులూ కలిసే వచ్చాయి. అమ్మయ్య అనుకుని శ్రీదేవి గారికి ఎడ్వాన్స్ ఇచ్చి. మరునాడు పాటల రికార్డింగ్ పెట్టుకున్నాం.

అటువైపు జయప్రద వద్ద ఇచ్చిన 5 వేలు అడ్వాన్స్ ఉండిపోయింది. షూటింగ్ రేపు అనగా ఈ రోజు సాయంత్రం ఆవిడ వద్దకి వెళ్ళాను. "మస్తాన్ రావు గారూ..నాన్నగారితో మాట్లాడాను..చెయ్యమన్నారు. షూటింగ్‌కి వస్తానులెండీ.." అన్నారు. ఆవిడంత హఠాత్తుగా ఒప్పుకోడానికి కారణం తరువాత తెలిసింది. నహతా గారు అదే కథని శోభన్ బాబు గారితో చేద్దామని ఒప్పించారట. జయప్రదే హీరోయిన్. ఐతే శోభన్ బాబుగారి డేట్స్ మరో మూడు నెలల వరకూ లేవు కాబట్టి ఎలానూ ఖాళీ ఉంది కదా అని మాకు ఒప్పుకున్నారు జయప్రద.

" వద్దులెండి.. మీరు చెయ్యనవసరం లేదు..నేను ఇంకో హీరోయిన్ ని మాట్లాడేశాను.." అని చెప్పాను.

"అదేమిటీ..ఎందుకలా..? ఎవరా హీరోయిన్..?" అని అడిగారు.

నేను శ్రీదేవి పేరు చెప్పలేదు. అప్పటికి జయప్రద పేరున్న హీరోయిన్. శ్రీదేవి అప్ కమింగ్ హీరోయిన్..

"ఎవరైతే ఎందుకులెండీ..మీరిలా చివరి నిమిషం వరకూ నిర్ణయాన్ని వాయిదా వేస్తే మేము రిస్క్ తీసుకోలేము కదా.."అని చెప్పి, ఎలాగైతే ముందు ఇచ్చిన ఎడ్వాన్స్ కూడా వెనక్కి తీసుకుని వచ్చేశాను..

***

ఈ విధంగా ఎన్ని  కష్టాలు పడాలో అన్ని కష్టాలూ పడి మొత్తానికి 'బుర్రిపాలెం బుల్లోడు" షూటింగ్ మొదలు పెట్టాం. నవయుగ పంపిణీ దారులు మా డిస్ట్రిబ్యూటర్స్. చాలా స్ట్రాంగ్ పార్టీ. మంచి ఫార్మ్‌లో ఉన్న హీరో గారూ, అప్పుడప్పుడే క్రేజ్ పెంచుకుంటున్న హీరోయిన్, అన్ని విధాలా సహకరిస్తున్న నిర్మాతా..ఇంతకంటే ఏం కావాలీ.. పడిన కష్టాలన్నీ మరిచిపోయి జోరుగా షూటింగ్ మొదలు పెట్టాం..

ఐతే ఇబ్బందులూ అడ్డంకులూ మమ్మల్ని వదల్లేదని 10 రీళ్ళు షూట్ చేశాక తెలిసింది.

అప్పట్లో సినిమా నిర్మాణం మీద డిస్ట్రిబ్యూటర్ల ప్రభావం ఎక్కువగా వుండేది. సినిమా ప్రారంభానికి ముందే పంపిణీదారుతో ఒప్పందం చేసుకునే వారు. సినిమా నిర్మాణం వివిధ దశల్లో పంపిణీదారు సలహాలు కూడా వుండేవి. 'బుర్రిపాలెం బుల్లోడు' పది రీళ్ళు అయ్యాక ఒక రోజు నిర్మాత గారు పిలిచారు.

"మస్తాన్ రావ్ గారూ.. ఒక సలహా ఇవ్వాలని ఉంది. ఇంతవరకూ చూసిన కొంతమంది ఈ సినిమా మరీ నాటక ఫక్కీలో ఉందీ.. ఒకసారి మీ గురువు గార్లు బాపయ్య, రాఘవేంద్రరావు గార్లకి చూపించి వాళ్ళ సలహా ప్రకారం ముందుకి వెళ్తే బావుంటుందని అంటున్నారు.." అన్నారు.

"అదేమిటి సార్..అలా అంటున్నారు. కృష్ణగారి పాత్ర కొత్తగా వుంది. ఆయన చాలా కష్టపడి డాన్సులు చేస్తున్నారు. కథ మీదా, కథనం మీదా నాకు పూర్తి నమ్మకం ఉంది. ఎవరో అనడం ఏమిటండీ.. మీకు నమ్మకం లేక పోతే చెప్పండి. నేను తప్పుకుంటాను. మీక్కావాలంటే నేనే రాఘవేంద్రరావు గారినో బాపయ్య గారినో మాట్లాడిపెడతాను.." అన్నాను.

" అహ్.. అలా అఫెండ్ కావొద్దు.. మన పంపిణీదారులే ఈ అనుమానం వ్యక్త పరిచారు.. నాకైతే మీ మీద నమ్మకం ఉంది .." అన్నారు.

" అలా ఐతే సరేనండీ.. నన్ను నమ్మండి.. ఈ సినిమాని సూపర్ హిట్ చేసే బాధ్యత నాది.." అన్నాను

ఇంక తరువాత పెద్దగా ఇబ్బందులేమీ లేకుండానే సినిమా నిర్మాణం సాగిపోయింది.

శ్రీదేవి కృష్ణల మీద చిత్రీకరించాల్సిన పాట నొకదాన్ని , సమయానికి శ్రీదేవి కాలికి దెబ్బతగలడం వల్ల ఆమెని క్లబ్‌లో కూర్చోబెట్టి కృష్ణ, జయమాలినిల మీద పాట చిత్రీకరించాల్సి వచ్చింది. మ్యూజిక్ డైరెక్టర్ చక్రవర్తి గారు కూడా ప్రతి పాటకీ వెరైటీ ట్యూన్లు ఇచ్చారు. టైటిల్ సాంగ్ ఐతే ' బుర్రి పాలెం బుల్లివాడ్ని నే..నే....' అంటూ కూచిపూడి డాన్సు శైలిలో చిత్రీకరించాము. కృష్ణ గారి డాన్సులకి ప్రేక్షకుల నుంచీ మంచి స్పందన వస్తుందని నాకు ముందునుంచీ గట్టి నమ్మకం ఉంది.

సినిమా విడుదల రోజు విజయవాడ వెళ్ళమని మా ప్రొడ్యూసర్‌గారు పంపించారు. అది 1979 చివరి భాగం.. ట్రైన్‌లో విజయవాడ వెళ్ళాను. సాధారణంగా పంపిణీదారుల మనుషులెవరైనా రైలు వద్దకి వచ్చి రిసీవ్ చేసుకుని హోటల్‌కి తీసుకెళ్ళడం ఆనవాయితీ. రైలు దిగగానే అటూ ఇటూ చూశాను. ఎవరూ నాకోసం రాలేదు. నేనే రిక్షాలో హోటల్‌కి వెళ్ళాను. ఆ హోటల్ కూడా పంపిణీ దారులదే నా పేరు మీదేమన్నా రూమ్ బుక్ చేసారేమోనని కనుక్కున్నాను. లేదని తెలిసింది. సరే నా అంతట నేనే రూమ్ తీసుకుని, స్నానం చేసి మా పంపిణీదారుల ఆఫీసుకి వెళ్ళాను. సినిమా ఉదయం ఆట ఇంకో గంటా, గంటన్నరలో మొదలౌతుంది. డిస్ట్రిబ్యూటర్ గారిని కలిసి వెళ్దామని నా ప్లాన్.



**సువర్ణసుందరి పాటల రికార్డింగ్ లో రమేష్ నాయుడు, బాలసుబ్రహ్మణ్యం గార్లతో**

"సార్..బిజీగా వున్నారు. కాస్సేపు కూర్చోండి.." అని నన్ను ఆయన ఆఫీసు బయటే కూర్చోబెట్టారు. ఎంతసేపైనా లోపలనుంచీ పిలుపు రాలేదు. ఏమౌతోందో తెలియలేదు. సినిమా టైమ్ దగ్గర పడుతోంది. ఒకటికి రెండు సార్లు కబుర్లు చేసిన మీదట లోనికి రమ్మని పిలుపు వచ్చింది..

" ఏమయ్యా మస్తాన్ రావ్..వచ్చావా.. రారా.. మరీ రాత్రి మనవాళ్ళు సినిమా చూశారయ్యా.. ఏదో యావరేజ్ సినిమా అంటున్నారు. కొన్ని రోజులు ఆడుతుందిలే.. ఐతే క్లైమాక్స్ ఉంది చూశావా.. అది అస్సలు బాగో లేదయ్యా. దాన్ని కట్ చేసేద్దామని చూస్తున్నాం.."

నాకు మతి పోయింది. ఇంకో అరగంటలో సినిమా మొదలవబోతోంది. ఈ సమయంలో లోకల్ సెన్సార్ ఇబ్బందులేమిటా అని ఆందోళన మొదలైంది . ఐనా పైకి ఏమీ తెలీకుండా కూల్‌గా

"సార్.. సినిమా ఎలానూ అరగంటలో మొదలౌతుంది కదా.. ఒక్క మోర్నింగ్ షోని యథాతథంగా వేసెయ్యండి. ఆడియన్స్ రియాక్షన్ చూడండి.. మీకు నెగిటివ్ అనిపిస్తే తరువాత నిర్ణయం మీకు వదిలేస్తాను.. సార్.. సినిమా మీద రియాక్షన్ ని నలుగురైదుగురు ఆడియన్స్ ని బట్టి డిసైడ్ చెయ్యడం కంటే, మాస్ రియాక్షన్ ముఖ్యం..నా మాట నమ్మండి.."అని చెప్పాను.



ఆయన ఏ మూడ్ లో ఉన్నారో.. " సరే.. నీ మాట మాత్రం ఎందుకు కాదనాలి.. అలానే చూద్దాం.. ఐతే నువ్వు థియేటర్ కి వెళ్ళి నేను పంపించానని చెప్పు.." అని నన్ను ఒంటరిగా వదిలేశారు.

సరే నేనే థియేటర్ కి వెళ్ళి నన్ను నేను పరిచయం చేసుకుంటే పైకి బాల్కనీ కి తీసుకెళ్ళి, సీట్లన్నీ ఐపోయే సరికి ఎక్స్ట్రా కుర్చీ వేసి కూర్చో బెట్టారు..

సినిమా మొదలైంది.. ప్రేక్షకులకి విపరీతంగా ఎక్కేసింది. ప్రతి సీన్‌కీ నవ్వులు. కృష్ణ, శ్రీదేవిల పాటలకైతే జనాలు బెంచీలెక్కి డాన్సులు చెయ్యడం, తెరమీదికి పైసలు విసిరెయ్యడం చేశారు. సినిమా ఇంటర్వెల్‌కే సూపర్ హిట్ అని తెలిసిపోయింది. సిన్మా పూర్తయే సరికి నేను సంతోషంతో తడిసి ముద్దయ్యాను.. కానీ ప్రేక్షకుల్లో ఒక్కరికి కూడా నేనే దర్శకుడ్ని అని తెలీదు. మెట్లు దిగి క్రిందికి వస్తుంటే దూరంగా చిన్నప్పటి నాటకాల మిత్రుడొకతను నన్ను గుర్తు పట్టి " అరేయ్..మస్తాన్ రావ్."అని పిలిచాడు. ఆ మాట విన్న కొంతమంది..నా వైపు చూసి " మస్తాన్ రావు అంటే..బీరం మస్తాన్ రావు.. ఈ సినిమా డైరెక్టర్ మీరేనా..?" అని అడిగి నన్ను అందరూ కలిసి భుజాల మీద ఎక్కించుకుని ఆనందతో కేరింతలు కొడుతూ, ఎవరో మధ్యలోపూల దండలు తెచ్చి మెడలో వేసి..థియేటర్ చుట్టూ వూరేగించారు..

తరువాత ఆ చిత్రం సాధించిన ఘనవిజయం మీకూ తెలిసిందే.

ఇదండీ..నామొదటి సినిమా చరిత్ర..! సినిమా నిర్మాణం ఎప్పుడూ పూలబాట మీద ప్రయాణం కాదు.. అడుగడుగునా ఎన్నో ఆటంకాలు, అనుకోని అవాంతరాలు ఎదురౌతుంటాయి. ఎప్పుడు ఏ మూలనుంచీ ఏ ఆటంకం వస్తుందో ఊహించలేం. షిప్ కి కెప్టెన్ లాంటి దర్శకుడికి గుండెల నిండా దమ్ముండాలి, నమ్మిన దాన్ని అమలు పరిచే ఆత్మవిశ్వాసం ఉండాలి, క్రియేటివిటీ విషయంలో ఎక్కడా

**ఇప్పుడేంచేస్తున్నారు...?**

*1988 లో హైదరాబాదుకి వచ్చేసిన శ్రీ మస్తాన్ రావు గారు పలు టి.వి చానెళ్ళకి అనేక సీరియల్స్ రూపొందించారు. తొలిసారిగా టి.వి.సీరియళ్ళల్లో సినీ నిర్మాణంలో అనుసరించే ఎన్నో టెక్నిక్స్ ని పరిచయంచేశారు. గత ఏడెనిమిదేళ్ళుగా ధ్యాన ప్రక్రియలో ఎన్నో ప్రయోగాలు చేశారు. చేస్తున్నారు. తరచూ హిమాలయాలకు వెళ్ళి అక్కడ యోగులని దర్శించి వస్తుంటారు. ధ్యానంలో తనకి కలిగిన అనుభవాలతో 'ధ్యానమస్తాన్' అనే పుస్తకం కూడా వ్రాశారు. స్వామి రామగారు వ్రాసిన గ్రంథం ఆధారంగా హిమాలయాలలోని యోగుల గురించి విలక్షణమైన చలన చిత్రాన్ని రూపొందించాలనే ఆశయంతో స్క్రిప్టు వర్క్ చేస్తున్నారు. ఈ చిత్రం ద్వారా భారతీయ ధ్యాన ప్రక్రియగురించీ, హిమాలయాలలోని యోగులు ఈ ప్రక్రియలో చేస్తున్న కృషి గురించీ ప్రపంచానికి తెలియచేయాలని మస్తాన్ రావు గారి ప్రయత్నం. దీనితో బాటుగా టి.టి.డి దేవస్థానం వారు సొంతంగా ప్రారంభించబోయే టి.వి.ఛానెల్ కోసం స్క్రిప్టు ఇన్ చార్జ్ / కో ఆర్డినేటర్‌గా కూడా పనిచేస్తున్నారు.. ఆయన సెల్ నంబరు:*

98667 48817.

రాజీ పడకూడదు.. ప్రేక్షకులే అంతిమ తీర్పు చెబుతారు..

ఈ కష్టాలన్నీ మొదటి సినిమాకే అనుకుంటే పొరబడ్డట్టే. తరువాత తీసిన 5 సినిమాలూ కూడా మొదటి సినిమాలాగే కష్టాలు తెచ్చిపెట్టాయి. కష్టమొచ్చిన ప్రతిసారీ ఎలాగొలా బయటపడేవాడిని. చివరిసారిగా నేనే స్వయంగా నిర్మించి, దర్శకత్వం వహించిన సువర్ణసుందరి విడుదలయ్యాక మేధావుల ప్రశంసలనందుకుంది. 1984 ప్రాంతాల్లో ఆ సినిమాలోని పాటలూ , నృత్యాలూ Talk of the town గా వుండేవి. కానీ ప్రేక్షకాదరణకి నోచుకోలేదు. సినిమా నిర్మాణ వ్యయంలో కూడా మా అంచనాలు తలక్రిందులయ్యాయి. ఆ రోజుల్లో చంద్రమోహన్ హీరోగా నిర్మించిన సినిమాకి బడ్జెట్ 15 లక్షలు దాటకూడదు. దాటిందా నిర్మాత మఠే..! నా విషయంలో అదే జరిగింది. సినిమా నిర్మాణ వ్యయం 40 లక్షలు ఐంది. 13 ఫుల్ ఫ్లోర్ సెట్స్ వేసి, 10 వర్ణభరితమైన పాటలు చిత్రీకరించాను. చిత్రానికి 1984 సంవత్సరానికి 8 నంది అవార్డులు రావడంతో మంచి దర్శకుడిగా మిగిలిపోయినా, అదే సినిమా నేను చిత్రరంగంనుంచీ నిష్క్రమించడానికి కారణమయ్యింది...! ఒక్క పొరబాటైనా జీవితాన్ని ఎలాంటి మలుపులు తిప్పుతుందో నా ఈ చివరి సినిమానే ఉదాహరణ..!

ఐతే నా ప్రతిభనీ , అనుభవాన్నీ గుర్తించిన ప్రభుత్వం సినిమాలకూ, టి.వి సీరియల్స్‌కూ నంది అవార్డులనిచ్చే కమిటీల్లో నన్ను తరచూ సభ్యుడిని చేస్తున్నారు. ఇలా సుమారుగా 37 ఏళ్ళుగా సాగిన నా సినిమా జీవిత జ్ఞాపకాలని నెమరేసుకుని మీ ముందుంచే అవకాశాన్ని కల్పించిన 'కౌముది' కి నా కృతజ్ఞతలు..!

PUBLISHED IN FEBRUARY 2008

# పి.చంద్రశేఖర్‌రెడ్డి

*సుమారు 75 చిత్రాలకి దర్శకత్వం వహించిన పి.చంద్రశేఖర రెడ్డి గారు తెలుగు సినిమా చరిత్రలో తనదైన ముద్రవేశారు. అత్యధిక శాతం విజయవంతమైన చిత్రాలే. అక్కినేని, ఎన్టీఆర్, కృష్ణ, శోభన్ బాబు, మోహన్‌బాబు, సుమన్..వగైరా అందరు హీరోలతోనూ సినిమాలు తీసారు. ఒక వైపు అందరినీ కట్టుకున్నే కుటుంబ గాధా చిత్రాలు తీస్తూనే మరో వైపు జేమ్స్‌బాండ్ 999, మాయలాడి, కంచు కవచం లాంటి యాక్షన్ సినిమాలు కూడా తీశారు. వీరి వద్ద పనిచేసిన వారిలో మొత్తం 47 మంది ఇంతవరకూ దర్శకులయ్యారు. ఈ సంఖ్య వచ్చే సంవత్సరం చివరికి 60 చేరుకుంటుందని అంచనా. సీనియర్ మోస్ట్ డైరెక్టర్ శ్రీ పి.చంద్రశేఖర రెడ్డి గారు 'కౌముది 'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తన మొదటి సినిమా అనుభవాలని ఇలా పంచుకున్నారు..*

మా స్వగ్రామం నెల్లూరు జిల్లా, ఆత్మకూరు మండలంలోని అనుమసముద్రం అనే పల్లెటూరు. నేను 1933 లో పుట్టాను. అప్పటికి (కొంతవరకూ ఇప్పటికీ) మా వూరు చాలా వెనుక బడిన ప్రదేశం. అన్నీ మెట్టపంటలే. నాకు ఊహ తెలిసాక చాలా రోజులు



కరెంటు కూడా లేదు. మేము గుడ్డి దీపాల వెలుగులోనే పెరిగాము. నాన్న పేరు నారపరెడ్డి. అమ్మ సుబ్బమ్మ. నాన్న గారు ఆ వూరి మునసబుగా పనిచేసే వారు. మాది మధ్యతరగతి కుటుంబమే కానీ పెద్ద కుటుంబం. అన్నయ్యా, నేనూ మగ పిల్లలం , ఆరుగురు ఆడపిల్లలు.

నా చిన్నప్పుడు సాయంకాలమయ్యే సరికి నాన్న వద్దకి ఊళ్ళో వాళ్ళంతా వచ్చి కూర్చునే వాళ్ళు. నాన్న చక్కటి గాత్రంతో పద్యాలు చదువుతూ వాళ్ళందరికీ పురాణాల్లోని ముఖ్య ఘట్టాలని వివరించి చెబుతుండేవారు. నాకవి చాలా ఆసక్తి కరంగా ఉండేవి. ఆ పద్యాలు వుంటూ నాన్న చెప్పే పురాణ పాత్రలని మనసులో ఊహించుకుంటూ ఉండేవాడిని. అప్పుడే నాలో క్రియేటివిటీకి బీజం పడిందేమో అనిపిస్తుంటుంది ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే.

నా ప్రాథమిక పాఠశాల చదువంతా మా వూళ్ళోనే సాగింది. హైస్కూలుకి మాత్రం మా వూరికి ఆరు మైళ్ళ దూరంలో వున్న ఆత్మకూరు వెళ్ళేవాళ్ళం. ఆరుమైళ్ళు వెళ్ళడం ఆరు మైళ్ళు రావడం.. ప్రతిరోజూ విహారయాత్రలానే ఉండేది.. ఆ రోజుల్లోనే మా అన్నయ్య బలరామరెడ్డి మద్రాసులో ఒకరి వద్ద బియ్యం వ్యాపారం చేస్తూ ఉండేవాడు. మా మామయ్య ఇంకొకాయన (ఆ యన పేరూ నారప రెడ్డి), మద్రాసులోనే నెయ్యి వ్యాపారం చేస్తుండేవాడు. వీళ్ళిద్దరూ మద్రాసులో ఉండడంతో అన్నయ్య నన్ను తనవద్ద ఉండి చదువుకోమని చెప్పి నన్ను మద్రాసు తీసుకెళ్ళారు. ఆవిధంగా నేను మద్రాసులోని పచ్చయ్యప్పాస్ కాలేజీలో చేరాను. నేను ఇంటర్మీడియట్ చదువుతుండగా మా కాలేజీలో నాకు బాగా సీనియర్లు వి.రామచంద్రరావు, వల్లం నరసింహారావు ఉండేవాళ్ళు. (భవిష్యత్తులో వల్లం నరసింహారావు సినీ రంగంలో నటుడిగా స్థిరపడగా, వి.రామచంద్రరావు ప్రముఖ దర్శకుడయ్యారు). నాకూ వాళ్ళకీ చాలా తరగతులు వ్యత్యాసం ఉన్నా వాళ్ళతో చాలా స్నేహంగా ఉండేవాడిని. నేను డిగ్రీకి వచ్చేసరికి స్టూడెంట్ ఫెడరేషన్

కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ నాటకాలలో ప్రధాన పాత్రలు వేస్తుండేవాడిని. ఇంటర్ కాలేజీ పోటీలు లాంటి ఈవెంట్స్ నిర్వహణలో ముందు ఉండేవాడిని.

ఎమ్మే లో ప్రవేశించేసరికి వల్లం నరసింహారావు నటుడిగా ఎదుగుతున్నారు. ఆయన సహాయంతో అసలు సినిమా షూటింగ్ ఎలా ఉంటుందో చూద్దామని ఒకరోజు ప్రకాష్ స్టూడియోకి వెళ్ళాను. ఏ సినిమానో గుర్తులేదుకానీ నేను వెళ్ళేసరికి సెట్టంతా హడావిడిగా గందరగోళంగా వుంది. కాస్సేపటికి సన్నగా,బక్క పల్చగా ఉన్న ఒకాయన వచ్చేసరికి అంతా ఎక్కడి వారక్కడ సర్దుకున్నారు. అంతా ఆయన ఏమి చెబితే అది చెయ్యడం మొదలెట్టారు. ఒక్క మనిషి అంతమందిని అలా కంట్రోల్ చేయడం నాకు చాలా విచిత్రంగా అనిపించింది. తరువాత తెలిసింది ఆయన దర్శకుడు జగన్నాథ్ గారనీ, దర్శకుడికి సినిమా నిర్మాణంలో అంత పవర్ ఉంటుందనీ..! అప్పుడే అనిపించింది ఎప్పటికైనా సినిమాల్లో దర్శకుడిని కావాలని. మళ్ళీ ఇంకోసారి వాహినీలో కె.వి.రెడ్డి గారి షూటింగ్ చూసే అవకాశం లభించింది. అక్కడైతే మరీ భయంకరమైన డిసిప్లిన్. అప్పటికే 'పాతాళభైరవి' లాంటి హిట్ సినిమాలతో పెద్దపేరు తెచ్చుకున్న ఎన్టీరామారావు గారు సైతం డైరెక్టర్ రెడ్డి గారి వద్ద వినయ విధేతలతో ఉండడం గమనించిన నాకు, దర్శకుడి హోదా మీద గౌరవం , ఆకర్షణ పెరిగాయి.



ఇంక అది మొదలు తరచీ కాలేజీ ఎగ్గొట్టి సినిమా షూటింగ్ లకి వెళ్ళేవాడిని. ఇంట్లో ఏదో ఒకటి చెబుతుండే వాడిని. ఇలా వెళ్ళడంలోనే జగన్నాథ్ గారితో పరిచయం కావడం, వల్లం నరసింహారావు గారి వల్ల ఆ పరిచయం చనువుగా పెరగడం జరిగాయి. అప్పుడు ఆయన ఈలపాట రఘురామయ్య, సూరిబాబు, వల్లం నరసింహారావు, సంధ్య(జయలలిత తల్లి) ..మొదలైన వారు ముఖ్య పాత్రలుగా 'శ్రీకృష్ణ రాయబారం' సినిమా మొదలుపెడుతున్నారు. నా ఉత్సాహం గమనించి దానికి అసిస్టెంట్‌గా పనిచేసే అవకాశం ఇచ్చారు. ఆయన కూడా బాగా చదువుకున్న వ్యక్తి. అప్పట్లో చదువుకున్న వాళ్ళు సినిమా రంగంలోకి వెళ్ళడం అరుదు. నేను ఎమ్మే చదువుకుంటున్నానని తెలిసి కూడా అందరూ గౌరవంగా చూసే వారు.

ఆ విధంగా నాకు తెలుగు చలన చిత్రరంగంలో పనిచేసే అవకాశం కలిపించిన మొదటి సినిమా శ్రీకృష్ణ రాయబారం. ఆ సినిమా షూటింగ్ జరుగుతున్నన్ని రోజులూ అతిశ్రద్ధగా అన్ని విభాగాల తీరుతెన్నులనీ అధ్యయనం చేసాను. సినిమా చివరికి వచ్చేసరికి అటు కాలేజీలో కూడా ఎమ్మే ఫైనలియర్ పరీక్షలు దగ్గరకొచ్చాయి. ఇంకో నెల రోజులు షూటింగ్‌లో కంటిన్యూ అయితే సినిమాలో పేరు పడుతుంది. ఇటు చూస్తే పరీక్షలు రాస్తే డిగ్రీ వస్తుంది. సినిమాలో పేరుకోసం ఎమ్మే డిగ్రీ వదులుకోవడమా లేదా అన్న సందిగ్ధం. నాకై నేనే తేల్చుకోవాల్సిన విషయం. చివరికి మనసు సినిమా వైపే మొగ్గు చూపింది. ఎమ్మే పరీక్షలకి డుమ్మా కొట్టేసాను. ( మరి డైరెక్టర్ గారితో చెబితే 'పేరు వేస్తానులే..వెళ్ళి పరీక్షలు రాసిరా' అనే వాళ్ళేమో.. కానీ ఆ పని చేయలేదు. నా అంతట నేనే చదువు మానెయ్యడానికే నిర్ణయించుకున్నాను. అప్పటినుంచీ ఇప్పటివరకూ బి.ఎ తో నే సరిపెట్టుకున్నాను. ఎమ్మే చెయ్యాలనే ఆశ ఉంది ఇంకా. మా ఇద్దరు అమ్మాయిలు ఎమ్మే చేశారు, మనవరాలు బి.కామ్ చేసింది. మా అమ్మాయిలు నాతో అంటుండేవారు 'నాన్నా..మాతో ఐనా ఈ సారి పరీక్షలు రాసి ఎమ్మే డిగ్రీ తెచ్చుకుంటావా!' అని!)

ఆ విధంగా శ్రీకృష్ణరాయబారం సినిమాలో మొదటి సహాయ దర్శకుడిగా తెరమీద నాపేరు పడింది. ఇది జరిగింది 1959లో..! మొదటి చిత్రానికి పనిచేసేప్పుడే సముద్రాల, మల్లాది గారి లాంటి ఉద్దండులతో సన్నిహితంగా మెలిగే సదవకాశం లభించింది.

తరువాత జగన్నాథ్ గారి వద్ద కొంచెం గాప్ వచ్చింది. అప్పుడే కె.బి.తిలక్ గారు 'పండుగ అల్లుళ్ళు' అనే సినిమాకి స్క్రిప్టు సిద్ధం చేస్తున్నారు. ఎస్.వి.రంగారావు, ఛాయాదేవి వగైరా తారాగణంతో ఆ చిత్రం చేయాలని ఆయన ప్రయత్నం. ఆయన వద్ద సహాయకుడిగా చేరాను. మద్దిపట్ల సూరి గారి రచన అది. అప్పటికే రేడియోలో ప్రసారమై చాలా పేరు తెచ్చుకుంది ఆ నాటకం. కొన్ని రోజులు పనిచేశానక్కడ. కానీ ప్రయత్నాలు ఒక కొలిక్కి రావడం లేదు. ఈ లోగా తిలక్ గారి వద్ద పనిచేసిన వి.మధుసూదన రావు గారు దర్శకుడై 'తులసి' తీశారు. ఆయన రెండో చిత్రం 'అన్నపూర్ణ' (జగపతి వారి మొదటి చిత్రం)కి పనిచేయడానికి ఎవరైనా సహాయకుడు కావాలని చూస్తున్నారని తెలిసింది. తిలక్ గారు కూడా తన సినిమా ఎప్పటికి మొదలౌతుందో తెలీదని మధుసూదన రావు గారి వద్దకి వెళ్ళమనే ప్రోత్సహించారు.



ఆ విధంగా మధుసూదన రావు గారి వద్ద చేరిన వాడిని 11 సంవత్సరాలపాటు అక్కడే పనిచేశాను. జగపతి వారి 'అంతస్తులు', 'ఆస్తి పరులు', 'ఆత్మ బలం' వగైరా సినిమాలన్నింటికీ నేనే సహాయకుడ్ని. మధుసూదన రావు గారు ఏ సినిమా చేసినా వేరే ఎవరూ చెప్పనవసరం లేకుండా నేనే మొదటి సహాయకుడిగా వుండే వాడిని. అన్ని సంవత్సరాల్లోనూ జగపతి రాజేంద్ర ప్రసాద్ గారితోనూ, అక్కినేని గారితోనూ కూడా చాలా చనువు ఏర్పడింది. వయసులో చిన్నవాడినైనా అందరూ గౌరవంగా 'రెడ్డిగారూ' అని పిలిచే వారు. తమ్మారెడ్డి కృష్ణమూర్తి గారి లక్షాధికారి సినిమాకి కూడా నేనే అసిస్టెంట్‌ని. ఆయనకూడా నన్ను చాలా అభిమానంతో చూసుకునేవారు. జగపతి రాజేంద్ర ప్రసాద్ గారే నన్ను దర్శకుడ్ని చేయాల్సింది..

కానీ అనుకోకుండా ఏమైందంటే అన్నపూర్ణావారి 'పూలరంగడు' సినిమాకి పనిచేసే అవకాశం వచ్చింది. అప్పటి వరకూ ఆదుర్తి సుబ్బారావు గారి వద్ద సహాయకుడిగా పనిచేసిన విశ్వనాథ్ గారు దర్శకుడై పోవడంతో ఆయనకి మంచి అసిస్టెంట్ కావాలని నన్ను అడిగారు. రాజేంద్రప్రసాద్ గారు 'రెడ్డి గారిని నేను దర్శకుడ్ని చెయ్యాలనుకుంటున్నాను' అంటే ' తరువాతి సినిమాకి మేమే దర్శకత్వం ఛాన్స్ ఇస్తాం..పంపండి' అని వాగ్దానం చేసి నన్ను తీసుకున్నారు. అప్పటికే అక్కినేని గారితో ఎన్నోఏళ్ళ పరిచయం ఉండడం వల్లకూడా ప్రోజెక్ట్ ఒప్పుకుని అన్నపూర్ణా సంస్థలో ప్రవేశించాను. ఆ సినిమా పూర్తయింది. రీ-రికార్డింగ్‌కి ముందు నిర్మాత దుక్కిపాటి గారు, మేమూ అందరం కలిసి 'పూలరంగడు' రషెస్ చూశాము. దుక్కిపాటి గారు 'మళ్ళీ రేపు ఉదయం చూద్దాం' అన్నారు. రెండో సారి ఎందుకు చూద్దామనుకుంటున్నారో అర్థం కాలేదు. సరే మరునాడు పొద్దున్నే చూశాం. మళ్ళీ మూడో షో కూడా వెయ్యమన్నారు. 'నాకేమీ అర్థం కాలేదు. ఇంకా రీ-రికార్డింగ్ కూడా కాలేదు, మనం తీసిన సినిమానే ఎందుకిన్ని సార్లు చూడ్డం' అనుకున్నాను. ఐతే మూడో సారి చూసేప్పుడు దుక్కిపాటి గారు నన్ను పిలిచి 'ఈ సినిమాలో ఇంకా ఎక్కడెక్కడ ఇంప్రూవ్ చెయ్యొచ్చో పాయింట్లు చెప్పండి' అని అడిగారు. అప్పుడర్థమైంది ఆయన అన్నిసార్లు ఎందుకు చూసారో నని. నాకు తెలిసిన పాయింట్లు ఐదారు రాశాను. ఆయన 15 పాయింట్లు రాశారు. నాకు చాలా సిగ్గేసింది. అరే ఆ విషయాలు నాకెందుకు తట్టలేదా అని. మళ్ళీ ఆర్టిస్టుల్ని మద్రాసునుంచీ రప్పించి కొన్ని సీన్లు రీ-షూట్ చేయించారు. అదీ ఆ రోజుల్లో నిర్మాతకి కూడా సొంత సినిమా మీదనున్న మమకారం, ఆత్మీయత, నిబద్ధత! సినిమా విడుదలైంది. సూపర్ హిట్ ఐంది.. అందరూ సంతోషించారు. ఇక నాకు దర్శకత్వం అవకాశ మివ్వడమే మిగిలింది. ఐతే అప్పుడే అంత పెద్ద హిట్ ఇచ్చి, వెంటనే కొత్త దర్శకుడితో తరువాతి సినిమా తీయడమంటే రిస్క్ అని చెప్పారు అన్నపూర్ణా సంస్థ వారు.

ముందు మాట ఇచ్చేకదా తీసుకొచ్చారు..మరి ఇప్పుడిలా అంటున్నారేమిటా అనిపించింది ఒక్క క్షణం, ఐతే వాళ్ళ వైపునుంచీ చూస్తే అదీ నిజమే అనిపించింది. ఆ విధంగా అన్నపూర్ణలో మొదటి సినిమా చెయ్యాల్సిన అవకాశం దక్కలేదు.

అదే సమయంలో ఫ్రెండూ, బంధువూకూడా ఐనా ఎస్.వి.ప్రభాకర రెడ్డి అనే ఆయన 'ఎలాగైనా సరే నీ దర్శకత్వంలో సినిమా తీస్తాను. నిన్ను నా సినిమాకే మొదటిసారి దర్శకుడ్ని చేస్తాను' అని వచ్చారు. నేనూ సరే అన్నాను. ఎవరితో తీయాలి అనుకున్నప్పుడు నాకు బాగా చనువున్న అక్కినేనిగారు గుర్తొచ్చారు. ఆయన వద్దకి వెళ్ళాం, మా సినిమాలో చెయ్యండి అని అడగడానికి. ఐతే ఆయన 'చూడండి రెడ్డి గారూ.. మీ మీద , మీ ప్రతిభమీదా నాకు పూర్తి నమ్మకం వుంది కానీ మీరూ కొత్తే, నిర్మాతే కొత్తే.. నా పాలసీ ప్రకారం ఇద్దరూ కొత్త వారే ఐతే సినిమా చెయ్యలేను. మీరు ఒక సినిమా చేసి రండి, రెండో సినిమా తప్పని సరిగా చేస్తాను..' అన్నారు. ఆయన భావం కూడా అర్థం చేసుకున్నాను.

సరే ఇంక ఆప్షన్స్ ఏమున్నాయా అనుకుంటే అప్పుడు మాంచి రైజింగ్ లో వున్న కృష్ణగారు కనిపించారు. ఆయన్నీ , విజయనిర్మలగారినీ అడిగాం. వారితో నా మొదటి సినిమా 'అనూరాధ' మొదలుపెట్టాం. ఐతే నేను ముందునుంచే 'దర్శకుడ్ని ఐపోవాలి..కథలన్నీ సిద్ధం చేసుకోవాలి..' అనే తపనలో ఉండేవాడ్ని కాదు కనుక, కథ తయారుగా లేదు. అప్పుడు నిర్మాతా, నేనూ కల్సి కథ తయారు చేసుకున్నాం. జగపతి సంస్థలో అనేక సినిమాలకి కలిసి పనిచేసిన ఆత్రేయ గారిని మాటలు వ్రాయడానికీ, కె.వి.మహదేవన్ గారిని సంగీతానికి మాట్లాడుకున్నాం. మిగతా కేరక్టర్స్ రాజశ్రీ, కృష్ణంరాజు, రాజబాబు...వగైరా అందరూ కుదిరారు. కానీ అప్పట్లో పంపిణీదారులే సినిమా నిర్మాణాన్ని శాసించేవాళ్ళు. వాళ్ళ అండదండలు లేకుండా సినిమాలు మొదలవడం కానీ, పూర్తవడం కానీ జరిగేవి కాదు. మా కొత్త సినిమాకి ఎవరు ముందుకొస్తారు!? అప్పుడే వి.బి.రాజేంద్రప్రసాద్ గారు ఆయన సినిమాలు చాలా పంపిణీ చేసిన లక్ష్మీ ఫిలిమ్స్‌వాళ్ళతో మాట్లాడారు. 'అసలు నేనే రెడ్డి గారిని దర్శకుడిని చేయాల్సింది. మంచి భవిష్యత్తు ఉంది..మీరు ఈ సినిమాకి పంపిణీదారులు గా వుండండి' అని సిఫార్సు చేశారు.

ఆ విధంగా ప్రసిద్ధ పంపిణి సంస్థ లక్ష్మీ ఫిలిమ్స్ ఆశీస్సులతో నా మొదటి సినిమా 'అనూరాధ' 1970 లో మొదలైంది. కొన్ని నెలలు జోరుగా షూటింగ్ సాగింది కానీ మధ్యలో కారణాంతరాలవల్ల బ్రేక్ వచ్చింది. ఆగి పోయిందనడం కరెక్టుకాదు కానీ కొంచెం గ్యాప్ ఇవ్వాల్సి వచ్చింది. అదే సమయంలో ఫారెస్ట్ ఆఫీసర్ మార్రెడ్డి గారూ, వాళ్ళ బ్రదర్ చిన్నపురెడ్డి గారూ తమ రెండో సినిమా మొదలుపెడుతూ నన్ను దర్శకత్వం చెయ్యమని అడిగారు. అదే 'విచిత్ర దాంపత్యం'. ఎలానూ 'అనూరాధ'కి గ్యాప్ వచ్చింది కాబట్టి సరే నన్నాను. మొదటి సినిమాలో కృష్ణ, విజయనిర్మల కాబట్టి దీనిలో శోభన్ బాబు, చంద్రకళ అనుకున్నాం. ఐతే చంద్రకళ, ఎమ్జీఆర్‌తో తమిళ సినిమాలో ఉండడం వల్ల దీనికి కూడా విజయనిర్మల గారినే హీరోయిన్‌గా తీసుకోవడం జరిగింది. బహుశా ఏ కొత్త దర్శకుడికీ ఎదురవ్వని మరో అనుభవం - ఈ సినిమా చేస్తున్నప్పుడే నందినీ ఫిలిమ్స్ వారి దగ్గర నుంచీ 'అత్తలూ-కోడళ్ళు' కి పనిచెయ్యమని కబురొచ్చింది. ఈ విధంగా మొదటి సారే 'విచిత్ర దాంపత్యం', 'అత్తలూ కోడళ్ళు' రెండు సినిమాలూ సమాంతరంగా షూటింగ్ చేసాను.

అలానే ఏ కొత్తదర్శకుడికీ దొరకని మరో అనుభవం.. ఈ రెండు సినిమాలూ ఒకేరోజు విడుదలవవడం. 1971 ఏప్రిల్ 14న విజయవాడలో రిలీజ్‌కి వెళ్ళాం. ఇద్దరు నిర్మాతలూ పక్కపక్క రూముల్లోనే దిగారు. ఇంటర్వెల్ వరకూ 'విచిత్ర దాంపత్యం', ఆ తరువాత 'అత్తలూ కోడళ్ళు' చూసాం. ఒకటి నవయుగ వాళ్ళదీ, రెండోది పూర్ణాపిక్చర్స్‌దీ. రెండూ హిట్ టాక్ తెచ్చుకున్నాయి. అనుకోని ఆనందం..! తరువాత కొద్ది నెలలకి ఎప్పుడో మొదలై ఆగిపోయిన 'అనూరాధ' విడుదలయ్యింది. అదీ మొదటి రెండు సినిమాలంత హిట్ టాక్ తెచ్చుకోకపోయినా, ఓ మోస్తరుగా ఆడింది. మరి ముందుగా 'అనూరాధ' విడుదలై ఉంటే నా భవిష్యత్తు ఎలా ఉండేదో కానీ అనుకోకుండా జరిగిన మార్పులవల్ల మొదటగా రిలీజైన రెండు సినిమాలూ హిట్ అవడం నాకు చాలా సహాయం చేసింది.

ఈ విధంగా నా దర్శకత్వంలో మొదలైన మొదటి సినిమా 'అనూరాధ' ఐతే రిలీజైన మొదటి సినిమాలు 'విచిత్ర దాంపత్యం', 'అత్తలూ-కోడళ్ళు'.

ఇంక అప్పటినుంచీ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ఇంకా దర్శకత్వం కొనసాగిస్తూనే ఉన్నాను. దాదాపు 40 సంవత్సరాల క్రిందటి జ్ఞాపకాల్ని వెలికి తీసుకొస్తున్న 'కౌముది'కీ, ఇన్నేళ్ళుగా నా సినిమాలని ఆదరించిన తెలుగు ప్రేక్షకులకి నా శుభాభినందనలు.

ఇంటర్వ్యూ: కిరణ్‌ప్రభ

PUBLISHED IN APRIL 2008

# శివనాగేశ్వరరావు

*మొట్ట మొదటి సినిమా 'మనీ' తోనే సంచలనం సృష్టించిన శివనాగేశ్వర రావుగారు తరువాత 'పట్టుకోండి చూద్దాం', 'సిసింద్రీ' బ్లాక్ బస్టర్స్ అందించారు. 'నాయనమ్మ', 'వన్ బై టూ', 'వామ్మో వాత్తో వో కోడలో..', 'డూప్లికేట్', 'రమణ', , ధనలక్ష్మీ ఐ లవ్ యూ', ' మిస్టర్ అండ్ మిసెస్ శైలజా కృష్ణ మూర్తి', ' ఫోటో' వగైరా 16 సినిమాలకి దర్శకత్వం వహించిన శివనాగేశ్వర రావు గారి లేటెస్ట్ సినిమా 'భూకైలాస్'. త్వరలోనే మరో సినిమాకి దర్శకత్వం వహించ బోతున్న శివనాగేశ్వర రావుగారు ఈ నెల 'కౌముది' పాఠకులతో తన మొదటి సినిమా అనుభవాలని పంచుకుంటున్నారు.*



మాది గుంటూరుకి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న ఉప్పలపాడు అనే గ్రామం. మానాన్న నరసింహారావు గారు వ్యవసాయం చేస్తుండేవారు. అమ్మ సాధారణ గృహిణి. నాకు ఒక అక్కయ్య, ఇద్దరు చెల్లెళ్ళు.. మాది ఉమ్మడి కుటుంబం. తాతగారి హయాంలో మేమూ, మా బాబాయి గారూ కలిసే ఉండేవాళ్ళం. మా బాబాయికి నలుగురు పిల్లలు - ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. అమ్మా నాన్నలకి నేనొక్కడినే మగపిల్లవాడిని కావడం చేత నన్ను బాగా గారాబంగా చూసుకునే వాళ్ళు. తాత గారైతే పిల్లలందరినీ పిలిచి ఏదైనా కొనుక్కోమని తలా ఒక ఐదు పైసలు ఇచ్చేవారు. నన్ను మాత్రం మళ్ళా వెనక్కి పిలిచి మరో ఐదు పైసలు అదనంగా ఇస్తుండేవారు. అలా అందరి మధ్యా గారబంగా పెరుగుతూ పదో తరగతి వరకూ మా వూరి పరిషత్ హైస్కూల్లోనే చదువుకున్నాను.

ఏడో తరగతిలో ఉండగా అనుకుంటాను, నాటకాలంటే ఆసక్తి ఏర్పడింది. మా స్కూల్లో 'దొంగవీరుడు' నాటకం వేస్తున్నారు. అందులో చిన్నపిల్లాడి వేషం వెయ్యాలనిపించింది కానీ మా క్లాస్ మేట్ ఒకడు వేషాన్ని తన్నుకుపోయాడు. చాలా నిరాశ అనిపించింది. మరికొన్నాళ్ళకి 'ఆడది' నాటకం వేసేప్పుడు అందులో వేషం కోసం ప్రయత్నించాను. ఈ సారి మాక్లాస్ మేట్ కి నాకూ పోటీ పడింది. ఇందులో కూడా వాడే గెలిచాడు. తరువాత తెలిసింది - పాత్రల సెలక్షన్‌కి రెండు రోజుల క్రిందటే, వాళ్ళ ఇంట్లో గేదె ఈనితే జున్ను పాలు తీసుకెళ్ళి మాస్టారి ఇంట్లో ఇచ్చాడనీ , ఆ విధంగా నాటకం ఛాన్సు కొట్టేశాడనీ. మా ఇంట్లో గేదె ఉందికానీ ఈన లేదు.! మొత్తానికి అలా అవకాశం చేజారినప్పుడు ఏదో సినిమాలో హీరో వేషం పోయినట్లే బాధ పడ్డాను.. ఏం చెయ్యాలి ..!? ఎలాగైనా స్టేజి ఎక్కి తీరాలి..

అలా తీవ్రంగా ఆలోచిస్తున్నప్పుడే మా ఇంకో స్నేహితుడు మాయలఫకీరు మోనో యాక్షన్ వేస్తున్నాడని తెలిసి వాడి వద్దకెళ్ళాను. మోనో యాక్షన్ అంటే ఒక్కడే వెయ్యాలి..మరి నాకు అవకాశమెలా వస్తుందీ..!? బ్రిలియంట్ ఐడియా వచ్చి మా వాడితోఒక ఒప్పందానికి వచ్చాను. ఎలాగంటే, మాయలఫకీరు వేషంలో తను ‘‘ కాపాలీ.. ’’ అన్న డైలాగ్ చెప్పగానే స్టేజ్ వెనకనుంచీ కాపాలికుడు వణుకుతున్న గొంతుతో ‘ఔ...ను..‘ అనాలి. కాపాలికుడు వేషం నేను వేస్తాననీ. అలా ‘ఔ..ను..‘ అంటూ స్టేజి మీదికి కూడా వస్తాననీ వాడిని ఒప్పించాను. విధంగా మోనో యాక్షన్ లోనే అతి చిన్న వేషం వేసి మొదటి సారిగా స్టేజ్ ఎక్కాను.

తరువాత ఊళ్ళో పిల్లలందరినీ పోగు చేసి, మేమే ఒక నాటిక వేద్దామని ప్రణాళిక వేసి, తలా ఐదు రూపాయలూ వేసుకున్నాం. నేను డైరెక్టర్ ని కాబట్టి పదిహేను రూపాయలు వేసుకున్నాను. చేసేదేదో భారీ ఎత్తున చెయ్యాలని కరపత్రాలు కూడా ప్రింట్ చేయించాం. ఆ రోజుల్లోనే దాసరి నారాయణ రావుగారు తన సినిమాలకి తన పేరుని మేఘాల్లో వేసుకునే వారు. నేనేం చేశానంటే కరపత్రంలో పైన ఒక బ్లాకుని ఖాళీగా వేయించి. ఒక రబ్బరు స్టాంప్ చేయించి దర్శకుడు: శివనాగేశ్వరరావు అనే పేరుని ఎర్ర ఇంకుతో ముద్ర వేశాను. నేనూ , నా చెల్లెళ్ళూ ఒక రాత్రంతా కూర్చుని రెండు వేల కరపత్రాల మీద నా స్టాంపు వేశాం. అది చూసిన మా టీమ్‌లో ఒకడు ’’ఏరా..డబ్బులన్నీ మావీ.. పేరేమో పైన పెద్దగా నీదీ..వేయించుకుంటున్నావ్..‘ అన్నాడు. ‘ సరేలేరా..మీరంతా ఐదేసి రూపాయలిస్తే నేను పదిహేను ఇచ్చాను తెలుసా‘ అని వాడి నోరు మూయించాననుకోండీ.. ఆ విధంగా నాటకాల పిచ్చి ఏడాదికేడాదికీ ముదరసాగింది. చుట్టుపక్కల 25 మైళ్ళ దూరంలో ఎక్కడ నాటక ప్రదర్శన జరుగుతున్నా సైకిల్ వేసుకుని వెళ్ళిపోయేవాళ్ళం..



అలా హైస్కూలు దశ ముగిసాక గుంటూరు హిందూ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరాను. అందరు తల్లి దండ్రుల్లానే మా అమ్మా, నాన్నా కూడ నన్ను డాక్టర్‌ని చేయాలని బై.పి.సి. లో చేర్చారు నన్ను. రెండేళ్ళు గడిచాయి కానీ మంచి మార్కులు రాలేదు. మెడిసిన్ సీటు రాలేదు. అప్పటికే నాన్నకి కొంత సహాయం అవసరమయింది. అందుకని రెగ్యులర్ కాలేజీ మానేసి ఆంధ్రా యూనివర్సిటీ కరస్పాండెన్స్‌లో బి.కామ్ చేయడం మొదలు పెట్టాను. ఐతే కాలేజీలో నాకున్న పరిచయాల వల్ల, డిగ్రీలో ఉన్నవాళ్ళంతా నా ఇంటర్ క్లాస్‌మేట్సే అవడం వల్ల, తరచూ కాలేజీకి వెళ్ళి అవసరమైన క్లాసుల్లో కూర్చుంటూ ఉండేవాడిని. చాలా మంది నేను కూడా రెగ్యులర్ స్టూడెంట్‌నే అనుకుంటూ ఉండేవాళ్ళు.

ఈ విధంగా కాలం గడుస్తుండగా చిన్న, చిన్న బిజినెస్‌లు చాలా చేసాను, కానీ ఏమీ కలిసి రాలేదు. ప్రతిదాన్లోనూ ఎదురు దెబ్బలే తగిలేవి. ధాన్యం రైతుల వద్ద కొని వ్యాపారస్తులకి అమ్మే కమిషన్ వ్యాపారం చేసాను. అందులో వచ్చిన కొంత లాభం తీసుకెళ్ళి ఒక మిత్రుడితో కలిసి ‘కంచికి చేరని కథ‘ అనే సినిమాని గుంటూరు జిల్లాకి కొనడానికని 15 వేలు అడ్వాన్స్ ఇచ్చాం. సినిమా చూసేందుకు మద్రాసు కూడా వెళ్ళి వచ్చాం. సినిమా రిలీజ్ అయ్యే సమయానికి మరో 30 వేలు కట్టాలి. కానీ మాకు సర్దుబాటుకాలేదు. మరొకాయన ముందుకు వచ్చి మిగతా డబ్బులు నేను పెడతాను, ఐతే లాభాలు వస్తే మొదట నా పెట్టుబడి నేను తీసుకుని మిగతాది మీకు ఇస్తాను అన్నారు. మరో మార్గం లేదుకాబట్టి సరే నన్నాం. సినిమా రిలీజైంది..వెళ్ళిపోయింది. పూర్తిగా వాష్ ఔట్. పెట్టిన డబ్బులన్నీ పోయాయి. మావూళ్ళో అందరూ మమ్మల్ని చూసి ‘ఇంటికి చేరిన కథ‘అనే వాళ్ళు ఎగతాళిగా.

అలాంటి రోజుల్లోనే మా వూరి కుర్రాడొకతను, చాలా రోజులక్రిందట ఊరు విడిచి వెళ్ళిన వాడు, తిరిగొచ్చాడు. వేళ్ళకి ఉంగరాలు, మెడలో గొలుసూ, బూట్లూ, ధగ ధగలాడే డ్రస్సులూ..ఊళ్ళో అంతా ఆశ్చర్యపోయి చూసే రీతిలో రీ-ఎంట్రీ ఇచ్చాడు.

విషయమేమిటంటే మద్రాసులో దాసరి నారాయణరావు గారి వద్ద అసిస్టెంట్‌గా చేస్తున్నాని చెప్పాడు. ఇంక నా ఆనందానికి హద్దుల్లేవు. ఎలానూ చేసిన బిజినెస్‌లన్నీ నష్టాలే. ఇంక మద్రాసు వెళ్ళి, దాసరి గారి వద్ద చేరి సినీ ఫీల్డ్‌లో అదృష్టం పరిశీలించుకోవాలనే దృఢ నిర్ణయానికి వచ్చాను. రోజూ ఆ మద్రాసు రిటర్న్ కుర్రాడి చుట్టు తిరుగుతుండే వాడిని. ఎలాగైనా దాసరి గారి వద్ద చేర్చమని బ్రతిమాలే వాడిని. సరేనని ఒప్పుకున్నాడు, కానీ చెప్పిన దానికంటే రెండు రోజులు ముందే మాయమై పోయే వాడు. ఈమళ్ళా ఓ ఆరునెలలకి ఎంట్రీ ఇచ్చేవాడు. ఇలా రెండు మూడు సార్లయింది. ప్రోమిస్ చేసికూడాఎందుకు తీసుకెళ్ళడంలేదో అంతుబట్టేది కాదు.

ఇలా కాదు..ఎలాగైనా అతని అడ్రసు తీసుకుని నేనే వెళ్ళిపోదామని అనుకున్నాను. కానీ అడ్రసు వివరాలు కూడ స్పష్టంగా చెప్పేవాడు కాదు. ఒక సారి రకరకాల ఇండైరెక్ట్ ప్రశ్నలు వేస్తూ అతనికి తెలీకుండానే కోడంబాకం , ట్రస్ట్‌పురంలో ఉంటాడన్న విషయాన్ని కనిపెట్టగలిగాను. (ఒకరోజు..''ఏరా.మద్రాసులో సినిమా వాళ్ళు ఎక్కడుంటారు ' అంటే 'కోడంబాకం' అనేవాడు. 'నువ్వుండేది అక్కడికి ఎంతదూరం అంటే 'నేనుండేది అక్కడేరా ' అనేవాడు.. అమ్మయ్య వీడు ఉండే పేట పేరు తెలిసింది అనుకునేవాడ్ని. మరికొన్ని రోజులకి 'ఏరా..కోడంబాకంలో తెలుగువాళ్ళు ఎక్కువగా ఎక్కడ వుంటారు అంటే ట్రస్టు పురం అనే వాడూ.. మరి నువ్వు అక్కడ కాదా ఉండేది అంటే..లేదే.నేనుండేదీ అక్కడే' అనే వాడు..ఇలా అడ్డదోవలో వెళ్ళి వాడి అడ్రసు పట్టుకున్నానన్న మాట)



ఎప్పటిలానే ఆ సారి కూడ నాకు చెప్పకుండానే మద్రాసు చెక్కేసాడు. వాడు వెళ్ళిన రెండు, మూడు రోజులకే నేనూ ఇంక మద్రాసు వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాను. ఐతే ఇంట్లో చెబితే ఎలానూ వద్దంటారు కాబట్టి చెప్పకుండా పారిపోదామనే నిర్ణయానికి వచ్చి, ఒక సంచీలో బట్టలు పెట్టుకుని, ఒక 60 రూపాయలు తీసుకుని లాస్ట్ బస్ వచ్చే టైముకి ఊరి చివరికి చేరుకున్నాను. రాత్రి 10 గంటలు. అంతా చీకటి..ఐతే బస్సు గుంటూరు నుంచీ మా వూరి మీదుగా ఇంకో రెండు మైళ్ళు పైకి వెళ్ళి వెనక్కి వస్తుంది. బస్సు వెలుతురులో ఎవరైనా చూస్తారేమోనని , ఒక చెట్టు చాటున దాక్కుని , బస్సు మళ్ళా వెనక్కి వచ్చినపుడు ఎక్కి, గుంటూరు చేరుకున్నాను. ఇది జరిగింది 1979 లో. గుంటూరు నుంచీ మద్రాసు బస్సులో వెళితే 16 రూపాయలు అవుతుంది. అదే లారీలో ఐతే 8 రూపాయల్లో వెళ్ళిపోవచ్చు. అందుకని చుట్టుగుంట చేరుకుని ఒక లారీలో ఎక్కి మద్రాసు ప్రయాణం ప్రారంభించాను. తీరా మద్రాసు చేరుకున్నాక నా ఆకారం నేనే చూసుకుంటే తెలిసింది , రాత్రి నేను ఎక్కింది బొగ్గుల లారీ అని. మొత్తం బట్టలూ, ఒళ్ళు అంతా నల్లగా మసికొట్టుకు పోయాయి. ఈ అవతారంలో ఎక్కడికి వెళ్ళినా జడుసుకుంటారని అనుకుని బృందావన్ లాడ్జిలో 8 రూపాయలకి ఒక రూమ్ తీసుకుని స్నానం చేసాక, మా వూరి వాడు ఉండే చోటు వెదుక్కుంటూ వెళ్ళాను.



వాడికి చెప్పకుండా వచ్చాను కాబట్టి నన్ను చూసి చాలా ఆశ్చర్యపోతాడులే అనుకుని ధీమాగా వెళ్ళాను. వాడు చెప్పిన ఆఫీసుకి వెళ్ళే సరికి తలుపులు వేసి ఉన్నాయి. తలుపులు కొట్టాను.. ఎవరో తలుపుతీసి

‘ఎవరు కావాలి‘ అన్నారు.

‘సదాశివుడు అనే అసిస్టెంట్ డైరెక్టర్ గారు కావాలి‘ అన్నాను.

” ఆ పేరున్న వాళ్ళెవరూ లేరు..” అన్నారు.

బయట చూస్తే వాడు మా వూరు వచ్చినప్పుడు కొనుక్కున్న కొత్త బాటా చెప్పులు ఉన్నాయి.. ( మీకు ‘మనీ‘ లో సీన్ గుర్తొస్తోంది కదా!)

‘లేదు సార్..ఇక్కడే ఉండాలి.. ఇవిగో ఈ చెప్పులు అతనివే‘ అన్నాను.

” ఓ అతనా..అతను మా ఆఫీస్ బోయ్ కుమార్ వి.. అరే కుమార్ నీ కోసం ఎవరో వచ్చారు..ఇలా రా‘ అని పిలిచారు. మనవాడు కాఫీ ట్రే తో బయటికి వచ్చాడు. ముందు షాక్ తిన్నది నేనైతే , నన్ను అనుకోకుండా చూసి షాక్ తినడం వాడి వంతయింది. నన్ను చూసి ఆశ్చర్యం, ఆనందం అంతకంటే అవమానం, అందోళనతో పక్కకి తీసుకెళ్ళి ‘ ఏమ్రిటా ఇలా చెప్పా పెట్టకుండా వచ్చేసావ్..చెప్పి రావొద్దూ..‘ అంటూ నన్ను ఓ హోటల్ కీ తీసుకెళ్ళి టిఫిన్ అదీ పెట్టించి, నిజం చెప్పాడు. మొత్తానికి తేలిందేమిటంటే మనవాడు అసిస్టెంట్ డైరెక్టరేమీ కాదు.. జస్ట్ ఆఫీస్ బోయ్ అంతే..!



నాతో బాటే హోటల్ కి వచ్చాడు.. ‘అరే..నేను ఎక్కువరోజులు ఇలా హోటల్లో ఉండలేను..నా వద్ద ఉన్న డబ్బులూ చాలా తక్కువే. ఎలాగైనా నువ్వే ఏదో ఒక రూమ్ లో పెట్టు‘ అని బతిమాలాడాను. చివరికి నా పోరు పడలేక ... రంగరాజపురంలో ‘చలం‘ గారి ఇంటి ఎదురుగా ఒక రూమ్ లో కొంతమంది నాలాంటి వాళ్ళతోనే కలిసి ఉండే ఏర్పాట్లు చేసాడు.

తెచ్చుకున్న 60 రూపాయలు ఎన్ని రోజులని వస్తాయి..? మన వాడికి చెప్పాను ‘అరే బాబూ.. తొందరగా ఎక్కడన్నా అసిస్టెంటుగా కుదురుకునేలా చూడు..‘ అని. తన ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. ఈలోగా చేతిలో డబ్బులు ఐపోయి, ఎప్పుడో నాన్న కొనిపెట్టిన చేతి వాచీ తాకట్టు పెట్టాల్సి వచ్చింది. ఆ పని కూడా వాడితోనే చేయించాను.

నేను మద్రాసు వెళ్ళిన కొన్నాళ్ళకి ఇంటికి లెటర్రాసాను ‘ఇక్కడ క్షేమంగానే ఉన్నాను. నా గురించేమీ కంగారు పడకండి..‘ అని. ముందు జాగ్రత్తగా అడ్రసు మాత్రం ఇవ్వలేదు.

కొన్ని రోజులు పొద్దున్నే వెళ్ళి బజుల్లారోడ్‌లో దాసరి గారి ఇంటిముందు అలా నిలుచునే వాడ్ని. రామారావు గారి ఇంటి ఎదురుగానే దాసరి గారి ఇల్లుండేది. ఆ ఇంటిముందో పది కార్లు, ఈ ఇంటిముందో పది కార్లు ఉండేవి. నా మొహం మాత్రం ఎవరూ చూసే వాళ్ళు కాదు. చివరికెలాగో దాసరి గారి వద్ద పనిచేసే అసిస్టెంటులు ఒకరిద్దరు పరిచయమయ్యారు. నా హేండ్ రైటింగ్ చూసి స్క్రిప్ట్ ఫెయిర్ కాపీయింగ్ కి కూడా పనికిరానని తేల్చి చెప్పేసారు. ఎవరో సహాయం చేస్తే ‘బుర్రిపాలెం బుల్లోడు‘, ‘సన్నాయి అప్పన్న

' సినిమాల్లో ఎక్స్ట్రా వేషాలు వేసాను. మూడు రోజులు పనిచేస్తే 100 రూపాయలు ఇచ్చేవాళ్ళు. ఐతే నాకు గుర్తింపు కార్డు లేకపోవడం వల్ల అదీ ఎక్కువరోజులు గడవలేదు.

రోజులిలా గడిస్తుండగా మద్రాసులోనే ఉన్నా మా బాబాయి గారితో ( ఆయన ఎడ్వకేటు) పరిచయాలు పెంచుకున్నాను. ఆయన రికమండేషన్ వల్ల ఒక ప్రొడక్షన్ ఆఫీసులో ఎక్కౌంటెంట్ కమ్ మేనేజర్ గా జాయిన్ అయ్యాను. సగం సగం చదివిన బి.కామ్ ఇక్కడ ఉపయోగపడింది. ఇది తాత్కాలికమే.. ఎప్పటికైనా దర్శకత్వ శాఖలోకి వెళ్ళాలనే ఆశయం మాత్రం మరిచిపోలేదు. అదే ఆఫీసులో చేరడానికి కూడా ఒక కారణం ఉంది. వాళ్ళు ఇంతకు ముందు ఒక సినిమా తీసి ఉన్నారు, వచ్చే సినిమా దాసరి గారితో తియ్యబోతున్నారు. ఎలాగైనా యన వద్ద అవకాశం దొరుకుంతుందని ఒక ఆశ కూడా ఉండేది.



ఇంటికి అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తుండేవాడిని అడ్రసు లేకుండానే. ఆఫీసు వాళ్ళే హోటల్లో భోజనం చెయ్యడానికి టిక్కెట్లు ఇచ్చేవాళ్ళు. జీతం గురించి మాత్రం మాట్లాడేవాళ్ళు కాదు. ఒకసారి అవసరం కోసమని జీతం గురించి అడిగితే చాలా హేళనగా, అవమానకరంగా మాట్లాడారు. అది తట్టుకోలేక అభిమానంతో ఆవేశంతో ఉద్యోగానికి ఉద్వాసన పలికి గుంటూరు వెళ్ళిపోయాను. ఇంటికి మాత్రం వెళ్ళలేదు. మా వాళ్ళకీ కనబడలేదు. మిత్రుడొకరి వద్ద మూడ్నెల్లు గడిపి మళ్ళీ మద్రాసు వెళ్ళాను. ఈ సారి త్రిపురనేని మహారథి గారి అబ్బాయి 'చిట్టి' అనే - ఆయన నా కష్టాలన్నీ తెలుసుకుని 'సరే ఐతే నిన్ను వెంటనే అసిస్టెంట్ గా చేరుస్తాను.. ఫలానా కళ్యాణ మంటపం వద్దకి రేపు రా ..' అని చెప్పారు.

మరునాడు ఆయన చెప్పిన ప్రదేశానికి వెళ్ళాను. అదీ దర్శకత్వ శాఖతో నా మొదటి పరిచయం. ఆ సినిమా పూమ్ పుహార్ ప్రొడక్షన్ వారి 'అమ్మాయికి మొగుడు..అత్తకి యముడు' కృష్ణ గారు హీరో. నేను వెళ్ళగానే 'చిట్టి' గారు నన్ను యూనిట్ కి పరిచయం చేసి నన్ను అసిస్టెంట్ గా చేర్చుకోమని చెప్పారు. మొదటి రోజు క్లాప్ బోయ్ రాలేదు. అప్పటికే ఉన్న అసిస్టెంట్లకి క్లాప్ బోర్డ్ పట్టుకోవడం నామోషీగా వుంది. వెళ్ళగానే క్లాప్ బోర్డ్ నా చేతికి ఇచ్చారు. అలా మొదలైంది నా సినీ జీవిత యాత్ర. నేను వెళ్ళే సరికే ఆ సినిమా మూడు వంతులు పూర్తయింది. మరో పదిహేను రోజులు నేను పనిచేయగానే సినిమా ఐపోయింది. ఆ తరువాత చిట్టిగారే వాళ్ళు విజయనిర్మల గారి దర్శకత్వంలో నిర్మిస్తున్న భోగి మంటలు సినిమాకు నన్ను అసిస్టెంట్ గా చేర్చుకున్నారు. ఆ సినిమా నిర్మాణ సమయంలో విజయనిర్మలగారి వద్దనుంచీ సినిమా దర్శకత్వంలోని మెళకువలు చాలా నేర్చుకున్నాను. ఆవిడవద్దనే 'అంతం కాదిది ఆరంభం', ' డాక్టర్ సినీ యాక్టర్' సినిమాలకి కూడా అసిస్టెంట్గా చేసాను. ఇంక అప్పటికి నేను మోస్టవాంటెడ్ అసిస్టెంట్ డైరెక్టర్ గా పేరు తెచ్చుకున్నాను. వెంట వెంటనే వి.మధుసూదనరావు గారు, సి.ఎస్ . రావు గారు, లెనిన్ బాబు గారు , ఎస్. ఎ. చంద్రశేఖర్ గార్ల వద్ద చాలా సినిమాలకి పనిచేసాను. క్రాంతికుమార్ గారి వద్ద స్వాతి సినిమాతో ఆరంభించి దాదాపు ఆరేళ్ళు పనిచేసాను. క్రాంతికుమార్ గారి వద్ద ఎక్కువ రోజులు పనిచేసిన అసిస్టెంట్ని నేనే నేమో..!

'రావు గారిల్లు' సినిమాకి అసిస్టెంట్ గా పనిచేస్తున్నప్పుడు రామ్ గోపాల వర్మ తో పరిచయం జరగడం నా సినీజీవితంలో ఒక ముఖ్యమైన మలుపుకి కారణమయ్యింది. ఆ సినిమాకి నేనూ, రామ్ గోపాల వర్మ ఇద్దరం అసిస్టెంట్లు గానే పనిచేసాం. ఐతే వర్మ

నిర్మాత వైపునుంచీ, నేను దర్శకుడి వైపునుంచీ వచ్చిన వాళ్ళం. అలా సినిమా షూటింగ్‌తో పాటు మా పరిచయమూ పెరిగింది. ఒకరోజు వర్మే అన్నాడు..'నాకు సినిమా దర్శకత్వం అవకాశం వచ్చేట్లుంది. నువ్వు నాకు కోడైరెక్టర్ గా చేస్తావా?' అని. అప్పటి వరకూ తనతో పెరిగిన పరిచయం, ఏర్పడిన చనువు వల్ల సరేనని అన్నాను. వర్మ మంచి పారితోషికం ఇస్తానవడమే కాకుండా, తనూ మంచిగా సెటిలయితే నాకూ వరుసగా అవకాశాలు వస్తాయి కదా అని నా అభిప్రాయం.

తను సినిమా ఇంకా మొదలు పెట్టక ముందే నేను 'ప్రేమ యుద్ధం' సినిమాకి రాజేంద్రసింగ్ బాబు వద్ద కో-డైరెక్టర్ గా చేరాను. ఐతే నేను ఎక్కువగా నిర్మాత తరఫున మాట్లాడుతున్నాననే నెపంతో ఆ సినిమా షూటింగ్ మధ్యలో నన్ను పంపించేశారు. సరిగ్గా అదే సమయంలో వర్మ శివ మొదలు పెడుతూ నన్ను పిలిచారు. ఆ విధంగా 'శివ' కి రామ్ గోపాల్ వర్మ వద్ద కో-డైరెక్టర్ గా చేరాను. 'శివ ' ఐపోయింది. ఆంధ్ర దేశాన్ని ఒక కుదుపు కుదిపేసింది. వర్మ రెండో సినిమా 'క్షణం క్షణం' షూటింగ్ జరుతుండగా ఇంక నాకూ సొంతంగా డైరెక్షన్ చెయ్యాలని ఉందనీ, ఎక్కడన్నా అవకాశం కోసం ప్రయత్నిస్తాననీ చెప్పాను. 'ఎక్కడికో వెళ్ళడం దేనికీ..నేనే నిన్ను దర్శకుడ్ని చేస్తాను. కథ రెడీ చేసుకో..' అన్నాడు వర్మ.

ముందుగా హిందీ సినిమా 'సౌదా' చూసి అదే లైనులో చనిపోయే ముందు ఒక వ్యక్తికి జీవిత భీమా చేయించడం, ఆ డబ్బులకోసం నాటకాలాడ్డం..ఇలా నడుస్తుందా కథ. వర్మ విన్నాడు కానీ ఇంకా మంచి కథేమైనా దొరుకుంతుందేమో చూడమని తనే 'రూత్ లెస్ పీపుల్' సినిమా గురించి చెప్పాడు. అది చూసి తయారు చేసిందే 'మనీ' మూల కథ. 'క్షణం క్షణం' షూటింగ్ జరుతున్నప్పుడే తారాగణం ఎంపిక కూడా చెయ్యడం మొదలుపెట్టాం. చక్రవర్తి. చిన్నా, జయసుధ రోల్స్ ని తొందరగానే సెటిల్ చేసాం.



పరేష్ రావెల్ చేసిన పాత్రకి ముందుగా దాసరి నారాయణరావు గారు అనుకున్నాం. వర్మ తో చెబితే సరేనన్నాడు. కానీ లోతుగా ఆలోచించిన మీదట అంత పెద్ద డైరెక్టర్ ని పెట్టుకుంటే, అందునా నాది మొదటి సినిమా , సరిగా హేండిల్ చెయ్యగలనో లేదోనని అనుమానం వచ్చి నేనే వెనకడుగు వేసాను. తరువాత బాల సుబ్రహ్మణ్యం గారనుకున్నాం. వర్మ ఆయనతో మాట్లాడ్డం కూడా జరిగింది. ఆయన ఒప్పుకున్నారని కూడా వర్మ చెప్పాడు.

'డైరెక్ట్ చేసేది ఇలా నీ అసిస్టెంట్ ననీ, నా పేరూ చెప్పావా?' అని అడిగాను.

ఆయన లేదన్నాడు.

'బహుశా బాలు గారు నీ డైరెక్షన్ అనుకున్నారేమో.. తీరా సెట్లో నన్ను చూస్తే అప్‌సెట్ అవ్వొచ్చు. నా దర్శకత్వం అంటే ఒప్పుకుంటారో లేదో న' ని సందేహం వెలిబుచ్చాను. నా పాయింట్లో రీజనింగ్ వర్మ కి అర్థమయింది. అప్పుడే క్షణం క్షణం షూటింగ్ లో పరేష్ రావెల్ నటన గమనించిన నేను 'మనీ' లో పాత్రకి ఆయన్ని తీసుకుందామని సూచించాను. వర్మ సరేనన్నాడు (తర్వాత ఎక్కడో ఫ్లైట్‌లో బాలు గారు కనబడి అడిగితే, ఇలా వేరే అతని దర్శకత్వం లో అని చెబితే 'ఓహో అలానా..నేను నీ డైరెక్షన్ అనుకున్నానే ' అన్నారట. వర్మ అన్నాడు నేను చెప్పిందే నిజమైందని)

క్షణం..క్షణం రిలీజయ్యాక వర్మ దర్శకత్వంలో 'రాత్రి', తన నిర్మాణం, నా దర్శకత్వంలో 'మనీ' ఒకే సారి మొదలయ్యాయి. 'మనీ' మధ్యలో పరేష్ రావెల్ బొంబాయి వెళ్ళినపుడు యాక్సిడెంట్ ఐ విశ్రాంతి తీసుకోవాల్సి రావడం వల్ల మధ్యలో మూడునెలలు

షూటింగ్ ఆపెయ్యాల్సి వచ్చింది. 1990లో మొదలైన 'మనీ' 1993 వరకూ విడుదలకి నోచుకోలేదు. మధ్యలో 'రాత్రి' పూర్తయి రిలీజయింది. వర్మదే మరో సినిమా 'అంతం' కూడా పూర్తయింది కానీ 'మనీ' మాత్రం చాలా మనీ ఇబ్బందుల్లో పడింది. పూర్తయ్యాక దాదాపు ఆరునెలలు డబ్బాలు లాబ్ లోనే ఉండి పోయాయి. ఎంతో మంది పంపిణీదారులకీ, కొనుగోలు దారులకీ చూపించాం. ఎవ్వరూ కొనడానికి ముందుకి రాలేదు. అసలు విడుదలౌతుందన్న ఆశ కూడ పోయింది. చివరికి వర్మే బంధువుల సహకారంతో మరికొంత పెట్టుబడి సమకూర్చుకుని సురేష్ డిస్ట్రిబ్యూటర్స్ సహకారంతో సొంతంగా రిలీజ్ చేసాడు. ఇంక ఆ సినిమా సృష్టించిన సంచలనం గురించి వేరే చెప్పాల్సిన అవసరం లేదు కదా. .. తరువాత ఎన్ని సినిమాలు తీసినా ఇంకా నన్ను మనీ శివనాగేశ్వర రావు గానే అందరూ గుర్తుపెట్టుకోవడం, నా మొదటి సినిమా పవర్‌కి ఒక ఉదాహరణ.

అవండీ నా మొదటి సినిమా అనుభవాలూ...జ్ఞాపకాలూ.

ఈ సందర్భంలో మా నాన్న గారి గురించి కొంత చెప్పాలి. 'మనీ' షూటింగ్ జరుతున్నప్పుడు వర్మ ఆ సినిమా గురించి పేపర్లో ఫుల్ పేజీ ప్రకటన ఇచ్చాడు. అది చూసిన నాన్నగారు ఊళ్ళో అందరికీ అది చూపించి 'నా కొడుకు ప్రయోజకుడయ్యాడు..' అని గర్వంగా చెప్పుకున్నారు. 1992లో సినిమా నిర్మాణంలో ఉండగా నాన్నకి కాన్సర్ అని తేలింది. సినిమా పూర్తవగానే హైదరాబాబు వచ్చి ప్రివ్యూ చూస్తానని అనే వారు. అదివీలుకాదనీ, ఆయన మరో రెండు మూడు నెలలు మించి ఉండరనీ అప్పటికే తెలిసింది. కానీ ఆయనకి చెప్పలేం. 'అలానే సినిమా పూర్తవగానే హైదరాబాదు తీసుకెళ్తానని' చెప్పాను. 'మనీ' సినిమాలో చక్రవర్తికీ, వీధి బిచ్చగత్తెకీ..; అనే పాట పిక్చరైజ్ చేసేప్పుడు మధ్యలో ఒక సీనులో శవయాత్ర జరుగుంతుంటుంది. బంధు మిత్రులు శవం చెవిలో 'నారాయణ..' నారాయణ..' అంటుంటారు. ఆ దృశ్యం తీసిన సరిగ్గా రెండు నెలలకి నాన్న చివరి క్షణల్లో ఆయన చెవి దగ్గర 'నాన్నా..నాన్నా.' అని పిలిచాను. అప్పటికే ఆయన నా పిలుపు వినలేనంత దూరాలకి వెళ్ళిపోయారు. అది నా జీవితంలో ఇప్పటికీ మరచిపోలేని విషాదంగా మిగిలిపోయింది.. నా మొదటి సినిమా నాన్నకి చూపించే అవకాశం శాశ్వతంగా నాకు దూరమైంది.

ఇంటర్వ్యూ: కిరణ్‌ప్రభ

PUBLISHED IN MAY 2008

# సత్యానంద్

తెలుగు చలన చిత్రసీమలో సుమారు 400 కి పైగా చిత్రాలకి మాటలు (కొన్నింటికి కథ కూడా) వ్రాసి రికార్డు సృష్టించిన సత్యానంద్ గారు, తన తొలి సినిమా జ్ఞాపకాల్ని ఈ నెల మనతో పంచుకుంటున్నారు. ఆనాటి ‘మాయదారి మల్లిగాడు‘ నుంచీ మొన్నటి ‘మధుమాసం‘, ‘యమగోల మళ్ళీ మొదలైంది‘ వరకూ అనేక హిట్ సినిమాలకి రచన చేసిన సత్యానంద్ గారు అన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలకీ , అందరు ప్రముఖ హీరోలకీ వ్రాసారు. ‘జ్యోతి‘. ‘ఆమె కథ‘, ‘కల్పన‘ లాంటి చిన్న సినిమాలనుంచీ ‘జస్టిస్ చౌదరి‘, ‘ కొండవీటి సింహం‘ , ‘గజదొంగ‘ లాంటి భారీ సినిమాలకి కూడా రాసి అత్యధిక శాతం హిట్స్ అందించిన సత్యానంద్ గారు, 1980 మొదట్లో ఒకే సంవత్సరం 18-20 సినిమాలకి కూడా మాటలు వ్రాసిన సందర్భాలు ఉన్నాయి. సత్యానంద్ గారు, అంతర్జాతీయ సాహిత్యాన్నంతా ఔపోసన పట్టిన సాహితీ పిపాసి.



మా నాన్నగారి(హనుమంత రావు గారు) సొంతవూరు కాకినాడ దగ్గర పిఠాపురం. మా అమ్మగారి(వెంకట రత్నమ్మ గారు) స్వస్థలం రాజమండ్రి. నేను 1953 , నవంబర్ 23న పుట్టాను. నాన్న గారి ఉద్యోగ రీత్యా మా కుటుంబం నేను 4, 5 తరగతులు చదివేప్పటికే రాజమండ్రిలో స్థిరపడింది. నా బాల్యం, ప్రాథమిక విద్యాభ్యాసం, హైస్కూలూ, కాలేజీ అంతా రాజమండ్రిలోనే సాగింది. చిన్నప్పుడు ఓరియెంటల్ స్కూల్లో సంస్కృతం చదువుకునేవాడిని. అక్కడ ఉన్నప్పుడే చిన్న, చిన్న నాటకాల్లో వేషాలు వెయ్యడం, డిబేటింగ్ పోటీల్లో పాల్గొనడం అలవాటైంది. చుట్టుపక్కల ఉన్న పాఠశాలలన్నింటికీ కలిపి నిర్వహించిన డిబేటింగ్ పోటీల్లో కూడా బహుమతులు గెలుచుకునే వాడిని. ఎలా అలవాటైందో ఇప్పుడైతే గుర్తులేదుకానీ చిన్నప్పటినుంచే పుస్తకపఠనం అంటే విపరీతమైన ఆసక్తి ఏర్పడింది. రోజూ లైబ్రరీలో చాలా సేపు కూర్చుండే వాడిని. ఆ విధంగా లైబ్రేరియన్ స్నేహితుడై, ఇంకా ఎక్కువ పుస్తకాలు ఇస్తుండే వాడు. అలా చదవడం అన్న అలవాటే వ్రాయడానికి కూడా దారితీసింది. ఎనిమిదో తరగతి వచ్చేసరికి నా కథలు చందమామ , బాలమిత్రల్లో అచ్చయ్యాయి. అదే ఫోర్త్ ఫారం, ఫిఫ్త్ ఫారమ్ వచ్చేసరికి ఆంధ్రప్రభ, డిటెక్టివ్ (వై.వి.రావ్ సంపాదకులు.‘పగసాధిస్తా‘ లాంటి సినిమాలు కూడా తీసారాయన) పత్రికల్లో ఫిక్షన్, అపరాధ పరిశోధన కథలు కూడా వ్రాయడం మొదలుపెట్టాను. అలా విపరీతంగా పుస్తకాలు చదవడం, వ్రాయడం అనే అలవాటు, హైస్కూలు నుంచీ కాలేజీకి వచ్చినాక కూడా పెరిగిందే తప్ప ఏమాత్రం తగ్గలేదు.

రాజమండ్రి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోనే బి.ఎస్సీ(ఎం.పి.సి) పూర్తి చేసాను. బి.ఎస్సీ పరీక్షలు వ్రాసాక వేసవి శెలవల్లో మద్రాసు వెళదామని అనుకున్నాను.

అప్పటికే మా అమ్మగారి అన్నయ్యలు నలుగురూ మద్రాసులోనే తెలుగు సినిమా రంగంలో ఉన్నారు. పెద మామయ్య ఆదుర్తి సుబ్బారావు గారు. పరిచయం అవసరంలేని ప్రముఖ దర్శకుడు. రెండో ఆయన ఆదుర్తి నరసింహమూర్తి గారు. ఈయన కుమ్మరి మొల్ల లాంటి సినిమాలకి ప్రత్యక్షంగానూ, మరికొన్ని సినిమాలకి ఘోస్ట్ రైటర్ గానూ పనిచేసారు. ఐతే సుబ్బారావు గారికి వచ్చినంత పేరు రాలేదు. మూడో మావయ్య ఆదుర్తి రమణమూర్తి గారు. కెమేరా విభాగాల్లో పనిచేస్తుండే వారు. నాలుగో మావయ్య ఆదుర్తి హరనాథ్ గారు. ఈయన ఎడిటింగ్ విభాగంలో పనిచేస్తుండే వారు. హరనాథ్ మావయ్య మంచి రచయిత కూడా. ఆయన వ్రాసిన కథలు అప్పట్లో

యువ, జ్యోతి దీపావళి సంచికల్లో ప్రచురితమౌతుండేవి. ఈయనే నాకు ఎక్కువగా రచనల విషయంలో ప్రోత్సహిస్తుండే వారు. ఏమేమి పుస్తకాలు చదవాలో చెప్పి, నేను వ్రాసిన వాటిని మరింతగా ఎలా మెరుగు పరచాలో చెప్పి నాకు ఒక విధంగా ఇన్స్పిరేషన్ గా వుండేవారు.

సరే నలుగురు మావయ్యలు ఉన్నారు కదా, సినిమా రంగంలోనో , లేదంటే అక్కడ ప్రచురణకర్తలు కూడా ఎక్కువగానే ఉన్నారు కాబట్టి మామూలు రచయితగానైనా ఎక్కువ అవకాశాలు ఉంటాయిలే అనికూడా మద్రాసు ప్రయాణం కట్టాను. ఐతే ఇవేమీ ఇంట్లో చెప్పలేదు. జస్ట్ శెలవలు కదా, మావయ్య వాళ్ళని చూసి వస్తాను అని చెప్పి 1971 లో మద్రాసులో అడుగుపెట్టాను. చిన్నమావయ్య హరనాథ్  గారి వద్ద ఉండేవాడిని. కథలూ, గట్రా వ్రాయడమూ, ఆయన చేస్తుండే ఎడిటింగ్ గురించి కొంచెం, కొంచెం తెలుసుకోవడం చేస్తుండే వాడిని. మద్రాసులోనే ఉండి పోదామన్న నిర్ణయంతో వచ్చాను కాబట్టి ఇంక ఇంటికి వెళ్ళడం గురించి ఆలోచించలేదు.

ఒక నెలరోజులు గడిచాయి. బి.ఎస్సీ పాసయ్యానని తెలిసింది. 'సరే మరింక ఇంటికి వచ్చెయ్యి' అని నాన్న గారు ఉత్తరం వ్రాసారు. ఒకటి..రెండు..మూడు.. దేనికీ నేను సమాధానం వ్రాయలేదు. వ్రాస్తే మళ్ళీ నేను సంజాయిషీ ఇచ్చుకోవాలి ..ఎందుకులే అని వూరుకున్నాను. ఇంక కొన్నాళ్ళకి నాన్న గారే సరాసరి మద్రాసు వచ్చి " మరేమిటీ..ఎమ్మెస్సీ లోనో, ఇంజినీరింగ్ లోనో చేరాలి కదా..ఇంటికి వెళ్దాం పద.." అన్నారు. నేను మనసులోని మాట చెప్పాను. ఏదో ఒకటి చేస్తాను అనకుండా రచయితనౌతాననే చెప్పాను. ఎందుకంటే అప్పటికే రచయితగా నాకు అనుభవం ఉందని తెలుసుకాబట్టి, ఆ రంగంలో రాణిస్తానన్న నమ్మకం నాన్నగారికి ఉంటుందని నా అభిప్రాయం. ఆయన నచ్చ జెప్పచూసినా ఇంక నా నిర్ణయం మారదని తెలుసుకుని 'సరే పెద మావయ్యని అడుగుదాం పద' అని ఆదుర్తి సుబ్బారావు గారి వద్దకి తీసుకెళ్ళారు. ఆయన అప్పటికే తెలుగు సినిమా రంగంలో మంచి మనసులు, మూగమనసులు, తేనె మనసులు, ..లాంటి వరుస 'మనసుల' సినిమాలతోనూ, 'మరో ప్రపంచం', ''సుడిగుండాలు' లాంటి ప్రయోగాత్మక చిత్రాలతోనూ ఎదురులేని దర్శకుడుగా ముందుకి సాగుతున్నారు. ఆయన గొప్ప దర్శకుడే కాదు, వ్యక్తిగా కూడా చాలా గొప్ప ఉన్నతమైన వ్యక్తిత్వం ఉన్న మనిషి. ముఖస్తుతి కోసం ఏమీ చెప్పేవారు కాదు. కొంచెం చేదుగా వున్నా నిజాల్ని నిక్కచ్చిగా చెప్పేవారు. నా గురించి విని "సరే.. సినిమాల్లోకి రావలని అనుకోవడమూ, నువ్వు ఇప్పటికే కథలు వ్రాసి ఉండడమూ బాగానే ఉంది.. కానీ ఈ రంగంలో ఎవరూ ఎవరికీ హామీ ఇవ్వలేరు. ఎప్పుడు ఏమి జరుగుతుందో కూడా తెలీదు. సెలయేళ్ళు ఉంటాయి..ఎండమావులూ కనిపిస్తాయి. ఎవరి శ్రమ వాళ్ళు చెయ్యాల్సిందే ప్రతిభ వున్న ఎవరికైనా ఎలాంటి సహాయం చేస్తానో, నీలో స్పార్క్ కనిపిస్తే అలానే సహాయం చేస్తాను..నువ్వేదో బంధువని స్పెషల్ గా మాత్రం ఏమీ చెయ్యలేను.. " అని నిష్కర్షగా చెప్పారు. నాన్న మళ్ళీ మళ్ళీ ఆలోచించారు.. కానీ నా పట్టుదల చూసి ,ఇంక నేను అభిప్రాయం మార్చుకోనని తెలిసి ఆయన వెనక్కి వెళ్ళి పోయారు.

అది మొదలు నేను మరో మూడేళ్ళ వరకూ రాజమండ్రికానీ, కాకినాడ కానీ వెళ్ళలేదు. మధ్య మధ్యలో అమ్మే "ఏమైనా అవసరమైతే చెప్పు బాబూ.. " అని ఉత్తరాలు వ్రాస్తుండేది. నేనేదో పనిలో ఉన్నానులే అని చెప్పినా వాళ్ళకి బెంగ ఉండేది. ఎందుకంటే మా మావయ్యలు ఇద్దరిలో పెదమావయ్య పెద్ద దర్శకుడైతే, రెండో ఆయనకి ఏమాత్రం సక్సెస్ లేదు.. అంతా అనిశ్చితమైన రంగం కాబట్టి నేను ఎలా నెగ్గుకొస్తానోనని వాళ్ళకి సహజంగానే భయంగా వుండేది. నేనుకూడా ఇంటికి వెళితే సెంటిమెంటల్ గా ఎక్కడ బందీని కావల్సి వస్తుందోనని అనిపించి ఆ ఆలోచన విరమించుకున్నాను.

నాన్నగారు వెళ్ళగానే పెదమావయ్య వద్దకి వెళ్ళి దర్శకత్వ శాఖలో అప్రెంటిస్‌గా అవకాశం కల్పించమని అడిగాను. 'అప్రెంటిస్ గా చెయ్యడానికేమీ అభ్యంతరం లేదు..అలానే వచ్చి చేరు' అన్నారాయన. ఆ విధంగా మావయ్య అప్పుడే మొదలు పెట్టిన 'జీత్' హిందీ సినిమాకి (తెలుగులో 'పూలరంగడు') అప్రెంటిస్‌గా నా సినీ జీవితం మొదలైంది. 'జీత్' లో హీరో, హీరోయిన్లు రణధీర్ కపూర్, బబిత. ఆ తరువాత మావయ్యే తీసిన 'రఖ్‌వాలా'కి కూడా అప్రెంటిస్‌గా పనిచేసాను. ఇలా పెద మావయ్య వద్ద పనిచేయడం, సాయంకాలం ఇంటికి చేరగానే చిన మావయ్య హరనాథ్ గారి వద్ద ఎడిటింగ్‌లో మెళకువలు నేర్చుకోవడం, ఎలానూ నాకు ఉన్న రచనాసక్తిని కొనసాగిస్తూ మామూలు నవలలూ, డిటెక్టివ్ నవలలూ వ్రాయడం.. కాలం బిజీగానే గడిచేది. ఐతే ఆ  హిందీ సినిమాలు

సరిగా ఆడలేదు. ‘జీత్’, ‘రఖ్‌వాలా‘, ‘దర్పణ్‘ సినిమాలతో సుబ్బారావు మావయ్య ఆర్థికంగా బాగా దెబ్బతిన్నారు. ఇంకా హిందీ సినిమా రంగాన్నే పట్టుకుని వేలాడ్డం కంటే, చాలా రోజులైంది కాబట్టి తెలుగులో ఏదైనా సినిమా చేద్దామని అనుకున్నారాయన.

అది 1973 లో..ఒక సారి నన్ను పిలిచి ‘నువ్వు నవలలూ గట్రా వ్రాస్తున్నావు కద..నేనొక పాయింట్ చెబుతాను. దాన్ని నవలగా వ్రాయగలవా? ‘ అన్నారు. నేను ఒప్పుకున్నాను. ఆయన కొంచెం లైన్ చెప్పారు. అంత పెద్ద దర్శకుడు ఇచ్చిన మొదటి అవకాశం కాబట్టి, ఎలాగైనా నన్ను నేను నిరూపించుకోవాలని ఒక నెల రోజులు కష్టపడి (మిగతా పనులు చేస్తూనే), ఐదారు వందల పేజీల నవల తయారు చేసాను. అది తీసుకెళ్ళి చూపించగానే సుబ్బారావుగారు చాలా ఇంప్రెస్ అయ్యారు. ముందులో ‘ఏదో కుర్రాడు అందుబాటులో ఉన్నాడులే చెప్పిచూద్దాం..’ అని కాజువల్‌గా చెప్పారు, కానీ స్క్రిప్ట్ చూసాక ఎలాగైనా దాన్ని సినిమాగా తీయాలని నిర్ణయించుకున్నారాయన. ‘సరే.. నవల ఐతే రాసావు కానీ సినిమాకి దీన్ని సీనిక్ ఆర్డర్ వేసి దాని ప్రకారం వ్రాయాలి..‘ అని సినిమా స్క్రిప్ట్ వ్రాసే విధానాన్ని వివరంగా చెప్పారు.


ఆదుర్తి సుబ్బారావుగారు

నిజానికి ఆయనకి ముందులో ఆత్రేయ గారే మాటలూ, పాటలూ వ్రాసే వారు. ఆ తరువాత ‘సుడిగుండాలు‘ కి ఎన్నార్ నంది గారు, ‘మరోప్రపంచం‘ కి మోదుకూరి జాన్సన్ గారు మాటలు వ్రాసారు. ఈ కొత్త సినిమాకి కూడా ఎన్నార్ నందిగారి తోనే మాటలు వ్రాయిద్దామనుకున్నారు, కానీ అప్పటికి నందిగారికి ఆరోగ్యం అంత బావుండలేదు. తరచూ మైగ్రేన్ వస్తుండేది. అందుకని కొన్ని రోజులు స్వస్థలానికి వెళ్ళొస్తానని చెప్పి ఆయన మద్రాసునుంచీ వాళ్ళవూరికి వెళ్ళారు.. అందుకని ఇంక సంభాషణలు కూడా నన్నే వ్రాయమని ఆదేశించారు. నేను సీన్ ప్రకారం వ్రాసుకుంటూ పోతుంటే రోజూ రాత్రి పూట కూర్చో బెట్టి వాటికి మార్పులు చేర్పులూ చేయడం, ఏ సీన్ ఎలా మొదలుపెట్టాలో, ఎలా ముగించాలో, సంభాషణల్లో కుప్తత , సూటిదనం ఎలా వుండాలో, పాత్రోచితంగా ఎలా వ్రాయాలో అన్నీ వివరంగా చెప్పేవారు. ఆదుర్తి సుబ్బారావు, దర్శకుడు అని సినిమా టైటిల్స్ లో పడినా స్క్రిప్ట్ విషయంలో మావయ్య పాత్ర చాలా వుండేది (తరువాతి కాలంలో విశ్వనాథ్ గారికి కూడా ఇదే అలవాటు వచ్చింది). ఆ విధంగా మొదలైందే నా మొదటి సినిమా ‘మాయదారి మల్లిగాడు‘. మొత్తం స్క్రిప్ట్ పూర్తి కాగానే హీరో కృష్ణ గారికీ, అప్పటికే డైలాగ్ కింగ్ అనిపించుకుంటున్న నాగభూషణం గారికీ చూపించారు. వాళ్ళిద్దరికీ సంభాషణలు బాగా నచ్చాయి.

ఆ సినిమాకి నేను సుబ్బారావు గారి వద్ద అసిస్టెంట్‌గా కూడ పనిచేయడం వల్ల ఎప్పుడూ సెట్ లోనే ఉండే వాడిని. ఇలా ఉండడం రచయితగా నన్ను నేను మెరుగు పరచుకోవడానికి చాలా ఉపయోగపడింది. సెట్లో ఎక్కడైనా డైలాగులు మరీ పెద్దవయ్యాయని అనిపించినా, ఎవరికైనా పలకడం ఇబ్బంది ఐనా అక్కడికక్కడే మారుస్తూ ఉండే వాడిని. ఈ రకమైన అభ్యాసం వల్ల సినిమా స్క్రిప్ట్‌కి ఉండాల్సిన లక్షణాలన్నీ కూలంకషంగా నేర్చుకునే అవకాశం మొదటి సినిమానుంచే లభించింది. ఎక్కడో రూములో కూర్చుని వ్రాసి ఇచ్చెయ్యడానికీ, సెట్లో ఉండి ప్రాక్టికల్‌గా జరిగే షూటింగ్‌ని గమనిస్తూ అవసరమైన చోట మెరుగులు దిద్దడానికీ తేడా చాలా ఉంటుందని అప్పుడే తెలిసింది.

ఆ సినిమా 1974 లో విడుదలై ఘన విజయం సాధించింది. సంభాషణల రచయితగా నాకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. హీరో కృష్ణ గారు కూడా ఎక్కడికి వెళ్ళినా నా గురించి చెప్పేవారు.

నా మొదటి సినిమా ‘మాయదారి మల్లిగాడు‘ శతదినోత్సవానికి కాకినాడ వెళ్ళాను యూనిట్‌తో కలిసి. మూడేళ్ళ క్రిందట బి.ఎస్సీ శెలవల్లో మద్రాసు వెళ్ళిన వాడిని మళ్ళీ మా వూరు వెళ్ళడం అదే మొదటి సారి. ఆ సినిమా ఉత్సవాలూ, వక్తలందరూ నన్ను అభినందించడం చూసిన మా కుటుంబసభ్యులకి, అప్పటికి నామీద కాస్త భరోసా కలిగింది. ‘ఫరవాలేదు..మనవాడు సినిమా రంగంలో స్థిరపడగలడులే..‘ అనుకున్నారు.

ఆ సినిమా తరువాత ప్రముఖ దర్శకుడు తాతినేని రామారావు గారు, నిర్మాత పూర్ణచంద్రరావు గారితో కలిసి మావయ్యని అడిగారట 'మీ మేనల్లుడెవరో మీ సినిమాకి బాగా వ్రాశాడట గదా..మేమూ ప్రయత్నిస్తాం' అని. అలా వచ్చింది 'దేవుడు చేసిన పెళ్ళి' అదే సమయంలో క్రాంతికుమార్ గారు 'ఊర్వశి' కి రాసే అవకాశం ఇచ్చారు. సరిగ్గా అప్పుడే జగపతి పిక్చర్స్ నుంచీ కూడా కబురు వచ్చింది. వాళ్ళకి పర్మినెంట్‌గా వ్రాసే ఆత్రేయ గారికి ఆరోగ్యం అంత బావుండలేదనీ, ఆయనే నన్ను సూచించారనీ (అప్పటికే ఆత్రేయ గారితో నాకు మాయదారి మల్లిగాడు పాటలు వ్రాయించే సమయంలో కలిగిన పరిచయం చనువుగానూ, ఆయనకి నా మీద అభిమానం గానూ మారింది) చెప్పారు. ఆ విధంగా జగపతి పిక్చర్స్ వారి 'మంచి మనుషులు' కి కూడా వ్రాసే అవకాశం వచ్చింది.

కెరీర్ ప్రారంభంలోనే కృష్ణ, శోభన్ బాబు గారి లాంటి అగ్రహీరోల సినిమాలకి పనిచేసే అవకాశం రావడమూ, ఒక్క 'ఊర్వశి' తప్ప మిగతావన్నీ హిట్ కావడంతో ఇంక నేను వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు.

ఇలా కెరీర్ విపరీతమైన బిజీగా సాగుతుండగా 1987 ప్రాంతాల్లో నిర్మాత మిద్దె రామారావుగారు సినిమాకి దర్శకత్వం వహించమని ప్రపోజల్ తెచ్చారు. ముందుగా నాకంత పెద్ద ఆసక్తి అనిపించలేదు. అదే చెప్పాను 'ఏదో ఇలా రచయితగా బిజీగా ఉంటున్నాను కదా. మళ్ళీ దర్శకత్వం అంటే ఈ ఆబ్లిగేషన్స్ అన్నీ చూసుకోవడం కష్టమౌతుంది.. తర్వాత చూద్దాంలే ' అన్నాను. కొన్ని రోజుల తర్వాత  మళ్ళీ ఆయనే వచ్చారు .." మొన్నటి వరకూ కో-డైరెక్టర్ గా వున్న శరత్‌ని నేనే దర్శకుడ్ని చేసాను..మీరుకూడా ఒక సినిమా చేస్తే బావుంటుంది' అని మల్లాది గార్ మిస్టర్'వి' నవల ఇచ్చారు. అప్పటికే మల్లాది, యండమూరి ..వగైరా రచయితలందరూ మంచి మిత్రులు... నవల బాగా నచ్చింది. సరేలే ఒక సారి ప్రయత్నిస్తే పోయిందేముందిలే అని అనుకున్నాను. ఆ నవలనే 'ఝాన్సీరాణి'గా నా దర్శకత్వంలో మిద్దె రామారావు గారు నిర్మించారు. భానుప్రియ, రాజేంద్రప్రసాద్, ముచ్చెర్ల అరుణ.. సినిమా బాగానే తీసాననిపించింది. ముందుగా చూసిన వాళ్ళుకూడా మంచి సర్టిఫికెటే ఇచ్చారు. కానీ ప్రేక్షకులు ఆదరించలేదు. కొంత మా వైపునుంచీ మిస్ కాలిక్యులేషన్ కూడా జరిగింది. అప్పట్లో హాస్య నటుడిగా సినీ రంగాన్ని ఏలుతున్న రాజేంద్రప్రసాద్‌ని ఒక్కసారిగా సీరియల్ హంతకుడిగా చూపించడంలో ప్రేక్షకుల అంచనాలని తారు మారు చేసినట్లయింది. ఇది వారికి రుచించలేదు. ఆ సినిమా పరాజయం తర్వాత కూడా ఒకరిద్దరు మళ్ళీ దర్శకత్వం వైపు లాగారు కానీ నేనే ఆసక్తి చూపించలేదు. ఒక విధంగా చెప్పాలంటే మరీ కావాలనీ దర్శకత్వంలోకి దూకలేదు...అలానే మరీ విరక్తితోనూ దూరం కాలేదు..ఏదో అదొక కెరటంలా వచ్చి వెళ్ళిందంతే..!

రచయితగా గత 35 సంవత్సరాలుగా మిమ్మల్ని ఆనందపరిస్తున్నందుకు నాకు సంతోషంగా వుంది. ఆదరిస్తున్న మీ అందరికీ నా కృతజ్ఞతలు. ముఖ్యంగా ఎక్కడో అమెరికాలో వుంటున్నా ఉత్తమ సాహిత్యాన్ని అందించడానికి 'కౌముది' చేస్తున్న ప్రయత్నాలకి నా అభినందనలు. అన్నీ వీలుకుదిరితే తొందరలోనే 'కౌముది' లో ఒక ఫీచర్ వ్రాయడానికి కూడా ప్రయత్నిస్తాను. ఇప్పటికి సెలవు మరి.

ఇంటర్వ్యూ: కిరణ్‌ప్రభ

PUBLISHED IN JUNE 2008

# ఈశ్వర రెడ్డి

తన మొట్ట మొదటి సినిమా 'మీ శ్రేయోభిలాషి' తో బాధ్యతాయుతమైన, సామాజిక స్పృహ ఉన్న మంచి దర్శకుడిగా ముద్ర వేసుకున్న ఈశ్వరరెడ్డి గారు తన బాల్యం గురించీ, తెలుగు చిత్రసీమ ప్రవేశం గురించి, తొలిసినిమా వరకూ జరిగిన ప్రస్థానం గురించీ ..ఇలా చెబుతున్నారు. ఈశ్వరరెడ్డి గారి దర్శకత్వంలో రెండో సినిమా 'మనోరమ' నిర్మాణ దశలో ఉంది.



*బాల్యం,చదువు:* మాది కర్నూలు జిల్లా లోని ఒక కుగ్రామం. మాది సాధారణ మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. నాన్న గారు హనుమంతరెడ్డి,...అమ్మగారు నారాయణమ్మ.. మేము ఐదుగురు అన్నదమ్ములం. నేను మధ్యవాడిని. ఇద్దరి అక్క చెల్లెళ్ళు.నేను పుట్టింది 1974.... మే 6 తేదీన.

చిన్నతనం నుంచీ చదువులో నేను కాస్త వెనక బడే ఉండేవాడిని. ఐదో తరగతి వరకే ఒక మాదిరిగా చదివిన గుర్తు. ఆ తరువాత ఇంటర్మీడియట్ వరకూ కూడా వానాకాలం చదువులే. నా బాల్యంలో తాతగారి వద్ద ఆళ్ళగడ్డ ఊళ్ళో పెరిగాను. మా పెద్దమ్మ కూడా తాతగారింట్లోనే ఉండేది. తనకి సినిమాలు చూసే అలవాటు బాగా ఉండేది. నేను రెండు, మూడు తరగతులు చదివేప్పుడు , పెద్దమ్మ ఎప్పుడు సినిమాకి వెళ్ళినా నన్ను వెంటబెట్టుకునే వెళ్ళేది. ఆ విధంగా నాకు ఊహ తెలిసాక చూసిన మొదటి సినిమా 'కరుణామయుడు' , తరువాత 'పొట్టేలు పున్నమ్మ'. నెలకి ఒకటో రెండో చిన్నా పెద్దా పండుగలు వుండేవి. ప్రతి పండుగకీ పెద్దమ్మ తో కలిసి సినిమాకి వెళ్ళడం అదొక తప్పని సరి కార్యక్రమంగా ఉండేది. నాకు పదేళ్ళ వయసు వచ్చేప్పటికే సినిమాల మీద వ్యామోహం బాగా పెరిగింది.

ఆరో తరగతి నుంచీ హైస్కూలు చదువుకోసం నాన్నగారు నన్ను మళ్ళీ మా వూరికి తీసుకొచ్చేసారు. మా వూరికి 3,4 మైళ్ళ దూరంలో ఉన్న పెద్ద ముడియం అనే వూళ్ళో స్కూలుకి రోజూ నడిచి వెళ్ళి వచ్చేవాళ్ళం. కాళ్ళకి చెప్పులుకూడా ఉండేవి కాదు. వేసవి రోజుల్లో ఐతే అరికాళ్ళు మండుతుంటే భరించలేక పరుగులు తీసే వాళ్ళం. మధ్యలో ఎక్కడన్నా చెట్టునీడ ఉంటే కాస్సేపు అరికాళ్ళు చల్ల బరచుకోవడం.. మళ్ళీ నీడ దొరికే దాకా పరుగు తీయడం (ఈ పరుగుతీయడం అనే అలవాటు భవిష్యత్తులో ఉపయోగపడుతుందని అప్పుడు అనుకోలేదు). మా వూళ్ళో సినిమా హాళ్ళు లేవు కానీ టెంట్లు వేసి 16 ఎం.ఎం. సినిమాలు ఎక్కువగానే వేసేవాళ్ళు. అవికూడా ఒక్కటి కూడా ఒదలకుండా చూసేవాడిని.. నాన్నగారు చదువుదెబ్బ తింటుందని కేకలేసే వాళ్ళు కానీ నా అలవాటు మాత్రం మానుకోలేదు. ఇక్కడ చదువుసాగడం లేదని మధ్యలో 9,10 తరగతుల్ని జమ్మలమడకలో చదవమని పంపించారు. కానీ అక్క డా అత్తెసరు మార్కులతోనే పదో తరగతి పాసయ్యాను.

ఇంక ఊళ్ళో ఉండడం కంటే తాతగారి వద్దనే మంచిదేమోననుకుని మళ్ళీ ఆళ్ళగడ్డకి ఇంటర్మీడియట్ కోసం పంపించారు. దొంగచేతికి తాళాలిచ్చినట్లయింది...ఇంక నాస్వేచ్ఛకి అడ్డం వచ్చేవాళ్ళు లేరన్నట్లు సినిమాలు చూసే అలవాటు మరింతగా పెరిగిపోయింది. ఆ సినిమా ఈ సిన్మా అని లేదు. పోస్టర్ మారిందంటే వెళ్ళి పోవాల్సిందే. విధంగా మూడు రోజులు  ఆరు సినిమాలుగా సాగడం వల్ల సహజంగానే చదువు కుంటుపడింది. ఇంటర్మీడియట్ పాస్ కాలేదు..

*చలో హైదరాబాద్:* తర్వాత ఏమి చెయ్యాలా అని అనుకుంటుండగా హైదరాబాదులో ఉన్న మా బావగారు ఇల్లు కట్టించుకుంటూ, కొంచెం సహాయం అవసరం అవుతుందని నన్ను హైదరాబాదు రమ్మన్నారు. ఆ విధంగా 1990 ప్రాంతాల్లో హైదరాబాదులో అడుగుపెట్టాను. రాజేంద్రనగర్ లో బావగారి వద్ద ఉంటూ , ఆయన కొత్త ఇల్లు నిర్మాణంలో సహాయం చేస్తూ



యధావిధిగా సినిమాలు ( ఈ సారి అన్ని భాషల సినిమాలూ) చూడ్డం చేస్తుండేవాడిని. ఇల్లు పూర్తయే దశకి వచ్చేసరికి 'ఇంటికి వెళ్ళడం కంటే ఇక్కడే ఏదైనా పని చూడమ'ని బావగారిని అడిగాను. కాటేదాన్ లోని ఒక బిస్కెట్ ఫేక్టరీ లో తెలిసిన వాళ్ళ ద్వారా నాకో చిరుద్యోగం ఇప్పించారు. బిస్కెట్ల మీద పేరు ప్రింటై బయటికి వచ్చేప్పుడు, పేర్లు సరిగా ముద్రకాని బిస్కెట్లని ఏరి పక్కన పడేయడం అనేది నా పని.. రెండు మూడు రోజులు చేసే సరికే నాకు మొహం మొత్తింది. అలా మెకానికల్ గా ఉదయం నుంచీ సాయంకాలం వరకూ ప్రతి బిస్కెట్ నీ చూస్తుండడం..చెయ్యలేకపోయాను. సోమవారం చేరిన వాడిని శనివారానికల్లా ఉద్యోగం మానేసాను.

*కృష్ణానగర్ దాకా:* మా బావగారి ఇంటికి దగ్గరలోనే ఉంటున్న  ఆయన మిత్రుడు ఒకరికి సినిమా పరిశ్రమలో పరిచయం ఉన్నవాళ్ళున్నారని తెలిసింది. తనకి డైరెక్టుగా తెలీదుకానీ కృష్ణనగర్ లో ఒక టైలర్ ఉన్నాడు, ఆయనకి దాసరి గారి వద్ద పనిచేసే కాస్ట్యూమర్ ఒకాయన తెలుసు..ఏమైనా పనికొస్తాడేమో చూసుకో అని చెప్పారు. కొంచెం ఆధారం దొరికితే చాలనుకుని కృష్ణనగర్ టైలర్ గారి వద్దకెళ్ళాను. ఆయన దాసరి గారి వద్ద పనిచేసే కాస్ట్యూమర్ గారికి పరిచయం చేసారు. నన్ను చూడగానే ఆయన అనాల్సినవన్నీ అన్నారు.." ఎందుకయ్యా కుర్రాళ్ళిలా సినిమాలు..సినిమాలు..అనుకుంటూ వచ్చి భవిష్యత్తులు చెడగొట్టుకుంటారు.. ఇన్నేళ్ళుగా ఉంటున్న మాకే ఏ సినిమానో ఏమిటో అంతుబట్టదు..ఇంత చిన్న వయసులో ఎందుకిలాంటి నిర్ణయం..హాయిగా మీ వూరు వెళ్ళిపోయి ఏదో ఒక పనిచేసుకో .." అని చాలా నచ్చజెప్పారు. ఐతే చిన్నప్పటినుంచీ నాకున్న సినిమా వ్యామోహం గురించి చెప్పి..ఎలాగైనా ఏదో ఒక చిన్న అవకాశం ఇప్పించమని బతిమలాడాను. ఒకవారం రోజులు ఆయన చుట్టూ తిరిగాను. నా పట్టుదల చూసాక ఆయన 'సరే ఐతే ఒక 600 రూపాయలు తీసుకురా..నీకు కంపెనీ ఆర్టిస్ట్ కార్డు ఇప్పిస్తాను..సినిమాల్లో చిన్నా చితకా వేషాలు దొరుకుతాయి. నేనైతే ఈ మాత్రం సహాయం చెయ్యగలను.." అన్నారాయన. నాకు కొండెక్కినంత సంబర ం కలిగింది. ఎలానో తంటాలు పడి 600 కట్టి  కార్డు తెచ్చుకున్నాను. కంపెనీ ఆర్టిస్ట్ అంటే జూనియర్ ఆర్టిస్ట్ కంటే ఎక్కువట..కానీ ఎవరూ నాకు వెంటనే వేషాలు ఇవ్వలేదు.

*జూనియర్ ఆర్టిస్ట్‌గా మొదటి సినిమా:* పదిరోజులపాటు కృష్ణానగర్ వీధుల్లోనే తిరుగుతూ ఉన్నాను . అప్పుడు వినోద్ అనే మిత్రుడి ద్వారా నాగార్జున, మీనా లు నటించే 'ప్రెసిడెంట్ గారి పెళ్ళాం' అనే సినిమాలో జూనియర్ ఆర్టిస్ట్ వేషానికని పిలిచారు. ఆ విధంగా నా మొదటి సినిమా దేవర్ యాంజాల్‌లో మొదలైంది. అందులో నా వేషం హీరో నాగార్జున గారి వెనకాల నిలుచున్న యాభైమందిలో ఒకడిని..! మేము చేసిన పనల్లా 'రాజా బాబు గారికి జై..రాజా బాబు గారికీ జై..' అనడమే..! ఆ సీన్ అవగానే మమ్మల్నందరినీ మరో

లారీ ఎక్కి విలన్ సత్యనారాయణ గారి వెనకాల వెళ్ళాలని చెప్పారు. నాకు అర్థం కాలేదు..'ఇదేమిటి నేను హీరో దగ్గరుండే గుంపులో మనిషిని కదా..మళ్ళీ విలన్ దగ్గరకి వెళ్ళమంటున్నారు. డైరెక్టరేదో తప్పు చేస్తున్నారు. నా కేరక్టరైజేషన్ దెబ్బ తింటుంది కదా..' అని పరిపరి విధాల లోచించి అదే మాట వినోద్ కి చెప్పాను. ఆయన పగలబడి నవ్వుతూ నువ్వు 'గుంపులో గోవిందా గాడివి..ఇదో పాత్రా..నీకో కేరక్టరైజేషన్..చాల్లాల్లే..ఎక్కు..లారీ ఎక్కు.." అని అందరితో బాటుగా నన్ను లారీలో కుక్కేసారు..

ఆ షాట్ కూడ అయ్యాక అర్థమయింది జూనియర్ ఆర్టిస్ట్ అంటే ఎలా వుంటారో. నేను ఉండాల్సింది ఇందులో కాదు.. అసలు ఈ సిన్మా నిర్మాణమేమిటీ, ఇందులో ఉన్న కిటుకులేమిటీ తెలుసుకోవాలని అనిపించింది. ఆ రోజే దేవరయాంజాల్ లోనే ఒక ఫేన్సీ షాపుకి వెళ్ళి ఒక నోట్ బుక్ కొన్నాను (ఇప్పటికీ ఉంది నావద్ద ఆ పుస్తకం). నెమ్మదిగా కెమేరా అసిస్టెంట్ వద్దకెళ్ళి బతిమాలి, బతిమాలి..కెమేరా అంటే ఏమిటీ., లెన్స్ అంటే ఏమిటీ..ఎలా పనిచేస్తుందీ.. వగైరా విషయాలు తెలుసుకుని పుస్తకంలో రాసుకున్నాను. అలా సినిమా షూటింగ్ జరిగిన 20 రోజుల్లో దాదాపు అన్ని విభాగాల సహాయకుల వద్దకి వెళ్ళి అసలు నిర్మాణంలో ఎన్ని విభాగాలు ఉంటాయి.. ఏది ఏమేం చేస్తుందీ అనే విషయాల మీద ఒక అవగాహన తెచ్చుకున్నాను.



***ముఖ్యమంత్రిగారి రికమండేషన్ కోసం:*** ఇలా జూనియర్ వేషాలు ఎన్ని రోజులు వేసినా ఇలాగే ఉంటాను.. ఇంకా ఏదైనా చెయ్యాలి అనుకుని..ఒక సాహస వంతమైన పథకాన్ని అమలు పరిచాను. మా వూరినుంచీ తెలిసిన వాళ్ళ ద్వారా అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డి గారిని కలుసుకునే అవకాశం సంపాదించాను. 'సార్..నేను కూడా కర్నూలు జిల్లా నుంచీ వచ్చిన వాడినే. ఇలా సినిమాల్లో చేరాలని ఉంది.. మీరేమైనా రికమండేషన్ చేస్తారా?' అని ప్రాధేయ పడ్డాను. ఆయన వాళ్ళ అబ్బాయి సూర్యప్రకాశ్ రెడ్డి గారిని కలవమని చెప్పారు. ఆయన్ని కలిసాను. 'నాకెవరూ సినిమా రంగంలో తెలిసిన వాళ్ళు లేరయ్యా..పైగా నువ్వేం చేస్తావో నాకేమీ తెలీదు.. ఐతే మా బావ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి( మల్లెమాల ఎమ్మెస్ రెడ్డి గారి అబ్బాయి) కి పరిచయం చేస్తాను..రా.." అని నన్ను శ్యామ్ ప్రసాద్ గారికి పరిచయం చేసారు. అది భవిష్యత్తులో జరిగిన గొప్పమలుపులకి పునాది ఐంది.

శ్యామ్ ప్రసాద్ గారు నాకున్న ఆసక్తి తెలుసుకుని 'నేనైతే ప్రస్తుతం ఏమీ చెయ్యడం లేదు.. తెల్సిన వాళ్ళ ద్వారా ఎక్కడైనా అవకాశం కల్పిస్తాను' అని వాగ్దానం చేసారు. అన్నట్లే ఒక సినిమాకి కెమేరా అసిస్టెంట్ గా ఉండమని పంపించారు. రెండు మూడు రోజులు వెళ్ళాక మళ్ళీ శ్యాం గారిని కలిసి 'సార్..ఇది నాకు అంత ఎక్కడం లేదు.. ఎలాగైనా ఎక్కడైనా దర్శకత్వంలో అవకాశం కల్పించండి..' అని బతిమాలాను.

***అప్రెంటిస్‌గా ప్రవేశం - ఆటుపోట్ల జీవితం:*** ఆయన, పద్మాలయలో షూటింగ్‌లో ఉన్న 'అన్నా చెల్లెలు' (రమేష్ బాబు, సౌందర్య, ఆమని..) సినిమాకి పి.సి.రెడ్డి గారి టీమ్‌లో అప్రెంటిస్ గా చేర్పించారు.'అమ్మయ్య..ఎలాగైతే చిన్న అధారం దొరికింది..' అనుకుంటూ ఆ టీమ్ లో పనిచెయ్యడం మొదలుపెట్టాను. అప్రెంటిస్ కాబట్టి ఏమీ పారితోషికం ఉండదు అని ముందే చెప్పారు. సనత్ నగర్‌లో ఒక మిత్రుడి రూమ్ లో ఉంటూ, రోజూ నడుచుకుంటూ పద్మాలయాకి వెళ్ళేవాడిని. ఎలాగంటే రోజూ పొద్దున్నే 5.00కి లేచే వాడిని, అమీర్ పేట వరకూ నడిచే వాడిని, అక్కడి నుంచీ యూసుఫ్‌గూడ వరకూ పెరిగెత్తేవాడిని. మళ్ళీ చెక్ పోస్ట్ వరకూ నడిచే

వాడిని..మళ్ళీ డౌన్ రాగానే పరిగెత్తడం..అప్ రాగానే నడవడం.. అలసట గా ఉంటే కాస్సేపు రోడ్డు పక్కనే కూర్చోవడం..ఇలాగ రోజూ 8.00లోపే స్టూడియోలో ఉండేవాడిని. ఇది ఒక రోజు పని కాదు.. రోజూ ఇంతే..

డబ్బులకీ కటకటగా నే ఉండేది. నా వంతు అద్దె 50 రూపాయలు కట్టాల్సివచ్చేది. పైగా తిండి ఖర్చులూ. బావగారిని అడగడం కానీ, ఇంటివద్దనుంచీ తెప్పించుకోవడం కానీ ఇష్టం లేదు. ఇంట్లో వాళ్ళైతే 'ఇంటికి వచ్చేసి పొలం పనిచేసుకో' అంటుండే వారు..అలా కష్టాలు పడుతుండగానే మధ్యలో సినిమా షూటింగ్‌కి కొంత గ్యాప్ వచ్చింది. రమేష్ బాబు గారికి ఆరోగ్యం బావుండకపోవడమో ఏదో ఐంది.. ఆ సమయంలో కోదండరామిరెడ్డిగారి వద్ద పనిచేసే మధు అనే ఆయన 'ముఠా మేస్త్రి ' సినిమాలో 20-25 రోజులుండే ఒక జూనియర్ వేషం ఉంది..డబ్బులు కూడా ఇస్తారు..వేస్తావా?' అని అడిగాడు. అసలే డబ్బులకోసం ఇబ్బంది గా వున్న నాకు ఈ అవకాశం చాలా అద్భుతంగా అనిపించింది. వెంఠనే ఒప్పేసుకున్నాను. అది నాకు చాలా మేలు చేసింది. ఆ సినిమాలో చిరంజీవి గారుండే బస్తీ జనాల్లో ఒకరిగా వేషం. 20-25 రోజులు వరుసగా షూటింగ్ జరిగింది. రోజుకి 200 చొప్పున 4, 5 వేల వరకూ అందింది. ఆ రోజుల్లో అది నాకు 4, 5 కోట్ల కిందలెక్క.. వెంటనే తెలిసిన వాళ్ళని పట్టుకుని ఎస్.బి.ఐ లో ఎక్కౌంట్ తెరిచి అందులో వేసాను.

మళ్ళీ 'అన్నా-చెల్లెలు' మొదలైంది. బాంకు నుంచీ 10, 15 తీసుకుని వాడుకుంటూ ఉండే వాడిని. 'అన్నా చెల్లెలు' పూర్తవగానే శ్యామ్ ప్రసాద్ గారే 'అమ్మోరు' రెండో వెర్షన్ తీస్తూ నన్ను పిలిచి తన వద్ద పనిచేయమని అడిగారు. నాకు నెత్తిమీద పాలు పోసినట్లనిపించింది. వెంటనే ఒప్పుకున్నాను. 'అమ్మోరు' కి పనిచేసేప్పుడు కూడా షెడ్యూల్ మధ్యలో ఖాళీ వస్తే ఏవో చిన్న చిన్న పనులు చేసేవాడిని డబ్బులు కూడబెట్టుకునేందుకు. కొన్ని రోజులు ఆటో తోలాను, జూబిలీ హిల్స్ లో ఒక తాపీ మేస్త్రీ దగ్గర రాళ్ళు కూడా మోసాను. గౌరవంగా బ్రతకడానికి ఏ పనిచేసినా తప్పులేదనే భావం నాలో నాటుకుపోయింది. మళ్ళీ షెడ్యూల్ ఉందనగానే షూటింగ్ కి వెళ్ళి పోయే వాడిని.

***సురేష్ సంస్థలోకి:*** 'అమ్మోరు'కి పనిచేస్తుండగానే విజయభాస్కరరెడ్డి గారి వద్ద పనిచేసే రాజ్‌కుమార్ అనే పి.ఎ గారు ఒక రోజు ఫోన్ చేసి 'సురేష్ ప్రొడక్షన్ రామానాయుడు గారి వద్ద అవకాశం ఇప్పిస్తాను..వెళ్తావా?' అని అడిగారు. లోగడ ఒకసారి రాజ్ కుమార్ గారితో ఈ విషయం మాట్లాడి ఉంచాను. ఆయన గుర్తు పెట్టుకుని పిలిచారు. అప్పుడే రామానాయుడు గారు 'సూపర్ పోలీస్' అనే సినిమా మొదలుపెడుతున్నారని పేపర్లో చదివాను. రామానాయుడు గారి వద్ద ఐతే వరుస సినిమాలు ఉంటాయి..ఎక్కువరోజులు స్థిరంగా ఉండవచ్చునన్న ఉద్దేశంతో శ్యాం బాబు గారి వద్దకెళ్ళి 'బాబూ..ఇలా అవకాశం వచ్చేట్లుంది..వెళ్ళమంటారా?' అని అడిగాను. ఆయన సరేనన్నారు.



నేను రాజ్ కుమార్ గారి వద్దకెళ్ళి రికమండేషన్ లెటర్ తీసుకుని రామానాయుడు గారిని కలిసాను. అది చూసిన ఆయన 'ఆ సినిమా మొదలుపెట్టడానికి ఇంకా టైముంది కొంచెం ఆగి కనిపించు ' అన్నారు. సరే నని రెండు వారాలు ఆగి మళ్ళీ వెళ్ళాను. ఈసారి సురేష్‌బాబు గారు ఉన్నారు. జరిగిన విషయం చెప్పాను. 'సూపర్ పోలీస్' రెండురోజుల్లో మొదలౌతున్న విషయం నిజమే కానీ..నాన్నగారు నాకేమీ చెప్పలేదే.' అన్నారు. అయ్యో ఇప్పుడెలాగా అనిపించి , రామానాయుడు గారు కారంచేడు లో 'అక్కా చెల్లెలు' షూటింగ్ లో ఉన్నారని తెలుసుకుని వెంటనే జనరల్ బోగీలో కూర్చుని రైల్లో చీరాల వెళ్ళి, అక్కడినించీ కారంచేడు వెళ్ళాను. నన్ను చూడగానే రామానాయుడు –

ఆశ్చర్యపోయారు. 'ఏమయ్యా..ఈ టైములో ఇక్కడికి వచ్చావేమిటి?' అన్నారు. చెప్పాను. 'దీనికి ఇంతదూరం రావాలా? సరే వెనక్కి వెళ్ళు ..సురేష్ కి చెబుతాన్లే ' అన్నారు. మళ్ళీ పోలో మంటూ హైదరాబాదు వచ్చాను. సురేష్ గారిని కలిసాను. ' ఇంకా నాకు ఫోన్ ఏమీ రాలేదు. ఐనా నువ్వు చెప్పేమాటలమీద నమ్మకం ఉంది.. కాస్సేపు వెయిట్ చెయ్యి' అన్నారు. కాస్సేపు అన్నది దాదాపు సాయంకాలం ఐపోయింది. వాళ్ళంతా షూటింగ్ హడావిడిలో ఉన్నారు. నాగురించి పట్టించుకునే అవకాశం రాలేదు. సాయంకాలం జరిగిన ఒక ఫైట్ సీన్ లో వెంకటేశ్ గారు రిక్షామీదనుంచీ కింద పడడంలో ఆయనకి స్వల్పంగా దెబ్బ తగిలింది. అందరూ హడావిడిగా అటూ



ఇటూ పరిగెడుతున్నారు. అటుగా వచ్చిన సురేష్ బాబు గారు ..' ఏమయ్యా ..అలా ఖాళీగా నిల్చోకపోతే వెళ్ళి ఏదైనా పని అందుకోవచ్చు కదా..' అన్నారు. ఇంక దొరికిందే సందు అనుకుని దర్శకుడు మురళీ మోహన్ రావు గారి వద్దకెళ్ళి సురేష్ బాబు గారు పంపించారని చెప్పి క్లాప్ బోర్డ్ అందుకున్నాను...

ఆ విధంగా సుదీర్ఘ ప్రయత్నానంతరం సురేష్ ప్రొడక్షన్స్ లో కాలు పెట్టాను. అది ఏ శుభముహూర్తమో కానీ అక్కడినుంచీ సురేష్ ప్రొడక్షన్ లో 6-7 సంవత్సరాలు కొనసాగాను. 'సూపర్ పోలీస్' నుంచీ మొదలు పెట్టి 2002 చివరలో వచ్చిన 'జెమిని' వరకూ కూడా సురేష్ ప్రొడక్షన్స్ లోనే ఉన్నాను. రామానాయుడు గారు, సురేష్ బాబు గారు, వెంకటేష్ గారు..యూనిట్ అందరూ నన్ను బాగా చూసుకునే వారు.

మధ్యలో ఒక సారి సురేష్ ప్రొడక్షన్స్ లో కాస్త గ్యాప్ వచ్చింది . అప్పుడు కొంతమంది మిత్రులతో కలిసి 'రెడ్డి డోర్ డెలివరీ సర్వీసెస్' అనే సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ షాపు ఒకటి పెట్టాను. అపోలో హాస్పిటల్స్, ఫిల్మ్ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉండే వాళ్ళకి వాటర్ బిల్, ఎలెక్ట్రిసిటీ బిల్ వగైరా కట్టడం, షాపులనుంచీ సరుకులు తెచ్చి పెట్టడం లాంటి సర్వీసెస్ అందించే వాళ్ళం. అది బాగానే నడిచేది. నెలకి పదివేలకి పైగా మిగిలేది కూడా. ఓ రోజు వెంకటేశ్ బాబు గారే పిలిచి 'సినిమాల్లో చేద్దామనుకున్న వాడివి మళ్ళీ ఈ బిజినెస్ లు ఎందుకు..మా సినిమాలు లేకపోయినా నేను పనిచేసే వేరే ప్రొడ్యూసర్స్ కి చెప్పి అవకాశాలిప్పిస్తాను రా..' అని అన్నారు. ఆయన రికమండేషన్ మీదే ఆయన అప్పుడు చేస్తున్న 'పవిత్ర బంధం' కి అసిస్టెంట్ గా చేరాను. మళ్ళీ రామానాయుడు గారు సినిమాలు మొదలవగానే అందులోకి వెళ్ళి పోయాను. ఆ సంస్థలోనే అసిస్టెంట్ నుంచీ అసోసియేట్ అక్కడి నుంచీ కో-డైరెక్టర్ గా కూడా ప్రమోట్ అయ్యాను. సురేష్ ప్రొడక్షన్స్ తీసిన బెంగాలీ, ఒరియా, హిందీ, కన్నడ సినిమాలకి కూడా నేను పనిచేసాను. ఏరోజూ ఖాళీ లేకుండ 2002 చివరి వరకూ గడిచిపోయింది. అప్పుడు మళ్ళా వాళ్ళ నిర్మాణంలో కాస్త గ్యాప్ వచ్చింది. అప్పుడే నా క్లోజ్ మిత్రుడు నాగేశ్వరరెడ్డి 'నేనూ-సీతా మాలక్ష్మి' సినిమా చేస్తుంటే అతని వద్ద చేరాను.

*సి.సి.రెడ్డిగారి పరిచయం:* 2003 మధ్యలో అనుకుంటాను, మా చిన్న బావగారు (మా చెల్లెలి భర్త) సి.సి.రెడ్డి గారి వద్ద అకౌంటెంట్ గా పనిచేస్తుండేవారు. ఆయన మాటల సందర్భంలో నేను సినిమా ఫీల్డ్‌లో ఉన్నానని చెప్పేసరికి, రెడ్డి గారు పిలిపించమన్నారట. 2003 ఆగస్ట్‌లో సి.సి.రెడ్డి గారిని కలిసాను. తను కూడా సినీ నిర్మాణంలోకి ప్రవేశిద్దామనుకుంటున్నానని చెప్పారు. 'నీవద్ద కథలేమైనా ఉన్నాయా? ' అన్నారు. నేను ఎప్పుడో రాసుకున్న ఒక యాక్షన్ స్టోరీని రెండు గంటల పాటు ఆయనకి వినిపించాను. 'కథంతా బాగానే చెప్పావు కానీ..నేను ఇలాంటి సినిమాలు తియ్యాలనుకోవడం లేదు...మెసేజ్ ఓరియెంటెడ్ సినిమాలు తీద్దామని నా ఉద్దేశం. అలాంటి సబ్జెక్ట్ ఏమైనా తయారు చేస్తే చెప్పు. ఐతే అంతవరకూ మా యూనిట్ లో పనిచెయ్యవచ్చు' అన్నారు. నాకది మంచి

అవకాశం గానే అనిపించింది. సి.సి.రెడ్డి గారు సినిమా మొదలుపెట్టడం కొంచెం ఆలశ్యం అయింది. అంతలో 2004 లో ఎలక్షన్స్ వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ ప్రచారం కోసం సి.సి.రెడ్డి గారు కొన్ని వీడియో లు రూపొందించే బాధ్యత తీసుకుని అది నాకు అప్పగించారు. ఆ సందర్భంలో నేను రూపొందించిన వీడియోలు (‘పల్లె కన్నీరెడుతోంది..‘లాంటివి) చాలా మంచి పేరు తెచ్చుకున్నాయి. దానితో రెడ్డి గారికి నా పనితనం మీద మంచి నమ్మకం కుదిరింది.

*ముందుకి వెనక్కి:* ఆయన ‘రూమ్ మేట్స్‘ సినిమా తీసేప్పుడు నేను ‘మీ శ్రేయోభిలాషి‘ కథ చెప్పాను. ఆయనకి బాగా నచ్చి వెంటనే ప్రెస్‌మీట్ పెట్టి తన తర్వాతి సినిమాగా నా దర్శకత్వంలో సినిమాని ప్రకటించారు. ఐతే దురదృష్టవశాత్తూ ‘రూమ్ మేట్స్‘ బాక్సాఫీసు వద్ద దెబ్బతినడంతో ఆయన సినిమా నిర్మాణానికి కొంత గ్యాప్ వచ్చింది. సినిమా విభాగంలో పనిచేసే ఉద్యోగులని కూడా వేరే చోట పని చూసుకోమని చెప్పేసారు. నా పరిస్థితి రోడ్డున పడినట్లయింది. ఏమి చెయ్యాలా అని ఆలోచిస్తుండగా ఉషాకిరణ్ వాళ్ళు కొత్త



సినిమా చెయ్యాలనుకుంటున్నారని ఉమామహేశ్వరరావు గారనే ఆయన చెప్పారు. ఆయన ద్వారానే ఉషాకిరణ్ మూవీస్ స్టోరీ విభాగంలో పనిచేసే అజయ్‌శాంతి టీమ్‌ని కలిసాను. మరో కొత్త కథ చెప్పాను. వారి కది నచ్చింది. మొత్తం ట్రీట్‌మెంట్ వ్రాయమని, నాకు వాళ్ళ గెస్ట్ హౌస్‌లో నివాసం కూడా కుదిర్చారు. దాదాపుగా మూడు వారాల్లో మొత్తం , సంభాషణలతో సహా సిద్ధం చేసాను. సరిగ్గా అప్పుడే ‘మార్గదర్శి‘ వివాదం మొదలైంది. తాము సినీ నిర్మాణం గురించి ఇప్పట్లో ఆలోచించలేమని చెప్పారు. మళ్ళీ ‘మనిషి వీధిన పడ్డాడు‘ అన్నట్లయింది నా పని.

‘మీ శ్రేయోభిలాషి‘ కథనే చాలా మంది నిర్మాతలకి, హీరోలకీ చెప్పాను. కొంతమంది పూర్తిగా విని బాగానే ఉంది కానీ బిజినెస్ కాదని ముందుకి రాలేదు. మరికొంతమంది మధ్యలోనే వినడం పేసారు.

*ఆశించిన గమ్యం చేరిన విధానం:* ఇలా వుండగా 2007 మొదట్లో సి.సి.రెడ్డి గారి నుంచీ మళ్ళీ ఫోన్ వచ్చింది. ఆ ఫోన్ కాల్ నాకు పునర్జన్మ నిస్తుందని అప్పుడు అనుకోలేదు. కానీ మనసులో మాత్రం ఎక్కడూ ఆశ తళుక్కు మంది..

నన్ను చూడగానే ‘ ఏమయ్యా..ఇంతకుముందు ఆత్మహత్య కథ ఏదో చెప్పావు కదా.. ఏమైంది‘ అని అడిగారు.

‘ఇంకా ఏమీ కాలేదు సార్..ప్రయత్నాల్లోనే ఉన్నాను‘ అని చెప్పాను.



‘బడ్జెట్ ఎంతవుతుందంటావ్?" అన్నారు.

చెప్పాను.

'ఇంకా కాస్త తక్కువలో చేస్తానంటే నేనే ఆలోచిస్తాను‘ అన్నారు.

సరే నన్నాను.

ఆయన మొత్తం కథా, మాటలూ స్క్రీన్‌ప్లే కూలంకషంగా పరిశీలించి ..’ నీకు చిత్రం మీద బాగా పట్టు వుంది..ఇంక నేనేమీ పట్టించుకోనవసరం లేదు‘ అన్నారు. అన్నమాట ప్రకారమే ఒకసారి చిత్రనిర్మాణం మొదలుపెట్టాక

ఒక్క రోజుకూడా సి.సి.రెడ్డి గారు సెట్ లోకి రాలేదు. బాధ్యతలన్నీ పూర్తిగా నాకే వదిలేసారు. అనుకున్న దాని కంటే బడ్జెట్ కొంచెం ఎక్కువ ఐనా ఏమాత్రం వెనకాడకుండా ముందడుగు వేయించారు. 2007 ఏప్రిల్ లో మొదలైన చిత్రం డిసెంబర్ 28 న విడుదలైంది. చిత్ర విజయవంతమవడం గురించి మీ అందరికీ తెలిసిన విషయమే. సామాన్య ప్రేక్షకులనుంచీ, మేధావులనుంచీ కూడా ప్రశంసలందుకుంది. దాసరి నారాయణరావు గారు తన పుట్టిన రోజు సందర్భంగా నన్ను ఉత్తమ దర్శకుడిగా గౌరవించి నగదు బహుమతి నిచ్చారు. వీటన్నింటికీ ముఖ్యకారణం సి.సి.రెడ్డి గారే. ఆయనే కనుక ముందుకి రాకపోతే ఈ సినిమా ఎప్పటికీ అలానే ఉండిపోయేదేమో. ఆయన ధైర్యమే నాకు దర్శకుడిగా జన్మనిచ్చింది. ఆయన అనేవారు ' ఈ సినిమాలో నష్టం వచ్చినా ఫరవాలేదు. పదికోట్ల చిత్రంతో నైనా రాని మంచి పేరుని నా బేనర్‌కి ఈ  చిన్న సినిమా తో అందించావు' అని ఆయన నన్ను అభినందించడం ఈ జన్మలో మరిచిపోలేని విషయం.

నేను తీసింది ఒకటే సినిమా ఐనా నా గురించి అందరికీ పరిచయం చేయాలనే తపనతో మీరు శ్రమకోర్చి ఈ కథనం మీ పాఠకుల అందించడం నాకు చాలా ఆనందంగా వుంది. 'కౌముది' పాఠకులకి నా శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. మీ ఆశీస్సులతో మరిన్ని మంచి సినిమాలకి మంచి దర్శకత్వం వహిస్తానని మనవి చేసుకుంటున్నాను.

**ఇంటర్వ్యూ: కిరణ్‌ప్రభ**

PUBLISHED IN JULY 2008

# విజయబాపినీడు

విజయబాపినీడు గారి పేరు వింటేనే ఎన్నో విజయవంతమైన సినిమాలు తెలుగు ప్రేక్షకుల మదిలో మెదులుతాయి..'పట్నం వచ్చిన పతివ్రతలు',' మగమహారాజు','మగధీరుడు','మహానగరంలో మాయగాడు', 'ఖైదీ నెం. 786', 'గాంగ్ లీడర్', 'బిగ్ బాస్', 'విజయ', 'బొట్టు-కాటుక', 'బొమ్మరిల్లు'...మచ్చుకి ఇవి కొన్ని మాత్రమే.

డిటెక్టివ్ నవలా రచయిత, విజయవంతమైన వెరైటీ పత్రికల స్థాపకుడూ, సంపాదకుడూ, ప్రేక్షకుల నాడి తెలిసిన సినిమా రచయిత, విజయవంతమైన చిత్ర నిర్మాణ సారధి..ఇన్ని దశలను దాటుకుంటూ వచ్చి సినిమా దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన మొదటి సినిమానే సూపర్ హిట్ కుటుంబ కథా చిత్రంగా రూపొందించిన సీనియర్ దర్శకుడు శ్రీ విజయబాపినీడు గారి జ్ఞాపకాల పరంపర ఈనాటి సంచికలో.



**మా స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా** ఏలూరికి రెండు మైళ్ళదూరంలో ఉన్న చాటపర్రు. నేను పుట్టింది 1936, సెప్టెంబర్ 22 న. నాన్న గారి పేరు సీతారామ స్వామి అమ్మ గారి పేరు లీలావతి. నా పూర్తిపేరు గుత్తాబాపినీడు చౌదరి. అమ్మ, నాన్నలకి నేను ఒక్కడినే మగ సంతానం. నాకు ముందు ఒక అక్కయ్య. తనని మా మేనత్తగారి అబ్బాయి కే ఇచ్చి పెళ్ళిచేసారు.

నాన్నగారు పెద్దగా చదువుకోలేదు. ఆ రోజుల్లో ఒకటో క్లాసో, రెండో క్లాసో చదువుకున్నారు. వ్యవసాయమే ప్రధాన వృత్తి. మా వూరు పేరుకి పల్లెటూరే కానీ ఏలూరికి మరీ సమీపంలో ఉండడంతో ఆధునిక ఛాయలూ, పట్నం పోకడలూ ఉండేవి. చిన్నప్పటినుంచీ సినిమాలు చూసే అలవాటు బాగానే ఉండేది. ఏరోజైనా సినిమా చూసి వస్తే , వచ్చాక రాత్రంతా కూర్చుని మళ్ళీ ఆ సినిమాలోని సీన్లన్నీ రాసుకునే వాడిని. వాటిని గుర్తుపెట్టుకుని రాసుకోవడం, ఎక్కడ నాకు నచ్చలేదో, ఇంకా ఎలా వుంటే బావుంటుందో రాసుకోవడం ఒక అలవాటుగా ఐంది. ఇంట్లో వాళ్ళకివేమీ తెలీదు. మా బంధువుల్లో ఎవరికీ కూడ ఇలా సినిమాలూ, కథలూ..ఇలాంటి వాటిలో పరిచయం లేదు. పెద్దగా చదువుకున్న వాళ్ళుకూడా లేరు. నాకే ఎందుకో చిన్నప్పటినుంచీ పుస్తకాలు చదవడం, సినిమాలు చూడ్డం బాగా అలవాటైంది. అప్పటికే మా కజిన్ గుత్తారామినీడు సినిమా పరిశ్రమలో ఉన్నారు.

ఏలూరు సి.ర్.ర్. కాలేజీలో బి.ఎ(లెక్కలు) పూర్తిచేసాక వెంటనే జిల్లాపరిషత్ ఆఫీసులో గుమాస్తాగా చేరాను. ఏడెనిమిది నెలలు పనిచేసాక డిప్యూటీ పంచాయితీ ఆఫీసర్ పోస్టుకి అవకాశం వస్తే పరీక్షలు రాసి పాసయ్యాను. ఫైనల్ ఇంటర్వ్యూకి పదిహేను మందినో, ఇరవై మందినో పిలిచారు. అందులో నేనూ ఒకడ్ని. అప్పటికి జిల్లా బోర్డు ప్రెసిడెంట్గా మాగంటి సీతారామ దాసు అనే ఆయన ఉండేవారు. వీరి అబ్బాయే నాకు చిన్నప్పటినుంచీ మంచి మిత్రుడు (తరువాతి రోజుల్లో నా సినిమాలకి నిర్మాతగా కూడా వ్యవహరించారు) మాగంటి రవీంద్రనాథ్ చౌదరి. ఐతే ఇంటర్వ్యూకి వెళ్ళేముందు ఒక చిన్న అవరోధం వచ్చింది. ఎలాగంటే నా పేరు బాపినీడు చౌదరి. జిల్లా బోర్డు ప్రెసిడెంట్ మాగంటి సీతారాం దాసుగారిదీ నాదీ ఒకటే కులం అవడంతో, గిట్టని వాళ్ళెవరో అధికారులకి ఆకాశరామన్న ఉత్తరం రాసారు. "బాపినీడు బి.ఎ. పాసై సంవత్సరం కూడా కాలేదు. కులం కారణంగా ఈయన్ని సెలెక్ట్ చేసారు.." అని. ఐతే

ఇంటర్వ్యూ తీసుకునే ఆయన పేరు మహమ్మద్ ఆలీ చౌదరి. నా మీద ఒచ్చిన రోపణలు విని "నేనూ పేరులోనూ చౌదరి ఉంది..కానీ నేను ముస్లిమ్ని. ఐనా ఇలాంటివన్నీ నేను ఖాతరు చెయ్యను. నీలో సామర్థ్యం ఉంటే నువ్వే సెలెక్ట్ ఔతావు.." అన్నారు. మొత్తానికి ఇంటర్వ్యూ బాగా చెయ్యడంతో డిప్యూటీ పంచాయితీ ఆఫీసర్ గా సెలెక్ట్ అయ్యాను. వెంటనే ఉద్యోగం వచ్చింది.. విశాఖజిల్లాలోని వడ్డాది లో మొదటి పోస్టింగ్. అక్కడ ఒక సంవత్సరం చేసాక ఏలూరు దగ్గర భీమడోలుకి ట్రాన్సఫర్ వచ్చింది. అది మా వూరికి దగ్గరే. భీమడోలులో ఉండగానే నాకు విజయతో వివాహం జరిగింది.



మొత్తం ఏడెనిమిది సంవత్సరాలు అదే పోస్టులో కంటిన్యూ అయ్యాను. పంచాయితీ ఆఫీసర్గా చేసేప్పుడే నాకు రచనలమీద ఇంట్రెస్ట్ పెరిగింది. ఒకసారి ఏదో కథ చదివి 'ఇది ఇలా ఎందుకు ఉంది..దీన్ని ఇంకా మారిస్తే బావుంటుంది..కదా" అనే ఆలోచనతో మార్చి రాసి మా మిత్రులకి చూపించాను. వాళ్ళు బాగా మెచ్చుకున్నారు. ఆ విధంగా నేనే సొంతంగా వ్రాస్తే ఎలా వుంటుందీ అనుకుంటూ కథలు వ్రాయడం మొదలుపెట్టాను. ఐతే ఒకటి రెండు కథలు ఆంధ్రప్రభ లాంటి వారపత్రికలకి పంపించినా పబ్లిష్ కాలేదు. ఆ రోజుల్లోనే మద్రాసునుంచీ డిటెక్టివ్ నవలలు విపరీతంగా రిలీజయ్యేవి. నెలకి మూడు, నాలుగు నవలలు విడుదలౌతుండేవి. ఇప్పట్లో కొత్త సినిమా విడదలకి ఎంత హంగామా ఉంటోందో ఆ రోజుల్లో డిటెక్టివ్ నవలల రిలీజ్కి అంత హంగామా ఉండేది. కొన్ని నవలలు సీరియల్ గా నెలకో భాగం విడులౌతుండేవి. నాకు వాటిమీదకి దృష్టిమళ్ళింది.

అప్పుడే చదివిన ఒక ఇంగ్లీషు నవల ప్రభావంతో 'చీరవిడిచిన వీరవనిత' అనే డిటెక్టివ్ నవల రాసి మద్రాసు పబ్లిషర్స్కి పంపించాను. అందులోని లేడీ కేరక్టర్ ఉన్నట్టుండి మాయమై పోతుంటుంది. దాన్ని వాళ్ళు అంగీకరించడంతో ఇంక వరుసగా డిటెక్టివ్ నవలు వ్రాయడం మొదలుపెట్టాను. ఇవన్నీ 1960 - 67 మధ్యలో జరిగిన సంఘటనలు. ఉద్యోగంలో కూడా పెద్దగా ఒత్తిడి లేకపోవడం కూడా నా నవలా రచనా వ్యాసంగం కొనసాగడానికి దోహదపడింది. మొత్తం ఆరేడేళ్ళలో 70 వరకూ నవలలు రాసాను. మొదట్లో గుత్తా బాపినీడు చౌదరి పేరుతోనూ, వివాహమయ్యాక విజయబాపినీడు అనే పేరుతోనూ ఈ నవలలన్నీ వ్రాసాను. ఆ రోజుల్లో వచ్చిన అపరాథ పరిశోధన పత్రికల్లో కూడా నా రచనలు వచ్చేవి. మొత్తానికి ఈ విధంగా మా వూరు చుట్టుపక్కల అందరికీ నేను రచయితగా తెలిసిపోయాను. ఏ నవలా కూడా తిరిగి వ్రాయడం అనేది ఉండేది కాదు..అంతా ఒక ఫ్లో లో వెళ్ళిపోయేది.

ఈ నవలల మూలంగా మద్రాసులోని పబ్లిషర్స్ పరిచయం అయ్యారు. నా నవలలకి ముఖచిత్రాలు వేస్తుండే 'కేతా' అనే చిత్రకారుడు నన్ను మద్రాసు రమ్మని పిలిచారు. 'మీరు నవలలు బాగా వ్రాస్తున్నారు కదా.. మీరు మద్రాసు వస్తే పబ్లిషింగ్ బిజినెస్ పెట్టుకుని మీ పుస్తకాలు మీరే సొంతంగా వేసుకోవచ్చు. సినిమాలమీదా ఆసక్తి ఉందంటున్నారు కాబట్టి ఆ ఫీల్డ్లోనూ ప్రయత్నించవచ్చు..' అని ఆయన నన్ను ఒప్పించగలిగారు. సరే ఒకసారి ఇది కూడా ప్రయత్నించి చూద్దాం అనుకుని రెండు, మూడు నెలలు ఉద్యోగానికి శెలవు పెట్టి మద్రాసు వెళ్ళాను.

కేతా గారు ఎమ్.వి.ఎస్ పబ్లికేషన్స్లో బొమ్మలు వేస్తుండేవారు. అందులో ఆయన భాగస్వామి కూడా అనుకుంటాను. కేతా గారు సినిమా పబ్లిసిటీ ఆర్టిస్ట్ కూడా అవడం వల్ల ఆయన వద్దకి వచ్చే సినిమా వాళ్ళందరితో నాకూ పరిచయమయ్యేది. అలా ఐదారు నెలలు జరిగిందనుకుంటాను..వాళ్ళలో వాళ్ళకి ఏవో సమస్యలు రావడంవల్ల కేతా గారు ఎమ్.వి.ఎస్ నుంచీ బయటికి రావడంతో నేనూ బయటికి వచ్చేసి సొంతంగా నా నవలలూ, బయటి వారి నవలలు కూడా ప్రచురించడం మొదలుపెట్టాను.

ఎప్పుడూ కొత్తదనంకోసం వెదుకులాడే నేను ఏదైనా వెరైటీగా చేద్దామని 'రమణి', 'రాధిక' అనే 'పెద్దవారికి మాత్రమే' పత్రికలు మొదలుపెట్టాను. అవి అప్పట్లో ఆంధ్రదేశంలో ఒక పెద్ద సంచలనం సృష్టించాయి. ఐతే వాటివల్ల నాకు ఒకే బ్రాండ్ నేమ్

వస్తోంది. దాన్నుంచీ బయటికి ఫేమిలీల్లోకి వెళ్ళే పత్రిక తేవాలి అనిపించి ఒక మాసపత్రిక మొదలుపెట్టాను. అప్పటికే యువ, జ్యోతి, జయశ్రీ, స్వాతి మాసపత్రికలు మార్కెట్లో ఉన్నాయి. వాటికంటే భిన్నంగా ఉండాలనే ఉద్దేశంతో 'విజయ'మాసపత్రికని మొదలుపెట్టాను. పత్రిక సైజునుంచీ, ప్రింటింగ్ వరకూ కొత్తరకంగానూ. కథలూ, నవలలూ మంచి క్వాలిటీ ఉండేవి గానూ ఎంచుకోవడంతో అతి కొద్ది కాలంలోనే ఫేమిలీ పత్రికగా 'విజయ' నిలదొక్కుకుంది. 'విజయ'ని ఒక పత్రికగా కాకుండా నాలుగు చిన్న పత్రికల సమాహారంగా తీసుకొచ్చేవాడిని. కథల పుస్తకం, హాస్య పుస్తకం, సినిమా అనుబంధం, నవలాను బంధం ఇలా నాలుగు పుస్తకాలని కలిపి ఒక ప్రత్యేకమైన గమ్ తో అతికించి విడుదలచేసే వాళ్ళం. నాలుగు పుస్తకాలని విడి, విడిగా చేసుకుని చదువుకునే అవకాశం ఉండేది. 'విజయ' సినిమాను బంధంలో వచ్చే సినిమా సమీక్షలు అప్పట్లో చాలా ప్రామాణికంగా ఉండేవి.

'నీలిమ' అనే మరో పత్రికని కూడా మొదలుపెట్టాను కానీ అది ఎక్కువరోజులు నడవలేదు.'బొమ్మరిల్లు' అనే పిల్లల పత్రికకూడా మొదలుపెట్టి 'చందమామ', 'బాలమిత్ర' లకి ధీటుగా తెచ్చేవాళ్ళం.

ఒకవేపు ఈ పత్రికారంగంలో బిజీ గా వుండగానే , సినిమా వాళ్ళతో పరిచయాలు పెరిగాయి. 1968-69 ప్రాంతాల్లోనే డిటెక్టివ్ నవలలు సినిమాలుగా రావడం మొదలైంది. జగత్కిలాడీలు, జెగజ్జెట్టీలు, హంతకులు-దేవాంతకులు మొదలైనవి అందులో కొన్ని. వాటిని గమనించిన మీదట నాకూ సినిమా రంగం మీద ఆసక్తి పెరిగింది. సొంతంగా తీయడానికి ముందు అనుభవం రావాలని 'బలిపీఠం 'అనే సినిమాకి నిర్మాత వై.సలీల్ చౌదరి గారితో భాగస్వామిగా పనిచేసాను. అప్పుడే 1975 లో తమిళంలో విడుదలైన ఒక సినిమా చూడడం సంభవించింది. దాని పేరు 'మయంగుకిరల్ ఒరు మధు'. ఎస్.పి. ముత్తురామన్ గారి దర్శకత్వంలో ముత్తురామన్, సుజాత, విజయకుమార్ ప్రభృతులు నటించారు. దాన్ని సొంతంగా తెలుగులో రీమేక్ చేస్తే బావుంటుందని అనిపించి, నేనే స్క్రిప్ట్ రాసాను, తెలుగు నేటివిటీకి కొంచెం మార్పులు చేస్తూ.

దాని నిర్మాణంకోసమే మా సొంత నిర్మాణ సంస్థ శ్యాం ప్రసాద్ ఆర్ట్స్ మొదలుపెట్టాము. బాల్యం నుంచీ నాకు మిత్రుడైన మాగంటి రవీంద్రనాథ్ చౌదరి నిర్మాతగా మా సంస్థ మొదలైంది. ఆ రోజుల్లోనే మా ఇద్దరికీ చాలా గాఢ మిత్రుడైన శ్యాం ప్రసాద్ అనే అతను మద్రాసు వచ్చాడు, ఏదైనా బిజినెస్ మొదలు పెడదామని. ఐతే అనుకోకుండా చాలా చిన్న వయసులోనే తను ఈ లోకం విడిచి వెళ్ళిపోయాడు. రవికీ, నాకూ ఇద్దరికీ క్లోజ్ ఫ్రెండ్ ఐన తనకి గుర్తుగా మా బేనర్ కి శ్యాం ప్రసాద్ ఆర్ట్స్ అని పేరు పెట్టడం జరిగింది.

మా వూరి వాడే ఐన మురళీమోహన్ హీరో, జయచిత్ర హీరోయిన్. అప్పుడు దర్శకుడిగా అగ్ర స్థానంలో ఉన్న దాసరి నారాయణరావు గారు దర్శకుడు. ఒక విధంగా అప్పట్లో అలాంటి కథాంశంతో సినిమా తీయడం సాహసమే. ఐతే ముందునుంచీ ప్రయోగాలు చేయడం నాకు బాగా అలవాటు కాబట్టి ధైర్యంగా ఆ కథాంశాన్నే ఎన్నుకున్నాం. ముందుగా ఆ సినిమాకి 'చెడిన ఆడది' అనే పేరు అనుకున్నాం. ఐతే అప్పటి సెన్సార్ బోర్డ్ మెంబర్ ఐన పి.పుల్లయ్య గారు దీనికి తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. 1976లో 'యవ్వనం కాటేసింది'గా మా సినిమా విడుదలై ఘన విజయం సాధించింది. ఇదీ సినీ రచయితగా , నిర్మాణ సారధిగా నా మొదటి సినిమా విజయం.

ఇంక అప్పటినుంచీ వరుసగా సినిమా నిర్మాణం చేపట్టాము. ఒక వైపు 'విజయ', 'బొమ్మరిల్లు' పత్రికలూ, మరో వైపు సినిమా రచనా, నిర్మాణమూ..విపరీతమైన బీజీగా కాలం గడిచేది. మన్మధలీల, రుద్రతాండవం, రంభ-ఊర్వశి-మేనక, లాంటి విభిన్న కథాంశాలతోబాటుగా బొట్టు-కాటుక, విజయ, బొమ్మరిల్లు లాంటి కుటుంబ గాథా చిత్రాలు కూడా నిర్మించి విజయవంతమైన నిర్మాణ సంస్థగా శ్యాంప్రసాద్ ఆర్ట్స్ ని కొనసాగించాము.




ఎంతో మంది హీరోలతో పనిచేసినా చిరంజీవి గారు నాకు బాగా ఆత్మీయులయ్యారు. ఆయన బలవంతం మీదనే నేను దర్శకుడ్ని కావలసి వచ్చింది. 'చక్కగా కథ సంభాషణలూ వ్రాస్తారు. విజయవంతమైన సినిమాకి ఏమి కావాలో, సినిమాని విజయవంతం ఎలా చెయ్యాలో మీకు బాగా తెలుసు. మరి మీరే ఎందుకు దర్శకత్వం చెయ్యకూడదు..' అని నన్ను ప్రోత్సహించారు. ఆ విధంగా నా దర్శకత్వంలో మొదటి సినిమా 'మగమహారాజు' ( చిరంజీవి, సుహాసిని) 1983 లో విడదలై ఘన విజయం సాధించింది. తెలుగు ప్రేక్షకులు నన్ను దర్శకుడిగా అంగీకరించి, ఆదరించాక మరిన్ని సినిమాలు దర్శకత్వం వహించి నిర్మించడం కొనసాగింది.

ఇన్నేళ్ళ తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే బి.ఎ పూర్తయిన వద్దనుంచీ ఏ పనీ ఇలా చెయ్యాలి అని ముందుగా ప్రణాళిక వేసుకుని చేసింది లేదు. ఏదో కొత్తగా చేద్దామనుకోవడం అదృష్టం కలిసిరావడం..ఇలా జరుగుతూ వచ్చింది. నా ప్రయత్నాలకి అదృష్టం కూడ బాగా కలిసి వచ్చిందనే నమ్ముతాను. ఈ సిన్మా రంగంలో నాకంటే సమర్థులూ, నా కంటే తెలిగల వాళ్ళూ చాలా మంది ఉన్నారు. నా స్నేహితుల్లోనే అలాంటి వారు చాలా మంది కనిపిస్తూ ఉంటారు.. వారికీ , నాకూ గల తేడా ఒకటే..అదృష్టం..!

మగమహారాజు సినిమా రివ్యూ 'విజయ' మాసపత్రిక 1983 అక్టోబర్ సంచిక నుంచీ - మొదటి పేజీ


అక్టోబర్ 1983

విజయ

మగమహారాజు - A/2 గ్రేడ్

విజయవంతమైన చిత్ర నిర్మాణ శిల్పి విజయ బాపినీడు, వినోద భరితమైన చిత్రపథ నిర్దేశకుడుగా కూడా మన్ననల నందుకొనేలా చేసే మంచి చిత్రం 'మగమహారాజు'! మంచి చిత్రమైనంత మాత్రం చేత 'డ్రై'గా ఉండాలనేం లేదు. నవ్విస్తూ, కవ్విస్తూ సంతోషకరంగా సాగుతూనే, ఒక చిత్రం సందేశ భరితంగా కూడా రూపు తెచ్చుకోవచ్చునని నిరూపించే చిత్రం, 'మగమహారాజు'.

'మగమహారాజు', చక్కటి కరుణారస భరితమైన వినోదాత్మక చిత్రం అన్న విషయంలో ఎటువంటి సందేహమూ లేదుగాని. ఈ చిత్రాన్ని దర్శకుడు మోతాదుకు మించిన మసాలాతో కూర్చి, వేయించి సందువల్ల; చిత్రానికి ఉదాత్త లక్షణం మసకబారి వినోదలక్షణం ప్రకోపించి నట్లుగా అనిపిస్తుంది. 'అమాయక చక్రవర్తి' వంటి ఉదాత్త చిత్రం పరాజయం పొందిందే అన్న కసితో, కచ్చగా బాక్సాఫీస్ సరంజామానంతా దట్టించి వదిలారు చిత్రమంతటా అనిపిస్తుంది, చిత్రం చూస్తుంటే. అయితే, 'బొమ్మరిల్లు' 'బొట్టు-కాటుక' వంటి విశిష్ట చిత్రాన్ని చూశామన్న అభిప్రాయం కలగపోతే పోయింది గాని, ఆద్యంతమూ అలరించే అపూర్వ వినోదాత్మక చిత్రాన్ని చూశామన్న ఆనందాన్ని మాత్రం తప్పక కలిగించి తీరుతుంది చిత్రం. చలనచిత్రం ఉదాత్తంగానూ, సందేశాత్మకంగానూ ఉండాలని అభిలషించే ప్రేక్షకులను కొంతలో కొంత. సినిమా పరమార్థం కేవలం వినోదమే అని తలపోసే ప్రేక్షకులను అమితంగానూ ఆకట్టుకొనే చిత్రం, 'మగమహారాజు'.

ఒక పత్రికను పాఠక జనరంజకంగా నడపగల విజయ బాపినీడు, ఒక చిత్రాన్ని నవరస భరితంగా తీర్చిదిద్దటం ఆశ్చర్యకరం కాదు గాని, 'మగమహారాజు' చిత్రంలోని బిట్టు బిట్టునూ, ఫ్రేము ఫ్రేమునూ ఆయన వినూత్నంగా, విశిష్టంగా తీర్చిదిద్దిన విధానం మాత్రం నిజంగా అభినందనీయం. నూతన దర్శకులు ప్రఖ్యాతులు కావడానికి చిత్రీకరణలో ఎంతటి బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించాలో అంతా ప్రదర్శించారు దర్శకుడు. నవరసాలలో తలమానికమైన కరుణరసాన్ని, ఎదలో మృదుహాసాల్ని చిందించగల హాస్యరసాన్ని ఈ చిత్రంలో ఆయన కలగలిపిన తీరు అన్ని వర్గాల ప్రేక్షకులనూ అమితంగా ఆకట్టుకొని తీరుతుంది.

ఇంటర్వ్యూ: కిరణ్‌ప్రభ

PUBLISHED IN AUGUST 2008

# బి.వి.రమణ



తెలుగు సినిమా చరిత్రలో మొట్టమొదటి సారిగా దర్శకత్వం వహించిన సినిమాని పేరు లేకుండా విడుదల చేసి, విడుదలైన రెండువారాలకి పేరు పెట్టి సరికొత్త రికార్డు నెలకొల్పిన యువదర్శకుడు బి.వి.రమణ. ఆయన తొలిసినిమానే 'పాపే నా ప్రాణం'. విడుదలైన రెండు వారాల వరకూ '?' తో పేరులేని సినిమాగా నడిచింది. తరువాత దర్శకత్వం వహించిన 'శుభవేళ','ఎలా చెప్పను?' అంతగా సక్సెస్ కాకపోయినా నాలుగో సినిమా 'గౌరి' తో హిట్ కొట్టారు. తరువాత వచ్చిన 'ప్రేమంటే ఇంతే' పెద్దగా విజయం సాధించలేదు. ఇటీవలే విడుదలైన 'ఒంటరి' విజయవంతమైన వ్యాపారాత్మక చిత్రంగా నమోదు ఐంది. విజయపథంలో వెలుగు-నీడల సయ్యాటలుగా తన కెరీర్‌ని కొనసాగిస్తున్న బి.వి.రమణ తొందరలోనే సూపర్ హిట్ సినిమా అందించడమే తన లక్ష్యం అంటున్నారు. సంస్కారం, సాహితీ ప్రియత్వం, చక్కటి అభిరుచీ కలబోసిన మంచి వ్యక్తిత్వం రమణ గారిది. బాల్యం నుంచీ తన మొదటి సినిమా వరకూ జరిగిన సినీ జీవన ప్రస్థానాన్ని ఈ విధంగా గుర్తుకి తెచ్చుకుంటున్నారు, ఈ నెల 'కౌముది' పాఠకులకోసం.

**నా పూర్తి పేరు బొడ్డపాటి వెంకటరమణ.** నేను పుట్టింది కృష్ణాజిల్లా గుడివాడలో 1965 ఆగస్టు 14న. నాన్న గారి పేరు బి.వి.ఎస్.ప్రసాద్. అమ్మగారి పేరు బాలా త్రిపురసుందరి. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో మధ్య వాడిని నేను. నాకు ఇద్దరు అక్కయ్యలు, ఒక తమ్ముడు, ఒక చెల్లి. మా తాతగార్లది విజయవాడ ఐనా నాన్నగారి ఉద్యోగ రీత్యా (ఇన్‌కమ్ టాక్స్ శాఖలో ఇన్స్పెక్టర్ గా పనిచేసేవారు) మా బాల్యం, చదువూ అన్నీ ఆంధ్రప్రదేశ్లోని వివిధ ప్రాంతాల్లో సాగింది. 1నుంచీ 3వతరగతి వరకూ ఖమ్మంలోనూ, 4 నుంచీ 7 వరకూ వరంగల్ లోనూ, 7 నుంచీ ఇంటర్ వరకూ విజయవాడలోనూ, డిగ్రీ మొదటి రెండేళ్ళు విజయనగరంలోనూ, చివరి సంవత్సరం హైదరాబాదులోనూ చదువుకున్నాను. ఏడో తరగతి వరకూ కాస్త చురుకైన విద్యార్థినే కానీ తరువాత సాధారణ విద్యార్థిగానే మిగిలిపోయాను.




బాగా చిన్నప్పటి గుర్తు.. మా మేనమామ ఒకాయన నరసింహారావు గారనీ, ఆయన కూడా ఇన్‌కమ్ టాక్స్ విభాగంలోనే హైదరాబాదులో పనిచేస్తుండేవారు. ఆయన స్టేజి నాటకాలు ఎక్కువగా వేస్తుండేవారు. ఆయన నాటకాలు చూసిన నాకు చిన్నవయసులోనే నాటకాలంటే ఆసక్తి కలిగింది. బహుశా ఐదో తరగతిలో అనుకుంటా ఆయన నాటకాలు చూసిన స్ఫూర్తితో 'రిస్ట్ వాచ్' అని ఒక చిన్న నాటిక లాంటిది రాసి, ఆయన శెలవలకి మావూరు వచ్చినపుడు చూపించాను. 'ఫరవాలేదురా ఈ వయసులోనే ఏదో రాయాలన్న తహతహ వుంది. నిన్ను మెచ్చుకోవాలి. కథ ఓ మాదిరిగా ఉందికానీ, ఇంకా నాటకం సంభాషణలు వ్రాయాలంటే, చాలా మెచ్యూరిటీ కావాలి..కొన్ని రోజులు ఆగు..' అని సలహా ఇచ్చారు. ఫరవాలేదు కొంచెమైనా బావుందన్నారు కదా అని నేను చాలా ఉప్పొంగిపోయాను.

సినిమాలంటే ఆసక్తి కలిగింది (ఆసక్తి అనేకంటే ఒక విధంగా 'పిచ్చి' అనొచ్చేమో) విజయవాడలో. నాన్నగారు అంటుండేవారు 'విజయవాడ నీళ్ళు ఒక గ్లాసు తాగితే చాలు..సినిమాలమీద ఇంటరెస్టు పెరిగిపోతుంది..' అని. ఏడవ తరగతి అంటే ఎదిగీ ఎదగని వయసు.. సొంత వ్యక్తిత్వం వచ్చేస్తోందని భ్రమ కలిగించే వయసు.. అక్కడ నాకు సినిమాలు చూడ్డం బాగా అలవాటైంది. ఏడవతరగతిలో ఉండగానే విజయవాడలో 'అడవిరాముడు' శతదినోత్సవం జరిగింది. ఉత్తరభారతదేశం, దక్షిణ భారతదేశం చిత్రపరిశ్రమకి సంబంధించిన అతిరథ మహారథులందరూ ఆ ఉత్సవానికి తరలి వచ్చారు. నేనో బుడతడ్ని.. పెద్దపెద్ద వాళ్ళంతా అప్సరా థియేటర్ కి వస్తుంటే అందరిలో దూరి, ముందు వరుసలో నిల్చుని వచ్చేవాళ్ళని చాలా ఆరాధనా భావంతో చూడ్డం మొదలుపెట్టాను. దిలీప్ కుమార్, శివాజీ గణేశన్, జయప్రద, జయసుధ, వాణిశ్రీ రాజబాబు. ఎన్టీఆర్, ఏఎన్నార్.. అందరినీ ఆశ్చర్యంతో చూస్తుండగా నా పక్కన నిలుచున్నాయన్ని అడిగాను 'ఈ సినిమా డైరెక్టర్ ఎక్కడా?' అని. ' అదుగో.. ఆ గడ్డమాయనే ' అని రాఘవేంద్రరావుగారిని చూపించాడతను. కె.ఎస్.ప్రకాశరావు, దాసరి నారాయణ రావుగార్ల మధ్యన నడుస్తున్న రాఘవేంద్రరావు గారిని చూడగానే మనసులో అనుకున్నాను 'పెద్దయ్యాక ఎలాగైనా సరే ఈయనలా డైరెక్టర్‌ని కావాలి..' అని. ఎందుకో చెప్పలేను కానీ, ఈ విభాగం ఏం చేస్తుందో సరిగ్గా తెలీకపోయినా అప్పుడే సినిమా డైరెక్షన్ అంటే ఒక విధమైన గ్లామర్ ఏర్పడింది.

సాధారణంగా చిన్నపటినుంచీ ఏదైనా చెయ్యాలి అనుకుంటే అది సాధించేదాకా శ్రమించే గుణం అలవాటైంది... ఒక ఉదాహరణ ఏమిటంటే.. విజయవాడలో నవరాత్రికి పందిళ్ళు వేసి తొమ్మిది రోజులూ ఏవో ఒక కల్చరల్ కార్యక్రమాలు పెడుతుండేవాళ్ళు. ఒకసారి విజయవాడ స్థానికుడైన సిల్వర్ స్టార్ అనే అతని మిమిక్రీ ప్రొగ్రామ్ పెట్టారు. ఐదారు వేల మంది ప్రేక్షకుల్ని గంటల తరబడి ఒక్కడే అలా కట్టిపడెయ్యడం చూసి, నాకూ అలా మిమిక్రీ చెయ్యాలనిపించింది. అంతే మరునాటి నుంచే ఇంట్లో అద్దం ఎదురుగా నిలుచుని ప్రాక్టీసు చెయ్యడం, ఇంట్లో అందరితోనూ రకరకాల నటులు మాట్లాడినట్లు మాట్లాడ్డం.. ఇలా అభ్యాసం చేసాను. ఇవన్నీ గమనించిన నాన్నగారు ఒకసారి ఇంటికి ఎవరో బంధు మిత్రులు వస్తే వాళ్ళ ముందు మిమిక్రీ చేయించారు. అలా మొదలైన కళ తరువాత నాతో పాతిక ముప్ఫై స్టేజి కార్యక్రమాలు ఇప్పించింది.! అలా పట్టుదల అనేది ఆ వయసునుంచే ఉండేది.

విజయనగరంలో డిగ్రీ చదివేప్పుడు సినిమాల్లోకి వెళ్ళాలనే భావం బాగా బలపడింది. అలానే అక్కడ చదువుకునేప్పుడు మంచి సాహిత్యం చదవడం బాగా అలవాటైంది. తిలక్. బుచ్చిబాబు, రావిశాస్త్రి..మిత్రుల సహచర్యంతో చాలా పుస్తకాలు చదవడం..ఏవో కథల్లాంటివి మనసులో రూపుదిద్దుకోవడం జరుగుతుండేది. ఆ రోజుల్లో కొన్ని కవితలు కూడా వ్రాయడం, పత్రికల్లో పబ్లిష్ కావడం జరిగింది.

డిగ్రీ ఫైనలియర్‌కి హైదరాబాదు వచ్చాక ఇంక డిగ్రీ పూర్తిచేసి సినిమాల్లోకి వెళ్ళాలనే నిశ్చయాన్ని దృఢపరచుకున్నాను. చదువు విషయంలో ఒక స్థాయిలో ఉండాలన్న ధ్యాస మాత్రం ఎప్పుడూ ఉండేది. అందుకే డిగ్రీ అయ్యేవరకూ సినిమా ఆలోచనల్ని లోపలే ఉంచేసుకున్నాను. డిగ్రీ పూర్తయింది. మద్రాసు వెళ్ళాలంటే డబ్బులు కావాలి. అసలే మధ్యతరగతి కుటుంబం. నాన్నగారిని అడిగి ఇబ్బంది పెట్టడం ఇష్టంలేదు. నాంపల్లిలోని హర్ష హోటల్లో ఫ్రెంట్‌లాబీ మేనేజర్‌గా చేరాను. కొంతకాలం పనిచేసి, కాస్త పైకం సమకూరాక మద్రాసు ప్రయాణం కట్టాను.

అప్పటికే నా మిత్రుడు సత్యప్రసాద్ అనే అతను మద్రాసువెళ్ళి సినిమాలకోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. అతను నాకు డిగ్రీలో క్లాస్‌మేట్. నేనే ఎప్పుడూ సినిమాలు. సినిమాలు అంటూ పోరు పెట్టేవాడిని. నా మాటలతో ప్రభావితమై, నాకంటే ముందుగా తనే మద్రాసు వెళ్ళాడు. సరే ఇలా వస్తానని చెబితే 'రావొద్దు.. ఈ ఫీల్డ్ చాలా కష్టమైంది. నేనే ఇంకా ఏమీ అవకాశాలు లేక సెటిలవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాను..' అని రాసాడు. ఐనా నాలో ఉన్న నిర్ణయాన్ని ఆ ఉత్తరం మార్చలేకపోయింది. ఏమైతే ఐందని నేను సంపాదించిన డబ్బులతో మద్రాసు వెళ్ళి, సత్యప్రసాద్  రూమ్ లోనే దిగాను. షరా మామూలే.. ఏదీ తనంతతానై నీ దరికి రాదు.. అన్నట్లు.. సినిమారంగ ప్రవేశం కోసం బాగానే తిరగాల్సి వచ్చింది. చివరికి నాకు తెలిసిన ఒక మిత్రుడికి సి.వి.గణేశ్ అనే దర్శకుడు పరిచయం ఉంది. ఆయన అప్పట్లో 'అంతిమరాత్రి' అనే సినిమాకి దర్శకత్వం చేస్తున్నారు. మా మిత్రుడి రికమండేషన్ మీద ఆ సినిమాకి అప్రెంటిస్‌గా చేయడానికి కుదిరాను. ఆ సినిమాలో తారాగణం..కపిల్ దేవ్, శ్రీదుర్గ (తర్వాత మాలాశ్రీ పేరుతో బిజీ స్టార్ అయ్యారు), శుభలేఖ సుధాకర్, శివాజీరాజా..వగైరా. ప్రతిరోజూ సెట్‌కి వెళ్ళి దర్శకత్వం అంటే ఏమిటో, ఎవరేమి చేస్తున్నారో పరిశీలిస్తూ, ఎవరికేమి కావాలన్నా సహాయం చేయడమే నా పని. ఫరవాలేదు..ఏదో నేర్చుకుంటున్నాను అనుకునే సమయంలోనే ఆ సినిమా నిర్మాణం..- ఆగిపోయింది. 'అంతిమరాత్రి' ఎప్పటికీ విడుదలకాలేదు.!

మళ్ళీ మద్రాసు..మిత్రుడి రూమూ..అందరివద్దకీ వెళ్ళడం.. చాలా రోజులవరకూ ఏమీ స్థిరం కాలేదు..అయ్యో తప్పు చేసానేమో..ఈ ఫీల్డ్ మనకి సరిపడేది కాదేమో.. వెనక్కి వెళ్ళిపోతే మంచిదేమో.. అని కూడా కొన్నాళ్ళు అనుకున్నాను. మళ్ళీ పట్టుదల.. ఎలాగైనా సాధించి తీరాలి..అని. ఇలా ఊగిసలాటలో ఉండగా ఇంటి వద్దనుంచీ నాన్నగారు ఉత్తరం రాసారు. మా సోదరి వివాహం సెటిలయిందనీ ఒక నెల ముందుగా వచ్చి కాస్త సహాయం చెయ్యాలనీ. సరే అని హైదరాబాదుకి బయలుదేరుతుండగా ఒక అవకాశం వచ్చింది, పి.ఎన్.రామచంద్రరావు గారి వద్ద 'సాక్షి' అనే సినిమాకి అసిస్టెంట్ గా పనిచేయడానికి. కానీ అప్పటికే నాన్నకి వస్తానని చెప్పి ఉండడం వల్ల ఆ అవకాశాన్ని వదులుకుని హైదరాబాదుకే ప్రయాణమయ్యాను.

హైదరాబాదు రైల్లో వస్తుండగా జ్యోతిచిత్రలో వచ్చిన ఒక సినిమా ప్రకటన నన్ను ఆకట్టుకుంది. సినిమా పేరుకానీ, నటీనటుల వివరాలు కానీ ఏమీ లేవు.. ఒక సైకిల్ చైను.. షూటింగ్ మొదలైంది మార్చి లో..అని ఉందంతే.. సైకిల్ చైన్ చూడగానే అనిపించింది, ఇదేదో విజయవాడ ..స్టూడెంట్స్ కథే అయ్యుంటుందని.. ఎంచేతంటే విజయవాడ నేపథ్యం నాకు బాగా తెలుసు. ఈ దర్శకుడెవరో ముందునుంచే ఇంత విభిన్నంగా ప్రకటనలిస్తున్నాడు..ఈయన్ని కలిస్తే ఎలా ఉంటుందీ అని అనిపించింది. ఈ లోగా మా సోదరి వివాహ ఏర్పాట్లల్లో రెండు మూడు నెలలు గడిచిపోయాయి. సైకిల్ చైన్ సినిమా 'శివ' గురించి రకరకాల ప్రకటనలు వస్తున్నాయి. అందరికీ చాలా ఉత్సాహాన్ని రేకెత్తించాయి. ఆ సినిమాలో శుభలేఖ సుధాకర్ గారు కూడా ఉన్నారని తెలిసి , ఆయన ద్వారా 'శివ' దర్శకుడ్ని

కలవాలని నా ప్రయత్నం. సుధాకర్ గారిని కలిసాను. ఆయన 'రామ్ గోపాల్ వర్మ ఒక డిఫరెంట్ వర్కింగ్ శైలి ఉన్న దర్శకుడు. రికమండేషన్ లాంటివి ఎక్కువ పట్టించుకోరు.. నీ అంతట నువ్వే వెళ్ళి కలువు.. ఏమ్మాత్రం స్పార్క్ ఉందనుకున్నా నీకు అవకాశం ఇస్తారు..' అని సలహా ఇచ్చారు.



మొత్తానికి మూడు, నాలుగు వారాల ప్రయత్నం అనంతరం రాము గారిని కలుసుకునే అవకాశం సంపాదించగలిగాను.

అది 1989 జూన్ నెల అనుకుంటాను. నేను వచ్చిన పని చెప్పగానే రాము గారు 'శివ' ఇప్పటికే 80 శాతం పూర్తయింది. ఇప్పుడు నీకేమీ అవకాశం ఇవ్వలేను. తరువాతి సినిమాకి చూస్తాను. ఐనా ఈ సినిమా రిలీజవ్వాలి. అది సక్సెస్ అవాలి. నేనింకో సినిమా మొదలు పెట్టాలి . అప్పుడు చూద్దాం.." అన్నారు.

"ఈ సినిమా తప్పని సరిగా విజయవంతమౌతుంది.." అన్నాను.

" ఏమీ తెలీకుండానే ఎలా చెప్పగలుగుతున్నావు..?" అన్నారాయన.

"ఇవిగోండి..మీరు ఇంతవరకూ విడుదల చేసిన ప్రకటనలూ, స్టిల్సూ..వీటిని జాగ్రత్తగా గమనిస్తే ఇదొక స్టూడెంట్ బ్యాక్డ్రాపున్న సినిమా అని తెలుస్తోంది.." ఇంకా నేను చేసిన ఎనాలసిస్ అంతా చెప్పాను. అవన్నీ విన్నాక రామ్‌గోపాల్ వర్మ గారికి నామీద మంచి అభిప్రాయమే కలిగిందనుకుంటాను.." నీ వద్ద మంచి ఎనాలసిస్ పవర్ ఉంది..శివ సినిమా రిలీజయ్యాక కలవండో సారి.." అని చెప్పారు. ఇంక నేను మద్రాసు వెళ్ళే ప్రయత్నాలు కూడా మానేసాను. హైదరాబాదులోని ఉండి పోయి, ఆయన అన్నట్లే శివ రిలీజై రాష్ట్రమంతటా సంచలనాలు సృష్టిస్తున్న రోజుల్లో మళ్ళీ రామ్ గోపాల్ గారిని కలుసుకోవడం జరిగింది..

మరి మొదటి పరిచయంలో నాలో ఏమి చూసి గుర్తుపెట్టుకున్నారో కానీ, నన్ను చూడగానే గుర్తు పట్టేసారు..

"ముందే చెప్పాను కదండీ..ఈ సినిమా సక్సెస్ అనీ.." అన్నాను.

"సినిమాని పొగడ్డం కాదుకానీ..ఇంకా ఈ సినిమాలో ఏమేమి మార్పులు చెయ్యొచ్చో..వివరంగా చెప్పగలవా? అవసరమైతే మరో సారి ఈ సినిమా చూసి చెప్పు" అన్నారు.

ఆయన మాటమీదనే మరునాడే మళ్ళీ ' శివ ' మేటినీ షోకి వెళ్ళాను. ప్రతి దృశ్యాన్నీ నా క్రిటికల్ బ్రెయిన్‌తో చూడసాగాను. సినిమా ఐపోయింది.. బయటికి వస్తుంటే రామ్ గోపాల్ వర్మగారు కూడా అదే సినిమాలోంచి బయటికి వస్తూ కనిపించారు. ఆయన చెప్పగానే నేను సిన్సియర్‌గా సినిమా చూసేందుకు వచ్చానని సంతోషించారో ఏమో కానీ, నన్ను తన కారులోనే ఎక్కించుకుని తన ఆఫీసుకి తీసుకెళ్ళి పెన్నూ, పేపరూ ఇచ్చి నేను అనుకుంటున్న మార్పులేమిటో వ్రాయమన్నారు. నేను కొన్ని సీన్లు ఇంకా ఎలా ఇంప్రూవ్ చెయ్యొచ్చో వివరంగా రాసి పెట్టాను. అప్పటికి ఆయన వెళ్ళిపోయారు. అక్కడున్న బోయ్‌కి పేపర్లు ఇచ్చేసి నేను వచ్చేసాను. మరునాడు ఆయన ఫోన్ చేసి అన్నపూర్ణా స్టూడియోకి రమ్మన్నారు...వెళ్ళాను..

"నువ్వు రాసిన ఎనాలసిస్ బావుంది.. మేమిప్పుడు ఇదే సినిమాని హిందీలో తీద్దామనుకుంటున్నాము. దానికి నిన్ను అసిస్టెంట్‌గా తీసుకుంటాను.."అని చెప్పారు. ఆ విధంగా రామ్ గోపాల్ వర్మ గారి వద్ద అసిస్టెంట్‌గా చేరడం, మొదటి సినిమాగా 'శివ' హిందీకి పనిచేయడం జరిగింది. అప్పుడే ఉత్తేజ్ పరిచయమవడం, కొద్ది సమయంలోనే మేమిద్దరం చాలా క్లోజ్ మిత్రులమవడం జరిగింది.

అక్కడినుంచీ మొదలుకుని క్షణ క్షణం, గోవిందా గోవింద, రాత్రి, గాయం, రంగీలా..వరకూ రామ్ గోపాల్ వర్మ గారి వద్దనే ఆరేళ్ళ పాటు పనిచేసాను. అక్కడే ఆయన గెస్ట్ హౌస్ లోనే ఉండేవాడిని. ఉత్తేజ్ నా రూమ్మేట్ గా ఉండేవాడు.

'రంగీలా..' షూటింగ్ జరుగుతున్న రోజుల్లోనే ఆయన ఎ.బి.సి.ఎల్‌తో కలిసి కృష్ణవంశి దర్శకత్వంలో 'గులాబి' మొదలు పెట్టడం జరిగింది. అప్పుడే మేమందరం కల్సినప్పుడు.. "కృష్ణ వంశీ తరువాత..ఎవరు సొంతంగా డైరెక్ట్ చెయ్యడానికి రెడీగా వున్నారు?" అని అడిగారాయన. మా టీమ్ అంతా కల్సి నా పేరే ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. "కథలేమైనా అనుకుంటున్నావా రమణా.." అని అడిగారు రాము గారు. రోజూ పడుకోబోయేముందు ఉత్తేజ్‌తో కొత్తకథల గురించి చర్చిస్తూ ఉండేవాడిని. అదే చెప్పాడు ఉత్తేజ్.
ఐతే నేనే రాము గారితో " వర్మ కార్పొరేషన్ లో దర్శకుడిగా పరిచయమవ్వాలంటే..నాకే కొంత బెరుకుగా ఉంది.." అన్నాను.

"ఎందుకలా?" అని అడిగారాయన..

"ఏమీ లేదండి.. గులాబి సినిమాకి కూడా దర్శకుడి కంటే ఇది 'రామ్ గోపాల్ వర్మ' సినిమా అనే పేరు వచ్చింది. డైరెక్టర్ పేరుని బానర్ పేరు డామినేట్ చేస్తుందోమోనని సంశయంగా వుంది.." అన్నాను ధైర్యంగానే.

"నీ ఇష్టం..నువ్వు వేరే బేనర్ లో చెయ్యాలనుకున్నా మా అందరి సహకారం ఎప్పుడు ఉంటుంది..మళ్ళీ ఎప్పుడన్నా మన బేనర్ లో చెయ్యాలనుకున్నా వచ్చేసెయ్యి. సంతోషంగా చేద్దాం " అన్నారాయన విశాల హృదయంతో.

ఆ విధంగా 1995 ప్రాంతాల్లో సొంతంగా దర్శకత్వం చెయ్యడం కోసం నా ప్రయత్నాలు మొదలయ్యాయి.

అప్పటికే జె.డి.చక్రవర్తితో ఉన్న స్నేహంతో తనకి ఒక కథ చెప్పాను. అతనికి బాగా నచ్చిందది. అదృష్టవశాత్తూ ఒక నిర్మాత కూడా దొరికారు. జె.డి మిగతా సినిమాల బిజీలో ఉండగా నేనూ, నిర్మాతా కలిసి మిగతా పనుల్లో మునిగిపోయాము. అలా 5-6 నెలలు గడిచాయి. ఈ లోగా జె.డి. సినిమాలు 'మృగం','అనగనగా ఒక రోజు' విడుదల కావడమూ, అతని డిమాండ్ పెరగడమూ జరిగింది. సహజంగానే అతని పారితోషికమూ పెరిగింది. ఇక్కడే చిక్కు వచ్చింది. ముందు ప్రణాళిక వేసుకున్న ప్రకారం ఐతే పెరిగిన జె.డి. పారితోషికాన్ని నిర్మాత భరించే పరిస్థితిలో లేరు. ఆయన అదే విషయాన్ని ఖచ్చితంగా చెప్పేసారు... అలా నా దర్శకత్వంలో మొదలవ్వాల్సిన సినిమా ఆరంభం కాకుండానే ఆగిపోయింది.

మళ్ళీ నిర్మాతని వెదుక్కునే మార్గంలో మరో సంవత్సరం గడిచిపోయింది. ఆరోజుల్లో మళ్ళీ రామ్ గోపాల్ వర్మగారిని కలిసానొక సందర్భంలో. ఏం చేస్తున్నావన్న ఆయన ప్రశ్నకి జరిగిన సంఘటనలన్నీ చెప్పాను. ఆయనే అన్నారు.."ఇప్పటికైనా సరే నువ్వు చేస్తానంటే మన బానర్ లో చేద్దాం.." అని. నాకూ అనిపించింది.."ఇన్ని ఇబ్బందులు పడే బదులు రాము గారి మాట వింటేనే బావుంటుంది కదా." అని.

అప్పుడే రామ్‌గోపాల్ వర్మ గారికి రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ఒక కథ చెప్పాను. అప్పటికి ఆ నేపథ్యంలో సినిమాలేమీ రాలేదు. ఆయనకీ నచ్చింది. సరే నన్నారు. జె.డి హీరో, స్రిమాన్ హీరోయిన్. స్రిమాన్‌కి అదే మొదటి తెలుగు సినిమా. ఆ చిత్రానికి 'నాంది' అని పేరు పెట్టాం. స్రిమాన్. జె.డి. కాంబినేషన్‌లో రెండు - మూడు రోజులు షూటింగ్ జరిగింది. అంతవరకూ రామ్ గోపాల్ వర్మగారు అన్నీ నాకే వదిలేసారు. అప్పటికాయన 'దౌడ్' షూటింగ్ లో బొంబాయిలో ఉన్నారు. రెండు రోజుల తర్వాత వచ్చాక హీరోయిన్‌ని చూస్తానన్నారు. షూటింగ్ ముగిసాక ఆయన ఆఫీసుకి స్రిమాన్ , నేనూ వెళ్ళాము. అప్పటికి స్రిమాన్ మేకప్ తీసేసి ఉంది. కొంచెం జ్వరంగా కూడా ఉన్నట్లు గుర్తు. బాగా నీరసంగా వున్న తనని చూసి రామ్ గోపాల్ గారు, ఆమె అంత బరువైన పాత్రకి న్యాయం

చేకూర్చగలదా అని సందేహం వెలిబుచ్చారు. కెమేరామేన్ ఛోట కె.నాయుడు గారు కూడా చెప్పారు ..' మనిషి అలా కనిపించినా, నటన విషయంలో మాత్రం బాగా చేస్తోంది..' అని. బాగా ఆలోచించాక కూడా రాము గారు ఆమె స్థానంలో వేరే వారిని చూడమని చెప్పారు. ఆవిడకి సారీ చెప్పి పంపించేసాము. మళ్ళీ హీరోయిన్ కోసం అన్వేషణ ప్రారంభమయింది. అప్పటికే విడుదలైన డబ్బింగ్ సినిమా 'ప్రేమలేఖ'తో మంచి పేరు తెచ్చుకున్న హీరాని హీరోయిన్ గా పెట్టుకోవాలనుకున్నాము. రాము గారు కూడా సెలెక్షన్ బావుందన్నారు. మళ్ళీ షూటింగ్ మొదలైంది. కర్నూలు దగ్గర బనగాన పల్లిలో రెండు వారాలు షూటింగ్ జరిగింది. ఆ ప్రాంతాల్లో తెలుగు సినిమా షూటింగ్ జరగడం అదే మొదలట. స్థానికులంతా చాలా ఉత్సాహంగా మాకు సహాయం చేసారు.

అప్పుడు మరో సమస్య మొదలైంది. రామ్ గోపాల్ వర్మ గారికి అప్పటికే 'దౌడ్' విడుదలవ్వడమూ, అది ఫ్లాప్ కావడమూ జరిగింది. ఆయన డిస్ట్రిబ్యూషన్ కి తీసుకున్న ఒకటి రెండు సినిమాలు కూడా నష్టాలనే తెచ్చి పెట్టడం, వంశీ దర్శకత్వంలో విడుదలైన 'వైఫాఫ్ వరప్రసాద్' కూడా ఫ్లాప్ కావడమూ..వీటన్నింటితో ఆయన ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోయారు. నన్ను పిలిచి 'నాంది' కొనసాగించడం కష్టం అని చెప్పారు. ఆయన పరిస్థితులని గమనించిన నేనూ ఒత్తిడి చెయ్యలేక పోయాను. కళ్ళెదుట కనబడుతున్న వాస్తవాన్ని కాదనలేకపోయాను. ఆ విధంగా మొదటి సినిమా ఔతుందనుకున్న 'నాంది' మొదటిలోనే ఆగిపోయింది.

మళ్ళీ నా పరిస్థితి బాక్ టు స్క్వేర్ వన్ అన్నట్లయింది.



మళ్ళీ నిర్మాతల వేటా, కథలు సమకూర్చుకోవడం.. దాదాపు ఒక సంవత్సరం గడిచింది. అప్పటికి జె.డి బొంబాయిలో 'సత్య' చేస్తున్నాడు. తను ఒకసారి హైదరాబాదు వచ్చినపుడు కబురుచేస్తే వెళ్ళాను. 'రమణా..నేనే నీతో సినిమా తీస్తాను..ఇదిగో నా వద్ద ఒక లైన్ ఉంది..దీని మీద కథ తయారు చెయ్యి ' అనిఒక స్టోరీ లైన్ చెప్పాడు. దానికి ఒక ఇంగ్లీషు సినిమా ఇన్స్పిరేషన్ అని కేసెట్ కూడా ఇచ్చాడు. నేను ఆ సినిమా చూసి ఒకటి రెండు వారాల్లోనే పూర్తి కథ సిద్ధం చేసాను. జె.డి, కెమేరామేన్ శ్రీనివాస రెడ్డి, మరొకాయన మొత్తం ముగ్గురు నిర్మాతలుగా నా నిజమైన మొదటి సినిమా మొదలైంది. జె.డి. హీరో, మీనా హీరోయిన్. ఐతే సినిమా ప్రారంభానికి ముందు జె.డి ఒక షరతు చెప్పాడు. సినిమా లో బడ్జెట్‌లో నెల రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లో పూర్తవ్వాలి అని. నేనూ పట్టుదలగా, పక్కా ప్లానింగ్ తో వెళ్ళి 1998 జూలై మొదట్లో మొదలు పెట్టి, ఖచ్చితంగా 23 రోజుల్లో పాటలూ, ఫైట్స్ అన్నీ కలిపి పూర్తి చేసేసాను. డబుల్ పోజిటివ్‌ని చూసిన శ్రీనివాసరెడ్డి గారు , అంతవరకూ మోనో లో రికార్డింగ్ చేద్దామనుకున్న నిర్ణయాన్ని మార్చుకుని, మొత్తం సినిమాని డి.టి.ఎస్ లో మిక్సింగ్ చేద్దామన్నారు.. ఆ విధంగా హైదరాబాదులో డి.టి.ఎస్. మిక్సింగ్ జరుపుకున్న మొదటి సినిమా మాదే ఐంది.

పేరు పెట్టడం దగ్గరకి వచ్చేసరికిఎటూ తేల్చుకోలేక పోయాము. జె.డి. 'అసలు పేరు పెట్టక పోతే ఏమౌతుంది?' అన్నాడు. "అంటే ఎవరైనా సినిమా గురించి మాట్లాడుకోవాలంటే ఏదో ఒక రిఫరెన్స్ ఉండాలి కదా.." అని అంటే "ఐతే ప్రశ్నార్థకంతో విడుదలచేద్దాం.. ప్రేక్షకులనే సినిమా టైటిల్ సూచించమని అడుగుదాం.." అన్నాడు. మాకూ ఆ ప్రతిపాదన నచ్చింది. ఈ సరికొత్త ప్రయోగంలో ప్రేక్షకుల్లో ఒక ఆసక్తిని రేకెత్తించింది. '?' పేరుతోనే సినిమా విడుదలైంది. 1998 అక్టోబర్ నెలలో. ఆంధ్రప్రదేశ్ అంతా

తుఫానుమయం, జోరున వర్షాలూ.. ఐతే అదృష్టవశాత్తూ ఓపెనింగ్స్ బాగానే వచ్చాయి. సినిమా విడుదలవగానే పేరు కోసమని పోటీ ప్రకటించాము. సరైన పేరు పెట్టిన వాళ్ళకి రెండు మూడు లక్షలు ఇందిరా వికాస్ పత్ర సర్టిఫికెట్‌లు ఇస్తామని కూడ చెప్పాము. ఏ పదో, పదిహేను వేలో ఉత్తరాలు వస్తాయిలే అనుకున్నాం. మా అంచనాలను తలకిందులు చేస్తూ 8.5 లక్షల ఉత్తరాలు వచ్చాయి. కొంతమంది తాత్కాలిక సిబ్బందిని నియమించి వాటన్నింటినీ ఒక పద్ధతిలో పెట్టగా తేలింది - చాలా మంది 'పాప కోసం', 'పాపే నా ప్రాణం', 'నాప్రాణం పాప',... ఇలా 'పాప' , 'ప్రాణం' ..ఈ పదాలు వచ్చేలాగానే సూచించారు. చివరికి 'పాపే నా ప్రాణం' అన్న పేరు ఖరారు చేసి అలా చెప్పిన వాళ్ళందరిలో లాటరీ వేసి విజేతకి ముందు అన్నట్లే ఇందిరా వికాస్ పత్ర అందించడం జరిగింది.

విపరీతంగా సూపర్ సక్సెస్ కాకపోయినా సినిమా 50 రోజులాడింది. దర్శకుడిగా నాకు మంచి పేరు తెచ్చి పెట్టింది.. ఇదీ నా మొదటి సినిమా వెనుకనున్న కథ..!

చిన్నప్పుడు వివిధ కార్యక్రమాల్లో ఇల్లు వదిలి తిరుగుతున్నప్పుడు అమ్మ అంటుండేది "ఎందుకురా అలా ఊరు వెంబడి తిరుగుతావు..? ఎవరైనా నీకు పూల దండలు వేసి ఊరేగిస్తారనుకుంటున్నావా?' అని. అమ్మ మాట నిజంగా నాకు వరమే ఐంది. నా మొదటి సినిమా అర్థ శతదినోత్సవం రోజున విజయవాడలో పెద్ద ఊరేగింపు జరిగింది. పూలదండలతో విజయరథం మీద నిలుచున్నప్పుడు అమ్మే నా మనసులో కదలాడింది.

హైస్కూలు దశలో మిమిక్రీ ఆర్టిస్ట్ కావలనుకుని సాధించడం దగ్గరనుంచీ నా మీద నాకో గట్టి నమ్మకం ఉంది. ఏదైనా అనుకుంటే కొంచెం ఆలశ్యమైనా కానీ దాన్ని సాధించితీరుతాను అని. ప్రస్తుతం ఎంత తొందరగా ఒక సూపర్ హిట్ సినిమాని తెలుగు ప్రేక్షకులకి అందించాలా అని చూస్తున్నాను. త్వరలో నా ప్రయత్నాలు ఫలిస్తాయని మీ అందరి ఆశీస్సులకోసం ఎదురు చూస్తుంటాను..



PUBLISHED IN SEPTEMBER 2008

# పర్వతనేని సాంబశివరావు

తెలుగు చలనచిత్ర రంగంలో సీనియర్‌మోస్ట్ డైరెక్టర్ శ్రీ పర్వతనేని సాంబశివరావు గారు. 1958నుంచీ చిత్ర పరిశ్రమతో సంబంధం ఉన్న సాంబశివరావుగారు దర్శకుడిగా తన కెరీర్‌లో దాదాపు 45 సినిమాలకి దర్శకత్వం వహించారు. 25-30 సంవత్సరాల క్రిందటే అనేక విజయవంతమైన చిత్రాలని అందించిన సాంబశివరావుగారు గత 15 సంవత్సరాలకు పైగా చిత్రరంగానికి దూరంగా ఉండడం వల్ల ఈ తరం ప్రేక్షకులకి వీరి పేరు వెంటనే గుర్తుకు రాకపోవచ్చు. 1979లో వచ్చిన సూపర్ హిట్ సినిమా 'ఇంటింటి రామాయణం', సూపర్ స్టార్ కృష్ణ 200 వ సినిమా 'ఈనాడు'(1982), కృష్ణ త్రిపాత్రాభినయం చేసిన సినిమా 'కుమార్ రాజా'(1978), విజయశాంతి హీరోయిన్‌గా నిలదొక్కుకోడానికి దోహదం చేసిన 'పెళ్ళిచూపులు'(1983) వగైరా చిత్రాలకి దర్శకత్వం వహించింది సాంబశివరావు గారే. గుండమ్మ కథ సినిమాని హిందీలో కూడా రూపొందించారు. అలానే శ్రీదేవి, కునాల్ గోస్వామీ లతో 'కళాకార్' అనే హిందీ చిత్రానికి కూడా దర్శకత్వం వహించారు. వీరు తెలుగులో రూపొందించిన చివరి చిత్రం 'మృగతృష్ణ'(1992). నేషనల్ ఫిలిమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి ఆర్థిక సహాయంతో రూపొందిందీ చిత్రం.. తరువాత తెలుగు సినిమాలకి దర్శకత్వం వహించకపోయినా, రెండేళ్ళ క్రిందటే, తెలుగు భాషలో విజయవంతమైన 'సత్యం'(సుమంత్ కథానాయకుడు) సినిమా బెంగాలీ వెర్షన్ "శక్తి"కి దర్శకత్వం వహించారు. గత 16 - 18 సంవత్సరాలుగా అనేక టి.వి. సీరియల్స్‌కీ, లఘు చిత్రాలకీ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఒక ప్రముఖ తెలుగు ఛానెల్ రూపొందిస్తున్న క్రైమ్ ఆధారిత ఒక గంట చిత్రాలకి (మల్లాది వెంకట కృష్ణ మూర్తి గారి రచనలు) దర్శకత్వం వహించబోతున్నారు. 73 సంవత్సరాల వయసులోకూడా ఏమాత్రం చురుకుదనం తగ్గకుండా, చలాకీగా పనిచేసే సాంబశివరావుగారిని ఫోన్లో పరిచయం చేసుకోగానే, తన మొదటి సినిమా జ్ఞాపకాలని 'కౌముది' తో ఇలా పంచుకున్నారు.



మా నాన్న గారి ( పర్వతనేని నారాయణరావు చౌదరి) స్వగ్రామం కృష్ణాజిల్లాలోని కౌతరం అనే ఊరు. ఆయన కలకత్తా ఆధారిత మందులకంపెనీకి ఆంధ్రప్రదేశ్‌లో సేల్స్ కో-ర్డినేటర్‌గా వుండేవారు. తన ప్రధాన ఆఫీసుని పశ్చిమగోదావరిలోని ఏలూరులో ఏర్పరుచుకోవడం వల్ల మేము పుట్టిందీ, పెరిగిందీ అంతా ఏలూరులోనే. 1935 సెప్టెంబర్ 20 న పుట్టాను నేను. ఏలూరు మున్సిపాలిటీ స్కూల్లోనే ఎలిమెంటరీ చదువూ, హైస్కూలు చదువూ ముగిసాయి. నేను హైస్కూల్లో ఉండగానే 1945లో ఏలూరులో సి. ఆర్. రెడ్డి కాలేజీ స్థాపించబడింది. హైస్కూలు చదువు పూర్తికాగానే సి. ఆర్. ఆర్. కాలేజీలోనే ఇంటర్మీడియట్, బి.ఎస్సీ కూడా పూర్తి చేసాను.

సరిగ్గా ఆ సమయంలోనే 1957లో నాన్న గారు దివంగతులయ్యారు. అప్పటికే మద్రాసులో ఉంటున్న అన్నయ్య వద్దకి అమ్మా, నేనూ వెళ్ళిపోయాము.

అన్నయ్య గంగాధర రావు గారు (తరువాత నవశక్తి బేనర్ ని స్థాపించి ఎన్నో ప్రతిష్టాత్మకమైన చిత్రాలని నిర్మించారు) అప్పట్లో మద్రాసు సినిమా రంగంలో కెమేరా నేర్చుకోడానికి ప్రయత్నాలు చేస్తుండేవారు. బి.ఎస్సీ పూర్తి చేసిన నేను ఏదో ఒక ఉద్యోగం చెయ్యాలి కాబట్టి అన్నయ్యకి తెలిసిన ఫీల్డ్ సినిమా రంగమే కాబట్టి విక్రమ్ స్టూడియోలోని లేబరేటరీలో అప్రెంటిస్‌గా నన్ను చేర్చారు.

సరిగ్గా ఆ సమయంలోనే హైదరాబాదులో సారథీ స్టూడియో నిర్మాణం జరుగుతోంది. అది పూర్తవగానే అక్కడ లాబ్‌లో పనిచేయడానికి హైదరాబాదు వచ్చేసాను. సారథీ స్టూడియో నిర్మాణం ఐన వెంటనే అన్నయ్య గంగాధరరావు గారే 'మా ఇంటి మహాలక్ష్మి' అనే సినిమా నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

ఆంధ్రప్రదేశ్ లోనే పూర్తిగా నిర్మాణం జరుపుకున్న మొట్టమొదటి సినిమా అదే. తెలుగు చలన చిత్ర చరిత్రలో అదొక మైలు రాయి. అది అన్నయ్య సొంత సిన్మా కావడం వల్ల నేను అప్పటివరకూ లేబొరేటరీలో ఉంటున్న వాడిని ఈ సినిమాకి దర్శకత్వ శాఖలో అప్రెంటిస్ గా చేరాను. అలా మొదలైంది దర్శకత్వ శాఖలోకి నా ప్రవేశం.

'మా ఇంటి మహాలక్ష్మి' సినిమాని తెలుగు ప్రేక్షకులు చక్కగా ఆదరించారు. అక్కడినుంచీ మొదలుకొని తాపీచాణక్య, ఆదుర్తి సుబ్బారావు, సి.ఎస్.రావుగార్ల వద్ద దర్శకత్వ శాఖలో అసిస్టెంట్‌గా చేస్తూ అనుభవం సంపాదించుకున్నాను. వాటిలో కొన్ని - జల్సారాయుడు, పెళ్ళికాని పిల్లలు, కీలుబొమ్మలు..వగైరా. ఆదుర్తి గారి వద్ద కొన్ని తమిళ సినిమాలకి కూడ పనిచేసాను. కేవలం దర్శకత్వ శాఖలోనే కాకుండా ఆత్రేయ గారి వద్ద స్క్రిప్ట్ రచనలో మెళకువలూ, అక్కినేని సంజీవి గారి వద్ద ఎడిటింగ్‌లో టెక్నిక్ లూ కూడా అధ్యయనం చేసాను.

అప్పుడే 1965 లో 'పాండవ వనవాసం' సినిమా విడుదలై ఘన విజయం సాధించింది. అన్నయ్య స్నేహితుల్లో కొంతమంది బెంగాలీ మిత్రులుకూడా ఉన్నారు. వాళ్ళొక సలహా ఇచ్చారు " ఈ పాండవ వనవాసం చాలా రిచ్ గా వుంది. కలకత్తాలో ఇంతటి భారీ సెట్టింగ్‌లతో సినిమా తీయడం చాలా కష్టం. పైగా మహాభారతం లాంటి పౌరాణిక గాధలకి మా రాష్ట్రంలో కూడా ఆదరణ బావుంటుంది. ఈ సినిమాని బెంగాలీ భాషలోకి అనువాదం చేస్తే మంచి బిజినెస్ అవుతుంది .. " అని. నాకు ఈ సలహా బాగా నచ్చింది. ఐతే డబ్బింగ్ ఆర్టిస్ట్‌లు మద్రాసులో ఎలా దొరుకుతారు.? స్థానిక బెంగాలీ అసోసియేషన్ వాళ్ళని అడగొచ్చు కానీ అన్ని విభిన్న పాత్రలకి సరిపడా గొంతులు దొరకడం కష్టమే..

నేనే ఇంక కలకత్తా వెళ్ళి సినిమాని డబ్బింగ్ చేద్దామని నిర్ణయించుకున్నాను. సినిమా రీళ్ళు పట్టుకుని కలకత్తాలో అడుగుపెట్టాను (అప్పటికి నాకు 30 సంవత్సరాల వయసు. ఇంకా పెళ్ళి కూడా కాలేదు). అక్కడ ఒక స్టూడియో మాట్లాడుకుని డబ్బింగ్ మొదలుపెట్టాను. అప్పుడే ఇండియా-పాకిస్థాన్ యుద్ధం కూడా మొదలైంది. కాస్త ఆలస్యమైనా రెండు నెలల్లో డబ్బింగ్ పూర్తి చెయ్యగలిగాను. ఒక తెలుగు సినిమా డబ్బింగ్ జరుగుతోందని తెలుసుకున్న బెంగాలీ చిత్ర రంగ ప్రముఖులు ఉత్తమ్‌కుమార్ , సత్యజిత్ రే కూడా డబ్బింగ్ స్టూడియో వద్దకి వచ్చి చూసి వెళ్ళారు. రిలీజయ్యాక ఘన విజయం సాధించిందా బెంగాలీ పాండవ వనవాసం.

పరాయి రాష్ట్రంలో, పరాయి భాషలోకి తెలుగు సినిమాని అనువదించి విజయం సాధించడం..అదీ ఒంటరిగా..ఇదొక మరపురాని అనుభవం..!

1966లో అన్నయ్య నాకు దర్శకత్వం ఇవ్వడానికి ముందుకి వచ్చారు.



కుటుంబ గాథా చిత్రాలు విరివిగా వస్తున్న ఆ రోజుల్లో ఒక కొత్త తరహా సినిమా తియ్యాలని ప్రణాళిక వేసుకున్నాను. అదే ‘అర్ధరాత్రి‘ గా రూపుదిద్దుకుంది. అప్పటివరకూ అన్నయ్య గారి సినిమాల్లో హీరోగా వేస్తూ వస్తున్న జగ్గయ్య గారినే నా సినిమాకి కూడా హీరోగా సెలక్ట్ చేసుకున్నాము. హీరోయిన్ విషయం వచ్చేసరికే కాస్త ఆలోచించాల్సి వచ్చింది. అప్పటి వరకూ మా సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తున్న జమున గారిని తీసుకుందామంటే ‘అర్ధరాత్రి‘లోని హీరోయిన్ లక్షణాలు అడ్డం వచ్చాయి. ఈ సినిమాలో హీరోయిన్, హీరో ఇంట్లో సర్వెంట్‌గా వచ్చి చేరుతుంది. హీరో, హీరోయిన్‌ల మధ్య నున్న అంతస్తుల వ్యత్యాసం దృష్ట్యా హీరోయిన్, హీరోతో మాట్లాడాలంటే చాలా సంశయిస్తూ, అణకువగా ఆచితూచి మాట్లాడాల్సి వుంటుంది. అప్పటికే ‘మూగ మనసుల్లా‘ంటి సినిమాల్లో గల గలా పారే గోదారిలా మాట్లాడే పాత్రలు ధరించిన జమునని తీసుకుంటే జగ్గయ్య, జమునగార్ల కెమిస్ట్రీ సరిగ్గా వర్క్ కాదనిపించింది.

కొత్త హీరోయిన్ కోసం వెదికాము. అప్పటివరకూ డాన్సర్‌గా వుంటున్న కన్నడ అమ్మాయి భారతిని మొదటి సారిగా ‘అర్ధరాత్రి‘ లో హీరోయిన్‌గా తీసుకున్నాము.

ఇంక కథ విషయానికి వస్తే సంభాషణల పాలు చాలా తక్కువ. సినిమా షూటింగ్ జరుగుతున్నన్ని రోజులూ హీరో జగ్గయ్య గారితో సహా అందరూ ‘ఇదేమిటయ్యా సాంబశివరావ్.. టాకీ యుగంలో మూకీ సినిమా తీస్తున్నట్లున్నావే.. అందులోనూ మొదటి సినిమా కూడా నీకిది..‘ అనే వారు. ఐనా కథ, కథనాల మీద నాకున్న నమ్మకంతో ముందుకి వెళ్ళాను. అయితే అనుకోని అవాంతరాల వల్ల షూటింగ్ దాదాపు సంవత్సరం పాటు సాగింది. మధ్యలో ఔట్‌డోర్ సెట్ వేస్తే తుఫానుకి కొట్టుకుపోయింది. ఎలాగైతే 1968 లో విడుదలై ప్రేక్షకాదరణకు నోచుకుంది నా మొదటి సినిమా..! సంభాషణలు ఎక్కువగా లేకపోవడమన్న అంశమే చాలా మందికి నచ్చింది. మాస్టర్ వేణుగారి సంగీతం, ఆరుద్ర గారు రాసిన పాటలు కూడా చిత్ర విజయానికి దోహదం చేసాయి. అలా దర్శకుడిగా నా విజయయాత్ర మొదలైంది. పది పదిహేను సంవత్సరాల పాటు నన్ను అందరూ ‘అర్ధరాత్రి‘ సాంబశివరావు అనే పిలిచే వాళ్ళు.

పాతికేళ్ళ పాటు చాలా సినిమాలు తీసాను. హిట్లూ ఉన్నాయి, ఫ్లాప్‌లూ ఉన్నాయి. అయితే ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు కుంగిపోవడమనేది నా స్వభావంలోనే లేదు. అలా ఐతే మనమీద మనకి నమ్మకం పోతుంది. మొత్తానికి చాలా హిట్ సినిమాలే అందించాను.

రెండో సినిమా ఎస్.వి. ఆర్., శోభన్ బాబు, కాంచనల కాంబినేషన్ ‘వంశోద్ధారకుడు‘. బాగా ఆడింది. ఇన్నేళ్ళ సినిమా దర్శకత్వ ప్రయాణంలో మరపురాని అనుభవాలు చాలానే ఉన్నాయి. ‘పెళ్ళిచూపులు‘ లో కథానాయికగా నిలదొక్కుకున్న విజయశాంతి, దాదాపు 15 సంవత్సరాల తరువాత హిందూ పత్రికకి ఇంటర్వ్యూ ఇస్తూ ‘సాంబశివరావు గారి దర్శకత్వంలోనే నేను నేను నటనలో ఎక్కువ మెళకువలు నేర్చుకున్నాను‘ అని చెప్పింది. ఆవిడకి నామీద ఉన్న గౌరవానికి ఇదొక ఉదాహరణ.

అలానే పద్మాలయా వారు మళయాళంలో బాగా ఆడిన సినిమాని తెలుగులో ముత్యాలముగ్గు శ్రీధర్ హీరోగా సినిమా తియ్యాలనుకున్నారు. ఐతే కథ చూసాక కృష్ణగారే హీరో ఐతే బావుంటారని అనిపించింది. అదే మాట కృష్ణ గారి తమ్ముడితో చెప్పాను. ఆయన ‘మీరే అన్నతో మాట్లాడండి..‘ అన్నారు. ‘ఏకలవ్య‘ షూటింగ్ లో వున్న కృష్ణ గారిని కలిసి ‘మీలాంటి మహా నటులుండగా పద్మాలయా బేనర్‌లో వేరే హీరోతో సినిమా ఎందుకండీ..కథ కూడ చాలా పవర్‌ఫుల్ గా వుంది. మీరే చేస్తే బావుంటుంది అని చెప్పాను..’

"ఐతే సాయంకాలం పరుచూరి బ్రదర్స్ ని కూడా పిలిపించండి కథ వింటాను" అన్నారు. కథ విన్నాక 'కథ ఐతే బావుంది. కానీ డేట్స్ లేవే' అన్నారు. ఆ రోజుల్లో కృష్ణగారు రోజుకి 24 గంటలూ పనిచేసినా సరిపోనన్ని సినిమాలుఉన్నాయి. ఒక్క పదిరోజులు ఎలానో సర్దారు. పదిరోజులు షూటింగ్ అయ్యాక ఇంక కథమీద కృష్ణగారికి బాగా నమ్మకం కుదిరింది. ఆ విధంగా తయారై ఘన విజయం సాధించిందే కృష్ణ గారి 200 వ చిత్రం 'ఈనాడు'.

ప్రస్తుతం టి.వి. కార్యక్రమాల దర్శకత్వంలో బిజీగా వుంటున్నాను. నన్ను ఇంతగా గుర్తుపెట్టుకుని అమెరికానుంచీ ఫోన్ చేసి, ఇన్నేళ్ళ తర్వాత నా జ్ఞాపకాలని అందరు తెలుగు వారితోనూ పంచుకునే అవకాశం కల్పించిన మీ పత్రికకి కృతజ్ఞతలు తెలియచేస్తూ శెలవుతీసుకుంటున్నాను.

## ఇంటర్వ్యూ : కిరణ్‌ప్రభ

## 'అర్ధరాత్రి' సినిమా షూటింగ్‌లో ఒక పిట్టకథ - *రావికొండలరావు*



**అర్ధరాత్రి సినిమాలో విలన్ వేషం వేసిన ప్రముఖ హాస్య నటులు** రావి కొండలరావుగారు ఆ సినిమా షూటింగ్‌లో తన అనుభవాల గురించి ఇలా వ్రాసారు ఒకచోట. సందర్భానుసారం ఆసక్తికరంగా వుంటుందని ఇక్కడ ఉదహరిస్తున్నాం..చదవండి..

– 'అర్ధరాత్రి' అనే సినిమాలో నేను విలన్ వేషం వేసాను. ఈ విలన్ గాడు బ్లాక్ మెయిల్ చేస్తాడు. చివర్లో ఫైట్లూ చేస్తాడు. పైగా కాగడాలతో ఫైట్..! నాకు ఫైట్లూ, కుస్తీలూ..అసలేమీ తెలీవు. ఆ మాటే దర్శకుడు సాంబశివరావు గారితో చెప్పాను. ఆయనేమో 'ఫైట్ అంటే రీళ్ళకి రీళ్ళు కొట్టుకోవడం ఉండదు..జస్ట్ కాస్సేపే.." అన్నారు. స్టంట్ మాస్టర్ రాఘవులు గారు కూడా ధైర్యం చెప్పారు.

జగ్గయ్యగారికీ, నాకూ చెరో కాగడా ఇచ్చారు. కిరసనాయిలు పోసారు. మండించారు. నన్ను పైకెత్తమన్నారు. అలా ఎత్తే సరికి వేడి వేడి కిర్సనాయిలు నా చేతి మీదికి జారగా, చెయ్యికాలి కాగడా కిందపడేసాను.

"అలా మరీ పైకెత్తకండిసార్..స్ట్రైయిట్‌గా..ఇలా పట్టుకోండీ.." అని కొన్ని జాగ్రత్తలు చెప్పి మళ్ళీ మంటబెట్టి నాకందించారు. కెమెరా ఎదురుగా పెట్టి కాగడాని అటూ ఇటూ ఆడిస్తూ ముందుకు రమ్మన్నారు. అలానే చేసాను.

జగ్గయ్యగారికి కూడా అలానే క్లోజప్ తీసారు.

తర్వాత ఇద్దరినీ ఎదురుగా పెట్టి ఫైటింగన్నారు. నాకు భయం! పైగా నిప్పుతో చెలగాటం! పైగా కంచు కంఠేశ్వరుడైన జగ్గయ్య గారితో ఫైటు..!

మంట లేకుండా మామూలుగా రెండు రిహార్సళ్ళు చేయించి 'టేక్' అని, కిరసనాయిలు పోసి మంటపెట్టి కాగడాలు మాకందించారు. షాటులో జగ్గయ్యగారి వైపు దూసుకెళ్ళి సాము కర్ర తిప్పినట్లుగా కాగడా తిప్పాను. కిరసనాయిలు చింది జగ్గయ్య గారి మీద పడింది. "ఏమిటి స్వామీ.. మొహం అంతా కాల్చేసేట్లున్నారు..మీరు ఫైటింగేమిటీ..సాంబశివరావ్.." అని డైరెక్టర్ గారిని కేకేసి "ఈయనేమిటయ్యా..నిజంగా ఫైట్ చేసేలా వున్నారు. ఐనా ఏ రాజనాలో ఐతే ధీటుగా ఉంటుంది కానీ ఈ మాస్టారితో ఇంతసేపు ఫైట్ అక్కర్లేదయ్యా.." అన్నారు నవ్వుతూ.. ఎలాగోలా నాలుగైదు షాట్లలో ఫైటింగ్ ముగించి, నా చేత జగ్గయ్యగారి చేతా కూడా 'అమ్మయ్య' అనిపించారు దర్శకుడు సాంబశివరావు గారు, స్టంట్ మాస్టర్ రాఘవులు గారు.

✡

PUBLISHED IN OCTOBER 2008

# చంద్ర సిద్ధార్థ

గత సంవత్సరం విజయవంతమైన అతి కొద్ది చిత్రాలలో ఒకటైన 'మధుమాసం' దర్శకుడు చంద్ర సిద్ధార్థ అంటే 'ఆ నలుగురు' గుర్తుకు రాకుండా ఉండదు. అన్ని వయసులవారినీ విపరీతంగా ఆకట్టుకున్న ప్రయోజనాత్మక చిత్రం 'ఆ నలుగురు' తో విజయదుందుభిని మోగించిన చంద్ర సిద్ధార్థ మొదటి చిత్రం ..'అప్పుడప్పుడు..' అని చాలామందికి గుర్తు లేకపోవచ్చు. ఇంకా చాలామందికి అస్సలు తెలీని సంగతేమిటంటే 'అప్పుడప్పుడు..' కంటే ముందే చంద్రసిద్ధార్థ గారు 'The inscrutable Americans' అనే ఇంగ్లీషు సినిమాకి దర్శకత్వం వహించి, దానిని ఇండియాలోని అన్ని మెట్రోపాలిటన్ సిటీల్లోనూ విడుదల చేసారు. తన బాల్యం, సినిమా రంగ ప్రవేశం, ఎక్కిన శిఖరాలగురించీ, తొంగిచూసిన లోయల గురించీ చంద్ర సిద్ధార్థ గారు 'కౌముది' పాఠకులతో తన జ్ఞాపకాలనిలా పంచుకుంటున్నారు.

**నేను పుట్టిందీ పెరిగిందీ హైదరాబాదులోనే.** నాన్నగారి ఉద్యోగరీత్యా నేను పుట్టే సరికే హైదరాబాదులో స్థిరనివాస మేర్పరచుకున్నారు. నాకు ఇద్దరు అన్నయ్యలూ, ఒక తమ్ముడు. నాన్నగారి పేరు స్వర్గీయ పూర్ణచంద్రరావు గారు. అమ్మ స్వర్గీయ శకుంతలాదేవి. నాన్నగారు ఐ.ఏ.ఎస్ కేడర్‌లో రిటైరయ్యారు. ఆయన ఉన్నతస్థాయి ఉద్యోగిగా పనిచేసారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రెండు రాష్ట్రాలకీ జనాభా లెక్కల పర్యవేక్షణాధికారిగా ఉండేవారు. అమ్మ కూడా గ్రాడ్యుయేట్.



నా చదువూ, బాల్యం అంతా హైదరాబాదులోనే. కాన్వెంట్ స్కూలూ, హైస్కూలు..అన్ని క్లాసుల్లోనూ ముందే ఉండేవాడిని. కష్టపడి చదవడం తక్కువే కానీ ఒక్కసారి చదివితే గుర్తుండేది. అందుకే శ్రమ పడకుండా మంచి మార్కులు తెచ్చుకుంటుంటే మా క్లాస్ మేట్స్ అందరికీ అనుమానం వస్తుండేది 'వీడికిన్ని మార్కులెలా వస్తున్నాయబ్బా..' అని. చదువుతోబాటు స్పోర్ట్స్, పెయింటింగ్..వగైరా కార్యక్రమాల్లో కూడా చురుగ్గా ఉండేవాడిని.

1985 లో ఇంటర్మీడియట్ కి వచ్చేసరికి ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ జూనియర్ స్కూల్లో జాయిన్ చేసారు. నన్ను బాగా చదివించి ఐ.ఏ.ఎస్ ని చెయ్యాలని నాన్నగారికి చిన్నప్పటినుంచీ కోరికగా ఉండేది. అంతగా కష్టపడకుండా మంచి మార్కులు తెచ్చుకోవడమనే టెక్నిక్ ఇంటర్మీడియట్‌లో పనిచేయదని మొదటి సంవత్సరంలోనే తెలిసిపోయింది. 'లిటిల్ ఫ్లవర్' అంటే అందరికీ తెలిసే ఉంటుంది..అక్కడ చేరిన వాళ్ళంతా ఇంజినీర్లో, డాక్టర్లో ఐ తీరాల్సిందే ఎటుచూసినా పోటీ చదువులూ, ఉరుకులూ పరుగులూ.. నేను కాస్త సందిగ్దంలో పడ్డాను.. ఎవరో రాసిన పుస్తకాలు నేను చదవాలి..ఇంకెవరో ఇచ్చే ప్రశ్నాపత్రంకి సమాధానాలు వ్రాస్తే, ఇంకెవరో దిద్ది నాకు మార్కులు వెయ్యడం..ఈ ప్రహసనాలన్నీ దాటుకు వెళితే నేనూ ఒక ఇంజినీర్నో,

డాక్టర్నో ఔతాను.. ఐతే ఏమిటి..మందిలో ఒకడిగా మిగిలిపోతాను.. సాధించేదేముంటుందీ.. ఇలా సాగిన ఆలోచనలు 'నాకంటూ గుర్తింపు వచ్చే దిశగా ప్రయాణించాలి' అని నిర్ధారణకి వచ్చేలా చేసాయి. అప్పటికే పెయింటింగ్, కాస్తో కూస్తో వ్రాయడం.. అలవాటున్న నాకు సినిమా రంగం నా ఆలోచనలకి సరిపడే గమ్యం అనిపించింది.

ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలోకి అడుగు పెట్టే రోజుల్లోనే నిశ్చయించుకున్నాను..'ఎలానో డిగ్రీ అయిందనిపించి , సినిమా రంగప్రవేశం చేసి నాకంటూ మంచిపేరు తెచ్చుకోవాలి..' అని. ఐతే నాన్నగారికి మాత్రం నా ఆలోచనలేవీ చెప్పలేదు. ఎలానో ఇంటర్మీడియట్ పూర్తయింది. ప్రయత్నిస్తే ఎక్కడో చోట ఇంజినీరింగ్ సీటు దొరికేదే. నాన్నగారి ఆశయం నేను ఐ.ఎ.ఎస్ చదవాలని కదా. 'నాన్నా..నేను చదవాల్సింది ఐ.ఎ.ఎస్ కదా..డిగ్రీ చేసాక ఐ.ఎ.ఎస్. కి ప్రిపేరౌతాను. ఇంజినీరింగ్‌లో చేరి నాలుగు సంవత్సరాలు ఆగడం ఎందుకు..?' అని ఆయన్ని ఒప్పించగలిగాను. నిజానికి ఒక్క సంవత్సరమైనా ముందుగా సినిమాల్లోకి వెళ్ళొచ్చనేది మనసులో ఆలోచన.

నిజామ్ కాలేజీలో డిగ్రీ చదువు మొదలైంది. బి.ఎస్సీ, బి.కామ్ లతో ప్రయోగాలు చేసి చివరికి బి.ఎలో సెటిల్ అయ్యాను. నేను చేరిన సంవత్సరమే కాలేజీకి శతవార్షికోత్సవాలు జరుగుతున్నాయి. వాటిల్లో చురుకైన పాత్ర పోషించాను. చాలా కార్యక్రమాలకి కో-ఆర్డినేటర్ గా ఉండడమేకాక ఆ ఉత్సవాలకి లోగో కూడా నేనే రూపొందించాను. నేను వేసిన పెయింటింగ్స్ ప్రదర్శన కూడా జరిగింది ఆ సందర్భంలోనే. ఆ ఉత్సవాలు అయ్యేసరికి కాలేజీలో నాకంటూ ఒక గుర్తింపు వచ్చింది. ..

1986లో నేను డిగ్రీలో చేరిన కొత్తలోనే మా అమ్మగారు కాలధర్మం చేసారు. అప్పటివరకూ సజావుగా సాగిపోతున్న జీవితంలో అదొక పెద్ద దెబ్బ నాకు. రోజూ ఇంటికి రాగానే నేను కాలేజీలో ఏం చదివానో, ఎలా మార్కులు వస్తున్నాయో శ్రద్ధగా కనుక్కునే అమ్మ లేకపోయే సరికి బ్రతుకులో వెలితి తెలిసింది...కాలేజీలో ఎన్ని బహుమతులు తీసుకున్నా స్నేహితులు కొట్టిన చప్పట్లకంటే, ఇంటికొచ్చి బహుమతిని అమ్మచేతిలో పెట్టినప్పటి ఆనందం ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండేది. తను కూడా గ్రాడ్యుయేట్ అవడం వల్ల అమ్మ నాకు ఎంతో మార్గదర్శిగా ఉండేది. అమ్మ ఎడబాటుకి తోడుగా డిగ్రీ మొదటి రెండు సంవత్సరాల్లోనే చాలా సన్నిహితులైన ఒకరిద్దరు స్నేహితుల మరణం కూడా నా ఆలోచనా దృక్పథంలో కొంతమార్పు తెచ్చింది. 'విధి' అనేది ఉంది, అంతా మనచేతుల్లోనే ఉందనుకోవడం భ్రమ.. అనే భావన మొదలైంది.

అమ్మలేని జీవితాన్ని సాగిస్తూనే డిగ్రీ పూర్తి చేసాను. డిగ్రీ పూర్తికావడమే తరువాయి ఇంక సినిమాల్లో చేరడానికి ప్రయత్నాలు ప్రారంభించాను. అప్పటికే మా పెద్దన్నయ్య కృష్ణమోహన్ సినిమాల్లో వేషాలకోసం ప్రయత్నిస్తున్నాడు. నాకైతే దర్శకత్వ శాఖలోనే చేరాలని ఉండేది. ఆ రోజుల్లో (1990) రామ్ గోపాల్ వర్మ గారు సంచలన దర్శకుడిగా ఒక ప్రభంజనం సృష్టించారు. దర్శకత్వశాఖ అంటే ఆయన వద్దనే చేరాలి అని ఒక భావం ఉండేది. ఒక శుభముహూర్తాన బ్యాగ్‌లో సర్టిఫికెట్లన్నీ (డిగ్రీ, నాకు ఇతరత్రా వచ్చిన బహుమతులూ, నా పెయింటింగ్స్ వగైరా అన్నీ) పెట్టుకుని గవర్నమెంట్ ఉద్యోగానికి వెళ్ళినంత ప్రిపరేషన్ తో మద్రాసు వెళ్ళాను. ఐతే నేను వెళ్ళే సరికి వర్మగారు హైదరాబాదు వెళ్ళారని తెల్సింది. మళ్ళీ నేనూ హైదరాబాదు వెళ్ళిపోదామనుకునేంతలో మా అన్నయ్య కృష్ణమోహన్‌కి బాగా స్నేహితుడైన ఉప్పలపాటి నారాయణ రావు 'జైత్రయాత్ర' అనే సినిమాకి మొదటి సారి దర్శకత్వం వహిస్తున్నారని తెల్సింది. అన్నయ్య రికమండేషన్ తో ఆయన వద్ద అసిస్టెంట్ గా చేరాను.



ఆ విధంగా నాగార్జున గారి జైత్రయాత్ర తో నా సినీ యాత్ర మొదలైంది. నారాయణరావుగారి వద్ద చిట్టచివరి అసిస్టెంట్‌ని నేను. మరో నెలరోజుల్లోనే ఆ సినిమా యూనిట్ కూడా హైదరాబాదుకే మకాం మార్చడంతో నేనూ వాళ్ళతో బాటే సొంత వూరైన హైదరాబాదు వచ్చేసాను. నేను హైదరాబాదులోనే పుట్టిపెరగడం, అక్కడున్న పరిచయాలు..వీటి వల్ల 'జైత్రయాత్ర' యూనిట్లో నేను చాలా ప్రధానపాత్ర పోషించాను. లొకేషన్స్ నిర్ణయించడం, పర్మిషన్స్ అవీ తీసుకోవడం..ఇలా అన్నింటికీ నా సహాయం ఎక్కువగా అవసరమయ్యేది. దర్శకత్వం కంటే ప్రొడక్షన్ కార్యక్రమాలే ఎక్కువగా చూస్తుండేవాడిని.. ఆ రోజుల్లో సొంతకారులో షూటింగ్‌కి వెళ్ళే అసిస్టెంట్ డైరెక్టర్‌ని నేనే..! అదొక స్పెషల్‌గా కూడా ఉండేది. ఆ సినిమా విజయవంతమయ్యాక నారాయణ రావు గారి దర్శకత్వంలోనే మొదలైన 'రక్షణ' సినిమాకు కూడా అసిస్టెంట్ గా చేరాను. ఐతే ఈ యూనిట్లో ఎక్కువకాలం ఉండలేదు. ఏవో కారణాంతరాల వల్ల మధ్యలోనే మానేసాను.

అప్పుడే, మనమే సొంతంగా సినిమా తీస్తే ఎలా ఉంటుంది అనే ఆలోచన వచ్చింది.. అప్పటికే మా రెండో అన్నయ్య రాజేంద్రప్రసాద్ పూనా ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ లో శిక్షణపొంది ఉన్నాడు. ఆయన కెమేరా, దర్శకత్వంలో 'నిఘా' అనే సినిమా నిర్మాణం మొదలు పెట్టాం. నాన్న గారు చెబుతుండే వారు ' అరేయ్..నీకు సినిమా వాతావరణం సరిపోదు. అసలే సున్నితమైన మనస్తత్వం.. శుభ్రంగా ఐ.ఎ.ఎస్. కి ప్రిపేరవ్వు' అని. ఐతే ఆయన భావన సరికాదనీ, నేను సినిమాల్లో పైకి రాగలననీ నిరూపించాలని నా తాపత్రయం.

శ్రీకాంత్, ఆలీ, బ్రహ్మాజీ, జె.డి, రంభ వగైరా భారీ తారాగణంతో 1994 ప్రాంతాల్లో 'నిఘా' మొదలుపెట్టాం. ఆ సినిమా ముహూర్తమే ఇండస్ట్రీలో పెద్ద సంచలనంగా మారింది. షూటింగ్ ఒక వారం సాగింది. పాటలు రికార్డింగ్ కూడా పూర్తయింది. ..కథ మామూలే..మధ్యలో ఆగిపోయింది.. ఫలితం..!? రాజ్‌భవన్ రోడ్ లో ఉన్న మా సొంత ఇల్లుకూడా అమ్మేయ్యాల్సి వచ్చింది అప్పులు తీర్చడానికి. అదీ సినిమా నిర్మాతగా నాకెదురైన మొదటి ఘాటైన చేదు అనుభవం.. ఆ ప్రయోగంలో ఒక సంవత్సరం కాలం వృధా అయింది.

ఆ తరువాత కూడా నిర్మాతగానే తెలంగాణ సాయుధపోరాటం నేపథ్యంలో 'నిరంతరం' అనే షార్ట్ ఫిల్మ్ నిర్మించాను. పూనా ఫిలిమ్ ఇన్స్టిట్యూట్ సహకారం అందించింది. అందులో అందరూ జాతీయస్థాయి నటీ నటులే. మొత్తం 16-17 లక్షల్లో పూర్తయిన ఆ సినిమాకి మంచి పేరు వచ్చింది కానీ పెట్టిన పెట్టుబడి మాత్రం తిరిగి రాలేదు. ఇది 1995 లో అనుభవం.

మళ్ళీ ప్రయోగాలు మొదలయ్యాయి. ప్రయత్నాలని టి.వి. రంగానికి మళ్ళించి బినాకా వాళ్ళకి ఒక 'ఫిఫ్టీ-ఫిఫ్టీ' గేమ్ షోని కొత్తరకంగా రూపొందించి మంచి పేరు తెచ్చుకున్నాను. సీనియర్ నటుడు నరేష్ దీనిలో ప్రధాన పాత్రధారి.

1996-97ల్లో తెలుగు సినిమాల్లోకి చేరాలని వచ్చే వాళ్ళందరూ తరచూ పంజాగుట్టలోని 'ట్రై లక్' కేఫ్‌లో కలుస్తూ ఉండేవాళ్ళు. సునీల్, విజయభాస్కర్, త్రివిక్రమ్ వగైరా..అందరూ అక్కడే నాకు పరిచయం. ఆ పరిచయంతోనే త్రివిక్రమ్ రాసిన కొన్ని

స్కిట్స్ ని సునీల్ తో రూ పొందించి జెమిని టి.వి. కి ఇస్తుండేవాడిని. చిన్నపిల్లల ఫాంటసీ సీరియల్ కూడ ఒకటి తీసాను.

అప్పుడే నా చిరకాల మిత్రుడు వేణు (‘స్వయంవరం‘,‘చిరునవ్వుతో..‘, ‘హనుమాన్ జంక్షన్‘, ‘ అల్లరే..అల్లరి..‘ వగైరా చిత్రాల ఫేమ్) సినిమాల్లో వేషాలకోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పాడు. ”వేణూ.. ఇలా నువ్వు ఫోటో ఆల్బమ్‌లు పట్టుకుని నిర్మాతల చుట్టూ తిరిగితే ఎప్పటికో గానీ నీకు బ్రేక్ రాదు. అంతవరకూ చిన్నవేషాలతో సరిపెట్టుకుంటేనేమో..హీరో వేషాలకి ఎదగడానికి చాలా సంవత్సరాలు పడుతుంది. నీకు ఆర్థిక సహాయం చెయ్యగల బంధువులు బాగానే ఉన్నారు కాబట్టి నువ్వే హీరోగా సొంతంగా ఒక సినిమా ప్లాన్ చేసుకోరాదూ..” అని నేనే సలహా ఇచ్చాను. నాకు హైస్కూలు రోజుల్నుంచీ మిత్రుడూ, వేణుకి కూడా డిగ్రీలో లో క్లాస్ మేట్ ఐన శ్యామ్ ప్రసాద్ ఈ ప్రోజెక్టుని చెయ్యడానికి ముందుకి వచ్చాడు. దర్శకుడిగా నన్నే ఉండమని అడిగారు. ‘మనం స్నేహితులుగా నే ఉందాం. ఇలా ప్రొఫెషనల్ సంబంధాలు పెట్టుకుంటే అనుకోని అపార్థాలు వస్తాయి..‘ అని నచ్చజెప్పాను. ఐనా నన్నే డైరెక్ట్ చెయ్యమని బలవంతం చెయ్యడంతో ఆ ప్రోజెక్టులోకి దర్శకుడిగా ప్రవేశించాను...అప్పటికే మంచిస్నేహితుడూ, సినిమా ఛాన్సులకోసం ప్రయత్నిస్తున్న - ఆర్.పి.పట్నాయక్‌ని సంగీత దర్శకుడిగా తీసుకున్నాను. సినిమా పేరు ‘అవునంటే..కాదంటూ..‘. ప్రొడక్షన్ మొదలై కొన్ని రోజులు కాగానే అనుకున్నట్లే అక్కడక్కడ బేధాభిప్రాయాలు మొదలయ్యాయి. నేనే అందులోనుంచీ తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను. నేను లేకపోతే తనూ ఉండనని ఆర్.పి. కూడ బయటికివచ్చేసాడు. అలా వద్దనీ. తనని కొనసాగించమనీ చెప్పినా తను వినలేదు. ఆ సినిమాకి చేసిన కొన్ని ట్యూన్స్ ని తరువాత ‘నీకోసం‘, ‘నీస్నేహం‘ ‘మనసంతా నువ్వే‘ సినిమాల్లో ఆర్.పి. వాడడం జరిగింది.
(తరువాత విజయభాస్కర్ దర్శకత్వంలో కొనసాగిన ఆ చిత్రమే ‘స్వయంవరం‘)

మళ్ళా నా సొంత ప్రోజెక్టు కోసం , నన్ను నేను నిరూపించుకునే ప్రయత్నాల్లో పడిపోయాను.

ఆ రోజుల్లో చాలామంది అప్పుడే అమెరికా వెళ్ళడం, సాఫ్ట్‌వేర్ బూమ్ మొదలైంది. ఆ నేపథ్యంలో ఏదైనా సినిమా తీస్తే బావుంటుందనిపించింది. ఐతే అమెరికాలో తియ్యాలి కాబట్టి ఇంగ్లీషులో ఐతే బావుంటుందనిపించింది. అప్పటికే మార్కెట్లో మంచి పేరుతెచ్చుకున్న అనురాగ్ మాథుర్ నవల ‘ The inscrutable Americans‘ ఐతే సరిగ్గా సరిపోతుందనే నిర్ణయానికి వచ్చాము. కెంటుకీ లోని డాక్టర్ మాలెంపాటి శ్రీహరి, డాక్టర్ శ్రీమతి ఇందిర గార్లు ఈ సినిమా నిర్మించడానికి ముందుకి వచ్చారు. మొత్తం సినిమా అంతా అమెరికాలోనే షూట్ చెయ్యడం జరిగింది. అప్పటికే ఒక హిందీ సినిమాతో మంచి పేరుతెచ్చుకున్న ఒక తెలుగు హీరోని ప్రధానపాత్రకి ఎంపిక చేసాం. కానీ మధ్యలో ఆ పాత్రని మార్చాల్సి వచ్చింది. కాలిఫోర్నియాలో పుట్టి పెరిగిన రాజీవ్ పంజా, న్యూయార్క్ ఫిల్మ్ స్కూలు నుంచీ వచ్చిన Eron Otcasek లు ప్రధాన పాత్రలు పోషించారు. ఆ సినిమా మనదేశంలోని అన్ని మెట్రోపాలిటన్ సిటీల్లోనూ విడుదలైంది. దర్శకుడిగా నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది (2001 మార్చిలో ఈ సినిమా విడుదలైనప్పుడు హిందూ పత్రిక రాసిన రివ్యూకోసం ఇక్కడ క్లిక్ చేయండి) ప్రధాన కేంద్రాల్లో 7-8 వారాలు ఆ-డింది. అదే వరుసలో నేను బొంబాయిలో కొనసాగితే ఎలా ఉండేదో కానీ హైదరాబాదు తిరిగి రావడం.. మళ్ళీ తెలుగు సినిమా రంగం వైపు దృష్టి సారించాను.




ఆ రోజుల్లోనే సమకాలీన సమస్యతో ‘అప్పుడప్పుడూ..‘ సినిమా (రాజా హీరోగా మొదటి సినిమా) తీసాను. శ్రియా రెడ్డి హీరోయిన్. సినిమా

అనుకున్నట్లు విజయవంతం కాలేదు హీరో రాజాకి మాత్రం మంచిపేరు వచ్చి తదుపరి సినిమాల్లో నిలదొక్కుకోడానికి సహాయపడింది.

ఈ విధంగా చెప్పాలంటే నిర్మాతగా నా మొదటి సినిమా 'నిరంతరం'. దర్శకుడిగా నా మొదటి సినిమా ఇంగ్లీషులో 'The inscrutable Americans' తెలుగులో 'అప్పుడప్పుడూ..'

ఇంకొంచెం ముందుకి వెళితే నన్ను మీ అందరికీ దగ్గర చేసిన మొదటి సినిమా ' ఆ నలుగురు'. ఇదెలా జరిగిందంటే..

ఒకనాటి ప్రముఖ నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావు గారు చాలా సంవత్సరాల తరువాత సినిమా తీసేందుకు హైదరాబాదు వచ్చినప్పుడు నన్ను కలుసుకున్నారు. ఒక తమిళ సినిమాని తెలుగులో తీయమని అడిగారు. అనువాద చిత్రం అనే సరికి నాకు అంత ఆసక్తి అనిపించలేదు. (తర్వాత అదే 'శీను వాసంత లక్ష్మి 'గా వచ్చింది). పూర్ణచంద్రరావు గారితో పనిచేస్తున్నప్పుడే రచయిత 'మదన్' పరిచయమయ్యారు. నా మొదటి సినిమా 'అప్పుడప్పుడు..' లో తనకి కనిపించిన కొన్ని లోపాల గురించీ, ఇంకా బెటర్ గా ఎలా తీస్తే బావుండేదీ అన్న విషయాలు నాతో చర్చిస్తుండేవాడు. తన వద్ద ఒక మంచి సినిమా కథ ఉందని 'ఆ నలుగురు' కథ నాతో చెప్పాడు. నాకది బాగా నచ్చింది. మనమే చేస్తే బావుంటుందని ప్రపోజల్ తెచ్చాడు తనే. ఇద్దరం కలిసి రాజేంద్ర ప్రసాద్ గారిని కలిస్తే ఆయన ఒప్పుకున్నారు. అదే సమయంలో 'ప్రేమ్ కుమార్' గారు కూడా పరిచయమై తాను నిర్మాతగా వుంటానని అన్నారు. ఇంకా మాకు అట్లూరి పూర్ణచంద్రరావు గారితో కమిట్ మెంట్ ఉంది కాబట్టి ఆయన వద్దకెళ్ళి విషయం చెప్పాము. 'మంచిదే.నేను ఎలానూ ఇప్పుడు ప్రోజెక్టు చెయ్యడం లేదు కాబట్టి మీరు చేసుకోండి..' అని పెద్దమనసుతో ఒప్పుకున్నారు.

అలా మొదలైంది 'ఆ నలుగురు'.. ప్రోజెక్టు ఫైనల్ అనుకున్న వారం రోజులకే అన్నీ సిద్ధమైపోయాయి. లో-బడ్జెట్ లో సుమారు 35 రోజుల్లో షూటింగ్ పూర్తిచేసాం. ఫిలిమ్ ఎక్స్‌పోజర్ కూడా చాలా తక్కువ చేసాం.

ఈ సినిమాలోప్రధాన కథ అంతా ఫాదర్ సెంటిమెంట్ చుట్టూ అల్లుకున్నట్లే, ఈ సినిమా నిర్మాణం కూడా మా నాన్న గారి జ్ఞాపకాలతో అల్లుకుని ఉంది నాకు. అంతకు ముందు విడుదలైన రెండు సినిమాలూ నాన్నగారు చూడలేదు. ఈ సినిమా గురించిన టైటిల్, కథ చెప్పినప్పుడు..'ఈ సినిమా నీకు ఖచ్చితంగా మంచిపేరు తెచ్చిపెడుతుంది. ఎందుకో చాలా పాజిటివ్ సక్సెస్ కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టులో' అన్నారు నాన్నగారు. అప్పుడాయన చెన్నైలో ఉన్నారు. సినిమా నిర్మాణం పూర్తయింది. పోస్ట్‌ప్రొడక్షన్‌లో ఉన్నాం. సినిమా విడుదలైన రోజు ఉదయం ఆట నాతో కలిసి చూడాలని అన్నారాయన. అందుకాయన ఎదురు చూస్తూ తరచూ చిత్రం ప్రోగ్రెస్ కనుక్కుంటూ ఉండేవారు...




'ఆ నలుగురు' సినిమా నిర్మాణం చాలా సెంటిమెంటల్‌గా సాగింది. ఎందుకంటే చాలా రోజులు శవయాత్రే షూటింగ్‌గా ఉండేది. ప్రతిరోజూ రాజేంద్రప్రసాద్ గారికి దిష్టి తీస్తూ ఉండేవాళ్ళం. ప్రతిరోజూ శవయాత్రలో పాల్గొనే వాళ్ళంతా కూడా ..'ఏమిటో సార్.. రోజూ ఇదే సీను చేస్తున్నాం..ఎవరి కేమౌతుందో..' అనే వాళ్ళు. నేను పెద్దగా పట్టించుకునే వాడ్ని కాదు.

ఇంకా వారం పదిరోజుల్లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఐపోయే సమయం. నేనూ, మదన్ ఒక రోజు డిన్నర్ చేస్తున్నాం. మద్రాసునుంచీ ఫోన్ వచ్చింది. నాన్నగారి హఠాత్తుగా స్ట్రోక్ వచ్చి చనిపోయారనీ, శవాన్ని హైదరాబాదు తీసుకొస్తున్నారనీ.. నమ్మలేక

పోయాను. రోజా చిత్ర ప్రోగ్రెస్ కనుక్కుని ఎప్పుడెప్పుడు నా నుంచీ ఒక విజయవంతమైన చిత్రాన్ని చూద్దామా అని ఆతృతగా ఎదురు చూసే నాన్నగారు ఇంక లేరన్న విషయాన్ని వెంటనే జీర్ణించుకోలేకపోయాను. యూనిట్ వాళ్ళు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు వాయిదా వేద్దామన్నారు. నేనే వద్దన్నాను. నాన్నగారి ఆత్మ శాంతికోసం..ఈ సినిమాని అనుకున్న సమయానికి పూర్తిచెయ్యాలని పట్టుదలతో ఎడిటింగ్ రూమ్‌కి వెళ్ళిపోయాను. మరునాడు జరుగిన నాన్నగారి అంతిమయాత్రలో పాల్గొన్న వాళ్ళలో చాలామంది రెగ్యులర్‌గా 'ఆ నలుగురు' షూటింగ్ లో శవయాత్ర దృశ్యాల్లో పాల్గొన్న వాళ్ళే. ఇదో యాదృచ్ఛికమైన సంఘటన... వాళ్ళే నటులూ, వాళ్ళే మిత్రులూ కూడా..

కోలుకోలేని గాయాన్ని అలానే భరిస్తూ సినిమా పూర్తిచేసి అనుకున్న సమయానికి రిలీజ్ చేసాం. మొదటి రోజు 30 శాతం మంది కూడా లేరు థియేటర్స్‌లో. 27 ప్రింట్లు రిలీజ్ చేస్తే మొదటి వారం అయ్యే సరికి 16 ప్రింట్లు వెనక్కి వచ్చేసాయి. కొంతమంది జోక్స్ కూడా వెయ్యడం మొదలెట్టారు 'ఆ నలుగురు' సినిమా ఎలా ఉందంటే 'హాల్లో నలుగు ఉన్నార్లే..' అని. విచిత్రమేమంటే చూసిన వాళ్ళంతా ఫోన్‌లు చేసి సిన్సియర్ అభినందనలు చెబుతున్నారు. నిజంగా చెప్పాలంటే నాకెందుకో ఆ సినిమా విజయం గురించి గట్టినమ్మకం ఉంది. ఎలాగైనా సరే విజయవంతమౌతుందని ఇంకా నమ్మకమే.

నాకు అంతగా నమ్మకంలేని ఒక సంఘటనని..ఎవరో గుర్తు చేసారు..'నాన్న గారి అస్తికలు ఇంకా కృష్ణానదిలో నిమజ్జనం చెయ్యలేదు' అని. నేను విజయవాడ వెళ్ళి ఆ కార్యక్రమం పూర్తిచేసుకుని వెనక్కి వచ్చాను. మొదటి సారిగా విజయవాడలో థియేటర్ నుంచీ ఫోన్ 'సినిమా హౌస్ ఫుల్' అని.! మరి ఇది ప్యూర్ కో-ఇన్సిడెన్స్ కావొచ్చు కానీ జరిగిందదీ. గుంటూరు నుంచీ మరో మిత్రుడు ఫోన్ చేసి అక్కడ కూడా హౌస్ ఫుల్ అని చెప్పాడు. నేను హైదరాబాదు వచ్చేసరికి సినిమా ఆడుతున్న థియేటర్స్ అన్నీ హౌస్ ఫుల్ అన్న వార్త వచ్చింది. ఎవరైతే మొదటి వారం అవగానే ప్రింట్స్ వెనక్కి పంపించారో మళ్ళీ వాళ్ళే ప్రింట్స్ కావాలని వచ్చి తీసుకెళుతున్నారు... (చాలా సంవత్సరాల క్రిందట 'శంకరాభరణం' విషయంలో ఇలా జరిగిందట!)



మొదటి నుంచీ డివైడెడ్ టాక్ ఉండడమూ, రివ్యూలు కూడా సరిగా లేకపోవడంతో మౌత్ పబ్లిసిటీ అందుకోడానికి వారం పట్టింది. ఇంక తరువాత విషయం మీకు తెలిసిందే. అదొక చరిత్ర.. ఎన్నో అనుభవాలు !!..మేము కొన్ని చోట్ల షూటింగ్ చేసిన ఇళ్ళ యజమానులు షూటింగ్ కోసం తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేసారు. చాలా రోజులుగా సినిమాలు చూడని వాళ్ళు కూడా ఈ సినిమా చూసి ఫోన్లు చేసారు. చాలా మంది ఈ సినిమా చూడగానే తమ నాన్న గారి వద్దకి వెళ్ళామని చెప్పారు. సినిమా పరిశ్రమలో చాలా పేరున్న ఒకాయన నాకు పదే పదే ఫోన్ చేసేవారు. ప్రతి సారీ నేను మిస్ ఔతుండే వాడిని. చిత్రం విజయవంతం ఐంది కదా నాతో మరో సినిమా తీయడానికి అడిగేందుకు ఫోన్ చేస్తున్నారేమో అనుకున్నాను. చివరికి ఒక రోజు ఫోన్‌లో ఇద్దరం కలవడం జరిగింది. విషయమేమిటంటే ఈయన ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సొంత కొడుకులు, కూతుళ్ళూ కూడ సహాయం చెయ్యని వాళ్ళు, ఈ సినిమా చూసాక అమెరికా నుంచీ వచ్చి ఈయన అప్పులన్నింటినీ తీర్చేసి వెళ్ళారట. ఆ విషయం చెప్పడానికి ఫోన్ చేసానన్నారాయన..

ముంచెత్తే అభినందనల వెల్లువలో ఎప్పుడూ కనిపించింది నాన్నగారి జ్ఞాపకాలే. నా విజయాన్ని కళ్ళారా చూడాలని ఎంతగానో ఎదురు చూసిన నాన్నగారు, ఆ క్షణాలు దగ్గరౌతున్న తరుణంలో తరలి రాని లోకాలకి వెళ్ళిపోవడం..నన్నెపుడూ వెంటాడే విషాదం..

# భువనచంద్ర

దాదాపు 20 సంవత్సరాల క్రిందట వొచ్చిన చిరంజీవి సూపర్ హిట్ సినిమా ‘ఖైదీ 786‘ గుర్తుందా? అందులో
‘గువ్వా..గోరింకతో..‘ అన్నపాట మరచిపోవడం అసాధ్యం. అలానే
‘బంగారు కోడి పెట్ట..వచ్చెనండీ..‘(ఘరానా మొగుడు) ,
‘వానా..వానా..వెల్లువాయె‘ (గ్యాంగ్ లీడర్) ఇవన్నీ మాస్ పాటలైతే
‘స్నేహానికన్న మిన్న / లోకాన లేదురా / (ప్రాణ స్నేహితులు)
‘ప్రియరాగాలే..గుండెలోన పొంగుతున్న శుభవేళ..‘ ( హలో బ్రదర్)
‘సూర్య కిరీటమే..నీవా..‘ (ప్రేమంటే ఇదేరా)
‘కీరవాణి రాగంలో..పిలిచిందొక హృదయం..‘ (‘స్వయంవరం‘) ఇలాంటివన్నీ క్లాసు పాటలు
’పచ్చని చిలకలు రెండుంటే..‘(‘భారతీయుడు‘)
‘రా..రా..‘(‘చంద్రముఖి‘)
ఇంకా ఈ మధ్యనే వొచ్చిన శివాజీ లోని పాటలన్నీ..ఇవన్నీ అనువాద చిత్రగీతాలు. వీటి గీతకర్త ‘భువనచంద్ర‘. గత 22 సంవత్సరాలుగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న గీతరచయితగా తెలుగు చలన చిత్రసీమలో కొనసాగుతూ వేలాది పాటలు రచించిన భువనచంద్ర గారి సినీ జీవన ప్రస్థానం..ఈనెల మీకోసం ప్రత్యేకం.



**మన రాష్ట్ర అవతరణ దినోత్సవం** సందర్భంగా తెలుగు భాషకి ప్రాచీన ప్రతిపత్తి లభించిన శుభ సందర్భంలో , ప్రపంచవ్యాప్తంగా భారతీయ సాంస్కృతిక రాయబారులుగా వున్న తెలుగు సోదరసోదరీమణులందరికీ నా హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తున్నాను. నా జీవితాన్ని గురించిన నాలుగు మాటలు మీతో పంచుకోబోయే ముందు నేను నమ్మే నాలుగు మాటలు..

ఒక మాట ఉంది ‘నువ్వు మోసుకెళ్ళలేని దానిని నువ్వు పోగుచేసుకోవద్దు‘ అని. మనిషి జీవితకాలంలో ఎంత సంపాదించినా, ఎన్ని కోటలు కట్టినా పడుకునేది ఒక మంచం మీదే, ఒక గదిలోనే, వేసుకునేది ఒక చొక్కానే (రెండు చొక్కాలు వేసుకుంటే నవ్వుతారు).. ఐతే కొన్ని తరాలకు సరిపడా ఆస్తిని సంపాదించుకోవాలనే తపనలో మానవత్వాన్నీ, దైవం మనకిచ్చిన ఈ జీవిత లక్ష్యాన్ని మరిచిపోతున్నాం. డబ్బు..సంపాదన..నేనూ..నావాళ్ళు..ఈ చట్రంలో సాటి మనిషి గురించి ఆలోచించడం, కమ్మని ప్రకృతిని ఆస్వాదించడం మరిచిపోతున్నాం.

జీవితంలో సంపాదన, ఆత్మీయతలు ముఖ్యమే కానీ ఏదీ అతిగా ఉండకూడదు. నేను కూడా ఒకప్పుడు ఇలాంటి వృత్తంలోనే ఉన్నానేమో..1971లో నా సహచరులు అనేకమంది నా కళ్ళముందే పాకిస్తాన్ యుద్ధంలో మరణించడం నా మనసుని కదిలించి ఉండకపోతే నేనూ అలానే బతికేవాడినేమో. ఆ యుద్ధభూమి పోరాటంలో నేను చూసిన దృశ్యాలు, జీవితం పట్ల నా దృక్పథాన్ని మార్చివేసాయి. జీవితంలో మరణాన్ని మించిన విషాదం లేదు. ఆ మరణం వచ్చిన రోజు నువ్వుండవు.. మరి చిన్న చిన్న విషయాలకెందుకు విచారం.!? మీరు బాధలు అనుకునేవి నిజమైన బాధలు కావు. అవన్నీ అందరికీ అతి సహజమైన సంఘటనలే. అన్నింటికీ ఏదో సమయంలో విముక్తి ఉంటుంది. ఎప్పటికప్పుడు ఇదే అంతం అనుకుని క్షణ క్షణం దుఃఖాన్ని పోగుచేసుకోకండి. సంతోషంగా ఉండండి..ఆనందంగా మానసిక ఐశ్వర్యంతో బతకండి. పదిమందికీ సంతోషాన్ని పంచండి.

- ఈ మాటలతో నా జీవన ప్రస్థానాన్ని సమీక్షించుకునే క్రమంలోకి వస్తాను.

నేను పుట్టింది కృష్ణాజిల్లా నూజివీడు దగ్గరలోని గుల్లపూడి అనే పల్లెటూరు. రెండు మూడేళ్ళ వయసులో ఏదో సీమచింతకాయ చెట్టుకింద పిల్లలతో ఆడుకునే ఒక జ్ఞాపకం తప్ప గుల్లపూడి గురించి పెద్ద జ్ఞాపకాలేమీ లేవు.

మానాన్న గారు సుబ్రహ్మణ్యశర్మ గారు, అమ్మగారు చంద్రావతి. ఎనిమిది మంది సంతానంలో నేను ఆఖరివాడిని. నాకు ముగ్గురు అన్నయ్యలు, నలుగురు అక్కయ్యలు. నాన్నగారు మా వూరికి ప్రెసిడెంట్‌గా చాలా సంవత్సరాలు పనిచేసారు. మా అమ్మగారు కూడా ఆ వూరి ప్రెసిడెంట్‌గా కొంతకాలం పనిచేసారు. ఒకప్పుడు బాగా కలిగిన కుటుంబమేనట మాది. గాంధీ గారు స్వాతంత్ర్యోద్యమ సమయంలో మా వూరికి వచ్చినప్పుడు మా అమ్మ ఇంట్లో వున్న నగలన్నీ వుద్యమానికి ఇచ్చేసిందట. నేను పుట్టే సమయానికే నాన్నగారి ఆర్థిక పరిస్థితి బావోలేదు. అందుకే ఏలూరుకి 35 కిలోమీటర్లదూరంలో ఉన్న చింతలపూడికి కాపురం మార్చేసారు.

ఆంధ్రప్రదేశ్ లో చింతలపూడి పేరుతో చాలా వూళ్ళున్నాయి. దీన్ని 'తాలూకా చింతలపూడి' అంటారు. అక్కడే నా ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్య కొనసాగింది. ఈ చింతలపూడిని 'వింతలపూడి' అని కూడా సరదాగా అనేవారు. ఎందుకంటే ఆ వూళ్ళో ఉన్నవాళ్ళంతా అల్పసంతోషులూ, ఉన్నంతలో చాలు అనుకునే వాళ్ళు. ఎవరూ కూడా ఏదో సంపాదించెయ్యాలి, కోటలు కట్టెయ్యాలి అనుకునే రకం కాదు. ఎవరి వద్దనైనా 10 రూపాయలుంటే ఆ రోజుకి అతనే మహరాజు. అలాంటి ఊళ్ళో పెరగడం, ప్రకృతి ఒడిలో కల్లాకపటం ఎరుగని మనుషుల మధ్య మసలడం నా అదృష్టంగా భావిస్తాను.

నా ఎలిమెంటరీ చదువంతా ఒక గొడ్లపాకలో సాగింది. ఎలియా అనే మాస్టారు మావూరికి వచ్చి పిల్లలందరినీ ఒక గొడ్లపాకలో చేరదీసి చదువుచెప్పేవాళ్ళు. ఒక వైపు మేము అ, ఆ లు నేర్చుకుంటుంటే, రెండో వైపు గేదెలు 'అంబా..'అంటుండేవి. ఎలియా మాస్టారు ప్రభుత్వంతో మంతనాలు జరిపి గ్రాంటులు సంపాదించి స్కూలుని మంచి భవనంలోకి మార్చే సమయానికి నేను హైస్కూలుకి వెళ్ళిపోయాను.

హైస్కూలు అనుకోగానే పక్కనే ఉన్న బూరుగుచెట్టు గుర్తొస్తుంది. ఒక్కసారి వెళ్ళి ఆ చెట్టుని కౌగలించుకోవాలనిపిస్తుంది. అలా జరిగినప్పుడు ఆ చెట్టు 'ఏం బాబూ..బాగున్నావా?" అని పలకరిస్తుందని ఒక భ్రమ. చింతలపూడి గ్రామ సౌందర్యం అత్యద్భుతం..రోడ్లన్నీ దుమ్మూ, ధూళీ తో నిండినవే ఐనా మామిడి తోటలూ, మామిడిపూల వాసనా, పొద్దున్నే మంచులో తడిసిన గడ్డీ, అందులో చెప్పుల్లేని కాళ్ళతో (కాళ్ళు గట్టిపడాలని చెప్పులు కొనేవాళ్ళు కాదు) అడుగులేసినప్పుడు అరికాళ్ళలోంచి, శరీరమంతా పాకి మెదడుకి చేరే 'జివ్వు' మనిపించే చల్లదనం.. ఆ రోజులు తలుచుకుంటే నన్ను నేను మరిచిపోతాను. అప్పట్లో 35 శాతం మార్కులు వస్తే పాసైనట్లే. అంటే జీవితంలో ఆమోదయోగ్యమైన విజయం సులువుగానే వచ్చేది, అదీ మరింత ఆత్మవిశ్వాసాన్నిచ్చేది. అలానే నాన్న గారు 'అరే వెధవా.ఎప్పుడూ చదువులేనా. కాస్త బయటికిపోయి ఆడుకో' అనేవాళ్ళు. ఎందుకూ..ఆటలాడితే శరీరానికి బలం వస్తుంది అని.

ఏడవ తరగతి వరకూ స్కూలు తప్ప మరో ప్రపంచం తెలిసేది కాదు. అప్పుడే మా వూళ్ళోని గ్రంథాలయానికి వెళ్ళడం అలవాటైంది. లైబ్రేరియన్ గారి పేరు దాశరథి. ఆయనే నాకు మంచి మంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసారు. నేను మొదటి సారి చదివింది కౌంట్ ఆఫ్ మాంటో క్రిస్టో.. ముందు కాస్త అర్థం కానట్లున్నా, అర్థమయ్యాక మళ్ళీ మళ్ళీ చదివాను. అదే వరుసలో ప్రపంచసాహిత్యంలో ఉత్తమమైన పుస్తకాలన్నీ తెలుగు అనువాదాల రూపంలో చదివేసాను. అలోచనా పరిధి బాగా విస్తృతమైంది. పుస్తకాలు చదవుతుంటే ఆలోచనలు పదునెక్కేవి.

అదే సమయంలో మా వూళ్ళో ఉన్న విశ్వనాథ ఆశ్రమంలోని స్వామీజీతో కూడా పరిచయమైంది. ఆయనకి నామీద ప్రత్యేకమైన అభిమానం ఉండేది. రోజూ సాయంకాలంపూట అక్కడికి వెళ్ళి పూలూ కోసి ఇవ్వడం, పరిసరాలు శుభ్రం చేయడం చేసేవాడిని. స్వామీజీ సమక్షంలో అనేక సారస్వత సమావేశాలు, వేదాంత చర్చలు, ఉపనిషత్తుల సారాంశం గురించిన ప్రసంగాలు జరుగుతుండేవి. ఆయన ప్రతి విషయాన్నీ సైంటిఫిక్‌గా విశ్లేషించి చెప్పేవారు. సైన్సు గురించి ఎంత చదివితే దేవుడికి అంత దగ్గరవుతాం అని చెప్పేవారు. హైస్కూలు పూర్తయే వరకూ కేవలం తిండి మాత్రమే ఇంట్లో.. తరువాత ఉంటే లైబ్రరీలో, లేకుంటే ఆశ్రమంలో..ఇలా గడిచింది నా చింతలపూడి జీవితం. జీవితం పట్లా, సాహిత్యం పట్లా అప్పుడే కొన్ని స్పష్టమైన అభిప్రాయాలు ఏర్పడ్డం మొదలైంది.



సినిమాలు ఎక్కువగా చూడ్డం కూడా చింతలపూడిలోనే మొదలైంది. ఆ వూళ్ళో గోపాలకృష్ణ, అన్నపూర్ణ అని రెండు టూరింగ్ టాకీస్‌లు ఉండేవి. రోజూ సాయంకాలం మైకులో వూరంతా వినిపించేట్లు పాటలు వేసేవాళ్ళు. పాటలు ఆగిపోయాయంటే, సినిమా మొదలైనట్లు అర్థం అన్నమాట. ఇంట్లో ఏమైనా కొనుక్కురమ్మని డబ్బిలిస్తే కాస్త కమీషన్ నొక్కేసి సినిమాకి వెళ్ళేవాడిని. సినిమా వాల్ పోస్టర్స్‌లో రచయితల పేర్లు చదివి చాలా థ్రిల్లింగ్‌గా ఫీలయేవాడిని. పుస్తకాలు ఎక్కువగా చదువుతుండడం వల్ల రచయితల పేర్లు ఎక్కువ ఆకర్షించేవి నన్ను. శ్రీశ్రీ ఆరుద్ర, సముద్రాల వగైరా పేర్లు వాల్ పోస్టర్స్ మీద చూసినప్పుడు ఆ పక్కనే సుద్ద ముక్కతో నా పేరు కూడా రాసుకుని ఆనందపడుతుండే వాడిని.

హైస్కూలు తరువాత పి.యు.సి చదవడానికి శ్రీకాకుళంలో ఉంటున్న మా రెండో అన్నయ్య వద్దకి వెళ్ళాను. అక్కడ చదువు ముగుస్తున్న రోజుల్లోనే ఒక సంఘటన జరిగింది. మిత్రులు కొందరం కలిసి సముద్ర స్నానానికి వెళ్ళాం. నాకు బాగా జ్వరంగా ఉండడం వల్ల లోనికి వెళ్ళకుండ ఒడ్డునే కూర్చున్నాను. మా సీనియర్, ప్రభాకర్ అనే అతను, స్నానానికని సముద్రంలో దిగి పోటెత్తిన కెరటాల ధాటికి లోపలికి కొట్టుకెళ్ళిపోయాడు. అంతా సెకన్లలో కళ్ళముందు జరిగిపోయింది. వాళ్ళనాన్న గారు రత్నాల కోటయ్య గారనీ, ఆ రోజుల్లోనే బాగా ధనవంతులు. కనీసం శవాన్నైనా తీసుకొచ్చిన వాళ్ళకి లక్షలు బహుమతినిస్తానన్నారు. ఐనా అతని శవం కూడా దొరకలేదు. ఆ సంఘటనా భవిష్యత్తులోని మరికొన్ని సంఘటనలూ నాకు జీవితం అంటే అశాశ్వతం అనే భావాన్ని స్థిరపరిచాయి. ఏదైనా వస్తే తీసుకుందాం.. దేనికోసమూ వెంపర్లాడకూడదు అనే భావాన్ని కలిగించాయి. పియుసి చివరి రోజుల్లోనే మానాన్న గారూ మరణించడం, నేను డిగ్రీ కొనసాగించడానికని హైదరాబాదులో ఉంటున్న మా మూడో అన్నయ్య వద్దకి వెళ్ళడం జరిగింది.

అక్కడకి వెళ్ళాక కూడ ఏమి చదవాలీ, ఏమి చదివితే తొందరగా ఉద్యోగం వస్తుందీ అనే విషయాల మీద అంత అవగాహన లేదు. సలహాలిచ్చే ఆప్తమిత్రులూ ఎవరూ లేరు. రోజుల్లో టైపూ, షార్ట్ హేండూ నేర్చుకుంటే ఈ కాలపు ఎం.సి.ఎ లని చూసినట్లు చూసే వాళ్ళు. అందుకని శారదా కమ్మర్షియల్ ఇన్స్టిట్యూట్ అనే సంస్థలో చేరి టైపు నేర్చుకోవడం మొదలు పెట్టాను.

చిక్కడపల్లిలో అన్నయ్యతో కలిసి ఉండడం, రోజూ ముషిరాబాద్ లోని లైబ్రరీకి వెళ్ళడం ఒక అలవాటుగా ఉండేది, అక్కడే రెడ్డి అనే అతను పరిచయమై మంచి మిత్రుడయ్యాడు. మేమిద్దరం రోజూ కలుసుకుంటూ చాలా విషయాలు మాట్లాడుకుంటూ ఉండేవాళ్ళం.

అతనికి తండ్రిలేడు. అమ్మ పదిమంది ఇళ్ళల్లో నీళ్ళు మోసి, పాచిపనులు చేసి అతన్ని చదివిస్తూ ఉండేది.. నన్నూ తన సొంతకొడుకులాగానే చూసుకుంటూ ఉండేది. ఒకరోజు మధ్యాహ్నం రెడ్డి పరిగెత్తుకుంటూ వచ్చి 'మిస్టర్ నో' సినిమా కి రెండు టిక్కెట్లు తెచ్చాననీ నన్ను రమ్మనీ అన్నాడు. అప్పటికి నేను వంట చేస్తున్నాను. అన్నయ్య కూడ అప్పటికి బ్రహ్మచారే అవడంతో ఇద్దరం కలిసి ఏదో మాకు తెలిసిన వంటలు చేసుకునే వాళ్ళం. బెండకాయ కూర అనుకుంటా వండుతున్నానప్పుడు.. 'బావుందిరా రెండు ముక్కలు తిని చూస్తాను..' అని కాస్త కూర నోట్లో వేసుకుని 'ఆహా అద్భుతం..' అని పొగిడాడు. అప్పుడు మధ్యాహ్నం 12.30 ఐంది. రెండింటికి సినిమా. 'నేను ఇంటికి వెళ్ళి, అమ్మకి చెప్పి, భోజనం చేసి రెడీగా వుంటాను. నువ్వు తొరగా వంట పూర్తి చేసిరా..'అని చెప్పి వెళ్ళాడు. నేను మరొక అరగంటలో బయలుదేరి నడుచుకుంటూ వాళ్ళింటికి బయలు దేరాను. నారయణగూడ బ్రిడ్జి దాటగానే పక్కన ఏదో యాక్సిడెంట్ ఐ ట్రాఫిక్ గిపోయింది. సినిమా టైమౌతోందీ, రెడ్డి ఎదురు చూస్తుంటాడు.. అనే తొందరలో ఉన్నా, జనాన్ని తప్పించుకుంటూ వెళ్ళడంలో యాక్సిడెంట్ ఐన మనిషిని చూడక తప్పలేదు. అతనెవరో కాదు..అరగంట ముందు నాతో ఉన్న రెడ్డి..! రక్తం మడుగులో..నిర్జీవుడై..! జేబులో సినిమా టిక్కెట్లు రెండు అలానే ఉన్నాయి.. నాకు ఏమైందో నాకే తెలీదు. ఎలానో వాళ్ళింటికి వెళ్ళాను. తన తల్లికి ఏమి చెప్పానో, ఎలా చెప్పానో కూడా గుర్తులేదు. ఈ సంఘటన మరో బలమైన ముద్రవేసింది నామీద..జీవితమంటే ఇంతేనా..? అప్పుడే గదా రెడ్డి నాతో మాట్లాడుతూ, నేను చేస్తున్న కూర రుచి చూసాడు..ఇంతలోనే ఈ లోకం నుంచీ నిష్క్రమించాడు. జీవితం క్షణభంగురమనడానికి ఇంతకంటే ప్రత్యక్షసాక్ష్యం ఏం కావాలీ.. ఐతే దేనికోసం మన పరుగులాట. ఎవరి కోసం వెంపర్లాట..!? ఆ రోజుల్లోనే వార్తా పత్రికల్లో ఒక వార్త వచ్చింది. గన్నవరం దగ్గర గోపవరం అనే వూర్లో పెళ్ళి పందిరికి నిప్పు అంటుకుని వందలాది మంది అక్కడికక్కడే మాడి మసి ఐపోయారు. మనకి తెలీని శక్తి ఏదో మనల్ని నడిపిస్తోంది. అంతా మనచేతుల్లోనే ఉంది, అన్నిటికీ మనమే సమర్థులం అనుకోవడం ఉత్త భ్రమ..ఇలాంటి భావాలు మనసుని కమ్మేసాయి.

నా టైపు శిక్షణ సాగుతోంది. ఉద్యోగం ఎలా వెతుక్కోవాలో తెలీదు. సహాయం చేసేవాళ్ళు లేరు. ఎక్కడి కెళ్ళినా 'ఉత్తరం(రికమండేషన్) లేదా దక్షిణం(లంచం)' అనే వాళ్ళు. అలాంటి రోజుల్లోనే మా ఇంటి గలవాళ్ళబ్బాయి ఒక రోజు నాతో 'ఎయిర్ ఫోర్స్' లో ట్రైనీ పోస్టులకి ప్రకటన వచ్చింది. నేను అప్లై చేస్తున్నాను. నువ్వు చేస్తావా?' అని అడిగాడు. ప్రోస్పెక్టస్ అదీ చూసి, నేనూ అప్లికేషన్ పెట్టాను. ఇద్దరం కలిసి బేగంపేట లోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కి వెళ్ళాం. మొత్తం పరీక్షలన్నీ కలిపి వారం రోజులు పట్టింది. 600 కి పైగా వచ్చిన యువకుల్లో ఆరుగురిని సెలెక్ట్ చేసారు. అందులో నేనూ ఒకడ్ని..

జీవితం ఇక్కడో మలుపు తిరిగింది. ఎయిర్ ఫోర్స్‌లో ప్రవేశించాను నా 18 సంవత్సరాల వయసులోనే. కొన్ని పుస్తకాలు, కళ్ళముందు చూసిన కొన్ని మరణాలు, మనసులో చింతలపూడి జ్ఞాపకాలు..ఇదీ అంతవరకూ నేను సంపాదించుకున్న మానసిక విజ్ఞానం.

ఎయిర్‌ఫోర్స్ లో చేరాక బెంగుళూరు లో మొదటి ట్రైనింగ్. ఎయిర్‌ఫోర్స్ జీవితం మొదటినుంచీ చాలా క్రమశిక్షణ నేర్పింది. మాలో ఎవరు తప్పు చేసినా అందరినీ శిక్షించేవాళ్ళు. అంటే మాలో మేమే ఒకరినొకరు సరిదిద్దుకోవాలని వాళ్ళు మాకు చెప్పకనే చెప్పిన పాఠమది.. అక్కడునుంచీ మొదలుకొని ఇండియాలో పలు ప్రాంతాల్లో 18 సంవత్సరాల పాటు ఎయిర్‌ఫోర్స్‌లోనే పనిచేసాను. 1971 లో ఇండో-పాక్ వార్‌లో పాల్గొని 6 పతకాలు సాధించాను. సర్వీస్‌లో ఉండగానే దేశంలోని పలు ప్రాంతాలనుంచీ వచ్చిన వారితో పరిచయాలు తప్పని సరి అయ్యేది. నాకు బాగా ఆసక్తికరమైన భాష, సాహిత్యమూ, సంగీతమూ వగైరా వాళ్ళనుంచీ వివరంగా తెలుసుకుంటూ ఉండేవాడిని. ఈ అనుభవం నాకు ఎంతో నేర్పింది. వివిధ భాషల్లోని జానపద గీతాల్ని తులనాత్మకంగా పరిశీలించే అవకాశం లభించింది. అక్కడే హిందీ సినిమా పాటలు విపరీతంగా వినేవాడిని. అవి విన్నప్పుడల్లా అదే ట్యూన్‌లో తెలుగులో పాటలు వ్రాసుకుంటూ ఉండేవాడిని. ఈ విధంగా వందలాది హిందీ ట్యూన్స్ కి తెలుగు పాటలు వ్రాసుకున్నాను. ఈ అనుభవం భవిష్యత్తులో పాట ట్యూన్ మీద పట్టు

కొనసాగించడానికి ఉపయోగపడింది..

1986 సంవత్సరం చివరి రోజులు. ఎయిర్‌ఫోర్స్‌లో నుంచి బయటికి వచ్చి సివిల్ ఉద్యోగం వెదుక్కోవాల్సిన పరిస్థితి. ఐతే 'కొంతకాలం మద్రాసు వెళ్ళి సినిమాపాటలు వ్రాసేందుకు ప్రయత్నిద్దాం. ఒక వేళ క్లిక్ ఐతే సరే లేకుంటే అప్పుడే ఏదైనా ఉద్యోగం వెదుక్కుందాములే' అని మద్రాసులో అడుగు పెట్టాను. ప్రయత్నాలు మొదలెట్టాను. ఒక నిర్ణయం తీసుకున్నాను 'ఎయిర్ ఫోర్స్ నుంచీ వచ్చే పెన్షన్ కదల్చకుండా, ఇక్కడే సంపాదించి బతకాలి' అని.

నా సినిమా ప్రయత్నాలు కొనసాగుతున్నప్పుడే ఒకాయన పరిచయమై 'డిటెక్టివ్ నవల వ్రాస్తావా డబ్బులిస్తాను' అన్నాడు. సరే నని ఒక నవలరాసిచ్చాను. 'బావుంది..ఇంకా రాయి.వరుసగా పబ్లిష్ చేస్తాను' అన్నాడు. 'అయ్యా నా మొదటి ప్రిఫెరెన్స్ సినిమా పాటలు. నాకిలా డిటెక్టివ్ నవలా రచయితగా సెటిలవాలని లేదు' అని ఆఫర్‌ని తిరస్కరించాను. సురేష్ అనే మిత్రుడొకతను నన్ను విజయబాపినీడు గారికి పరిచయం చేసాడు. అంతకు కొద్ది రోజుల ముందే నాకు ఒ.ఎన్.జి.సి లో ఉద్యోగానికి ఆఫర్ లెటర్ వచ్చింది. సినిమాల్లో పాటలకోసం ఉండిపోవాలా, వెళ్ళి శుభ్రంగా ఉద్యోగంలో చేరి పోవాలా అన్నది సమస్య.

> నా అసలు పేరు ప్రభాకర రాజు. మా అమ్మ పేరు చంద్రావతి, ఒక సారి నాకు కామెర్లు వచ్చినప్పుడు తన రక్తం ఇచ్చి నాకు ప్రాణదానం చేసిన అమ్మ కాని అమ్మ భువనేశ్వరి..వీళ్ళ గుర్తుగా నా కలంపేరు 'భువనచంద్ర' గా పెట్టుకున్నాను.

విజయబాపినీడుగారు నా విషయం విని, 'మేము 'నాకూ పెళ్ళాం కావాలి' అనే సినిమా తీసాము. దాదాపు అంతా పూర్తయిపోయింది. టైటిల్ సాంగ్ ఒక్కటే ఉంది. అసలు అది వద్దనుకుంటున్నాం. మీరేదో బాగా రాయగలనంటున్నారు కాబట్టి ఒక ఛాన్స్ ఇచ్చి చూస్తాను. ఇది నాకు నచ్చేలా రాస్తే ఇక్కడ నిలదొక్కుకోడానికి సహాయం చేస్తాను. లేదంటే మూటా ముల్లె సర్దుకుని మీ ఒ.ఎన్.జి.సి ఉద్యోగానికి వెళ్ళిపోండి..' అని ఒక విధంగా వార్నింగ్ లాంటిది ఇచ్చారు. పాట ఎలా వ్రాయాలి అంటే 'ఈ సినిమాకి మాతృక ఐన తమిళ సినిమా నగేష్ థియేటర్లో ఆడుతోంది. అది చూసి, దాని ప్రకారం వ్రాయమ'ని చెప్పి, ఆయనే కారు ఇచ్చి సినిమా థియేటర్‌కి పంపించారు. వెళ్ళాను..టైటిల్స్ అయ్యాయి. ఏమి వ్రాయాలో ఒక ఐడియా వచ్చేసింది. సినిమా పూర్తయే వరకూ ఉండలేదు. బయటికి వచ్చేసి అక్కడే ఒక సిగిరెట్ పెట్టె మీద రెండు మూడు పల్లవులు, చరణాలు రాసుకున్నాను. త్రోవలో తెల్ల కాగితాలు కొనుక్కుని వాటిమీద ఫెయిర్ కాపీ చేసి బాపినీడు గారి వద్దకి వెళ్ళాను. ఇంకా సినిమా పూర్తి కాకుండానే వచ్చేసానని ముందుగా కోపం తెచ్చుకున్నారు. ఐతే పాట రాసుకొచ్చానని చెప్పగానే కాస్త కూల్ ఐ వినిపించమన్నారు. నాకు వచ్చిన ట్యూన్ లో ఏదో పాడి వినిపించాను. ఆయన వెంటనే వాసూరావు గారిని పిలిపించారు. ఆయన తన అసిస్టెంట్స్ తో సహా వచ్చేసారు. నేను రాసిన పల్లవులూ, చరణాలూ నచ్చాయి. ఐతే కాస్త వెస్టన్ ట్యూన్ లో చేద్దామని మార్చి రాయమన్నారు. అప్పటికప్పుడే మార్చి ఇచ్చేసాను. కొంచెం ఫోక్ ఉంటే బావుటుందన్నారు. అప్పటికప్పుడే ఆ మార్పులూ చేసాను. ఫైనల్‌గా కాస్త వెస్టన్, కాస్త ఫోక్ కలిపి ఫైనల్ పాట తయారైంది. 1987 జనవరి 1 న నేను రాసిన పాట బాలుగారు పాడగా రికార్డ్ ఐంది.

*వినోదాలవిందురా*
*బాధలన్నీ బందురా*
*సినిమా సాటిలేదురా*
*డాన్సు, ఫైటు మిక్సురా*
*మళ్ళి, మళ్ళి మళ్ళి చూడరా*
*సినిమా..సినిమా..సినిమా..*

ఇదీ పాట.

ఈ విధంగా నా మొదటి సినిమా 'నాకూ పెళ్ళాం కావాలి' తో నా తెలుగు సినీ గీత ప్రస్థానం మొదలైంది.

ఆ సినిమా విడదలై ఘన విజయం సాధించింది. నిజానికి తెలుగు సినిమాకి అది చాలా స్లంప్ సీజన్. మహామహుల సినిమాలన్నీ బాక్సాఫీసు వద్ద బోల్తా పడుతున్న రోజులు. అలాంటప్పుడు విజయం సాధించిన 'నాకూ పెళ్ళాం కావాలి' కలెక్షన్లకి నిర్మాతలు ఎంతో సంతోషించి, ఒక ప్రయోగం చెయ్యదలుచుకున్నారు. అదేమిటంటే నాలుగో వారంలో మరోపాట కొత్తగా సినిమాకి చేర్చుదామనుకున్నారు. అప్పటికే నాతో కంఫర్టబుల్‌గా వున్న విజయబాపినీడు గారు నన్నే పిలిపించారు. రకరకాల ట్యూన్స్ విన్నా ఏదీ నచ్చలేదు. అప్పుడు నేనే అన్నాను ' ఇంతకు ముందు నేను వ్రాసిన ట్యూన్ లోనే ఈ కొత్త పాట కూడా వ్రాస్తాను..మీకేమన్నా అభ్యంతరమా? 'అన్నాను.' ఈ సిట్యుయేషన్ కొత్తకదా..పాత ట్యూన్‌లో ఎలా వ్రాస్తారు?' అన్నారు. 'ఆ బాధ్యత నాకొదిలెయ్యండి అని..అదే ట్యూన్‌లో



*నాకూ పెళ్ళాం కావాలి*
*మూడు ముళ్ళూ వెయ్యాలి*
*పెళ్ళంటేనే థ్రిల్లంటా*
*వైఫుంటేనే లైఫంటా*
*పెళ్ళాం లేని లైఫే వద్దంటే*
*టా..టా..టా..*

అని వ్రాసాను. అదే సినిమాలోనే రెండో పాట కూడా అదే ట్యూన్ లో వ్రాయడం నాకొక మరచిపోలేని అనుభవం. ఇంకో మరువలేని జ్ఞాపకం ఏమిటంటే – నా మొదటి సినిమాకే 100 రోజుల షీల్డ్ అందుకోవడం.

తరువాత నా రెండో సినిమా గోపీకృష్ణ ప్రొడక్షన్స్ 'మా యింటి మహరాజు'. దీని దర్శకులు విజయబాపినీడు గారు. మొదటి సినిమాలో నా రచనాశైలిని మెచ్చుకున్న బాపినీడు గారు ఈ సినిమాలో మొత్తం పాటలన్నీ నాతోనే వ్రాయించారు. అంటే నా రెండో సినిమాకే సింగిల్ కార్డ్ గీత రచయితనయ్యాను. ఆ పాటల రికార్డింగ్‌లో నన్ను చూసిన వి.మధుసూదన రావు గారు తను తీస్తున్న 'ఆత్మకథ' లో ఒక పాట వ్రాయించారు. ఆ తరువాత చిన్న చితక సినిమాల్లో పాటలు వ్రాసినా ప్రేక్షకులు నన్ను గుర్తించేంత బ్రేక్ రాలేదు. విజయబాపినీడు గారి సలహా పాటించి, నేను ఎక్కడికీ వెళ్ళి 'నాకు ఛాన్సు ఇవ్వండి..' అని అడిగే వాడిని కాదు. మళ్ళీ విజయబాపినీడు గారే తను తీసిన 'ఖైదీ 786' లో నాతో 3 పాటలు వ్రాయించారు. అందులో ఒకటి 'గువ్వా..గోరింకతో..ఆడిందిలే బొమ్మలాట..'. ఆ పాట సూపర్ హిట్ అవడంతో 'భువనచంద్ర' అనే గేయరచయిత ఉన్నాడు అని ఆంధ్రదేశం గుర్తించింది. తరువాత గ్యాంగ్ లీడర్ లో 5 పాటలు వ్రాసాను. అన్నీసూపర్ హిట్సే. ముఖ్యంగా అందులోని 'వానా వానా..వెల్లువాయే..' పాట గురించి వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు కదా. ఇంక ఆ సినిమాతో చలనచిత్ర రంగంలో నా స్థానం స్థిరపడింది. మిగతా గీత రచయితలతో సమానంగా నాకూ అవకాశాలు రావడం మొదలైంది. ఈ 22 సంవత్సరాల్లో ఎన్నో అద్భుతమైన పాటలు వ్రాసే అవకాశం ఇచ్చిన దర్శకులూ, నిర్మాతలూ, సంగీత దర్శకులూ, ఆదరించిన ప్రేక్షకులూ..అందరికీ కృతజ్ఞతలు తెలియచేయడం నా విధి.

నా మనసులోని భావాలను మీతో పంచుకుంటూ ఒక్కసారి నా గతాన్ని నెమరువేసుకునే అవకాశం కలిగించిన 'కౌముది'కి కృతజ్ఞతలు తెలియచేస్తూ మీ వద్ద ప్రస్తుతానికి శెలవు తీసుకుంటాను.

ఇంటర్వ్యూ: కిరణ్‌ప్రభ (ఇంటర్వ్యూ తేది:నవంబర్ 1,2008)

# ఇంద్రగంటి మోహనకృష్ణ

నేపథ్యం.. సాహితీ వేత్తల కుటుంబం

చదివింది పోస్ట్‌గ్రాడ్యుయేషన్

ఆసక్తి సినిమా రంగం మీద..అందులోనూ ఒక విదేశీ డిగ్రీ..

తెరంగేట్రం ప్రయోగాత్మక సినిమా *'గ్రహణం'*తో..

ప్రసంశల జల్లులూ, అసంఖ్యాకమైన ఎవార్డుల పరంపర

రెండో సినిమాగా వ్యాపారాత్మక సినిమా *'మాయాబజార్'* రూపకల్పన..అపజయం పలకరింపు

" ఆఁ..ఎక్స్పెరిమెంటల్ సినిమా తీసే వాళ్ళు కమ్మర్షియల్ సినిమాకి పనికి రారండీ.." విమర్శల వర్షం..

నేలకొట్టిన బంతిలా, పడి లేచిన కెరటంలా **'అష్టాచెమ్మా'** తో తనేమిటో నిరూపించుకున్న వైనం .

ఈ సంవత్సరం విడుదలైన చిన్న సినిమాల్లో శతదినోత్సవం జరుపుకుని రికార్డు సృష్టించినా

మనిషిలో అదే వినయం, అదే గౌరవం, అదే సంస్కారం..

## దటీజ్ ఇంద్రగంటి మోహనకృష్ణ..!

ఆయన మాటల్లోనే ఆయన సినీప్రస్థాన విశేషాలు..'కౌముది' జన్మదిన సంచికలో మీకోసం ప్రత్యేకం..!



### *బెజవాడ బాల్యం*

పుట్టింది పశ్చిమగోదావరి జిల్లా తణుకులో (1972, ఏప్రిల్ 17) ఐనా పెరిగింది మాత్రం బ్లేజ్‌వాడ గా పేరుపొందిన బెజవాడ లోనే. ఏ కోణంనుంచీ చూసినా 'విజయవాడ వాస్తవ్యుడు' గానే గుర్తింపు పొందడానికి ఇష్టపడతాను. నాన్న ప్రసిద్ధ రచయిత, పాత్రికేయులు శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ. అమ్మ ప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి ఇంద్రగంటి జానకీ బాల. నాకంటే నాలుగేళ్ళు పెద్దదైన అక్కయ్య పేరు కిరణ్మయి. జ్యోతిబాల మందిర్‌లో మొదలైన విద్యాభ్యాసం, బాల భారతి మీదుగా సాగి అమరవాణి నికేతన్‌లో హైస్కూలు చదువు పూర్తిచేసాను. అంతవరకూ తెలుగు మీడియం పాఠాలే. హైస్కూలు రోజులవరకూ ఎప్పుడూ చెడ్డపేరైతే తెచ్చుకోలేదు కానీ చిలిపి పనుల చిన్నోడిగా మాత్రం కాస్త పరపతి ఉండేది.

ముఖ్యంగా చదువుతోబాటుగా సంగీతంలోకూడా ప్రవేశం ఉండడంతో ఏక్లాసుకి వెళ్ళినా సంగీతం మాస్టారికి ప్రియ విద్యార్థినై పోయేవాడిని. ఆరో తరగతి వరకూ నా పాటల ప్రస్థానం, పోటీల్లో కొన్ని బహుమతులు గెలుచుకోవడం కూడా జరిగింది కానీ - ఆరోతరగతి తరువాత సంగీత సాధన కుంటుపడింది..కారణాలేమిటో స్పష్టంగా గుర్తులేవు.

*హైస్కూలు జ్ఞాపకాలు*

హైస్కూలు రోజుల్లో నేను చదివింది తెలుగు మీడియమ్ ఐనా ఆంగ్ల భాష అన్నా, ఆంగ్ల సాహిత్యమన్నా మక్కువ ఏర్పడింది. ఇందుకు ఒకటి రెండు కారణాలున్నాయి. మొదటిది మా టీచర్ అరుణకుమారిగారు ఇంగ్లీషు భాషని బోధించిన విధానం, రెండోది ఒకసారి మేము క్విజ్ పోటీలకి వెడితే కేవలం మేము తెలుగుమీడియం నుంచీ వచ్చామన్న ఒకే కారణంతో తిరస్కారానికి గురికావడం.. ఎప్పటికైనా ఇంగ్లీషు భాషపై పట్టు సాధించడమే గాక ఆంగ్ల సాహిత్యాన్ని కూడా ఔపోసన పట్టాలన్న పట్టుదల అప్పుడే మొదలైంది.

పట్టుదల అంటే హైస్కూల్లో జరిగిన మరో సంఘటన కూడా గుర్తొస్తుంది.. సెవెన్త్ డే ఎడ్వాన్టిస్ట్ హైస్కూలు మీద క్వార్టర్ ఫైనల్ క్రికెట్ మేచ్ ఆడాల్సిన అవకాశం. ఐతే మా టీమ్‌లో ఎవరూ సరిగా ప్రాక్టీసు చేయడానికి సమయంలేదు. అంచేత బాగా ఆడలేమేమోనని మా స్కూలు యాజమాన్యం కూడా మమ్మల్ని పంపడానికి ఇష్టపడలేదు. ఐతే మేము పట్టుబట్టి ఒప్పించి మేచ్‌కి వెళ్ళాం. సింగిల్ పేడ్ లు, తేలిక రకం గ్లవుజులూ..మమ్మల్ని చూసి వీళ్ళేనా క్వార్టర్ ఫైనల్ ఆడేది అని అందరూ నవ్వుకున్నారు. ఐతే అందరి అంచనాలనూ తల్లకిందులు చేస్తూ మేము గెలిచాం! చాలా మంది ఆశ్చర్యపోయారు..అఫ్‌కోర్స్ ఓడిన వాళ్ళు అప్‌సెట్ అయ్యారనుకోండి. పట్టుదల అన్నప్పుడల్లా ఈ సంఘటనా, గేమ్ గెలవగానే మా టీమ్ అందరికీ అక్కయ్య కొనిపెట్టిన 'పాల ఐస్' గుర్తొస్తుంది..!

*లీలామహల్లో ఇంగ్లీష్ సినిమాలు*

విజయవాడ అంటేనే సినిమాలకి పెట్టింది పేరు. విజయవాడలో చదువుతూ సినిమాలు చూడకుండా ఉండడం అసాధ్యం అని నా అనుభవం నేర్పిన పాఠం. నాకప్పుడు 8-9 సంవత్సరాల వయసుంటుంది. లీలా మహల్లో స్పీల్బర్గ్ 'జాస్' సినిమాకి వెళ్ళాను, నాకింకా గుర్తుంది..నేను వెళ్ళేసరికి ఆట మొదలైంది. హాలంతా చీకటిగా ఉందేమో సీటు వెదుక్కుంటూ వెళుతుంటే తెరమీద సముద్రంలో ఈదుతున్న అందమైన అమ్మాయి..పెద్ద బొమ్మ తెరనిండా. మరుక్షణంలోనే షార్క్ నోట్లో మాయమై పోవడం..ఆశ్చర్యం గానూ, కాస్తంత భయంగానూ కూడా అనిపించింది. అలా 'జాస్' సినిమా చూసినప్పుడే కదిలే బొమ్మల్లోని ఆకర్షణెంతో తెలిసింది. మా అమ్మమ్మ నరసమాంబ కథలు చెప్పే విధానం కూడా హిట్ సినిమా స్క్రీన్ ప్లేలకి ఏమాత్రం తీసిపోయేది కాదు..ఇలాంటివన్నీ కలిసి ఊహలకి చిత్రరూపమిచ్చే సినిమాలంటే ఒక విధమైన ఆకర్షణని కలిగించాయి ఆ చిన్న వయసులోనే. ఎక్కువగా ఇంగ్లీషు సినిమాలే చూసే వాడిని. అవి చూసొచ్చి మా అంకుల్ కుమారస్వామితో వాటిలోని కెమేరా, సంగీతం, కథ, నటన..అన్నింటి గురించీ చర్చిస్తూ ఉండేవాడిని.ఇప్పటికీ చిన్నప్పటి మిత్రులు కలిసి నప్పుడు, నేనా రోజుల్లో వాళ్ళందరికీ ఇంగ్లీషు సినిమా కథలెలా చెప్పేవాడినో గుర్తు చేస్తుంటారు.

*కాలేజీ జీవితం-ఆంగ్ల సాహిత్యంతో తాదాత్మ్యం..!*

ఇంతకు ముందు చెప్పినట్లు హైస్కూల్లో ఉండగానే ఇంగ్లీషు భాషన్నా సాహిత్యమన్నా మక్కువ ఏర్పడింది. ఐతే సిద్ధార్థ కాలేజీలో ఇంటర్‌లో చేరినప్పుడు మాత్రం లెక్కలు, కామర్స్, ఎకనామిక్స్ గ్రూపు తీసుకోవాల్సి వచ్చింది. అస్సలు ఇంట్రెస్టు లేని వ్యవహారం. పెద్ద ఆశ్చర్య పడకుండానే అస్సలు సరిగా చదవలేదు. సెకండ్ క్లాసులో మాత్రమే పాసయ్యాను. ఇష్టం లేని పనులు చేస్తే ఫలితం ఎలా ఉంటుందనడానికి జీవితం నేర్పిన పాఠం ఇదొకటి..! ఇష్టమున్నదే చదవాలని నిర్ణయించుకుని లయోలా కాలేజీలో బి.ఎ. ఇంగ్లీషు మెయిన్ లో చేరాను. విజయబాబు గారు(పొలిటికల్-సైన్స్) , సురేశన్‌గారు(ఇంగ్లీషు) లాంటి ఉద్దండులైన లెక్చరర్లు నాకు ఇంగ్లీషుపట్లా, ఇతర

అంశాలపట్లా అమితమైన ఆసక్తి కలిగేలా పాఠాలు బోధించారు.. ప్రతిరోజూ కొత్తగా అనిపించేది. ఎన్నో ఇంగ్లీషు పుస్తకాలు చదివాను. సాహిత్యం, రాజకీయాలు, చరిత్రా.. బాగా మథించాను. క్విజ్ పోటీల్లోనూ, డిబేటింగ్ లోనూ ఎన్నో ప్రైజులు గెలుచుకున్నాను. లయోలాలో గడిపిన మూడు సంవత్సరాలూ నా విద్యార్థి జీవితంలో బంగారు రోజులు. తర్వాత యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదులో ఎం.ఎ , ఎం.ఫిల్ చేసాను. తరువాత రెండేళ్ళు ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్‌గా కూడా పనిచేసాను.



### *సినిమారంగం వైపు తొలి అడుగులు*

ఇలా ఫ్రీలాన్సర్‌గా పనిచేస్తున్నప్పుడే 'మహాంధ్ర' అనే డాక్యుమెంటరీ నిర్మాణంలో పాల్గొనే అవకాశం లభించింది. జె.వి.సోమయాజులు గారు(శంకరాభరణం ఫేమ్) నిర్మించిన ఆ డాక్యుమెంటరీ సిరీస్‌కి పి.కె.మాన్వి గారు దర్శకుడు. ఆయన వద్దనే ఫిల్మ్ నిర్మాణంలో తొలిపాఠాలు నేర్చుకున్నాను. ఆయన పూనా ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ నుంచీ వచ్చిన వ్యక్తి. సినిమా రంగంలో మంచి దర్శకుడిగా పేరు తెచ్చుకోవాలంటే సినీ నిర్మాణంలోని అన్ని రంగాల పట్లా సమానమైన అవగాహన ఉండాలనీ, అలా నేర్చుకోడానికి ఫిల్మ్ స్కూల్సు మంచి పునాదులు వేస్తాయని, సినిమాకి దర్శకత్వం చేయాలంటే చదువు అవసరం లేదనే వాదన నమ్మొద్దనీ నాకు విశదపరచింది ఆయనే. మాన్వి గారి ప్రోత్సాహంతోనే 1998లో కెనడా, టొరాంటో లోని యార్క్ యూనివర్సిటీలో సినీదర్శకత్వంలో డిగ్రీ చేయడానికి వెళ్ళాను.

### *కెనడా విశ్వవిద్యాలయం నేర్పిన పాఠాలు*

కెనడా జీవితం ఒక మహత్తరమైన అనుభవం. Amnon Buchbinder (my thesis supervisor), Janine Marchessault, Barbara Evans and Phil Hoffman. లాంటి అద్భుతమైన టీచర్లు, అసలు సినిమా గ్రామరంటే ఏమిటో, సినీ నిర్మాణంలో నేర్చుకోవాల్సిన మెలకువలు, ఇండిపెండెంట్ సినిమా నిర్మాణం లాంటి ఎన్నో థీరీ పాఠాల్ని వారి అనుభవాలతో జోడించి బోధించారు. ఆ రోజుల్లోనే లెక్కలేనన్ని హాలీవుడ్ సినిమాలతోబాటుగా ప్రపంచంలోని అన్ని భాషల చిత్రాలనీ చూసే అవకాశం లభించింది. అక్కడ విద్యార్థిగా వున్నప్పుడే 'ఓమ్ స్వీట్ ఓమ్' , 'కాన్వర్సేషన్' అనే రెండు షార్ట్ ఫిల్మ్స్ తీశాను.

టొరాంటోలో చదువుతున్నప్పుడు జరిగిన సంఘటన ఒకటి బాగా గుర్తుండి పోయింది. అక్కడ సబ్-వే లో ఒకసారి నా క్లాసు ప్రోజెక్ట్‌కోసం షూట్ చేయడం మొదలెట్టాను. ఐతే సబ్-వే లో షూటింగ్ చెయ్యాలంటే టి.టి.సి. (Toronto Transit Commission) పర్మిషన్ ఉండాలి. నాకా విషయం తెలిసినా అవన్నీ తిరిగే ఓపికలేక పర్మిషన్ లేకుండానే షూట్ చేస్తున్నాను. ఒక పెద్దమనిషి నా దగ్గర కొచ్చి 'బాబూ..ఇలా సబ్-వేలో షూటింగ్ చెయ్యాలంటే టి.టి.సి. పర్మిషన్ ఉండాలి తెలుసా?' అని చాలా మర్యాదగా అడిగాడు. 'అలానా..నాకసలు తేలీదే.' అమాయకత్వం నటించాను. 'వాళ్ళు చూస్తే పట్టుకుంటారు. నీకు రూల్స్ తెలీవన్నా ఒప్పుకోరు..' అని నెమ్మదిగా చెప్పాడు. సరే ఆయన చెప్పాక కూడా నేను కొనసాగడం బావుండదని కెమేరా బేగ్ లో సర్దుకున్నాను. అప్పుడాయన చెప్పాడు తనే టి.టి.సి స్టాఫ్ నని..! కాలేజీ రోజుల్లో తను కూడా ఇలాంటి 'తెలివైన' అమాయకపు పనులు చాలా చేసాననీ, రూల్స్ ఉండేవి అతిక్రమించడానికేననే వయసులో ఇలాంటివి సహజమేననీ తన యుక్తవయసు జ్ఞాపకాలని పంచుకున్నాడు.

టొరొంటో కాలేజీ జీవితంలో మరో మరపురాని సంఘటన నాథీసిస్. మా అమ్మ జానకీబాల గారు రాసిన 'వెన్నెలమెట్టి' నవలా ఆధారంగా స్క్రీన్ ప్లే రాసుకుని సమర్పించిన థీసిస్‌కి నాకు డిగ్రీ రావడమే కాక యూనివర్సిటీ థీసిస్ అవార్డుకి కూడా నామినేట్ ఐంది. అలా విజయవంతంగా ఫిల్మ్ కోర్స్ ముగించుకుని 2001 లో మళ్ళీ మనదేశం వచ్చేసాను.

ఫిల్మ్ స్కూల్సు కేవలం థీరీ మాత్రమే చెబుతాయనీ, ప్రాక్టికల్స్ మీద ఎక్కువ కేంద్రీకరించరనీ చాలా మందిలో ఒక భావం ఉంది. ఇది తప్పు అనీ, ఫిల్మ్ స్కూల్లో థీరీ, ప్రాక్టికల్స్ రెండూ నేర్పుతారనీ, ఆ సమ్మిళతమైన టీచింగ్ భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందనీ యార్క్ యూనివర్సిటీ జీవితం నాకు తెలియచేసింది.

## *మొదటి సినిమా 'గ్రహణం' రూపు దిద్దుకున్న వైనం*

చలంగారి 'దోషగుణం' కథకి సినిమా రూపాన్ని(గ్రహణం) 1997లోనే కెనడా వెళ్ళడానికి ముందే తయారు చేసుకున్నాను. సహజంగానే చాలా ఎమెచ్యూరిష్‌గా వుంటుంది ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే. ఐతే దాన్నే కెనడాకి అప్లై చేసేప్పుడు ఆ యూనివర్సిటీకి  పంపించాను. అది నచ్చడంవల్లనే కెనడాలో సీటు ఇచ్చారు. అక్కడ నా సూపర్ వైజర్ చెప్పారు "నువ్వు గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక ఈ స్క్రిప్టు మీద పనిచెయ్యి. ఇంకా బాగా వస్తుంది' అని సలహా ఇచ్చారు. తిరిగొచ్చాక నాలుగు నెలల పాటు దాని మీదే కూర్చుని గ్రహణం సినిమా అనువాదాన్ని కొత్తగా తయారు చేసుకున్నాను. ఆ సమయంలోనూ ఎవరి వద్దా అసిస్టెంటుగా పనిచెయ్యలేదు. దర్శకుడిని కాబోయే ముందు అలాంటి అసిస్టెంట్ పనులు తప్పించుకోవాలనే యూనివర్సిటీ కోర్సుకి వెళ్ళాను. సరే..గ్రహణం స్క్రిప్టు పూర్తయింది. ఇంక నిర్మాతలు కావాలి..ఎలా? చాలామందికి వినిపించాను. అందరి అనుభవాలే నాకూ ఎదురయ్యాయి. కొంతమందికి ప్రోజెక్టు నచ్చినా ఎంతవరకూ వ్యాపారాత్మక సినిమా ఔతుందనే అనుమానం, మరికొంతమందికి ముందు ఎలాంటి అనుభవం లేకుండ ఇంత బరువైన సబ్జెక్టుని హేండిల్ చెయ్యగలనా అని సంశయం... అదంతా సహజమే. ఎవరైనా నన్ను నమ్మి ముందుకి రావాలంటే ఏ కొంచెమైనా నా సినీ అనుభవం మీద నమ్మకం రావాలి కదా.

2003 లో నా మిత్రులే ముగ్గురు యాక్టర్లుగా 'చలి' అనే సినిమా తీసాను. ఇందుకోసం నేను వాడింది హేండీకామ్. ఎడిటింగ్, మిక్సింగ్ అంతా నా కంప్యూటర్ మీదే. ఐన ఖర్చు కేవలం 3,500 రూపాయలు మాత్రమే..! ఈ సినిమాని హైదరాబాదులోని సారథీ స్టూడియోలో ప్రివ్యూ వేసాను. హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ సెక్రటరీ ప్రకాశ్ రెడ్డిగారు ఇందుకోసం చాలా సహాయం చేసారు. ఈ ప్రయోగానికి మంచి స్పందన లభించింది. ఆ సందర్భంలోనే తనికెళ్ళ భరణి గారిని కలవడం, ఆయనకి నావద్ద ఉన్న 'గ్రహణం' స్క్రిప్టు గురించి చెప్పడం జరిగింది. కొన్ని రోజుల తరువాత 'గ్రహణం' సినిమాలో నటిస్తారా అని అడిగాను. అందుకు పారితోషికమేమీ లేకుండా నటించడానికి భరణిగారు ఒప్పుకోవడమే కాక, కనకధార బృందం నిర్మాతలు - వెంకట్, సుబ్బారావు, అంజిరెడ్డి గార్లని పరిచయం చేసారు.

నిర్మాతల ప్రోత్సాహం లభించగానే సినిమా నిర్మాణం పనులు వేగం అందుకున్నాయి. ప్రముఖ నటి జయలలిత గారినీ, రంగస్థల నటులు రమణ, శివన్నారాయణ, సుందరం గార్లతోబాటు సినీ నటులు సూర్య, కమల్ గార్లను కూడా తారాగణంలో చేర్చడం జరిగింది. ఈ విధంగా అన్ని హంగులతో మొదలైన నా మొదటి సినిమా 'గ్రహణం' మొదటి షాట్‌ని నా సొంత అపార్ట్‌మెంట్లో సూర్య గారి క్లోజప్ తో మొదలుపెట్టాము. మొదటి రోజు షూటింగ్ నల్లేరు మీద నడకలా సాగింది. ప్రొఫెషనల్ నటులతో తీసినట్లుకాక అందరం కలిసి అదొక ఫ్రెండ్స్ సర్కిల్ లాగా షూటింగ్ సాగింది. మొదటి రోజు షూటింగ్ పూర్తికాగానే మా ఇంట్లోనే అందరం భోజనం చేసి తరువాతి రోజు చెయ్యాల్సిన సీన్‌ల గురించి చర్చించుకున్నాం. ఆ విధంగా మొదటి 3 రోజులూ మా అపార్ట్‌మెంట్ లోనే చిత్రీకరించాం. తరువాత హాస్పిటల్ దృశ్యాల కోసం లొకేషన్ మార్చాం.

'గ్రహణం' షూటింగ్ సమయంలో ప్రతిరోజూ ఒక మధురమైన జ్ఞాపకమే. ఒక షాట్లో భరణి గారు జయలలిత గారిని చెంపదెబ్బ కొడితే ఆమె తిరిగి భరణి గారిని కొట్టాలి. భరణిగారి షాట్ కాగానే జయలలిత గారు మాంచి బలంగా భరణి గారిని చెంపదెబ్బ కొట్టారు. సిద్ధంగా లేని భరణి గారు పక్కకి తిరగడం ఆలశ్యమవడంతో, ఆయన చెంప ఎర్రగా కందిపోయింది..! అనుకోని ఈ ఫలితానికి జయలలితగారు నొచ్చుకుని చాలా సార్లు సారీ చెప్పారు. భరణి గారు దీన్ని చాలా తేలిగ్గా తీసేసుకుని 'నా మీద ప్రతీకారం తీసుకుంది అంతేలే..' అని నవ్వేసారు. జయలలిత గారు చాలా ప్రతిభావంతమైన నటి. ఇప్పటికీ నా ఫేవరేట్ నటీమణి జయలలితగారే. భవిష్యత్తులో తప్పని సరిగా ఆమెతో నటనకి పూర్తి స్కోప్ ఉన్న మెయిన్ కేరక్టర్ చేయించాలని ఆశ.

ఈ సినిమా షూటింగ్ సమయంలోనే 2004, ఏప్రిల్ 17 నా పుట్టిన రోజు, కనకయ్య ఇంటి దృశ్యాలు తీస్తుండగా విషాద వార్త తెలిసింది. సహజనటి సౌందర్య గారు హెలికాప్టర్ ప్రమాదంలో ప్రమాదంలో మరణించారని. చాలా సేపు షూటింగ్ ఆపేసాం..మళ్ళీ మా మూడ్ లోకి రావడానికి ఎంతో సేపు పట్టింది.

### 'గ్రహణం' సాధించిన విజయాలు

సినిమా పూర్తయింది. మొత్తం బడ్జెట్ 6.75 లక్షలు మాత్రమే. మిని-డివి కెమేరాలో షూట్ చేసి 35 ఎమ్ ఎమ్ కి బ్లోఅప్ చేయడం జరిగింది. ఆ చిత్రం నాకూ మా యూనిట్‌కి తెచ్చిన గుర్తింపు, బహుమతుల గురించి వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు కదా. జాతీయస్థాయిలో ఉత్తమ కొత్త దర్శకుడిగా బహుమతినందుకున్నాను. రెండు నంది బహుమతులు వచ్చాయి. ప్రతిష్టాత్మకమైన గొల్లపూడి శ్రీనివాస్ మెమోరియల్ అవార్డు అమీర్‌ఖాన్ చేతులమీదుగా తీసుకున్నాను. ఇంకో యాదృచ్ఛికం ఏమిటంటే నేనీ బహుమతి అందుకున్న రెండేళ్ళకి అమీర్‌ఖాన్ గారే స్వయంగా తనూ ఇదే గొల్లపూడి శ్రీనివాస్ మెమోరియల్ అవార్డు బహుమతిని (ఈ సంవత్సరం 'తారే జమీన్ పర్' చిత్రానికి) అందుకున్నారు. ఇలా చెప్పుకుంటే పోతే నా మొదటి సినిమా 'గ్రహణం' గురించి పెద్ద పుస్తకమే వ్రాయొచ్చు. నిజంగానే ఎప్పుడో ఒకసారి ఈ మొదటి సినిమా అనుభవాలన్నింటినీ తప్పని సరిగా గ్రంథస్థం చేస్తాను. ఇప్పటికీ ఏదో ఒక చిత్రోత్సవంలో 'గ్రహణం' ప్రదర్శించబడుతూనే ఉంది.

ప్రసాద్ మల్టీప్లెక్స్ రమేష్ ప్రసాద్ గారు తనంతతానుగా చొరవతీసుకుని 'గ్రహణం' సినిమాని హైదరాబాదులోని ప్రసాద్ మల్టీప్లెక్స్‌లో విడుదల చేసారు. ఒక వారంపాటు ఆడింది. ఇన్ని విధాల గుర్తింపుతోబాటు, సినీ పరిశ్రమలోని ప్రముఖుల అభినందనలందుకోవడం నా అదృష్టంగా భావించాను. దాసరి గారు ప్రవేశపెట్టిన ఉత్తమ కొత్త దర్శకుడి ఎవార్డుని కూడా అందుకున్నాను. రాఘవేంద్ర రావు గారు. కె.విశ్వనాథ్ గారు లాంటి ప్రముఖులు ప్రత్యేకంగా అభినందనలు తెలియచేసారు. ఈ సినిమా విజయం మా ఇంట్లో అందరికీ ఎంతో ఆనందాన్నిచ్చింది. చలం గారి రచనలని వెండితెరకి అనువదించడం ఎంత కష్టమో అమ్మా, నాన్నలకి బాగా తెలుసు. వీటన్నింటికంటే హైలైట్ ఏమిటంటే చలం గారి కుమార్తె సౌరీస్ ప్రమోద గారి నుంచీ శుభాకాంక్షలందుకోవడం. "నేను ఈ సినిమాని పదే పదే చూసాను. నాన్న గారు బ్రతికుంటే ఈ సినిమా చూసి ఎంతో ఆనందించే వారు.." అన్నారామె. అంతకంటే పెద్ద సర్టిఫికెట్ ఏముంటుంది చెప్పండి..!

'గ్రహణం' తెచ్చిన పేరుతో నేనొక విచిత్రమైనస్థితికి చేరాను. అందరూ నన్ను కేవలం ఎవార్డులకోసం ప్రయోగాత్మక చిత్రాలు తీసే దర్శకుడిగానే చూడ్డం మొదలు పెట్టారు. బహుశా ఇలాగ ఎవార్డు విన్నింగ్ సినిమాలు తీసాక కమ్మర్షియల్ డైరెక్టర్స్ గా సక్సెస్ ఐన వాళ్ళు తక్కువగా వుండడమే కారణం కావొచ్చు.

### 'మాయాబజార్'అనుభవం

'గ్రహణం' సినిమాకి పేరు రావడం మొదలైనకొన్ని నెలలకి బి.సత్యనారాయణగారు నా వద్దకి వచ్చి సినిమా చేసిపెట్టమని అడిగారు. అదే నా రెండో సినిమా 'మాయాబజార్'. ఎన్నో ఆశలతో , చక్కటి స్టార్ కాస్టింగ్‌తో నేను మనసుపడి దర్శకత్వం వహించిన సినిమా అది. ఐతే కథ, శైలీ వర్తమాన సామాజిక అంశాలని ప్రతిబింబించకపోవడం వల్ల ప్రేక్షకుల్ని చేరలేకపోయిందేమోనని ఒక అభిప్రాయం. నేను మాత్రం ఎక్కడ రాజీ పడకుండా శాయశక్తులా కృషి చేసి రూపొందించిన సినిమా అది. ఇప్పటికీ కె.ఎమ్.రాధాకృష్ణ 'మాయాబజార్' కి అందించిన పాటలూ, నేపథ్యమూ ఉత్తమస్థాయి సంగీతం కోవకి చెందుతుందని నమ్ముతాను. వేటూరి, సాహితి గార్ల పాటలు కూడా అద్భుతంగా కుదిరాయి. ఐతే విచారించదగిన విషయమేమిటంటే కొంతమంది యువకులు 'నారద, కుబేరుల మధ్య జరిగే సంభాషణల్లోని భాష అర్థం కాలేద'ని అన్నారు. అసలు చాలామంది కుబేరుడు అంటేనే తెలీదని అన్నారు. కమ్మర్షియల్‌గా విజయం సాధించకపోయినా, ఎన్ని విమర్శలు వచ్చినా 'మాయబజార్' నా మనసుకి నచ్చిన సినిమా. అలాంటి సినిమా రూపొందించినందుకు నిజంగా గర్విస్తాను.

ఇంక నన్ను విజయవంతమైన కమ్మర్షియల్ డైరెక్టర్ గా మీ ముందుకి తీసుకొచ్చిన 'అష్టాచెమ్మా' గురించి చెప్పాలంటే -




### అష్టాచమ్మా అద్భుతం

ఈ సినిమా నిర్మాత రామ్ మోహన్ గారు 2001 లోనే మొదటి సారిగా సురేష్ ప్రొడక్షన్స్ ఆఫీసులో కలిసారు. అప్పట్లోనే ఆయనకి కొన్ని కథలు చెప్పడం జరిగింది. వాటిలో అష్టాచమ్మా ఆయనకి నచ్చింది. ఐతే అది ప్రాజెక్టు రూపం దిద్దుకోడానికి ఏడేళ్ళు పట్టింది. 'మాయాబజార్' అపజయం తరువాతనే రామ్ మోహన్‌గారు ఒకరోజు ఫోన్ చేసి 'మీతో సినిమా తియ్యాలనుకుంటున్నాను' అన్నారు. ఆయనకి నామీద ఉన్న నమ్మకానికి ఆశ్చర్యమేసింది. ఆయన నమ్మకాన్ని ఏమాత్రం వమ్ముచేయకూడదని నా సర్వశక్తులూ కూడ దీసుకుని నెలల తరబడి పనిచేసి 'అష్టాచమ్మా' స్క్రిప్టుకి మెరుగులు దిద్దాను. నాకు పూర్తి స్వేచ్ఛ నిచ్చినప్పుడు నా నుంచీ మంచి క్వాలిటీ వస్తుందని తెలిసిన నిర్మాత రామ్ మోహన్‌గారు. ప్రాజెక్టు మొదలయ్యాక ఎప్పుడో ఒకటి రెండు సార్లు మినహాయించి ఆయనెప్పుడూ షూటింగ్ స్పాట్ కి కూడా రాలేదు.

ఐతే ఎక్జిక్యూటివ్ నిర్మాత ప్రసాద్ నిమ్మకాయల గారు తన అద్భుతమైన తెలివితేటలతో నాకు కుడిభుజంగా నిలిచారు. అష్టాచెమ్మా సినిమా మొత్తం 44 రోజుల్లో షూటింగ్ పూర్తిచేసాము. 2008 సెప్టెంబర్ 5న అన్ని ప్రధాన కేంద్రాల్లోనూ విడుదల చేయడానికి ముందే వైజాగ్, విజయవాడల్లో 1, 2 తేదీల్లో పబ్లిక్ ప్రివ్యూలు వేయించారు రామ్ మోహన్‌గారు. ఇది చాలా సాహసోపేతమైన నిర్ణయం. ఏ కామెంట్ సినిమాని ఎటు వైపు మళ్ళిస్తుందో తెలీదు. ఐనా రామ్ గారి సాహసానికి ప్రతిఫలం లభించింది. సినిమా మొదటి షో నుంచే హిట్ -సూపర్ హిట్‌టాక్‌ని తెచ్చుకుంది. అమెరికాలాంటి విదేశాల్లో కూడా హౌస్ ఫుల్ కలెక్షన్లతో నడవడం మా అందరి నమ్మకాలనీ నిలబెట్టింది. నటీ నటులూ, సాంకేతిక నిపుణులూ అందరికీ ఈ విజయంలో సమాన భాగస్వామ్యం ఉంది.

ఇప్పటికే ఉత్తమ వినోదాత్మక చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటి, ఉత్తమ కొత్త నటుడు - ఇలా నాలుగు రేలంగి అవార్డులనందుకుంది.



మొన్న డిసెంబర్ 13కి 100 రోజులు పూర్తి చేసుకుని ఇంకా చాలా చోట్ల విజయవంతంగా నడుస్తోంది. ఇంకో రికార్డు ఏమిటంటే బెంగుళూరులోని పి.వి.ఆర్ సినిమాస్‌లో డిసెంబర్ 20 కి వందరోజులు పూర్తిచేసుకుని సరికొత్త రికార్డు సృష్టించిందీ సినిమా.. నా జీవితంలో, కెరీర్ లో ఈ అష్టాచెమ్మా ఎప్పటికీ మరపురాని మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

ఇవండీ.. నన్ను దర్శకుడిగా పరిచయం చేసిన మొదటి సినిమా 'గ్రహణం' గురించీ, విజయవంతమైన కమ్మర్షియల్ దర్శకుడిగా నిలబెట్టిన మొదటి సినిమా 'అష్టాచమ్మా' గురించీ మీతో పంచుకుంటున్న విశేషాలు.

ఇంకా ఈ కెరీర్ లో మొదటి దశలోనే ఉన్నాను. ముందు ముందు సాధించాల్సిన వెన్నో ఉన్నాయి. ఈ స్థాయికి చేరడానికీ, నా వ్యక్తిత్వం రూపుదిద్దుకోవడానికీ సహకరించిన అందరికీ ఈ సందర్భంగా నేను మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను. నా మొట్టమొదటి టీచర్ జయభారతి మేడమ్ గారి వద్దనుంచీ మొదలుకొని కెనడా యూనివర్సిటీ ప్రొఫెసర్స్ ..వరకూ నా విద్యాభ్యాసం ప్రతి దశలోనూ నాకు ఎన్నో విషయాలు నేర్పిన గురువులందరికీ ఎంతైనా ఋణపడి ఉంటాను. అలానే మా కుటుంబసభ్యులూ, మిత్రులూ, సినీ ప్రముఖులూ ..ఎందరో మహానుభావులు..అందరికీ వందనాలు..!

సినీ దర్శకులు కావాలనుకునే ఔత్సాహికులకి నేను నేర్చుకున్న కొన్ని విషయాలు చెబుతాను..

ఏ పనైనా ఇష్టపడి, మనసుపెట్టి చేస్తేనే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏపని మీదైనా కేవలం ఇష్టం ఉండడమే కాక ఆ పని గురించిన ప్రాథమిక అంశాలని కూలంకషంగా తెలుసుకుని ముందుకి నడవాలి.

ఎవరైనా సినిమా రంగంలో రాణించడానికీ , చదువుకీ సంబంధం లేదంటే నమ్మకండి. మనిషికి చదువు అనేది కేవలం విజ్ఞానాన్నే కాదు, వ్యక్తిత్వాన్ని కూడా ఇస్తుంది. అలానే ఎవరైనా 'కమ్మర్షియల్ సినిమా ఫార్ములాలు నావద్ద ఉన్నాయి. సినిమా హిట్ చేయించడం ఎలానో నాకు తెలుసు' అంటే అస్సలు నమ్మకండి.. ప్రేక్షకుల నాడి అనేది ఎవరి అంచనాలకూ అందదు. మీ కృషినీ, నిజాయితీని నమ్ముకోండి. అవే మిమ్మల్ని విజయపథం వైపు నడిపిస్తాయి..!

ఇంటర్వ్యూ: కిరణ్ ప్రభ

PUBLISHED IN JANUARY 2009

# దశరధ్

జీవితంలో ఎదురయ్యే కష్టాలకి ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా స్పందిస్తారు. కష్టాలకి లొంగిపోయి క్రుంగిపోయేవారు కొందరైతే ఎదురు నిలిచి పోరాడేవారు మరి కొంతమంది. ఎదురైన ప్రతి సమస్యనీ ఒక సవాలుగా తీసుకుని, ప్రతి అవరోధాన్నీ ఒక పునాది రాయిగా మార్చుకుని, అగ్నిపరీక్షలమయమైన జీవితాన్ని విజయపథంలోకి మళ్ళించాలంటే ఎంతో ఆత్మవిశ్వాసం, కృషి, క్రమశిక్షణ..ఉండాలి. అతి చిన్న వయసులోనే 'జీవితమంటే అంతులేని ఒక పోరాటం..' అన్న చేదునిజాన్ని ప్రతిరోజూ ఎదుర్కొంటూ, తన చదువుకి తన కృషినే పెట్టుబడిగా పెట్టి, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అతడు, విజయవంతమైన సినీదర్శకుడిగా రూపుదిద్దుకుంటానని ఆ రోజుల్లో ఊహించలేదు. మొట్టమొదటి చిత్రాన్నే (సంతోషం - నాగార్జున, శ్రియ) సూపర్ హిట్ ఫేమిలీ చిత్రంగా రూపొందించిన యువదర్శకుడు దశరధ్‌గా అందరికీ తెలిసిన కొండపల్లి దశరధ్ కుమార్ తన బాల్యం గురించీ, సినీ రంగప్రవేశం గురించీ, మొదటి సినిమా దర్శకత్వపు అనుభవాల గురించీ ఈ నెల కౌముది పాఠకులతో ఇలా తన జ్ఞాపకాలని పంచుకుంటున్నారు. ఈయన మొదటి సినిమా 'సంతోషం' శతదినోత్సవ చిత్రంగా ఆడి కేవలం ప్రేక్షకాదరణనే కాక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నందీ అవార్డులని కూడా గెలుచుకుంది.

'సంతోషం' తరువాత 'సంబరం', 'శ్రీ', 'స్వాగతం' సినిమాలకి దర్శకత్వం వహించిన దశరధ్ ప్రస్తుతం దిల్ రాజు నిర్మాతగా ప్రభాస్ హీరోగా తదుపరి చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. ఏప్రిల్ 2009 ప్రాంతాల్లో ఈ కొత్త సినిమా ప్రారంభమౌతుందని 'కౌముది'కి తెలియచేసారు.



**నేను ఖమ్మం పట్నంలో నవంబర్ 30, 1971న పుట్టాను.** నాన్న గారి పేరు రామచంద్రరావు, అమ్మపేరు సరస్వతి. నేను బాగా చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు మాది బాగా వున్న కుటుంబమే. నాన్నగారికి వందల ఎకరాల వ్యవసాయభూమి ఉండేది. ఐతే అనుకోని పరిస్థితుల్లో, సరైన ప్రణాళిక లేని కొన్ని పనులవల్ల నేను 10వ తరగతికి వచ్చేటప్పటికి మా సంపద అంతా హరించుకుపోయింది. నేనూ, తమ్ముళ్ళిద్దరూ, అమ్మా,నాన్నా.. రోజు గడవడమే కష్టం అన్నట్లయింది మా కుటుంబ పరిస్థితి. నా పదోతరగతి రోజుల్లోనే అమ్మ చనిపోయింది.

నేను ఇంటర్మీడియట్‌లో చేరినప్పటినుంచే నా ఫీజులు నేనే కట్టుకుంటూ, ఫేమిలీకోసం కూడా సంపాదించాల్సిన పరిస్థితి వచ్చింది. 6వ తరగతిలో ఉన్న తమ్ముడు కూడా పనిచేయడం మొదలు పెట్టాడు. మెడికల్ షాపులు, ఆడియో రికార్డింగ్ షాపులూ, రాఖీలు అమ్మడం లాంటి సీజనల్ షాపుల్లోనూ

పనిచేయడం మొదలు పెట్టాను. పనిచేయడం అంటే రోజూ పొద్దున్నే షాపు తెరిచి, అంతా శుభ్రం చేయడంతో మొదలుపెట్టి రాత్రి షాపు కట్టేసేవరకూ పనిచేసే వాడిని. అప్పుడప్పుడూ కాలేజీకి వెళుతుండేవాడిని. అలానే డిగ్రీ రెండో సంవత్సరం వరకూ గడిచింది. నా గురించి అందరికీ తెలుసు కాబట్టి కాలేజీకి రెగ్యులర్‌గా హాజరు కాకపోయినా లెక్చరర్లు ఏమీ అనేవారు కాదు. మరీ డిగ్రీ రెండో సంవత్సరానికి వచ్చే సరికి నేను సేల్స్‌బోయ్‌గా పనిచేసే షాపులకి మా క్లాసుమేట్స్ వచ్చినప్పుడల్లా నాకే చిన్నతనంగా అనిపించేది. ఉన్న ఊళ్ళో అలా కొనసాగడం కాస్త మనసుకి బాధ అనిపించి, మిగతా డిగ్రీ పూర్తిచేయడానికి, హైదరాబాదు వచ్చాను.

హైదరాబాదులోకూడా షాపులకి సేల్స్ రిప్రజెంటేటివ్‌గా చేరి, ఇంతకు ముందుకంటే ఒకమెట్టు పైనుండే ఉద్యోగంలో కుదురుకుని, మరో వైపు చదువు కొనసాగిస్తూ ఉండేవాడిని. ఇదంతా 1991 -92 ప్రాంతాల్లో. హైదరాబాదులో డిగ్రీ పూర్తిచేసుకుని మళ్ళీ ఖమ్మం చేరుకున్నాను.



Manair College of Lawలో లా కోర్సులో చేరాను. సమాంతరంగా ఉస్మానియా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా ఎం.కామ్ కూడ చేయడం మొదలుపెట్టాను...ఇలా రెండు పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిగ్రీలు చదువుతూనే జీవనోపాధి కోసం, కుటుంబ పోషణ కోసం సైడ్ బిజినెస్‌లు మొదలుపెట్టాను. మా మిత్రుడొకరు ఖమ్మంలోనే సూట్‌కేసులు తయారు చేసేవాడు. తన వద్ద కాస్ట్-టు-కాస్ట్ పద్ధతిమీద సూట్ కేసులు కొని, పట్నంలోని మిగతాషాపులకి కొంచెం లాభం వేసుకుని సరఫరా చేసేవాడిని. దీంతోబాటు ఒక లస్సీ సెంటర్ కూడ మొదలుపెట్టి, సాయంకాలం సమయాల్లో దాన్ని నడిపేవాడిని. వీటికి తోడుగా ఇంటర్మీడియట్ పిల్లలకి ట్యూషన్స్ చెప్పడం కూడా ప్రారంభించాను. ఒక చిన్న రూము, ఈతాకు చాపలు, ఒక బ్లాక్ బోర్డు ..ఇవే నా పెట్టుబడి. బాచ్ కి 40-50 మంది స్టూడెంట్స్ వచ్చేవారు. ఇన్ని బిజినెస్‌లు నడిపితే గానీ ఫేమిలీ నడపడం సాధ్యమయ్యేది కాదు. ఈ విధంగా రెండేళ్ళలో ఎం.కామ్ డిగ్రీ , లా రెండేళ్ళు పూర్తిసేసాను.

ఇక్కడో విషయం చెప్పాలి..ఎన్ని కష్టాల్లో, వ్యాపకాల్లో బిజీగా వున్నా పుస్తకపఠనమనేది చిన్నప్పటినుంచే బాగా అలవాటుండేది. పిల్లల పత్రికలతో మొదలు పెట్టి 9-10 తరగతులు వచ్చేసరికి డిటెక్టివ్‌లు విపరీతంగా చదివే వాడిని. డిగ్రీకి వచ్చేసరికి ప్రముఖుల జీవిత చరిత్రలూ, ఫిలాసఫీ..మొదలైన నాన్-ఫిక్షన్ చదవడం మొదలు పెట్టాను. (ఇప్పటికీ ప్రతిరోజూ కనీసం ఒక గంటైనా ఏదైనా ఒక పుస్తకం చదివితే గానీ నిద్రపోను). జీవనోపాధి కోసం రోజంతా ఏదో ఒక పని, అప్పుడప్పుడూ కాలేజీకి వెళ్ళడం, ఏ కాస్త ఖాళీ దొరికినా పుస్తకాలు చదవడం, ఇంటివద్ద తమ్ముళ్ళ బాగోగులు చూసుకోవడం. ..ఇదీ అప్పటి దినచర్య.

వయసులో సహజంగా ఉండే సినిమా ఆకర్షణనుంచీ నేను మినహాయింపు కాలేదు. 'గీతాంజలి', 'శివ' సినిమాలు నన్ను బాగా ప్రభావితం చేసాయి. ఏ సినిమా చూసినా నా సొంత అనాలసిస్‌తో మిత్రుల వద్ద సుదీర్ఘంగా చర్చిస్తూ ఉండేవాడిని. ఆ రోజుల్లోనే ఎలాగైనా సినిమా పరిశ్రమలోకి వెళ్ళాలని ఉండేది. ఎలా వెళ్ళాలో, ఏం చెయ్యాలో తెలీదు కానీ కోరిక మాత్రం బాగా ఉండేది.

1996 ప్రాంతాల్లో అనుకుంటా, పేపర్లో ఒక ప్రకటన వచ్చింది, యండమూరి వీరేంద్రనాథ్ గారు కొత్త రచయితల రచనలతో ఒక పుస్తకం వేస్తున్నారనీ, అందరూ కొత్త రచయితలనుంచే రచనలు ఆహ్వానిస్తున్నారనీ. అప్పటి వరకూ చదవడమే కానీ వ్రాయడం గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. యండమూరి గారికి విపరీతమైన అభిమానిని అప్పటికే. ఆయన మీద నున్న అభిమానంతో, ఆయనరచనలు ఇచ్చిన ఇన్స్పిరేషన్‌తో 'పల్లె' అని ఒక కథ వ్రాసి పంపించాను. ఆ పుస్తకానికి 1700 పైగా కథలు వచ్చాయని తెలిసింది. నేను కథ పంపించిన ఒకటి రెండు వారాలకే యండమూరి గారి వద్దనుంచీ అభినందన పూర్వకమైన ఉత్తరం వచ్చింది.. అదే సమయంలో

నేనో సారి హైదరాబాదు వెళ్ళినపుడు యండమూరి గారికి ఫోన్ చేసాను. "కథ చాలా బాగా వ్రాసావు..ఐతే పుస్తకంలో ఇంక్లూడ్ చేయడానికి కుదిరేలా లేదు..." అన్నారు. కాస్త నిరాశ అనిపించింది కానీ, నాతొలి రచనే నా అభిమాన రచయిత ప్రశంసని పొందగలిగిందన్న సంతోషం నాకు తృప్తినిచ్చింది.. మరి కొద్ది రోజులకి ఇంకోసారి హైదరాబాదు వెళ్ళినపుడు యండమూరి గారికి ఫోన్ చేసాను. " నీకథ పుస్తకంలో ఇన్క్లూడ్ చేసాను.. ఇంటికి వస్తే కాపీ ఇస్తాను.." అన్నారు. నా ఆనందానికి అవధులు లేవు. వెంటనే ఆయన వద్దకి వెళ్ళాను. ఆయనే స్వయంగాసంతకం పెట్టి పుస్తకం ఇస్తూ మరో సారి నా కథని మెచ్చుకున్నారు.

మరి కొద్ది రోజులకి 'ఇండియా టు డే' పత్రికలో ఒక వార్త చదివాను.. యండమూరి గారు టి.వి. సీరియల్స్‌కి దర్శకత్వం వహిస్తున్నారని. అప్పుడే కలిగిన పరిచయాన్ని పురస్కరించుకుని, ఆయన వద్ద అసిస్టెంట్‌గా చేరదామని మళ్ళీ హైదరాబాదు వెళ్ళాను 1997 ప్రాంతాల్లో. నా కోరిక చెప్పాను. ఆయన ఒప్పుకున్నారు కానీ ఒక షరతు పెట్టారు 'పారితోషికం ఏమీ ఉండదు' అని. నిజానికి అప్పటికింకా మా కుటుంబం మొత్తం నా మీదే ఆధారపడి ఉంది. అలాంటప్పుడు రెమ్యునరేషన్ లేకుండా పనిచేయడం కష్టమే. ఐతే నాకున్న పరిచయాలతో అంతకంటే మంచి బ్రేక్ దొరకదనీ, ఎలాగైనా ఆ అవకాశాన్ని ఉపయోగించుకోవాలనీ ఒప్పేసుకున్నాను. అప్పటికి యండమూరి గారు 'ఆనందోబ్రహ్మ' షూటింగ్ మధ్యలో ఉన్నారు. ఒరిజినల్ స్క్రిప్ట్ ఐతే ఆ నవల 8 ఎపిసోడ్స్ మాత్రమే వస్తుంది. 'ఇంకో 5 ఎపిసోడ్స్‌కి పెరిగేలా వ్రాయగలవా?' అని అడిగారు యండమూరి గారు. అలా నేను ఎడిషనల్‌గా రాసిన 5 ఎపిసోడ్స్ చూసి ఆయన చాలా ఇంప్రెస్ అయ్యారు. ఆ ఎపిసోడ్స్‌కి స్క్రీన్ ప్లే నా పేరే వేసారు. అలా జరిగింది నా టి.వి.రంగ ప్రవేశం.

అక్కడినుంచీ మొదలుకుని యండమూరి గారి వద్దనే మరో 5 సీరియల్స్‌కి అసిస్టెంట్ డైరెక్టర్ గానూ, కోడైరెక్టర్ గానూ, స్క్రీన్‌ప్లే, సంభాషణా రచయితగానూ కొనసాగాను. అందులో మరిచి పోలేనిది 'వెన్నెల్లో ఆడపిల్ల', కె.ఎస్.రామారావు గారు దాని నిర్మాత. ఆ రోజుల్లో దూరదర్శన్‌లో ప్రసారమయ్యే సీరియల్స్ కి 35-50 వేలు ఆదాయమొచ్చేది ఒక్కో ఎపిసోడ్‌కి. ఐతే 'వెన్నెల్లో ఆడపిల్ల'కి మాత్రం ఒక్కో ఎపిసోడ్‌కి లక్షా యాభై వేలకి పైగా యాడ్స్ వచ్చేవి. అంత మంచి పేరు వచ్చింది.

ఓరోజు యండమూరి గారి నడిగాను' సినీ రంగంలో మీకు తెలిసిన వాళ్ళెవరికైనా రికమండేషన్ చెయ్యండి.." అని. ఆయన పరుచూరి బ్రదర్స్‌కి రికమండేషన్ లెటర్ రాసిచ్చారు. అది తీసుకుని పరుచూరి బ్రదర్స్ వద్దకెళ్ళాను. అప్పటికి వారు మోహన్ బాబుగారి 'అడవిలో అన్న', ఆయనదే 'కలెక్టర్ గారు', జయంత్‌గారి మొదటి సినిమా... ఇలా ఒకేసారి 4-5 సినిమాలకి పనిచేస్తుండేవారు. నేనూ వారి వద్ద సినీ సంభాషణా రచనలో మెలకువలు నేర్చుకునేందుకు అసిస్టెంట్‌గా చేరాను. అక్కడున్నది కొద్ది నెలలే ఐనా చాలా మెళకువలు నేర్చుకున్నాను. సినిమా రంగంలో రచయిత పాత్ర ఎంత క్లిష్టంగా ఉంటుందో ప్రత్యక్షంగా చూసాను. రచయిత అన్నవాడు సినీ నిర్మాణశాఖలో ఎంతో మందిని ఒప్పించాలి. ఒక్కోసారి రచయిత ఎంత గొప్పగా వ్రాసానని అనుకున్నా దర్శకుడు 'నో'అంటే అంతే. అవన్నీ గమనించిన మీదట సినీ రంగంలో దర్శకత్వ శాఖలోనే కృషిచేసి ముందుకి వెళ్ళాలి కానీ రచయితగా కాదు అని నిర్ణయించుకున్నాను.

సరిగ్గా అదే సమయంలో కె.ఎస్.రామారావు గారు 'వెన్నెల్లో ఆడపిల్ల' నవలని 'హలో ఐ లవ్ యు'గా సినిమా తీసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఆ నవలని దూరదర్శన్‌కి రూపొందించిన సమయంలో ఉన్న పరిచయంతో ఆ సినిమాకి అసిస్టెంట్‌గా డైరెక్షన్ డిపార్ట్‌మెంట్లో ప్రవేశం కల్పించమని రామారావు గారిని అభ్యర్థించాను. అంతకు ముందే నా పనితనాన్ని గమనించిన రామారావు గారు నన్నా సినిమాకి అసోసియేట్‌గా (ఓ మెట్టు ఎక్కువ) చేర్చుకున్నారు. అలా నా తొలిసినిమా 'హలో ఐ లవ్ యు' గా చెప్పుకోవచ్చు. దాని తర్వాత జె.డి. గారి 'హరిశ్చంద్ర' సినిమాకీ వై.వి.ఎస్. చౌదరిగారి 'యువరాజు' సినిమాకి అసిస్టెంట్‌గా చేసాను. కాస్త వెసులుబాటు కలిగింది ఆ రెండు అవకాశాలతో.

అప్పట్లో అంటే 1998 ప్రాంతాల్లో నేను, ఆర్.పి.పట్నాయక్, త్రివిక్రమ్ శ్రీనివాస్, సునీల్ తరచూ కలుస్తుండేవాళ్ళం. మాకు మరో

క్లోజ్ ఫ్రెండ్ చంద్ర సిద్ధార్థ. అందరమూ సినిమా రంగంలో ముందుకి వెళ్ళాలని అనుకుంటూండే వాళ్ళమే. అప్పుడే చంద్రసిద్ధార్థ గారి బ్రదర్ కృష్ణమోహన్ నన్ను తేజ గారికి పరిచయం చేసారు. తేజగారు 'చిత్రం' సినిమా ప్లాన్ చేస్తున్నారు. ఆయనకి రచయిత - అసిస్టెంట్ డైరెక్టర్ రెండు పనులూ చెయ్యగలిగిన వాళ్ళు కావాలని అడిగారు. మా ఇద్దరికీ మొదటి పరిచయంలోనే అభిరుచులు కలిసాయి. అలా తేజగారి పరిచయంతో నా సినీ జీవితం కొత్త మలుపు తిరిగింది. 'చిత్రం' సినిమాకి సహరచయిత, సహ దర్శకత్వం క్రెడిట్స్ ఇచ్చారు తేజగారు.

ఒక్క క్షణం ఆగి చూసుకుంటే.. యండమూరి గారు ఈ రంగప్రవేశానికి దారులు వేస్తే, తేజ గారు నా పనికి మంచి గుర్తింపు వచ్చేలా చేసారు.

అక్కడనుంచీ తేజ గారి సినిమాలన్నింటికీ రచయితగానూ, సహ దర్శకుడిగానూ పనిచేసాను. 'శుభవేళ' సినిమాకి తేజ గారిది కథ ఐతే నేను సంభాషణలు రాసాను. 'ఫేమిలీ సర్కస్', 'నువ్వూ నేను' సినిమాలకి కూడా సహరచయిత, సహ దర్శకుడిగా పనిచేసాను.

ఇక్కడో విషయం చెప్పాలి మీకు..

'చిత్రం' విడుదలయ్యాక చాలా మంది నిర్మాతలు కథ సంభాషణలు వ్రాస్తే 5 లక్షలవరకూ ఇస్తామని వచ్చారు. ఐతే ఒక సారి రచయిత ముద్ర వేయించుకుంటే దర్శకత్వానికి వెళ్ళడం కష్టం అనిపించి ఆ అవకాశాలని ఒదులుకున్నాను.

'నువ్వూనేను' చిత్ర నిర్మాణ సమయంలోనే నటుడు 'బెనర్జీ' గారు 'చాలామంది నిర్మాతలు కొత్త దర్శకులకోసం చూస్తున్నారు. మీ వద్ద కథలేమైనా రెడీ గా వున్నాయా?' అని అడిగారు.

ఆయనే నన్ను కె.ఎల్.నారాయణ గారికీ, ఎస్.గోపాలరెడ్డి గారికీ పరిచయం చేసారు. నేను చెప్పిన కథ వాళ్ళకి మొదటి సిటింగ్ లోనే నచ్చేసింది. నాతో ప్రోజెక్ట్ చేస్తానన్నారు. హీరో ఎవరన్న ప్రశ్న వచ్చినప్పుడు తరుణ్ పేరు సజెస్ట్ చేసాను. నిర్మాతలు సరే ననగానే నేనే వెళ్ళి తరుణ్‌కీ, వాళ్ళమ్మ గారు రోజారమణి గారికీ కథ చెప్పాను. వారికీ వెంటనే నచ్చింది. అన్నీ సెట్ అయ్యాయి. మరో 4 నెలల్లో తరుణ్‌తో నా దర్శకత్వంలో మొదటి సినిమా మొదలవ్వాలి.

ఇదిలా ఉండగా నారాయణ గారు, గోపాలరెడ్డి గారు అదే సమయంలో సమాంతరంగా నాగార్జున గారికి సరిపోయే కథ కోసం కూడ వెదుకుతున్నారు. నేను తరుణ్ ప్రోజెక్టుకి పనిచేస్తూనే, నాగార్జున గారి కోసమని నిర్మాతలకి ఒక యాక్షన్ కథ చెప్పాను. వారికి నచ్చిన మీదట నాగార్జున గారికి చెప్పమన్నారు. ఆయనకీ నచ్చింది, నాలో టాలెంట్ ఉందని కూడామెచ్చుకున్నారు. ఐతే సరిగ్గా అదే సమయంలో షాజీ కైలాస్ దర్శకత్వంలో 'శ్రీరామ్' అనే యాక్షన్ సినిమా చేస్తున్నాననీ (ఈ ప్రోజెక్ట్ కాన్సిల్ ఐంది తర్వాత) మళ్ళీ ఇప్పుడే యాక్షన్ సినిమా ఐతే బావుండదనీ , ఏదైనా ఫేమిలీ సబ్జెక్ట్ మీద వర్క్ చెయ్యమనీ అన్నారు.

అప్పుడే వచ్చిన 'హమ్ దిల్ దే చుకే హై సనమ్' సినిమాలో అజయ్ దేవగన్ పాత్ర నాకు చాలా నచ్చింది. అలాంటి డీసెంట్ కేరక్టర్‌తో ఐతే నాగార్జునగారికి మంచి కథ వస్తుందని వర్క్ చేయడం మొదలుపెట్టాను. ఒక లైన్ అనుకున్నాక కె.ఎల్.నారాయణ గారికీ, నాగార్జున గారికీ చెప్పాను. ఇద్దరికీ బాగా నచ్చింది. తర్వాత కొన్ని రోజులకి ఎ.ఎస్.గోపాలరెడ్డి గారు కబురు చేసి 'నాగార్జున గారు నిన్నే డైరెక్ట్ చెయ్యమని అంటున్నారు. అగస్ట్ (2001) నుంచీ డేట్స్ కూడా ఇచ్చారు ' అన్నారు. అప్పటికింకా నేను తరుణ్ సినిమా మొదలుపెట్టడానికి వెయిట్ చేస్తున్నాను.

అగస్ట్ అంటే అప్పటికింకా రెండే నెలలు టైమ్ ఉంది. అంత తక్కువ సమయంలో అంత మంచి కథకి న్యాయం చెయ్యలేనని అన్నాను. నాగార్జున గారు 'అసలు దశరథ్‌కి రియల్ ప్రోబ్లమ్ ఏమిటో కనుక్కోండి.." అని కబురుపంపించారు. డిసెంబర్‌కి ఐతే పూర్తి ట్రీట్ మెంట్‌తో రెడీ ఔతానని చెప్పాను

ఇంక నాగార్జున గారి ప్రోత్సాహాన్ని ఊతంగా తీసుకుని 'సంతోషం' కథ మీదే వర్క్ చేయడం మొదలు పెట్టి, సరిగ్గా నవంబర్ 15, 2001 లో ఊటీలో మొదటి షాట్‌తో నా దర్శకత్వంలో నాగార్జున గారు హీరోగా 'సంతోషం' సినిమా మొదలైంది..!

నటీనటులూ, సాంకేతిక నిపుణులూ అందరూ సీనియర్సే కాబట్టి షూటింగ్ అంతా స్మూత్‌గా జరిగిపోయింది. హీరోయిన్ శ్రియ ఒక్కరే కొత్త నటి. మె మంచి కథక్ నృత్యకళాకారిణి. మంచి నటన చూపించారీ చిత్రంలో.



ఈ సినిమా మే 9, 2002 న విడుదలైంది. మొదటి రోజు, మొదటి ఆటకే వెళ్ళాను. చూసిన వాళ్ళందరూ బావుందని అన్నారు. కానీ మొదటి షో ప్రేక్షకుల ఫీడ్ బాక్ సరైన కొలమానం కాదని అంతకు ముందు నేను రచయితగా పనిచేసిన సినిమాలు గుణపాఠం నేర్పాయి. ఎందుకంటే నేను తేజగారితో చేసిన వాటిలో 'చిత్రం', 'నువ్వూ నేను' సూపర్ హిట్. ఫేమిలీ సర్కస్, శుభవేళ అంతగా ఆడలేదు. ఐనా అన్ని సినిమాలకీ మొదటి ఆట ప్రేక్షకులు 'సూపర్' అనే అంటారు..! 'సంతోషం' సినిమా చూసి ఇంటికి వెళ్ళాక మధ్యాహ్నం వచ్చింది నేను ఎదురు చూసిన ఫోన్ కాల్, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ గారి వద్దనుంచీ. చిత్రరంగంలో నాకు ఆయన పెద్ద అండ దండ. నేనంటే చాలా అభిమానం. ఆయన చెప్పింది 100శాతం నిజమైన ఫీడ్‌బాక్ అని నమ్ముతాను. ఆయన చెప్పారు 'సంతోషం' హిట్ సినిమా అని, కనీసం 10వారాలు ఆడుతుందని. అప్పుడు నాకు సినిమా విజయం మీద పూర్తి నమ్మకం కలిగింది.

మీరంతా కూడా ఆదరించారు.. ఇలా నా మొదటి సినిమా 'సంతోషం' నా కెరీర్ లో 'సంతోషం' వానలు కురిపించింది.

నా కష్టాలనీ, బాధలనీ చూసిన నాన్నగారు నా విజయాన్ని మాత్రం చూడలేకపోయారు. 'సంతోషం' ప్రోజెక్టు ఖరారైన మొదట్లోనే ఆయన దివంగతులయ్యారు. తరువాత 3-4 నెలలకి సినిమా మొదలైంది. నా పెద్ద తమ్ముడు 'చిత్రం' సమయంలోనే నా వద్దకి వచ్చేసాడు. ప్రస్తుతం ఆపరేటివ్ కేమెరామేన్‌గా చేస్తున్నాడు. చిన్న తమ్ముడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. 2005 నవంబర్ 13న శేషసౌమ్యతో నాకు వివాహమైంది.



అంతర్జాతీయ తెలుగు పాఠకులతో నా మొదటి సినిమా అనుభవాలు పంచుకోవడం చాలా ఆనందంగా వుంది. భవిష్యత్తులో రాబోయే నా సినిమాలని కూడ ఆదరించి నాకు మీ అభిమానాన్ని పంచుతారని ఆశిస్తున్నాను. ***

ఇంటర్వ్యూ: కిరణ్ ప్రభ

PUBLISHED IN FEBRUARY 2009

# మదన్

రచయితగా పనిచేసిన మొదటి సినిమా ' ఆ నలుగురు' సూపర్ హిట్, దర్శకుడిగా పనిచేసిన మొదటి సినిమా 'పెళ్ళైన కొత్తలో..' మరొక సూపర్ హిట్.. అతడే యువ దర్శకుడు మదన్. మదనపల్లె దగ్గరలోని పల్లెటూరిలో మొదలైన జీవితం, హైదరాబాదు వరకూ చేరి ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ సేల్స్‌మేన్‌గా, రాత్రిపూట పబ్లిక్ టెలిఫోన్ బూత్ ఉద్యోగిగా చేసి, అన్ని రకాల ఆటుపోట్లతో ఢక్కామొక్కీలు తిన్న అనుభవం మదన్ గారిది. 'కౌముది' అడగ్గానే ఇంటర్వ్యూకి అంగీకరించి గంటసేపు పైగా తన బాల్యస్మృతులనీ, మొదటి సినిమా వరకూ జరిగిన ప్రస్థానాన్నీ ఇలా వివరించారు.



**మాది చిత్తూరుజిల్లా మదనపల్లి దగ్గరలోని గ్రామం.** నాన్న పేరు రామచంద్రారెడ్డి, అమ్మ పేరు శకుంతలమ్మ. నాకు ఒక అక్క, అన్నయ్య. నేను అందరిలోకీ చిన్నవాడ్ని. నాన్నగారు రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్‌గా పనిచేస్తుండేవారు. మాది ముందునుంచీ మధ్య తరగతి కుటుంబమే. ఏడవ తరగతి వరకూ ఎలిమెంటరీ స్కూల్లో చదువుకున్నాను. నాలుగో తరగతిలోనో, ఐదో తరగతిలోనో ఉండగా మా స్కూలు తరఫున ఏదో చిన్న సాంస్కృతిక కార్యక్రమం వేసినట్లు లీలగా గుర్తుంది. నాకు బాగా మనసులో ముద్రించుకుపోయిన జ్ఞాపకాలు మాత్రం అన్నీ హైస్కూలు, కాలేజీ రోజులకి సంబంధించినవే.

మదనపల్లిలోని బీసెంట్ థియొసాఫికల్ సొసైటీకి చెందిన హైస్కూలు, కాలేజీ ఒకే కాంపస్‌లో ఉండేవి. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగోర్ 1919లో ఈ స్కూలుకి వచ్చినప్పుడే 'జనగణమన' గీతాన్ని బెంగాలు నుంచీ ఇంగ్లీషుకి అనువాదం చేసాడని చెబుతారు. 8వ తరగతి నుంచీ డిగ్రీ ఐపోయే వరకూ నా చదువంతా అక్కడే సాగింది. చదువుల్లో నేనెప్పుడూ యావరేజ్ స్టూడెంట్‌నే. ఎప్పుడూ వెనుక బెంచీలోనే కూర్చోడానికి ఇష్టపడే వాడిని. ముందు బెంచీలో కూర్చుంటే మాస్టారు మన ఒక్కళ్ళకే పాఠం చెబుతున్న ఫీలింగ్ ఉంటుందీ పైగా పూర్తి కాన్సంట్రేషన్‌తో పాఠం వినాలి. అదే వెనుక బెంచీలో ఐతే కాస్త రిలాక్సింగ్‌గా వుండొచ్చు. అందుకే ఎప్పుడూ క్లాసులో వెనక బెంచీనే నా స్థానం. ఇంటర్మీడియట్‌లో బైపిసి గ్రూపు చదివాను. చిన్నప్పటి నుంచీ లెక్కలు అంటే అంత ఇష్టం ఉండేది కాదు కానీ సైన్సు అంటే మాత్రం చాలా ఆసక్తిగా ఉండేది. ఇంటర్ తరువాత సైన్సు సబ్జెక్టు తోనే డిగ్రీ చెయ్యాలని ఉండేది. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో బి.ఎ. ఇంగ్లీషు మీడియమ్‌లో చేరాల్సి వచ్చింది.

అప్పుడే మొదలైన బి.ఎ. ఇంగ్లీషు మీడియమ్‌లో ఎక్కువమంది స్టూడెంట్స్ ఉండేవాళ్ళు కాదు. క్లాసులకి కావల్సిన మెటీరియల్ అంతే నేనే లైబ్రరీకి వెళ్ళి సమకూర్చుకోవాల్సి వచ్చేది. ఒక్కోసారి నేనే లెక్చరర్ల వద్దకి వెళ్ళి లెసన్స్ చెప్పించుకునే వాడ్ని. ఇలా లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు చదవడం అన్న అలవాటే నా జీవితంలో పెద్ద మార్పుకు నాంది అవుతుందని అప్పట్లో అనుకోలేదు.



అలా బి.ఎ క్లాసులకి పాఠాలు సేకరించే మార్గంలో లైబ్రరీలో ప్రముఖ గ్రీకు తత్వవేత్త సోక్రటీస్ వ్రాసిన పుస్తకాలు చదవడం సంభవించింది. ఒక చోట ఆయన 'పరిశోధనావకాశాలు ఎక్కువగా లేని ఈ రోజుల్లో నేను కొంతవరకే సాధించగలిగాను. కానీ రాబోయే వందల, వేల ఏళ్ళలో ప్రపంచ నాగరికత ఇంకా చాలా అభివృద్ధి చెందుతుంది. తద్వారా శాస్త్రప్రగతి ఊహకందనంత వేగంగా జరుగుతుంది.' అని రాసారు. అది చదివినప్పుడు చాలా ఆశ్చర్యపోయాను. దాదాపు రెండువేల సంవత్సరాల క్రిందటే ఈ కాలంలోని మానవ సమాజం ఎలా ఉంటుందో ఊహించగలిగిన సోక్రటీస్ మేధాసంపత్తి, ఊహాశక్తి అద్భుతమనిపించింది. అప్పటి నుంచే ఏది చదివినా దానిలోని అంతరార్థమేమిటి, ఆ అంశాన్ని మరింతగా ఎలా విశ్లేషించవచ్చు అని ఆలోచిస్తూ ఉండేవాడిని. అప్పుడు తెలీలేదు కానీ, ఇప్పుడు ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే నాలో క్రియేటివిటికి బీజం అనేది అప్పుడే పడిందని అనిపిస్తుంది.

కాలేజీ రోజుల్లో ఉండగానే సినిమాలు కూడా విపరీతంగా చూసేవాడిని. ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షలు ఉదయం 11.00కి మొదలౌతాయంటే 9.00 గంటల షోకి సినిమాకి వెళ్ళి ఇంటర్వెల్ వరకూ సినిమా చూసి అక్కడినుంచీ పరీక్షహాలుకి పరిగెత్తిన సందర్భాలున్నాయి. ఇంట్లో అబద్ధాలు చెప్పి డబ్బులు తీసుకుని సినిమాలకి వెళ్ళడం అనేది ఇంక చాలా మామూలు విషయంగానే ఉండేది.

సినిమాల బాగా చూడడం వల్లకానీండి, లైబ్రరీ పుస్తకపఠనం పదునుపెట్టిన ఆలోచనల వల్ల కానీండి డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉండగా మొదటి సారిగా ఒక నాటిక రాసాను. దాని పేరు 'పావులు'. కాలేజీ ఫంక్షన్‌లో ప్రదర్శించాము కానీ అట్టర్ ఫెయిల్ అయింది. ఎందుకంటే నాటికకీ, నాటకానికీ తేడా తెలీదప్పటికి. ప్రదర్శన విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కానీ, రిహార్సల్స్ ఎంత పకడ్బందీగా వుండాలీ అనేది కానీ ఏమీ తెలీని వయసు. సో..అది ఫెయిలవడంలో ఆశ్చర్యం లేదు. ఐతే మరునాడు జరిగిన సమావేశంలో మా కాలేజీ ప్రిన్సిపాల్ కోదండపాణి గారు నాటిక ప్రదర్శన బావుండకపోయినా, స్టోరీ లైన్ బావుంది అని అందరి ముందూ పొగిడారు. నాక్కొంచెం ధైర్యం వచ్చింది. ఆ ప్రోత్సాహంతోనే రెండో సంవత్సరంలో 'ఒంటి గొర్రె ' అనే నాటిక రాసి, నా దర్శకత్వంలోనే ప్రదర్శించాం. 'సంఘజీవులు గొర్రెల మందలాంటి వాళ్ళు. మందలోంచి ఒక గొర్రె బయటికి వచ్చేసిందంటే ఇంక అంతే సంగతులు. అది ముందుకి కదలలేదు. అందరితోబాటు నడిచినప్పుడే దాని నడకకి వేగం వస్తుంది. మనిషికూడ వర్తమాన సమాజ వేగంతో ముందుకి ప్రయాణించడం నేర్చుకోవాలి. ఒక్క క్షణం వెనుకపడినా మళ్ళీ వేగం అందుకోవడానికి చాలా కష్టపడాలి..' అదీ ఆ నాటికలోని కథాంశం. దాన్ని మా కాలేజీ స్టూడెంట్స్ బాగా రిసీవ్ చేసుకున్నారు. నా తొలి సక్సెస్ నాటిక ప్రదర్శన ఇదే అని చెప్పుకోవచ్చు.

డిగ్రీ ఫైనలియర్‌లో ఉండగా నాకు మరింత ఆత్మవిశ్వాసాన్నిచ్చిన సంఘటన ఒకటి జరిగింది. మదనపల్లిలో 'మదనపల్లి కళాపరిషత్' అనే ఒక నాటక సంస్థ ఉండేది. వాళ్ళు ప్రతి సంవత్సరం వేసవి కాలంలో రాష్ట్రస్థాయి నాటక, నాటిక పోటీలు పెట్టేవాళ్ళు. అవి చాలా ప్రతిష్ఠాత్మకమైనవి. అందులో పాల్గొనడానికి విశాఖపట్నం, తెనాలి, హైదరాబాదు లాంటి దూర పట్నాలతో కలుపుకుని రాష్ట్రం నలుమూలలనుంచీ నాటక సమాజాల వాళ్ళు వస్తుండేవాళ్ళు. 1992 సంవత్సరం జూన్ నెల. స్థానికంగా ఉన్న మేము కూడా ఒక నాటిక తయారు చేసి పోటీల్లో ప్రదర్శించాలని నిర్ణయించుకున్నాం. నేనే రాసాను. పేరు 'పిచ్చి కుక్కలు'. హ్యూమర్‌తో కూడిన పొలిటికల్

సెటైర్. ఇందులో నటించే వాళ్ళంతా మా కాలేజీ మిత్రులే. మిగతా నాటికలు ప్రదర్శించేవాళ్ళేమో హేమా హేమీలు. రంగస్థలం మీద పది పదిహేను సంవత్సరాలు అనుభవం ఉన్న వాళ్ళు. వాళ్ళతో పోటీపడి గెలిచితీరాలి అని అనుకోలేదు కానీ, మా నాటికని కనీసం ప్రేక్షకులకి చూపిస్తే చాలు అనుకుని తయారయ్యాం. ఐతే వాళ్ళు చెప్పిన తేదీకి మేము రెడీ కాలేక పోయే సరికి స్క్రూటినీలోనే మేము సెలక్ట్ కాలేదు. ఐతే దీనికొక మలుపు ఏమిటంటే- మా కాలేజీలో వల్లంపాటి వెంకట సుబ్బయ్య గారనే ఇంగ్లీషు లెక్చరర్ ఒకాయన ఉండేవారు(ఆయన రాసిన కథాశిల్పం, నవలా శిల్పం అనే పుస్తకాలు చాలా ప్రసిద్ధమైనవి. ఇప్పటికీ నా దగ్గరకి కథలు తీసుకొచ్చేవాళ్ళని ఆ పుస్తకాలు చదవమని చెబుతుంటాను.). పోటీ నాటికలని ఎంపిక చేసే సంఘంలో ఆయన కూడా ఒక సభ్యులు. ఆయన వద్దకెళ్ళి ఒక్కసారి నా నాటికని చదవమనీ, ఎలాగైనా ప్రదర్శనకి వెళ్ళేలా చూడమని అడిగాను. క్రిందటేడాది నా నాటిక చూసి ఉన్న అనుభవం మీద, నా మీద వున్న నమ్మకంతో ఆయన అంతా చదివి 'సరేనయ్యా..నేను నీ నాటికని రికమెండ్ చేస్తాను..' అన్నారు. అలానే హైస్కూలులో సోషల్ మాస్టారు అశ్వత్థ నారాయణ గారు, కాలేజీలోనే పనిచేసే గుండూరావు అనే క్లర్కుగారు కూడా నా నాటికని రికమెండ్ చేసారు. ఎలాగైతే పోటీల్లో ప్రదర్శించేందుకు, హేమా హేమీలతో తలపడేందుకు అవకాశం వచ్చింది.

ఆ పోటీల్లో రోజుకి మూడు నాటికలు ప్రదర్శిస్తారు. మాది నాలుగో నాటికగా పెట్టారొక రోజు. ఆరు గంటలకి మొదలైన పోటీల్లో మూడో నాటిక ముగిసి, స్టేజి అంతా ఖాళీ చేసి, మాకు ఇచ్చే సరికి పదిన్నర అయింది. ప్రేక్షకులు దాదాపు అందరూ వెళ్ళిపోయారు. సన్నగా వర్షం కురవడం మొదలైంది. పరిస్థితి చూసి మాకు నీరసం వచ్చేసింది. న్యాయనిర్ణేతలు మాత్రం 'ఇవి పోటీ నాటికలే కదా. జడ్జీలం మేము ఉన్నాం కదా. ఆడియన్స్ లేకపోతే ఏమయింది. వేసెయ్యండి..' అన్నారు. నేను మాత్రం 'బహుమతులకంటే ఆడియన్స్‌కి చేరడమే నాకు ముఖ్యం. ఇలా ఖాళీ ఆడిటోరియమ్‌లో మేము వెయ్యం' అని వాదించాను. ఎలాగైతేనేం మరునాడు వేసేందుకు అవకాశం ఇచ్చారు. మరునాడు కూడా రాత్రి 9.00 కే. ఐతే మరునాడు 6.00 గంటలకి మొదటి నాటికగా వేయ్యాల్సిన వాళ్ళు సమయానికి రెడీ కాలేదు. ఖచ్చితంగా సమయానికి మొదలుపెట్టడం ఆ పోటీల్లో ఒక ఆచారం. అప్పుడు రెండో టీమ్ వాళ్ళని అడిగారు. ఇంకా టైమ్ ఉంది కదా అని వాళ్ళూ రెడీగా లేరు. మా నాటికకి స్టేజి అలంకరణ హంగామా ఏమీ అవసరం లేదు. ఐదునిమిషాల్లో అంతా సిద్ధమైపోగలం. ఈ హడావిడి చూసి నేనెళ్ళి 'మేము రెడీ అండీ. మాకు అవకాశమివ్వండి..' అని అడిగాను. వేరే ఛాయస్ లేదు కాబట్టి వాళ్ళు ఒప్పేసుకున్నారు. 'పిచ్చి కుక్కలు' నాటిక అద్భుతంగా వచ్చింది. హౌస్ ఫుల్.. ఆడిటోరియమ్ అంతా చప్పట్లతో మమ్మల్ని అభినందించారు. అందులో నేను కూడా ఒక పాత్ర వేసాను. బహుమతుల విషయానికి వస్తే, నా పాత్రకి మాత్రమే కన్సొలేషన్ బహుమతి వచ్చింది. నాటికకి ఏమీ బహుమతులు రాలేదు. ఐనా మరునాడు ఈనాడు, ఆంధ్రప్రభ, హిందూ పేపర్లలో అందరూ మా నాటిక గురించీ కథాంశం గురించీ, సంభాషణల గురించి ప్రసంశల జల్లులు కురిపించారు. దాంతో 'ఫరవాలేదు.. నేనూ ఒకస్థాయి నాటికలు వ్రాయగలను..' అన్న ధైర్యం వచ్చింది.

డిగ్రీ ఐపోయింది. ఎలాగైనా హైదరాబాదు వెళ్ళి, సినీఫీల్డ్‌లో దర్శకత్వ శాఖలో భవిష్యత్తుని పరీక్షించుకోవాలని దీర్ఘంగా ఆలోచించాను . కానీ కుటుంబ పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. తప్పని పరిస్థితుల్లో ఆ ఆలోచన వాయిదా వేసుకుని తిరుపతిలో సిగ్మా కమ్యునికేషన్స్ అనే ఫ్రాంఛైజీ కంపెనీలో ఉద్యోగానికి చేరాను. అందులో టాటా టెలికామ్, బి.పి.ఎల్ వాళ్ళ టెలిఫోన్ కాన్ఫరెన్స్ సిస్టమ్స్‌ని డీలర్లకి మార్కెటింగ్ చేస్తుండే వాళ్ళం. అక్కడ ఆరు నెలలు పనిచేసాను. ఆలోచనలెప్పుడూ హైదరాబాదు ఎప్పుడు వెళ్దామా అనే ఉండేవి. ఆర్నెల్ల తర్వాత హైదరాబాదులో ఉండే మా మేనమామ గారి వద్దకి వెళ్ళాను. అది 1994 సంవత్సరం. ఆయన సహకారంతోనే రామ్ కోటీలోని శ్యామ్ ఆటోపార్ట్స్ అనే షాపులో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా చేరాను. నెలకి 2,500 జీతం. మామయ్యా ఇంట్లో ఉండే వాడిని కాబట్టి, ఆ జీతం నాకు బాగానే సరిపోయేది. ఐతే సేల్స్ ఉద్యోగం అవడం వల్ల నెలలో చాలా రోజులు బయట

ఊళ్ళలోనే ఉండాల్సి వచ్చేది. రకరకాల ఊర్లు తిరగడం, వివిధ రకాల మనుషుల్ని కల్సుకోవడం నాకూ ఇష్టమే కానీ, మరీ ఎప్పుడూ హైదరాబాదుకి బయటే ఉండడంతో సినిమా అవకాశాల కోసం ప్రయత్నించడానికి వీలు కాలేదు. అందుకని ఆ ఉద్యోగంలో ఎక్కువకాలం కొనసాగలేదు. హైదరాబాదులోనే స్థిరంగా ఉండే ఉద్యోగం ఏదైనా దొరికితే బావుంటుందని ప్రయత్నించాను. నాకు బ్రదర్ లాంటి విజయకుమార్ అనే ఫ్రెండ్ ఉండేవాడు. తనకి పంజాగుట్టలోని ఊర్వశి బార్ అండ్ రెస్టారెంట్ ఆవరణలో ఎస్.టి.డి. టెలిఫోన్ బూత్ ఉండేది. అది 24 గంటలు తెరిచి ఉంచాల్సిన బిజినెస్. పగలు తను చూసుకునే వాడు. రాత్రి నేను చూసుకునేందుకు నెలకి 800 రూపాయల జీతానికి అందులో చేరాను. నా డ్యూటీ రాత్రి పూట కాబట్టి పగలంతా సినిమా ట్రయల్స్‌కి సమయం ఉంటుందని అంచనా.

ఇక్కడ ఇంకో వ్యక్తిని మీకు పరిచయం చేయాలి. మనోహర్ నాయుడు గారనే ఒక రంగస్థల నటులు నాకు మదనపల్లి నుంచే పరిచయం. ఆయన చాలా రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు గెలుచుకున్న నటుడు. వయసులో నాకంటే పెద్ద వారైనా నన్ను బాగా ఎంకరేజ్ చేస్తుండేవారు. ఆయన కూడా సినిమాల్లో వేషాల కోసమని హైదరాబాదులో ఉండి ప్రయత్నాలు చేస్తున్నారు. నేనిలా టెలిఫోన్‌బూత్‌లో రాత్రి పూట పనిచేసేప్పుడే మళ్ళీ ఇద్దరం కలుసుకున్నాం. నేను కూడా సినిమాల్లో అవకాశం కోసం చూస్తున్నానని తెలుసుకున్న మనోహర్ నాయుడు గారు నన్ను పి.వి. చలం అనే ఆయనకి పరిచయం చేసారు.

పి.వి.చలం గారు ఎల్.ఐ.సి.లో పని చేస్తూండేవారు. దూరదర్శన్‌కి రూపొందించే డాక్యుమెంటరీలకి ఆయన దర్శకత్వం వహిస్తుండేవారు. ఆయన వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరాను. దర్శకత్వ రంగంలో నాకు మొదటి గురువుగారైన పి.వి.చలం గారిని ఎప్పటికీ మరచిపోలేను. ఆయన వద్ద ఫాదర్లీ ట్రీట్‌మెంట్ ఉండేది. ఎప్పుడైనా మధ్యాహ్నం సమయానికి వెళితే భోజనాలవీ ఏర్పాటు చేయించిన తర్వాతే వర్క్ మొదలు పెట్టేవారు. నాలోని రచయితని గమనించిన ఆయన కొన్ని ఎపిసోడ్స్‌కి నన్నే వ్రాయమని అవకాశం ఇచ్చారు. ఆయన దర్శకత్వంలోనే జెమిని టి.వి.వాళ్ళు నిర్మించిన 'వెంకటేశ్వర వైభవం' అనే మైథలాజికల్ సీరియల్ అన్ని ఎపిసోడ్స్‌కీ అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసాను. ఈ అనుభవం విజువల్ మీడియా గురించి చాలా నేర్పింది.

ఇదిలా ఉండగానే నే టెలిఫోన్ బూత్ ఉద్యోగం వల్ల పరిచయమైన వినయ్ అనే ఆయన ద్వారా, ఆయన కంపెనీ 'వినయ్ కెమ్ ఫార్మసూటికల్స్ ' అనే బల్క్‌డ్రగ్ కంపెనీలో పర్చేజింగ్ ఆఫీసర్‌గా చేరాను. నా టి.వి. కార్యక్రమాల గురించి తెలుసు కాబట్టి వినయ్ గారు ఆ విషయంలో ఫ్లెక్సిబుల్ గానే ఉండేవారు. ఈ విధంగా చలం గారి వద్ద దర్శకత్వ శాఖలో శిష్యరికం, వినయ్ గారి కంపెనీలో ఉద్యోగం ఒక సంవత్సరం పాటు నడిచింది.

ఆ రోజుల్లోనే (1996 ప్రాంతాల్లో) నేను రాసిన కథలు స్వాతిలోనూ. ఆంధ్రప్రభ లోనూ అచ్చయ్యాయి. అవి చదివిన వినయ్ గారు తన క్లోజ్ ఫ్రెండ్ ఐన ప్రముఖ కెమెరామేన్ హరి అనుమోలు గారికి పరిచయం చేసారు, సినీ రంగానికి దగ్గరగా ఉంటానని.

హరి అనుమోలు గారు అప్పట్లో ఢిల్లీ దూరదర్శన్‌కి మానవవనరుల శాఖ తరఫున ఎడ్యుకేషన్ ప్రోగ్రాములు రూపొందిస్తుండేవారు. వాటికి నిర్మాత ప్రముఖ నటుడు శాయిచంద్. హరి గారు దర్శకుడు, నేను రచయితగా వాళ్ళ యూనిట్‌లో ప్రవేశించాను. అక్కడినుంచీ వెంకటరాజు గారనే ఆయన దర్శకత్వం వహించిన 'తమసోమ జ్యోతిర్గమయ', 'అక్షరజ్యోతి' అనే సీరియల్స్‌కి కూడా రచయితగా పనిచేసాను. వెంకటరాజు గారే సినిమా రంగం గురించి నాకు సరికొత్త దృక్పథాన్ని కలిపించారు. సినిమాలని ఏ కోణంలో చూడాలి, సినిమా రంగాన్ని ఒక కళగా ఎలా ఎప్రోచ్ అవ్వాలి అనే విషయాలు ఎప్పుడూ చెబుతుండేవారు. నేను కేవలం రచయితనే ఐనా సీరియల్స్ నిర్మాణంలో మొదటి నుంచీ చివరి వరకూ అన్ని కార్యక్రమాల్లోనూ పూర్తిగా ఇన్వాల్వ్ అయ్యేవాడిని. ఆ విధంగా పూర్తి ప్రోడక్ట్ బయటికి రావడానికి ఉన్న దశలూ, వాటిల్లోని మెళకువలూ, సాధక బాధకాలూ అన్నీ తెలుసుకున్నాను. 2001 సంవత్సరంలో ఇంక పూర్తి సమయం సినిమా అవకాశాల మీద కేంద్రీకరించాలనుకుని ఉద్యోగం మానేసాను.

నా ప్రయత్నాల్లోని మరో మలుపు గురించి ఇక్కడ చెప్పాలి. దూరదర్శన్ ప్రొడక్షన్‌కీ సినీ నిర్మాణానికీ కెమేరా విభాగం తప్ప మిగతావన్నీ ఇంచు మించు ఒకేలా ఉంటాయి. అందుకనే ముందుగా సినీ కేమేరా విభాగంలో పరిజ్ఞానం సంపాదించాలనుకుని నిర్ణయం తీసుకున్నాను. మా కజిన్ బ్రదర్ నాగార్జున అనే ఆయన చిన్నపటినుంచీ నాలోని కళాదృష్టిని ప్రోత్సహిస్తూ వచ్చారు. ఆయనకి సీనియర్ కెమేరామేన్ ఎస్.గోపాలరెడ్డి గారు, శ్రీనివాస రెడ్డిగారు (దర్శకుడు సాగర్‌గారి బ్రదర్) చాలా క్లోజ్ ఫ్రెండ్స్. ఆ విధంగా నాకు ఎస్.గోపాలరెడ్డి గారి వద్ద కెమేరా విభాగంలో పనిచేసే అవకాశం లభించింది. ఆ విధంగా 'మనసంతా నువ్వే, ' సంతోషం' సినిమాలకి అసిస్టెంట్ కెమేరామేన్‌గా పనిచేసాను. పని విషయంలో గోపాలరెడ్డి గారు ఎంత సీరియస్‌గా వుంటారో అందరికీ తెలిసిందే ఐనా నేనడిగిన ప్రశ్నలన్నింటికీ ఓపికగా సమాధానాలు చెప్పేవారు. రెండు సినిమాలతో కెమేరా గురించి కూడా మంచి అనుభవం వచ్చింది.

ఈ జర్నీ ఇలా కొనసాగుతుండగానే 'చిరునవ్వుతో' ఫేమ్ రామ్ ప్రసాద్‌గారు పరిచయమయ్యారు. ఆయన దర్శకత్వం వహించిన 'కళ్యాణరాముడు', ' ఖుషీ ఖుషీగా' సినిమాలకి రచనా సహకారం అందించాను. రామ్ ప్రసాద్‌గారి ద్వారా అట్లూరి పూర్ణచంద్రరావు గారు పరిచయమయ్యారు. ఆయన చాలా సంవత్సరాల తర్వాత మళ్ళీ తెలుగు సినిమాలు నిర్మించడం మొదలు పెట్టారు. ఆయనకి 'ఆ నలుగురు' కథ లైన్ చెప్పాను. నిజానికి ఈ కథ నేనెప్పుడో 'ఈనాడు'లో చదివిన ఒక వార్తాంశం ఆధారంగా పుట్టింది. పూర్ణచంద్రరావు గారికి ఔట్‌లైన్ బాగా నచ్చి, నన్ను వెంటనే పూర్తి స్క్రిప్టు రెడీ చేయమని ఊటికి పంపించారు. తిరిగి రాగానే స్క్రిప్టుని ప్రకాష్ రాజ్ గారికి వినిపించమన్నారు. ఆయన విని 'ఇది నవలకి బాగానే ఉంటుంది కానీ విజువల్ గా అంత నప్పదేమో..' అని సందేహం వెలిబుచ్చారు.

ఇలా ఇది సందిగ్ధంలో ఉండగా రామ్ ప్రసాద్‌గారి ద్వారానే చంద్రసిద్దార్థ గారు పరిచయమయ్యారు. మొదటి సమావేశంలోనే ఇద్దరం చాలా గాఢమిత్రులమయ్యాము. ఆయన కూడా అప్పటికి 'అప్పుడప్పుడు..' సినిమా పూర్తిచేసి ఇంకో సినిమా ప్రయత్నాల్లో ఉన్నారు. సరే ఇద్దరం కల్సి కొత్త సినిమా ప్రయత్నాలు ప్రారంభించాము. రకరకాల కథలతో ఎక్కే ఆఫీసూ, దిగే ఆఫీసూ అన్నట్లుగా తిరిగేవాళ్ళం. అప్పటికి చందుకి 'ఆ నలుగురు' కథ తెలీదు. ఎప్పుడు చెబుదామని ప్రయత్నించినా 'ఎందుకు మదన్..! ఆ కథ చెబుతావు.. చావుతో సినిమా మొదలౌతుంది..ఎవరు చూస్తారు?' అంటుండేవారు. పూర్తిగా ఎప్పుడూ వినలేదు. ఆ సమయంలోనే ప్రేమ్ కుమార్ గారు పరిచయమై 'రాజేంద్ర ప్రసాద్ గారితో సినిమా చేద్దామనుకుంటున్నాను. మీరు వెళ్ళి ఆయనకి కథ చెప్పి ఒప్పించగలిగితే మనం ప్రోజెక్టు మొదలు పెట్టొచ్చు' అని చెప్పారు. మేమిద్దరం కలిసి ఒక రోజు ఉదయాన్నే ఏడింటికి రాజేంద్రప్రసాద్ గారింటికి వెళ్ళాం.

నా దగ్గర డైలాగ్స్‌తో సహా పూర్తి బౌండ్ స్క్రిప్టు ఉండడం వల్ల దాదాపు మూడు గంటలపాటు కథంతా స్క్రీన్‌ప్లేతో సహా చెప్పాను. చందు కూడా అదే మొదటి సారి పూర్తి కథ వినడం. నా నెరేషన్ పూర్తవగానే చందు, రాజేంద్రప్రసాద్ గారు ఇద్దరూ ఒక పావుగంట మాట్లాడలేదు. నాకు ఒక విధమైన టెన్షన్ వచ్చేసింది. వాళ్ళకి కథ బాగా నచ్చిందని తెలుస్తోంది కానీ సినిమాగా ఎలా తీయాలా అని వెనుకంజ వేస్తారేమోనని ఒక వైపు అనుమానం. చందు కళ్ళు పూర్తిగా కన్నీళ్ళతో నిండుకున్నాయి. రాజేంద్రప్రసాద్ గారు కూడా బాగా ఇంప్రెస్ అయ్యారు.

ఎంతో మంది పేరున్న నిర్మాతలు ఈ కథ విని, బాగుందని మెచ్చుకున్నా, సినిమాగా నిర్మించడానికి పెదవి విరిచిన వాళ్ళే. అలాంటిది ఈ సినిమా ప్రయోగాత్మకం అవుతుందని తెలిసికూడా, మొదటి సినిమాగా, చెయ్యడానికి ఒప్పుకున్న ప్రేమ్ కుమార్ గారిని కూడా ప్రత్యేకంగా అభినందించి తీరాలి. అట్లూరి పూర్ణచంద్రరావుగారికి ఈ విషయం చెప్పగానే ఆయన కోసం తయారు చేయించుకున్న 'ఆ నలుగురు'కథని మాకు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఆయన అప్పటికే 'మిస్టర్ అండ్ మిసెస్ శైలజా కృష్ణ మూర్తి', 'వెంకి'

సినిమాల నిర్మాణంలో బిజీగా వున్నారు. నాకు అంతకు ముందే ఇచ్చిన ఎడ్వాన్సుకి బదులుగా తమిళంలో కథ హక్కులు ఆయనకి ఇచ్చేలా మాట్లాడుకున్నాము.

ఆ విధంగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే రచయితగా నా మొదటి సినిమా 'ఆ నలుగురు' డిసెంబర్ 9, 2004 న విడుదలైన సినిమా ఎలాంటి విజయం సాధించిందో మీ అందరికీ తెలుసు. రచయితగా కూడా నాకు చక్కటి గుర్తింపునిచ్చింది.

ఈ సినిమా విజయంలో హీరో రాజేంద్రప్రసాద్ గారి పాత్ర చాలా ఉంది. నేను, చందు ఇద్దరమూ తక్కువ మాట్లాడే వాళ్ళమే. నిర్మాత ప్రేమ్ కుమార్ గారు కూడా సినిమా రంగానికి కొత్తే. అలాంటప్పుడు రాజేంద్రప్రసాద్ గారు సినిమా ప్రమోషన్ విషయంలో కానీ, నిర్మాణ సమయంలో కానీ సొంత సినిమా అన్నట్లుగా ఎంతో సహకారాన్నందించారు.

ఆ సినిమా ఘన విజయం తరువాత మళ్ళీ చందు, నేనూ కాంబినేషన్‌లోనే మరో సినిమా చెయ్యాలని అనుకున్నాం. కానీ వీలుకాలేదు. నేను కూడా సొంతంగా దర్శకత్వంకోసం ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఒకనాటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు వాళ్ళబ్బాయిని హీరోగా ప్రవేశపెడుతూ తీయబోయే మొదటి సినిమాకి, నాకు దర్శకత్వం అవకాశం ఇస్తామన్నారు. చాలా రోజులు ఆ ప్రోజెక్టుమీద పనిచేసాను కూడా. ఐతే చివరి నిమిషంలో ఆయన నిర్ణయం మార్చుకున్నారు. నాకు అది పెద్ద షాక్‌లా అనిపించింది. అప్పటికే ఫీల్డ్‌లో అందరికీ నేను ఆ సినిమా డైరెక్ట్ చేస్తున్నానని తెలిసిపోయింది. అది కాన్సిలవగానే మళ్ళీ నా ప్రయత్నాలు మొదలయ్యాయి. నా పరిస్థితి క్రాస్‌రోడ్స్‌లో నిలబడినట్లయింది. రచయితగానే కొనసాగాలా లేక ధైర్యం చేసి దర్శకత్వం వైపు వెళ్ళాలా అన్న మీమాంసలో పడ్డాను.

అలాంటప్పుడే ఒకరోజు రాఘవేంద్రరావు గారు మంచి కథకోసం వెదుకుతున్నారని కెమెరామేన్ శ్రీనివాసరెడ్డి గారు చెప్పారు. ఆయనే నన్ను రాఘవేంద్రరావుగారి వద్దకి కూడా పంపించారు. ఆయనకి 'పెళ్ళైన కొత్తలో' కథ చెప్పాను. అంతా విన్నాక 'కథలో పూర్తిగా ఇన్వాల్వ్ ఐ చెప్పావు. నీకు కథ మీద బాగా గ్రిప్ ఉంది. నువ్వే ఈ సినిమాకి దర్శకత్వం చెయ్యి ' అని పంపించారు. 'ఇదేమిటీ ఈయన ఇలా అన్నారు. నిజంగా అన్నారా లేక హేళనగా అన్నారా.." అని రెండు రోజులు మథనపడ్డాను. ఎంచేతంటే అన్నీ ప్రతికూలంగా అనిపిస్తున్నప్పుడు నెగెటివ్ ఫీలింగ్స్ పెరుగుతాయి కదా. ఐతే ఆయన సిన్సియర్‌గానే కామెంట్ చేసారని రెండు రోజుల తర్వాత తెలిసింది. దాన్ని నేను పెద్ద సర్టిఫికెట్‌గా భావించాను. ఐతే నిర్మాతలెక్కడ దొరుకుతారు? కొత్తవాడిని, కేవలం రచయితగానే ఇండస్ట్రీకి తెలుసు..

అలాంటప్పుడు ఇంక నేనే సొంతంగా నిర్మించాలనుకుని మిత్రులు కొందరితో సంప్రదింపులు జరిపాను. జగన్ అనే మిత్రుడు ఎక్కువభాగం పెట్టుబడి పెట్టడానికి ముందుకి వచ్చారు. అలానే మహేంద్ర గారు కూడా. మాగంటి బాబు గారు కూడా మాకు ఈ ప్రోజెక్టు ముందుకి వెళ్ళడానికి చాలా సహాయం చేసారు. 'కళ్యాణరాముడు', 'ఖుషీ ఖుషీగా' సినిమాల సమయంలో మిత్రుడైన కో-డైరెక్టర్ శ్రీనివాసరావు, సంగీత దర్శకుడు అగస్త్య నాకు వెన్నంటి ధైర్యాన్నిచ్చేవాళ్ళు ఎప్పుడూ.

ఇక్కడ ముఖ్యంగా హీరో జగపతి బాబుగారి గురించి చెప్పాలి. నేను దర్శకత్వం వహిద్దామని నిర్ణయించుకున్నప్పుడు ఒక యాక్షన్ స్టోరీ స్క్రిప్టు తీసుకుని జగపతి బాబుగారిని కలిసాను. ఆయన కథంతా విన్నాక 'మీరు కథ చెప్పడంలో చాలా పేషన్ కనిపిస్తోంది. మంచి దర్శకుడవుతారు. ఐతే నేను ఇప్పుడే 'సామాన్యుడు' చేస్తున్నాను. మీకు కూడా యాక్షన్ మూవీ అనే సరికి బడ్జెట్ ఎక్కువౌతుంది. ఒక నిర్మాత కొడుకుగా, నిర్మాతల సాధక బాధకాలు తెలిసిన వాడిగా చెప్పేదేమిటంటే, చక్కటి ఫేమిలీ స్టోరీతో మొదలుపెట్టండి. సేఫ్ ప్రాజెక్ట్ అవుతుంది' అని సలహా ఇచ్చారు. అప్పుడు 'పెళ్ళైన కొత్తలో' సినిమా కథని ఓకె చేసారాయన. ఈ విధంగా ఈ కథ హీరో ఛాయిస్ అని చెప్పొచ్చు. అంతే కాకుండా సినిమా నిర్మాణ సమయంలో జగపతిబాబు గారు ఎన్నో సలహాలిచ్చి మాది మొదటి సినిమా అనే భావం రాకుండ చేసారు. విడుదల ముందు కూడా ఆర్థికపరమైన ఇబ్బందులేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటుండే వారు.

హీరోయిన్ విషయం వచ్చే సరికి , ఒక మోడల్ కో-ఆర్డినేటర్ ద్వారా ప్రియమణి ఫోటోలు చూసాను. అప్పటికి తను 'ఎవరే అతగాడు' సినిమాలో ఒక చిన్న పాత్ర ధరించిందంతే. చాలా మంది ఆమె ఎంపికని నిరుత్సాహపరిచారు. అయినా స్క్రీన్ టెస్ట్ చేసాక ఆ పాత్రకి తను ఖచ్చితంగా సరిపోతుందని నాకు గట్టి నమ్మకం కలిగింది.



2006 జూన్ రెండవ వారంలో మొదలుపెట్టిన 'పెళ్ళైన కొత్తలో..', 2006 డిసెంబర్ 9న ('ఆ నలుగురు ' విడుదలైన సరిగ్గా రెండు సంవత్సరాలకి) విడుదల చేసాం. సినిమా ఘన విజయం గురించి మళ్ళీ ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా.

సినిమా విడుదల రోజు పొద్దున్నే (అప్పటికి రెండు రోజులుగా నిద్రా, తిండి లేవు) కారులో సినిమా ప్రింట్‌లు తీసుకుని దేవి థియేటర్‌కి నేనే వెళ్ళాను. సినిమా మొదలయ్యాక కాస్సేపు చూద్దామని నిలుచునే చూడసాగాను. ఒక అరగంట అయ్యే సరికి ప్రేక్షకులు సినిమాని రిసీవ్ చేసుకునే ఉత్సాహం, వాళ్ళ కేరింతలు చూసి అప్పటి వరకూ ఉన్న నీరసం ఎగిరిపోయి ఆ స్థానంలో వెయ్యి యేనుగుల బలంవచ్చింది.

ఈ విధంగా రచయితగా మొదటి సినిమా 'ఆ నలుగురు' , దర్శకుడిగా మొదటి సినిమా ' పెళ్ళైన కొత్తలో..' రెండూసూపర్ హిట్స్ అయ్యాయి. రెండో సినిమా 'గుండె ఝల్లుమంది' నార్మల్‌గా ఆడింది. ఇప్పుడు మళ్ళీ జగపతి బాబుగారి కాంబినేషన్‌లోనే ఇంకో సినిమా రూపొందించడానికి ప్రయత్నాలు చేస్తున్నాను.

మీతో ఒకసారి నా జ్ఞాపకాలని పంచుకునే అవకాశం కలిపించిన 'కౌముది'కి కృతజ్ఞతలు తెలియచేస్తూ, మీకు నా శుభాభినందనలు అందిస్తున్నాను.

ఇంటర్వ్యూ: కిరణ్ ప్రభ

PUBLISHED IN MARCH 2009

# కోటి

తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక సువర్ణాధ్యాయాన్ని రచించుకున్న సంగీత సమ్రాట్టు శ్రీ సాలూరు రాజేశ్వరరావు గారు. వారి అబ్బాయే ఐనా తనకంటూ ఒక పేరు తెచ్చుకోడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఎన్నో ఆటంకాలనధిగమించారు. తన నాన్నగారి సహాధ్యాయి శ్రీ టి.వి.రాజుగారి అబ్బాయితో కలిసి రాజ్-కోటిగా ఒక బ్రాండ్ నేమ్ సృష్టించుకుని పన్నెండేళ్ళపాటు గాఢమైన ముద్రవేసారు. మళ్ళీ ఒక ఎదురు దెబ్బ. ఇద్దరూ విడిపోయారు. శిఖరమెత్తు పేరు తెచ్చుకున్న జంట విడిపోతే మళ్ళీ ఒంటరిగా నిలదొక్కుకోవడం అంత తేలిక కాదు. దాన్నీ ఎదుర్కొన్నారు. మళ్ళీ కోటి గా మరో సంచలనం సృష్టించారు. ఎన్నో విజయవంతమైన తెలుగు సినిమాలకి తనదైన బాణీలో స్వరాలనందించి, తెలుగు వారి గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న 'కోటి'గారి స్వర జీవన ప్రస్థానం ఈ సంచికలో మీ కోసం ప్రత్యేకం.



**నాన్నగారు శ్రీ రాజేశ్వరరావు గారు.** అమ్మ గారు శ్రీ రాజేశ్వరీ దేవి. నేను పుట్టేసరికే నాన్నగారు మద్రాసులో స్థిరపడ్డారు కాబట్టి నా పుట్టుకా,బాల్యమూ, చదువూ అన్నీ మద్రాసులోనే . నేను పుట్టింది 1958 మే 28 వ తేదీన. మాది చాలా పెద్ద కుటుంబం. ఐదుగురు అబ్బాయిలు, నలుగురు అమ్మాయిలు. అబ్బాయిల్లో నేను నాలుగో అబ్బాయిని. చాలా రోజులు అందరం కలిసి ఒకే ఇంట్లో, ఎల్డామ్స్ రోడ్ లోని సొంత ఇంట్లో, ఉండే వాళ్ళం. మా ఇంటి వెనకాలే సుసర్ల దక్షిణా మూర్తి గారిల్లు ఉండేది. ఆ పక్కన ఎస్.వరలక్ష్మి గారు, ఓ చివర జి.వరలక్ష్మి గారు, పక్కన ప్రముఖ తమిళ నటుడు ఎస్.ఎస్.రాజేందర్ గారు ఎదుటి వీధిలో ఏడిద నాగేశ్వరరవు గారు, పి.జె.శర్మ గారు, విజయచందర్ గారు,....ఇలా అదంతా ఒక తెలుగు కాలనీలాగ అనిపించేది. అన్ని ఫేమిలీలు తరచూ కలుసుకుంటూ నా చిన్నతనంలో ఆప్యాయతలు, అనుబంధాలు చాలా ఆత్మీయంగా ఉండేవి.

పెద్దన్నయ్య రామలింగేశ్వరరావు గారు. పియానో స్పెషలిస్ట్. కాంబో ఆర్గన్ అనే ఎలక్ట్రానిక్స్ ఇన్స్ట్రుమెంట్‌లో కూడా ప్రావీణ్యం సంపాదించారు. చాలా సంవత్సరాలు నాన్నగారి వద్దా, చక్రవర్తిగారి వద్దా, నా దగ్గర కూడా కీబోర్డు ప్లే చేసారు. రెండో అన్నయ్య

పూర్ణచంద్రరావు గారు. గిటార్ స్పెషలిస్ట్. అన్ని రకాల గిటార్‌లు వాయించేవారు. ఇళయరాజాగారు, రాజన్-నాగేంద్ర గారు, చక్రవర్తిగారు, కొన్నాళ్ళు నా వద్ద కూడా గిటారిస్ట్‌గా పనిచేసారు. వాయిద్యాల ట్రెండ్ అంతా కీబోర్డ్ ప్రపంచం అయ్యాక సంగీతానికి స్వస్తి చెప్పి ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో మేనేజర్‌గా చేస్తున్నారు. మూడో అన్నయ్య వాసూరావు. మీలో చాలా మందికి తెలుసు. దాదాపు 50 సినిమాలకి సంగీత దర్శకత్వం వహించారు. వందలాది టి.వి. సీరియల్స్‌కి సంగీతం సమకూర్చుతున్నారు. మిగతావారికి చదువు సరిగా రాలేదని నన్నైనా బాగా చదివించి ఏ ఐ.ఎ.ఎస్సో, ఐ.పి.ఎస్సో చెయ్యాలని ఉండేది నాన్న గారికి.

బాగా పేరున్న కాన్వెంట్ స్కూల్లోనే నా చదువు మొదలైంది. ఐతే నాన్న గారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడమూ, పెద్ద కుటుంబం అవడంతో అక్కడ ఎక్కువ రోజులు చదివించలేక మామూలు స్కూలుకి మార్చేసారు నన్ను. కేసరి హైస్కూలు అనీ తెలుగు వారు ఎక్కువగా చదివే స్కూలుకి పంపించారు.

తొమ్మిదేళ్ళ వయసులో అనుకోకుండా డ్రమ్స్‌తో పరిచయం ఏర్పడి అందులో బాగా ప్రావీణ్యం సంపాదించాను. మా పూర్ణచంద్రరావు అన్నయ్యగారికి ఆ రోజుల్లోనే ఒక పాప్ సింగింగ్ ట్రూప్ ఉండేది. ప్రతి ఆదివారం వాళ్ళ ప్రాక్టీస్ అంతా మా ఇంట్లోనే ఉండేది. అవన్నీ నేను దీక్షగా గమనిస్తూ ఉండేవాడిని. ఒకసారి వాళ్ళు లంచ్‌కి వెళ్ళిన సమయంలో సరదాగా డ్రమ్స్‌ని ఎలా వాయించాలో నేర్చుకున్నాను. సరిగ్గా వాళ్ళు ఎలా చేసే వాళ్ళో నేనూ అలానే వాయించడం ప్రాక్టీస్ చేసాను. నా అంత నేనే త్వరలోనే పట్టు తెచ్చుకోగలిగాను. మా అన్నయ్య వాసూరావు గారు ఇది గమనించి 'వీడికి మంచి అనుభవం వచ్చినట్లుంది..నాతో రా..' అని తన ట్రూప్ లో చేర్చుకున్నారు. అంత చిన్న వయసులో నేను డ్రమ్స్ వాయించడం అందరినీ ఆకట్టుకునేది. ఎక్కడికి వెళ్ళినా నా వయసూ, నా ప్రదర్శనా అదో స్పెషల్ ఎట్రాక్షన్! కొంతకాలానికి నాన్నగారికి తెలిసింది. 'నిన్నేదో చదివించి గొప్పవాడిని చేద్దామనుకుంటే నువ్వూ ఇలానే తయారౌతున్నావా? డ్రమ్స్ లేవు ఏమీ లేవు.. మానెయ్. మళ్ళీ ఇలా కనిపించావంటే ఊరుకోను..' అని కేకలేసారు. చదువుమీదనే దృష్టిపెట్టమని బలవంతం చేసారు.

తొమ్మిదో తరగతి వరకూ బాగానే చదివాను కానీ పదో తరగతి నుంచీ స్నేహితుల సావాసం వల్ల చదువులో బాగా వెనకపడ్డాను. ఎప్పుడూ వాళ్ళతోనే తిరగడం, క్లాసులు ఎగ్గొట్టి సినిమాలకి వెళ్ళడం, ఇంట్లో లక్ష్యపెట్టక పోవడం..వగైరా లక్షణాలన్నీ అలవాటయ్యాయి. ఫలితం మొదటిసారి ఎస్.ఎస్.ఎల్.సి ఫెయిల్ అయ్యాను. బహుశా మొదటిసారే కనుక స్కూల్ ఫైనల్ పాసై ఉంటే నా జీవితం వేరే మలుపు తీసుకుని ఉండేదేమో. తర్వాత డిగ్రీ వగైరా చదివి ఏ గవర్నమెంటు ఉద్యోగిగానో సెటిల్ ఐ ఉండేవాడినేమో.. మళ్ళీ రెండో సారి వ్రాసి మంచి మార్కులతోనే పాసయ్యాను. అప్పట్లోనే మంచి పర్సనాలిటీ, బోడీ బిల్డింగ్ చేస్తుండే వాడిని. ఎందుకోగానీ నేవీలో చేరి షిప్పుల్లో పనిచెయ్యాలని ఉండేది. నాన్నగారి మిత్రుడు హనుమంతరావు గారనే ఆయన ఉంటే ఆయన సహాయంతో విశాఖపట్నంలో నేవీలో ఇంటార్వ్యూకి హాజరయ్యాను. ఫిజికల్ ఫిట్‌నెస్ అన్నింటిలో సెలెక్ట్ అయ్యాను, కానీ క్వాలిఫికేషన్స్ దగ్గరకొచ్చేసరికి దెబ్బతిన్నాను. మొత్తానికి 'నాట్ సెలెక్టెడ్' అన్నారు. బ్యాక్ టు మద్రాస్..

పై చదువులు చదవాలన్న శ్రద్ధ లేదు. అలా ఫ్రెండ్స్‌తో తిరుగుతూ కాలం గడుపుతుండే వాడిని. ఐతే ఎలాగైనా డబ్బులు సంపాదించాలనీ, ఇంట్లో నాన్న గారికి సహాయం చెయ్యాలని మనసులో బాగా ఉండేది. అప్పటికే నాన్న గారికి అవకాశాలు తగ్గడమూ, ఇంట్లో ఇబ్బందులు ఎక్కువగా ఉండడమూ జరిగింది.

ఇలాంటప్పుడే ఒకసారి అనుకోకుండా ఒక సంఘటన జరిగింది. ఒక రోజు ఎందుకో ఇంట్లో ఉన్న గిటార్ ప్రాక్టీస్ చెయ్యాలనిపించింది. గిటార్ తీసుకుని పైన డాబా మీదికి వెళ్ళాను. మా ఇంట్లో ఒక మామిడి చెట్టు, వేప చెట్టు పైవరకూ పెరిగి డాబా మీదికి వంగి ఉండేవి. వాటి నీడలో కూర్చుని గిటార్ ప్రాక్టీస్ మొదలుపెట్టాను. ఆ ఆలోచన ఎందుకు వచ్చిందో, ఎలా వచ్చిందో తెలీదు. ఆ సంగీత సరస్వతీ కటాక్షమేమోనని అనిపిస్తుందిప్పుడు. అలా మొదలైన ప్రాక్టీసు ఆపలేదు. రోజూ కొనసాగించాను. నా కోసం నా

ఫ్రెండ్స్ గాంగ్ వస్తే ఇంట్లోలేనని చెప్పమనే వాడ్ని. గిటారే లోకమైంది. ఒక్కోసారి సాయంకాలం 4 కి కూర్చుంటే తెల్లవారుఝాము వరకూ ఆపకుండా ప్రాక్టీస్ చేసేవాడిని. రెండు నెలల్లో బాగా పట్టుదొరకడమే కాకుండా సొంతంగా రాగాలు కూర్చే స్థాయికి చేరుకున్నాను. ఇదంతా సొంత ప్రాక్టీసే.

ఇలా ప్రాక్టీస్ చేసాక మొట్ట మొదటసారి గిటారిస్ట్‌గా గాయకుడు రామకృష్ణ, వసంత గార్ల బృందంతో కలిసి నర్సరావు పేటలో,ఒక మేరేజ్ రిసెప్షన్‌లో పాల్గొన్నాను. జీవితంలో సోలో గిటారిస్ట్‌గా అదీ నా మొదటి స్టేజ్ ప్రదర్శన. అప్పుడు నాకు వచ్చిన పారి తోషికం 40 రూపాయలు. ఇక్కడ నర్సరావు పేట అంటే ఇంకో విషయం చెప్పాలి మీకు. నేను ఉన్నదంతా మద్రాసే కాబట్టి ఎవరైనా ఆంధ్రా పేరు చెబితే చాలా కొత్తగా ఉండేది. ఆంధ్రా అంటే అదేదో అమెరికా దూరమంత అన్న భావం ఉండేది, మా పెద్ద బావగారి ఊరు ఆరంబాక్కం. అది ఆంధ్రా బోర్డర్‌లో ఉండేది. నేను అక్కడికి వెళ్ళినప్పుడు ఆంధ్రా వెళ్ళే లారీలని చూస్తుండేవాడిని. ఆగి ఉన్న లారీల మీద గూడూరు, నెల్లూరు అన్న పేర్లు చదివి ఆ లారీ చుట్టూ ఆరాధనా భావంతో తిరిగే వాడిని. అసలు ఈ 'ఆంధ్రా' అనే ప్రాంతాన్ని ఎప్పటికైనా చూస్తానా, చూస్తే నా జన్మ ధన్యమై పోతుంది కదా..అనిపించేది. అలా ఆంధ్రా చూడ్డం, నా మొదటి ప్రదర్శనకి నర్సరావు పేట వెళ్ళినప్పుడే

ఇదంతా 1972-73 ప్రాంతాల్లో. ఐతే తర్వాత సంగీత కార్యక్రమాలకి వేరే వూళ్ళు వెళ్ళడం నేను కొనసాగించలేదు. నా సొంత ప్రాక్టీసు కొనసాగిస్తుండగానే వి.కుమార్ అనే మ్యూజిక్ డైరెక్టర్‌గారి వద్ద గిటారిస్ట్‌గా అవకాశం సంపాదించుకోగలిగాను. ఆ రోజుల్లో కుమార్ గారు మోస్ట్ మెలొడియస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు. ఆయన పనిచేస్తున్న ఒక తమిళ సిన్మా పాటకి మొట్ట మొదటి సారిగా నేను గిటార్ ప్లే చేసాను. టెక్నికల్‌గా చెప్పాలంటే అదీ నా మొదటి సినిమా. అప్పట్లో నెలకి 75 రూపాయలు ఇచ్చేవాళ్ళు. ఎంతకష్టమైనా పడి ఇంట్లో నాన్నగారికి సహాయం చెయ్యాలనేది తపన. ఆయన వద్ద కొంతకాలం పనిచేసాక, రమేష్ నాయుడు గారు హెచ్.ఎమ్.వి వారికి చేస్తున్న ఒక ప్రైవేట్ ఆల్బమ్‌కి గిటార్ ప్లే చేసే అవకాశం వచ్చింది. కుమార్ గారి వద్ద పనిచేస్తున్నప్పుడు చూసి - ఆయన నన్ను పిలిచారు. రమేష్ నాయుడు గారి వద్ద పనిచేయడమంటే ఐ.ఎస్.ఐ మార్కులాంటిది. కాలం ఏదో జరిగి పోతుండేది కానీ సరిగ్గా స్థిరమైన ఆదాయం వచ్చే అవకాశాలు రాలేదు. నాన్నగారికీ అవకాశాలు బాగా తగ్గిపోయాయి. ఎవరైనా బిజీ సంగీత దర్శకుడు వద్ద చేరితే మంచిదనే ఆలోచన వచ్చింది.

ఇక్కడింకో విషయం చెప్పాలి మీకు..

నేను చాలా చిన్న వయసునుంచే మా ఎంబాసిడర్ కారు నడుపుతుండే వాడిని. ఎస్సెల్సీ అయ్యాక కూడ పని పాట లేకుండా తిరిగే వాడిని కాబట్టి మాఇంట్లో అందరికీ నేనే డ్రైవర్‌ని. నాన్నగారు కూడా నా డ్రైవింగ్‌నే ఇష్టపడేవారు. అమ్మనీ, అక్కయ్యలని ఎప్పుడు బజారుకి తీసుకెళ్ళాలన్నా నేనే డ్రైవర్‌ని. ఇలా వాళ్ళు పని చూసుకుని వచ్చేలోగా కారులో ఉన్న డొక్కు టేప్ రికార్డర్‌లో (దాన్ని కిందా మీదా రెండు దెబ్బలు వేస్తే గానీ పనిచేసేది కాదు!) నాన్న గారు సేకరించి పెట్టిన మంచి పాటలు, పాశ్చాత్య సంగీతమూ వింటుండే వాడిని. ఆ రోజుల్లో మా అన్నయ్యలు ముగ్గురూ మ్యూజిక్ డైరెక్టర్ చక్రవర్తిగారి వద్ద పనిచేస్తుండే వారు. వాళ్ళని అక్కడికి తీసుకెళ్ళడం, తిరిగి పికప్ చేసుకోవడం అన్నీ నేనే చేస్తుండేవాడిని. ఆ విధంగా రోజూ చక్రవర్తి గారిని కలిసే అవకాశం వచ్చేది. పైగా నాన్నగారి మీద వారికున్న గౌరవం వల్లకూడా మా అన్నయ్యలని చూసినట్లే నాతోనూ బాగా మాట్లాడే వారు.

కనిపించినప్పుడల్లా "ఏం చేస్తున్నావురా..?" అని అడిగే వాళ్ళు. గిటార్ ప్రాక్టీస్ చేస్తున్నానని అనగానే "ఊం..బాగా నేర్చుకో. పూర్తిగా ప్రాక్టీస్ చేసాక చెప్పు" అనే వారు. ఒక రోజు నేనే ధైర్యం చేసి, జెమినీ స్టూడియోలో రికార్డింగ్‌లో, ఉండగా 'మీవద్ద జాయినవ్వాలని ఉంది' అని అడిగాను. "అంతా వచ్చేసిందా..సరే అయితే. మంచి రోజు చూసి జాయిన్ ఐపో.." అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆ రోజు చాలా ఆనందం అనిపించింది. ఇంటికి వెళ్ళి ఎంతో ఆనందంతో అమ్మగారికీ, నాన్న గారికీ చెప్పి ఆశీస్సులడిగాను. వాళ్ళు

హృదయపూర్వకంగా దీవించారు.

ఇంకో చిన్న విషయం చెప్పాలి. మా ఇంట్లో నాకంటే ముందు లీల అనే పాప పుట్టింది. త్వరలోనే తను దేవిలో లీనమై పోయింది. తనపేరు మీద మా ఇంట్లో చిన్న గుడి లాంటిది 'కన్యమ్మ' పేరుమీద ఉంది. ఇప్పటికీ తననే మేము కులదైవంగా పూజిస్తుంటాము. మరునాడు పొద్దునే నేను రెడీ ఐ భుజానికి గిటార్ వేసుకుని మా ఇంట్లోని కన్యమ్మ గుడి వద్ద నిలుచుని అమ్మా, నాన్నా ఆశీస్సులు తీసుకున్నాను. అదీ నా జీవితాన్ని మలుపు తిప్పిన క్షణం.. ఆ ఆశీస్సులే ఇప్పటికీ నన్ను కంటికి రెప్పలా కాపాడుతున్నాయని భావిస్తాను.

అది 1975 సంవత్సరం. దాదాపు ఈ 35 సంవత్సరాల్లో ఎన్నో ఎత్తు పల్లాలు చూసాను. మా గురువు గారు చక్రవర్తిగారి పీక్ పీరియడ్ చూసాను. ఆయన డౌన్ ఫాల్ చూసాను.. నేనూ ఎత్తులు ఎక్కాను, కష్టాలుపడ్డాను.. ఐనా ఎప్పటికప్పుడు ముందుకి వెళుతున్నానంటే అదంతా రోజు నా తల్లిదండ్రులందించిన దీవెనల ఫలితమేనని నమ్ముతాను.

ఆ విధంగా చక్రవర్తిగారి వద్ద రిథమ్ గిటారిస్ట్‌గా నా సినీ సంగీత జీవన మొదలైంది. దాదాపు 8 సంవత్సరాలు ఆయన వద్దనే శిష్యరికం చేసాను. ఆయనకి ప్రియ శిష్యుడ్నయాను. ఆయన నన్ను తన కొడుకుతో సమానంగా చూసుకునే వారు. కొడుకు, శిష్యుడు, సేవకుడు, సోదరుడు , ఆత్మీయుడు అన్నీ నేనే ఆయనకి. ఎక్కడికి వెళ్ళినా నేను తోడుండాల్సిందే ఆయన బయలు దేరడానికి ముందు కారు శుభ్రంగా తుడిచి సిద్ధం చేసేవాడిని. కేవలం గురువులానే కాక ఆయన్నో గైడ్‌గా , జీవిత మార్గదర్శిగా భావించేవాడిని. మా ఇద్దరి అనుబంధం అలానే కొనసాగింది. ఆయన అప్పట్లో బిజియెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్. అలానే అసిస్టెంటులు కూడ చాలామందే వుండేవారు. ఆయన వద్ద చేరాక కాస్త ఆదాయం కూడా కళ్ళచూడసాగాను. మరే వ్యాపకమూ చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ఆయన వద్ద ఖాళీ దొరికినప్పుడు ఇతర సంగీతదర్శకుల వద్దకూడా పనిచేసే వాడిని. బప్పీలహరి. లక్ష్మీకాంత్ ప్యారేలాల్, ఆర్.డి.బర్మన్, పెండ్యాల, రమేష్ నాయుడు..ఇలా మహామహుల దగ్గర పనిచేసే అవకాశము, వాళ్ళ శైలులు పరిశీలించే అదృష్టమూ లభించాయి. నేను 1975లో చేరితే, 1980లో రాజు చక్రవర్తిగారి వద్ద చేరాడు. అప్పుడు మేము ప్రేమాభిషేకం పాటల కంపోజింగ్ లో ఉన్నాం. ఆ సమయంలో రాజు వచ్చాడు. ఇద్దరం కలిసి మరో మూడేళ్ళపాటు అంటే 1983 వరకూ చక్రవర్తిగారి దగ్గరే కొనసాగాము. మమ్మల్ని ఫిల్మ్ మ్యూజిక్‌లో చక్రవర్తిగారు ఎంత నిష్ణాతుల్ని చేసారంటే చాలా సినిమాలకి రీరికార్డింగ్ మొత్తం మాకే అప్పచెప్పేసేవారు.

1983 లో మా ఇద్దరి జీవితం మరో కొత్తమలుపు తిరిగింది. రాజు నాన్న గారికి మిత్రుడైన వెంకట్రామరాజు అనే నిర్మాత గారు 'ప్రళయగర్జన' అనే సినిమా తీస్తూ రాజుని సంగీత దర్శకత్వం చెయ్యమని అడిగారు. రాజు నా వద్దకి వచ్చి ఇలా 'అవకాశం వచ్చింది.. నువ్వూ నాతో రా..కల్సి చేద్దాం' అని అడిగాడు. 'అలా ఎందుకు? నీకు వచ్చిన అవకాశం కదా. నువ్వే చెయ్యి. నేను సహాయం చేస్తానులే' అన్నాను. "రేపు నువ్వూ ఒక మ్యూజిక్ డైరెక్టరవు తావు గదా. అప్పుడైనా నీకో మనిషి సహాయం కావాలి. నాకు ఇప్పుడే కావాలి. ఇప్పటినుంచే ఎందుకు కలిసి చెయ్యకూడదు?" అన్నాడు. అది సమంజసమే అనిపించింది. సరే అన్నాను.

'ప్రళయ గర్జన' లో మోహన్ బాబు గారు హీరో. పిసి రెడ్డి గారు దర్శకులు. మా ఇద్దరినీ కలిపి రాజ్-కోటి గా నామకరణం చేసింది ప్రముఖ సౌండ్ ఇంజినీర్ స్వామినాథన్ గారు. ఆయన దాదాపు తెలుగు చిత్రసీమలో అందరు సంగీత దర్శకులకీ శబ్దగ్రాహకుడుగా పనిచేసారు. దాదాపు 10, 000 సినిమాలకి పైగా అనుభవం. ఆయనే మా ఇద్దరినీ 'రాజ్-కోటి' గా మార్చారు. ఈ విషయం నేను చెప్పడానికి ముందుగానే ఎలాగో చక్రవర్తిగారికి తెల్సింది. ఆయన చాలా బాధ పడ్డారట. "నేనే వాడిని మ్యూజిక్ డైరెక్టర్ గా పరిచయం చేద్దామనుకున్నాను. వాడిలా తొందరపడి వెళ్ళిపోతాడా?" అని బాధపడ్డారు. వెళ్ళిపోవడం కాదనీ, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నానని చెప్పినా ఆయన బాధ పడ్డం మానలేదు. బాలసుబ్రహ్మణ్యం గారు కూడా చెప్పి చూసారు. చక్రవర్తి

గారికి నామీద కల్మషంలేని ప్రేమ. అందుకే అంతలా బాధపడ్డారు. ఇటు చూస్తే నన్నే నమ్ముకున్న మిత్రుడు. చివరికి నామీద నమ్మకం ఉన్న రాజు వైపే మొగ్గి 'ప్రళయగర్జన' కి 'రాజ్-కోటి' గా సంగీత దర్శకత్వం చెయ్యడానికి ముందుకి వెళ్ళాను.

1983 నవంబర్ రెండో వారంలో రికార్డింగ్ మొదలు. ముందు రోజు వరకూ చక్రవర్తి గారితో టెన్షనే. ఎలాగైతేనేం వేటూరి గారు వ్రాసిన పాట ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారు, సుశీల పాడగా విజయా గార్డెన్స్ డీలక్స్ థియేటర్ లో రికార్డింగ్ అయింది. అదే నా తొలి సినిమా. ఐతేపాట రికార్డింగ్ అయ్యాక చెప్పారు నిర్మాత గారు 'ఇప్పుడు దీన్ని తీసుకెళ్ళి హీరో గారికి వినిపిస్తాము. ఆయన ఓకే అంటే



ఫైనలైజ్ చేస్తాం' అన్నారు. మళ్ళీ మా గుండెల్లో రైళ్ళు. ఎలాగైతేనేం మోహన్ బాబుగారు పాట వినడం , వెంటనే ఓకె చెయ్యడం మా మొదటి సినిమాలోని మిగతా పాటలు నిరభ్యంతరంగా ముందుకి సాగడం జరిగింది.

ఇంకో పిట్టకథ ఏమిటంటే రాజు కేసరి హుస్కూల్లో స్టూడెంట్‌గా ఉండగా మోహన్‌బాబుగారు ( అప్పడు యన పేరు భక్తవత్సలం నాయుడు) అదే స్కూల్లో డ్రిల్ మాస్టారు గా వుండేవారు. అంటే గురు శిష్యులిద్దరూ, మ్యూజిక్ డైరెక్టర్లూ, హీరోలుగా మళ్ళి ఇక్కడ కలుసుకున్నారన్న మాట.

అలా మా మొదటి సినిమా విడుదలైంది. సంగీతానికి మంచి పేరే వచ్చింది. కానీ తర్వాత ఆర్నెల్ల వరకూ ఒక్క అవకాశమూ లేదు. అప్పుడో చిన్న సినిమా. తర్వాత నాలుగు నెలలకి మరో చిన్న సినిమా.. తర్వాత కూడా అలాంటి సినిమాలే రావడం మొదలయ్యాయి. ఎక్కువ రెమ్యునరేషన్ ఉండేది కాదు. మొత్తం సినిమా బడ్జెట్టే 3-4 లక్షలు ఉండేది! జేమ్స్‌బాండ్ 999, కాళరాత్రి..అన్నీ ఇలాంటి ఫైటింగ్ సినిమాలే. ఇలా చిన్నా చితకా సినిమాలు చేస్తున్నా గానీ చక్రవర్తిగారి వద్ద మేమిద్దరం అసిస్టెంటులుగా చేయడం మానలేదు. ఎస్పీ గారి మధ్యవర్తిత్వంతో గురువుగారి వద్దకూడా కొనసాగాము. అయితే ఇంతకు ముందున్నంత కంఫర్ట్‌నెస్ లేకుండింది. ఎంతలేదన్నా మేము అసిస్టెంటులుగా వుండగానే ఎవరో నిర్మాతలు వచ్చి కొత్త సినిమాల గురించి అడుగుతుండే వారు. మా గురువుగారికి అది నచ్చేది కాదు. ఒక విధమైన అనీజీనెస్ పెరగసాగింది. గురువుగారు దగ్గర ఫైనల్ రికార్డింగ్‌లో ఇన్స్ట్రుమెంట్స్ బాలెన్సింగ్ అంతా ఎప్పుడూ నేనే చూసుకుంటుండే వాడిని. గురువుగారు ముభావంగా వుంటున్నాకానీ నా పని నేను చేసుకుపోతుండేవాడిని. ఆయన రికార్డింగ్ థియేటర్‌కి వచ్చి కూడా నన్ను పలకరించకుండా ఇంజినీర్స్‌తో మాట్లాడి వెళ్ళిపోయేవారు.. రోజు రోజుకీ మనసులో గాయం పెద్దదవసాగింది. 1986లో ఒకరోజు ఎ.వి.ఎమ్-జి థియేటర్ నుంచీ నా గిటారూ. మిగతా సామానులన్నీ ఆటోలో వేసుకుని గురువుగారికి గుడ్ బై ఇంటికి వచ్చేసాను.

అప్పటికి దాదాపు నలభై సినిమాలు చేసాం కానీ పెద్ద పేరు ఆదాయం రెండూ లేవు. అప్పటికి పెళ్ళై సంవత్సరం అయింది. ఒక పాప కూడా పుట్టింది. పాపకి పాల డబ్బాలు కొనడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి. మా ఇంట్లో నాన్న గారు ఒక సిస్టమ్ పెట్టారు. ఎవరి ఫేమిలీకి కావాల్సిన సంపాదన వాళ్ళే తెచ్చుకోవాలి. వాళ్ళ ఆదాయంలో కొంత ఇంటి ఖర్చులకి కూడా ఇవ్వాలి. చాలా దుర్భరమైన పరిస్థితి. అమ్మాయి పాల డబ్బాలకోసం అన్నయ్యల వద్ద అప్పుచేసేవాడిని. గురువు గారి వద్దనుంచీ వచ్చి తప్పుచేసానా అని బాధపడుతుండే వాడిని. కాలం పెట్టిన పరీక్షలో తట్టుకున్నాము.. ఇలా బాధలు పడ్డ కొంతకాలానికి కొంచెం కొంచెం సినిమాలు రాసాగాయి. పాప పుట్టిన వేళావిశేషం అనుకున్నాను.

అప్పుడు ఒక చిన్నబ్రేక్ వచ్చింది మా మొదటి సినిమా దర్శకుడు పి.సి.రెడ్డి గారే మమ్మల్ని హీరో కృష్ణ గారి వద్దకి తీసుకెళ్ళి పరిచయం చేసారు. కృష్ణ గారు మా బ్యాక్‌గ్రౌండ్ విన్న వెంటనే అవకాశం ఇచ్చేసారు. అది ఆయన చేస్తున్న' నా పిలుపే ప్రభంజనం' అనే

సినిమా. ఆవిధంగా పెద్ద హీరో సినిమాలకి కూడా పనిచెయ్యగల సత్తా వున్న సంగీతదర్శక ద్వయం అని పేరు తెచ్చుకున్నాం. వెంటనే శోభన్‌బాబు గారి 'సంసారం' ఛాన్స్ వచ్చింది.

1985 ప్రాంతాల్లోనే మాకు ఒక కీబోర్డ్ ప్లేయర్ కావాలని మా ఇన్‌ఛార్జ్‌తో చెబితే దిలీప్ అనే కుర్రవాడిని తీసుకొచ్చాడు. అప్పట్లో అతను మా వద్ద సింగిల్ కీబోర్డ్ వాయించేవాడు. అప్పటినుంచీ దాదాపు ఐదేళ్ళపాటు మా వద్ద శిష్యరికం చేసిన దిలీపే ఈ నాటి ఆస్కార్ అవార్డ్ విజేత రెహమాన్. పనిలో ఎంతో శ్రద్ధగా, నమ్మకంగా, వినయంగా ఉండేవాడు. ఆ రోజుల్లో ఎలక్ట్రానిక్స్ వాయిద్యాలు ఎక్కువగా ఉపయోగించే సంగీత దర్శకుల్లో మేము ముందుండే వాళ్ళం. అపట్లో వొచ్చిన రోలాండ్ ఎస్ 50 అనే లేటేస్ట్ సాంప్లర్ కీబోర్డ్ ని మొదటి సారిగా సంపూర్తిగా ఉపయోగించింది మేమే. దిలీపూ, మేమూ కలిసి దానిలోని వాయిద్య సమ్మేళనాలన్నింటినీ పిండి వేసాం. అలా చేసిన 'మరణ శాసనం' అన్న కృష్ణంరాజు గారి సినిమా ఒక సెన్సేషన్. దానిలో పాటలు లేవు. కేవలం నేపథ్య సంగీతమే. రోలాండ్ కీబోర్డుతో ఆ సినిమాకి మేమిచ్చిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అప్పట్లో టాక్ ఆఫ్ ది టౌన్ అయింది. అది చూసిన నాగబాబు గారు, పవనకల్యాణ్ గారు మా గురించి సుప్రీమ్ హీరో చిరంజీవి గారికి చెప్పారు. ఆయనా వెంటనే మాకు 'యముడికి మొగుడు' చిత్రానికి అవకాశం ఇచ్చారు. మా సంగీత జీవితంలో అదో పెద్ద మలుపు. రాక రాక వచ్చిన అవకాశం.. మొత్తం మా శక్తులన్నీ కేంద్రీకరించి సినిమా చేసాం..'అందం హిందోళం..', 'వాన జల్లూ...' అన్నీ సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. సినిమా 250 రోజుల పాటు ఆడింది. సినిమా విజయానికి సంగీతం చాలా తోడ్పైందని పరిశ్రమలో అందరూ చెప్పుకున్నారు. అంతే ఇంక రాజ్-కోటి వెనక్కి తిరిగి చూసుకునే అవసరం రాలేదు. 1983 నుంచీ 1888 వరకూ ఐదేళ్ళలో కేవలం 50 సినిమాలు చేస్తే 1989 నుంచీ 1995 వరకూ ఆరేళ్ళలో 300 పైగా సినిమాలు చేసాము. తెలుగులో జంట సంగీత దర్శకులు ఎవ్వరూ మేమిద్దరం కలిసి చేసినన్ని సినిమాలు చెయ్యలేదు. ఒక దశలో తెలుగు సినిమా మ్యూజిక్ అంటే రాజ్-కోటినే అన్నంతగా పేరు తెచ్చుకున్నాం. ఎవరైనా ముందు మా వద్దకే వచ్చేవాళ్ళు. మేము వద్దంటేనే ఎక్కడికైనా వెళ్ళేవాళ్ళు. అలా మాది ఒక ప్రభంజనం నడిచింది.

చక్రవర్తిగారు అప్పుడప్పుడు స్టూడియోలో కనిపించి ఆప్యాయంగా పలకరించేవాళ్ళు. 'ఏరా..మళ్ళీ నాదగ్గరకి రావా.. నా రికార్డింగ్ బేలెన్స్ చెయ్యవా..?' అని చనువుగా అడుగుతుండే వారు.

ఇంత వువ్వెత్తున సాగుతున్న మా సంగీత కెరటం..1995లో అనుకోని తీరాన్ని తాకి కూలింది. 1995లో ఇద్దరం విడిపోవడానికి నిశ్చయించుకున్నాం. మా కాంబినేషన్‌లో చిట్టచివరి సూపర్ హిట్ 'హలో బ్రదర్'. 'పోకిరి రాజా', 'అస్తి మూరెడు -ఆశబారెడు' సినిమాలకీ చివరి సారిగా ఇద్దరం కలిసి చేసాం. ఆ సినిమాలకి రీ-రికార్డింగ్ సమయానికే రాజ్ వెళ్ళిపోవడంతో అదీ నేనే చేసాను

మళ్ళీ క్రాస్ రోడ్స్. అంత విజయవంతమైన 'రాజ్ - కోటి ' బేనర్ క్లోజయింది అనేది చిత్రసీమలో సంచలనం. నాకు అదొక అగ్ని పరీక్ష. మళ్ళీ నన్ను నేను ప్రూవ్ చేసుకోవాల్సిన పరిస్థితి. చేసుకోగలనా లేనా అన్న సందిగ్ధం. ఇలాంటి పరిస్థితి ఎందుకొచ్చిందా అన్న విచారం. అప్పట్లో నా భార్య నాకిచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. ఎప్పటికప్పుడు ధైర్యం చెబుతూ ఎలాంటి డిప్రెషన్‌కీ లోను కాకుండా నన్ను కంటికి రెప్పలా చూసుకునేది. మళ్ళీ అమ్మా నాన్న గారి ఆశీస్సులతో వొంటరిపోరాటం మొదలుపెట్టాను. జంటగా వందలాది సినిమాలకి పనిచేసినా ఒంటరి నసే సరికి ఎవరు ఇస్తారా అవకాశం అన్నట్లుండేది.

అప్పుడు సోలో సంగీతదర్శకుడిగా నా పునర్జన్మకి కారణం 'జగపతి' రాజేంద్ర ప్రసాద్‌గారు. ఆయన దర్శక, నిర్మాణంలో జగపతి బాబు హీరోగా నిర్మిస్తున్న 'భలే బుల్లోడు' కి అవకాశం ఇచ్చారు. 'కోటి'గా నా మొదటి సినిమా 'భలే బుల్లోడు' అయింది. ఆ పరిస్థితుల్లో నన్ను నమ్మి నాకా అవకాశం ఇచ్చిన రాజేంద్రప్రసాద్ గారి రుణం ఏమిచ్చినా తీర్చుకోలేనిది. నెమ్మది నెమ్మదిగా నన్ను నేను నిరూపించుకో గలిగాను. ఇ.వి.వి గారి లాంటి స్టార్ డైరెక్టర్లు అవకాశాలివ్వడం మొదలుపెట్టారు. 'అల్లుడా మజాకా, ' 'ఆయన కిద్దరు, 'ముఠామేస్త్రి' ఒక్కొక్కటే హిట్స్ రావడం మొదలయ్యాయి. 'పెదరాయుడు' మళ్ళీ ఒక సంచలనం..ఇంక వెనక్కి తిరిగి చూడలేదు.

మొన్నటి ‘అరుంధతి‘ వరకూ సోలో గా 150 పైగా సినిమాలు చేసాను. సినిమా బేనర్‌తో ,స్టార్ కేస్టింగ్‌తో నిమిత్తం లేకుండా నేనిచ్చిన ఉత్తమ సంగీతాన్ని తెలుగు ప్రేక్షకులు మనసారా స్వాగతించారు. సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా ‘కోటి‘ సంగీతం అంటే ఒక స్థాయిలో ఉంటుంది అన్న పేరు నిలబెట్టుకుంటూ వస్తున్నాను. ఈ సంవత్సరాల్లోనే ఒక 40 వరకూ కన్నడ సినిమాలకీ సంగీతం ఇచ్చాను. 18 వరకూ హిందీ సినిమాలకి నేపథ్య సంగీతం సమకూర్చాను... మీ అందరి ఆదరాభిమానాలు, మా అమ్మనాన్నలు, గురువు గారు చక్రవర్తి గారి ఆశీస్సులతో ఇంతటి వాడినయ్యాననుకుంటాను. ఇప్పటికీ కనీసం ఆరు  నెలలకోసారైనా మా గురువు గారు ‘చక్రవర్తి‘ గారు కలలో కొచ్చి నన్ను దీవిస్తుంటారు. నా జీవితంలో నా కుటుంబ సభ్యుల తరువాత ఆయనతో ఏర్పడిన అనుబంధం ఎప్పటికీ మర్చిపోలేనిది.

ఇలా సినీ సంగీత జీవితం ఒక ఎత్తు ఐతే గత కొద్ది నెలలుగా జీ.తెలుగు ఛానెల్ లో వస్తున్న లిటిల్ ఛాంప్స్ మరో ఎత్తు. 30 సంవత్సరాల్లో సినిమాల వల్ల వచ్చిన పేరుకి ధీటుగా ఈ కార్యక్రమం నాకు ఆత్మీయ అభిమానుల్ని సంపాదించి పెట్టింది. ఎక్కడ ఎవరు కనిపించినా ‘ప్రతి బుధవారం, గురు వారం మిమ్మల్ని టి.వి.లో చూస్తుంటే మా కుటుంబసభ్యుల్లో ఒకరిని చూసినట్లే ఉంటుంది. బాల గాయనీ గాయకులకి మీరిచ్చే సూచనలు సలహాలు మరువలేనివి‘ అంటుంటే మనసు ఆర్ద్రమౌతుంటుంది.

ఇన్ని విజయాలు సాధించినా ఒక్క విషయం మాత్రం ఇప్పటికీ నన్ను వెంటాడుతుంది. ఐదు సంవత్సరాల క్రిందట అమ్మ గారు చనిపోయినప్పుడు నేను హైదరాబాదులో ఉండడం వల్ల తన పక్కన లేక పోయాను. చివరిచూపుకి, మాటకి నోచుకోలేకపోయాను. జీవితాంతం నన్ను వెంటాడే దురదృష్ట క్షణాలవి.

ఇలా నా 35 సంవత్సరాల సినీ సంగీత జీవితాన్ని నెమరు వేసుకునే అవకాశం కల్పించిన ‘కౌముది‘ పత్రికకి, అంతర్జాతీయ తెలుగు సాహితీ ప్రియులకీ నా అభివందనాలు.



పెద్దబ్బాయి , యువ హీరో రాజీవ్ తో కోటి

ఇంటర్వ్యూ: కిరణ్‌ప్రభ

PUBLISHED IN APRIL 2009